సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 298

సోమవారం 19-1-2026

'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

కోహ్లి పోరాటం సరిపోలేదు

చివరి వన్డేలో భారత్ ఓటమి.. సిరీస్ న్యూజిలాండ్ సొంతం

10 లో

ఐదో విజయంపై ఆర్‌సీబీ గురి

డబ్ల్యూపీఎల్‌లో భాగంగా నేడు గుజరాత్ జెయింట్స్‌తో ఢీ

10 లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (Gramin): VB - G RAM G (వికసిత్ భారత్ - జీరామ్ జీ) చట్టం, 2025

125 రోజుల ఉపాధి హామీ

నిరుద్యోగ భృతి కొరకు పటిష్ట ఏర్పాటు | సకాలంలో వేతనాల చెల్లింపు మరియు ఆలస్యానికి పరిహారం | గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (VGPP)

CBC 35101/13/0080/2526

న్యూస్‌రీల్

సాల్మన్ హత్యపై వినతిపత్రం ఇస్తాం

పల్నాడు జిల్లా పిన్నెల్లిలో వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత కార్యకర్త మందా సాల్మన్ దారుణ హత్యపై డీజీపీకి వినతిపత్రం అందజేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. తమకు సోమవారం అపాయింట్‌మెంట్ ఇవ్వాలని డీజీపీకి వైఎస్సార్‌సీపీ లేఖ రాసింది.

వివరాలు 2లో

మద్యం మత్తులో యువకుల వీరంగం

మద్యం మత్తులో కొందరు యువకులు నెల్లూరు జిల్లా కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో వీరంగం వేశారు. పేషెంట్ దగ్గరకు ఎవరూ రావొద్దని చెప్పినందుకు.. డాక్టర్‌తో పాటు సిబ్బంది, రోగులపై శనివారం రాత్రి దాడికి తెగబడ్డారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 5లో

ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో నలుగురిని కమిషనర్లుగా నియమించింది. వీరు ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు.

వివరాలు 2లో

నేటి నుంచి అరసవల్లిలో రథసప్తమి ఉత్సవాలు

శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో రథ సప్తమి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 24వ తేదీ అర్ధరాత్రి నుంచి సూర్య భగవానుడి నిజరూప దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించనున్నారు.

వివరాలు 3లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల ట్రేలిట్ ధర ₹75	ఫారం కోడి లైవ్	164	బ్రాయిలర్ స్కిన్‌తో 277
	లేయర్ లైవ్	191	స్కిన్ లెస్ 315

విజయవాడలో ధరలు | శ్రేయస్సు దృష్ట్యా జాగ్రత్తలు పాటించవలెను

ఇదండీ సంగతి

గత ప్రభుత్వం చేసినవన్నీ క్రెడిట్ చోరీ చేశాం.. ఇదీ అంతేనా సార్!!

'పొదుపు'.. కుదుపు

పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాల్లో ఏకంగా రూ.16,607.57 కోట్లు కోత

అమాంతం పడిపోయిన సంఘాల పరపతి

ఏపీలో తిరోగమనంలో పొదుపు సంఘాలు

2024-25 స్వయం సహాయక సంఘాలపై నాబార్డు నివేదిక

సున్నా వడ్డీ పథకాన్ని రూ.3 లక్షల నుంచి ఏకంగా రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తామని ఎన్నికల ముందు నమ్మబలికిన బాబు

- ఆ హామీ మేరకు ఒక్క సున్నా వడ్డీ బకాయిలే రూ.7,500 కోట్లు
- సున్నా వడ్డీ లేదు.. ఆడబిడ్డ నిధి ఇవ్వలేదు.. జగన్ ఇచ్చిన పథకాలూ పోయాయ్..
- మహిళలను మరోసారి ముంచేసిన చంద్రబాబు సర్కారు
- నాడు సున్నా వడ్డీతోపాటు వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాలతో మహిళా సాధికారతకు బాటలు వేసిన జగన్
- ఒక్క సున్నా వడ్డీ ద్వారానే దాదాపు రూ.5 వేల కోట్లు చెల్లించి ఆదుకున్న వైఎస్ జగన్.. అక్కచెల్లెమ్మలు తమ కాళ్ల మీద నిలబడేలా వారి వ్యాపార ఉత్పత్తులు.. ఐటీసీ, పీ అండ్ జీ, రిలయన్స్, అమూల్ లాంటి సంస్థలతో టైఅప్

2 లో

రికార్డు 'కిక్'!

సంక్రాంతి సీజన్‌లో ఏరులై పారిన మద్యం

టీడీపీ మద్యం సిండికేట్‌కు పండుగ

రూ.1,797.57 కోట్ల మద్యం అమ్మకాలు

గతేడాది కంటే రూ.266.39 కోట్లు అధికం

విక్రయాల్లో తిరుపతి జిల్లా టాప్

తర్వాత స్థానాల్లో విశాఖ, నెల్లూరు, ఎన్టీఆర్ జిల్లాలు

2 లో

మద్యం తాగి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి

మణి మృతదేహం

పుష్పరాజ్ మృతదేహం

- అన్నమయ్య జిల్లా బండవడ్డిపల్లెలో విషాదం
- సంక్రాంతి పండుగ కోసం చెన్నై, బెంగళూరు నుంచి రాక
- గర్నిమిట్టలోని మద్యం దుకాణంలో 19 టిన్ బీర్లు కొనుగోలు
- నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ శివారులో తాగిన వైనం
- అస్వస్థతకు గురవ్వగానే ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి
- ఖాళీ బీర్ టిన్నులను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిన పోలీసులు
- అది నకిలీ మద్యం కావొచ్చని గ్రామస్తుల అనుమానం.. రాష్ట్రంలో ప్రతి నాలుగైదు మద్యం బాటిళ్లలో ఒకటి నకిలీదని ఇప్పటికే స్పష్టం
- ఆధారాలతో సహా పలు ప్రాంతాల్లో పట్టుబడిన నకిలీ మద్యం తయారీ కేంద్రాలు
- టీడీపీ నేతల కనుసన్నల్లో గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలకు సరఫరా
- తయారీ, పంపిణీ, విక్రయదారులంతా వాళ్లే.. లాభాల్లో నీకింత–నాకింత
- నకిలీ మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకుంటున్న, అనారోగ్యం పాలవుతున్న జనం
- తాజాగా 19 టిన్ బీర్లు తాగిన ఆరుగురిలో ఇద్దరు చనిపోవడంపై సర్వత్రా ఇదే అనుమానం

2 లో

అబద్ధాలు.. దబాయింపులు

భూముల రీ సర్వేపై విస్తుగొలుపుతున్న సీఎం చంద్రబాబు వైఖరి

- రాష్ట్రంలో అద్భుతంగా రీ సర్వే చేశామంటూ రూ.400 కోట్ల రాయితీ కోరిన వైనం
- వాస్తవంగా వైఎస్ జగన్ హయాంలో చేసిన రీ సర్వేపై కేంద్రం ప్రశంసలు
- ఓ వైపు రీ సర్వేపై బురదజల్లుతూ మరో వైపు సర్వే బాగా చేశామని కేంద్రం వద్ద బాబు బిల్డప్పులు
- తాము చేసిన సర్వే వల్లే రాయితీలు వచ్చాయని అబద్ధాలు ప్రచారం
- ఈ సర్వే కోసం జగన్ హయాంలో 3,240 జీఎన్ఎస్ఎస్ రోవర్లు, 200కు పైగా డ్రోన్లు, 70 కార్స్ స్టేషన్లు
- రోవర్ నెట్‌వర్క్ ద్వారా అత్యంత కచ్చితత్వంతో ఇదివరకెన్నడూ లేని విధంగా భూముల సర్వే
- వీటన్నింటి ద్వారా రాష్ట్రంలో 13,500 గ్రామాలకు గాను 6,800 గ్రామాల్లో పూర్తి
- విప్లవాత్మక రీతిలో సాగిన ఈ కార్యక్రమానికి గుర్తుగా గ్రానైట్‌తో హద్దుల్లో సర్వే రాళ్లు
- ఎప్పుడు సర్వే జరిగిందో గుర్తుండేలా లోగో ముద్రణ.. వీటన్నింటిపై నాడు బాబు దుష్ప్రచారం
- కేంద్రం ప్రశంసలతో ఇప్పుడు యూటర్న్ తీసుకుని అదే టెక్నాలజీతో సర్వే కొనసాగింపు
- క్యూ ఆర్ కోడ్ విధానం కూడా చోరీ.. కేంద్రం ప్రశంసలను తన ఖాతాలో వేసుకునేందుకు పడరాని పాట్లు

5 లో

ఒత్తిళ్లతో సచివాలయ ఉద్యోగి మృతి!

వైఎస్సార్ జిల్లా కడపలోని 27/2 గౌస్‌నగర్ సచివాలయంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీ జి.విజయకుమారి(42) అకస్మాత్తుగా మృతి చెందారు. ఈనెల 17న విధినిర్వహణలో ఉన్న విజయకుమారిని సర్వేల గురించి ఉన్నతాధికారులు గట్టిగా ప్రశ్నించడంతో ఆమె ఆందోళనకు గురైనట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున ఆమె మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

వివరాలు 5లో

అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి

ఈయూ బ్రేక్

గ్రీన్‌లాండ్ విషయంలో తన వెంట నిలబడని 8 ఐరోపా దేశాలపై ట్రంప్ 10 శాతం అదనపు సుంకాలు విధించడాన్ని యూరోపియన్ యూనియన్ తీవ్రంగా తప్పుబట్టింది. ట్రంప్‌కు బుద్ధిచెప్పాలని నిర్ణయించుకుంది. ఇందు కోసం అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని తాత్కాలికంగా పక్కనపెడుతున్నట్లు ప్రకటించింది. కాగా, నాటో మిత్రదేశాల సమష్టి భద్రత కోసం కృషి చేస్తున్న తమపైనే ట్రంప్ టారిఫ్‌లు విధించడం పూర్తిగా తప్పు అని యూరప్ దేశాల నేతలు ఖండించారు.

6లో

ఏపీఎస్ ఆర్టీసీకి దండగ..

టీఎస్ ఆర్టీసీకి పండుగ!

విజయవాడ బస్టాండ్‌లో తెలంగాణ ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

కీలకమైన సంక్రాంతి సీజన్‌లో ముఖం చాటేసిన మన ఆర్టీసీ

- హైదరాబాద్ నుంచి ఏపీకి ఏపీఎస్ ఆర్టీసీ కేవలం 200 సర్వీసులే
- ప్రైవేటు ట్రావెల్స్ మాఫియాతో కూటమి ప్రభుత్వ నేత కుమ్మక్కు
- టికెట్ రేట్లు ఐదారు రెట్లు పెంచేసి రూ.2 వేల కోట్లు దోపిడీకి స్కెచ్
- ఏపీకి ఏకంగా 6,430 స్పెషల్ బస్ సర్వీసులు తిప్పిన టీఎస్ ఆర్టీసీ పండుగ

2 లో

మీరు యాక్టివా..

పాసివా?

ఏ మ్యూచువల్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయాలి? షేర్లలో, బాండ్లలో ఇన్వెస్ట్ చేసే యాక్టివ్ ఫండ్లలోనా? లేదా ఇండెక్స్‌లో మాత్రమే పెట్టుబడి పెట్టే పాసివ్ ఫండ్స్‌లోనా? ఏది బెటర్?

మోసగాళ్లుంటాయ్...

జాగ్రత్త!

స్టాక్ మార్కెట్ మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్ సృష్టించి మోసం చేస్తున్న వారి బారిన పడకుండా ఉండటమెలా? మన డబ్బులు మనం కాపాడుకోవటం ఎలా?

- వివరాలు వెల్త్ పేజీలో

వైద్య శాఖలో

మరో అవినీతి టెం'ఢర్'

సెకండరీ హెల్త్ ఆస్పత్రులకు 230 వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్లు కొనుగోలుకు నిర్ణయం

- ఒక్కో ఎక్స్‌ట్రాక్టర్ ధర రూ.1.10 లక్షల నుంచి రూ.1.25 లక్షలలోపే
- అప్పుడీయుల అండతో రూ.3.13 లక్షలు చెల్లించేందుకు నిర్ణయం
- తద్వారా రూ.4 కోట్లకు పైగా నిధులు కొట్టేసేందుకు స్కెచ్
- ఇప్పటికే ఖరారైన టెండర్.. పర్చేజ్ ఆర్డర్ ఇవ్వడమే తరువాయి
- ఇదే పరికరాన్ని రూ.1.04 లక్షలకే తెలంగాణ సర్కారుకు సరఫరా చేసిన తయారీ సంస్థ
- కూటమి నేతలు, అధికారులకు భారీ ఎత్తున కమీషన్లు ముట్టజెప్పేలా ఒప్పందం

3 లో

క్లుప్తంగా...

సాల్మన్ హత్యపై వినతిపత్రం ఇస్తాం

- అపాయింట్‌మెంట్ ఇవ్వండి
- డీజీపీకి వైఎస్సార్‌సీపీ లేఖ

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన దళిత కార్యకర్త మందా సాల్మన్ దారుణ హత్యపై డీజీపీకి వినతి పత్రం అందజేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు తమకు సోమవారం అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ డీజీపీకి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి లేఖ రాశారు. ఊరు విడిచి ఎక్కడో తలదాచుకుంటూ, తన భార్యను చూసేందుకు వచ్చిన మందా సాల్మన్‌ను పిన్నెల్లిలో దారుణంగా ఇనుప రాడ్లతో కొట్టి హత్య చేశారని, రాష్ట్రంలో పూర్తిగా దిగజారిన శాంతిభద్రతలకు ఈ ఘటన ఒక ఉదాహరణ అని అప్పిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దళితులకు ఏ మాత్రం రక్షణ లేకుండా పోయిందని, ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్తలు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాల్మన్ హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసి, నిందితులకు శిక్ష పడేలా చూడాలని డీజీపీని కోరనున్నట్లు అప్పిరెడ్డి తెలిపారు.

నేటి నుంచి పోలవరంలో విదేశీ నిపుణుల కమిటీ పర్యటన



సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన విదేశీ నిపుణుల కమిటీ సోమవారం నుంచి ఈ నెల 21 వరకు పోలవరంలో పర్యటించనుంది. విదేశీ నిపుణుల కమిటీలో సభ్యులైన సీన్ హిన్స్ బెర్జర్, జియాన్ ఫ్రాంకో డీ సిక్కో, డేవిడ్ బి.పాల్ ఆదివారం రాత్రి రాజమహేంద్రవరానికి చేరుకున్నారు. వీరు సోమవారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), సీఎస్ఎంఆర్ఎస్ (సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) అధికారులతో కలిసి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. అనంతరం ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో.. అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో వెల్లడైన అంశాల ఆధారంగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేయనున్నారు. ఈ నెల 23న ఢిల్లీలో సీడబ్ల్యూసీ ఛైర్మన్, పీపీఏ సీఈవోలతో విదేశీ నిపుణులు సమావేశమై పోలవరం ప్రాజెక్టు పనుల స్థితిగతులను వివరించనున్నారు.

ఈ-పంట స్వీయ నమోదుకు త్వరలో శ్రీకారం

‘ఈ-పంటకు నిర్లక్ష్యం చీడ’ కథనంపై వ్యవసాయ శాఖ స్పందన

సాక్షి, అమరావతి: ఈ-పంట నమోదు వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తెస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. రైతులకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా కచ్చితమైన పంట నమోదు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో స్వీయ నమోదుకు అవకాశం కల్పించబోతున్నామన్నారు. ‘ఈ పంటకు నిర్లక్ష్యం చీడ’ శీర్షికన ఆదివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులు స్వయంగా పంట వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించడం ద్వారా మధ్యవర్తిత్వాన్ని తగ్గించి, రైతుల భాగస్వామ్యాన్ని పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. గతేడాది ఇదే సమయానికి 50 లక్షల ఎకరాల్లో పంటలను నమోదు చేయగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 12.50 లక్షల ఎకరాల్లో పంట వివరాలు నమోదు చేశామన్నారు. ఏలూరు, ఉభయ గోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో వరినాట్లు పూర్తికాకపోవడం వల్ల ఆయా జిల్లాల్లో ఈ పంట నమోదు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. రబీ కాలం ఫిబ్రవరి చివరి వరకు ఉన్నందున సాగైన మిగిలిన పంట వివరాల నమోదుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ఈ-కేవైసీ నమోదు ఫిబ్రవరిలో చేస్తామన్నారు. వెబ్‌సైట్‌లో ఈ -పంట నమోదు ట్రాకింగ్, ఫిర్యాదుల నమోదుకు అవకాశం కల్పించామన్నారు. రైతులే వారి పంటను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించేలా మొబైల్ అప్లికేషన్ తీసుకొస్తున్నామని తెలిపారు.

ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ (ఆర్టీఐ) చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. చీఫ్ కమిషనర్‌తోపాటు మరో నలుగురు కమిషనర్లుగా శరత్‌చంద్ర కళ్యాణ చక్రవర్తి, ఆదెన్న గాజుల, ఒంటేరు రవిబాబు, పరవాడ సింహాచలంను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో మూడేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వరకు కొనసాగుతారు.

‘పొదుపు’.. కుదుపు

పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాల్లో ఏకంగా రూ.16,607.57 కోట్లు కోత

అమాంతం పడిపోయిన సంఘాల పరపతి

ఏపీలో తిరోగమనంలో పొదుపు సంఘాలు

2024-25 స్వయం సహాయక సంఘాలపై నాబార్డు నివేదిక

ఏపీలో పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాలిలా..

2023-24	2024-25
వైఎస్సార్ సీపీ హయాంలో..	టీడీపీ కూటమి సర్కారు వచ్చాక..
సంఘాలకు మంజూరైన బ్యాంకు రుణాలు రూ.59,777.14 కోట్లు	సంఘాలకు మంజూరైన బ్యాంకు రుణాలు రూ.43,169.57 కోట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళలను హామీలతో మభ్యపుచ్చిన చంద్రబాబు సర్కారు మోసాలు నాబార్డు నివేదిక సాక్షిగా మరోసారి బట్టబయలయ్యాయి. ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం పథకాలను రద్దు చేసిన బాబు సర్కారు.. ఆడబిడ్డ నిధి, సున్నా వడ్డీ హామీలను సైతం ఎగరగొట్టడం తెలిసిందే. ఈ మోసాలకు బలై పోయిన స్వయం సహాయక పొదుపు సంఘాలు నిర్వీర్యమయ్యాయి. దీంతో వైఎస్సార్ సీపీ హయాంతో పోలిస్తే చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక 2024–25లో పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాలు ఏకంగా రూ.16,607.57 కోట్లు తగ్గిపోయినట్లు తాజాగా నాబార్డు నివేదిక వెల్లడించింది. తాము అధికారంలోకి వస్తే పొదుపు సంఘాలకు సున్నా వడ్డీ రుణాలను రూ.3 లక్షల నుంచి ఏకంగా రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తామని మేనిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. హామీ మేరకు రెండేళ్లలో ఒక్క సున్నా వడ్డీ పథకం ద్వారానే సుమారు రూ.7,500 కోట్ల మేర చంద్రబాబు సర్కారు పొదుపు సంఘాల మహిళలకు చెల్లించాల్సి ఉంది. ఇక ఆడబిడ్డ నిధి ద్వారా ఏటా రూ.18 వేలు చొప్పున రాష్టంలో ప్రతి మహిళకూ ఇస్తామన్న హామీని కూడా చంద్రబాబు ఎగ్గొట్టారు. అటు బ్యాంకు రుణాలు భారీగా తగ్గిపోవడం, ఇటు సున్నా వడ్డీ అమలు కాకపోవడంతో పొదుపు సంఘాల మహిళలు అప్పుల్లో కూరుకుపోతున్నట్లు నాబార్డు నివేదిక విశ్లేషించింది. ఆంధ్రప్రదేశ్‌లో పొదుపు సంఘాలకు రుణాల మంజూరు భారీగా తగ్గిపోయినట్లు నివేదిక వెల్లడించడం గమనార్హం.

డ్వాక్రా మహిళలకు బాబు మోసం..

‘ఆసరా’తో ఆదుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్

2014 ఎన్నికల ముందు డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకపోగా.. సున్నా వడ్డీ పథకాన్ని సైతం నిలిపివేశారు. ఫలితంగా పొదుపు సంఘాలు తీవ్ర అప్పుల ఊబిలో కూరుకుపోయి ఎన్‌పీఏలు (నిరర్థక ఆస్తులు)గా మారాయి. దీంతో నాడు చంద్రబాబు హయాంలో ఒక దశలో 18.36 శాతం సంఘాలు ఎన్‌పీఏలుగా ముద్రపడ్డాయి. అనంతరం వైఎస్ జగన్ హయాంలో పొదుపు సంఘాలు పునరుజ్జీవమయ్యాయి. నాడు వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు.. 2019 పోలింగ్ నాటికి రాష్ట్రంలో పొదుపు సంఘాలకు ఉన్న అప్పు మొత్తం రూ.25,571 కోట్లను ‘వైఎస్సార్ ఆసరా’ పథకం ద్వారా మహిళలకు నేరుగా చెల్లించడంతో పాటు సున్నా వడ్డీ పథకాన్ని క్రమం తప్పకుండా అమలు చేశారు. ఒక్క సున్నా వడ్డీ ద్వారానే మహిళలకు దాదాపు రూ.ఐదు వేల కోట్ల మేర చెల్లించి ఆదుకున్నారు. దీంతో పొదుపు మహిళలు సకాలంలో రుణాలను తిరిగి చెల్లించడంతో నాడు ఎన్‌పీఏల సంఖ్య కేవలం 0.17 శాతానికి పరిమితమైంది. అప్పట్లో దేశంలోనే అత్యధిక క్రెడిట్ లింకేజీ ఉన్న పొదుపు సంఘాలుగా నిలిచాయి. ఇక చేయూత పథకం ద్వారా మహిళా సాధికారతకు వైఎస్ జగన్ ప్రభుత్వం బాటలు వేసింది. మహిళలు వివిధ వ్యాపారాల్లో రాణించి తమ కాళ్లపై నిలదొక్కుకునేలా వారి ఉత్పత్తులను అమూల్, రిలయన్స్, ఐటీసీ ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్, హిందుస్థాన్ లీవర్ లాంటి ప్రముఖ సంస్థలతో అనుసంధానించి, రుణాలు అందచేసి తోడ్పాటునిచ్చింది.

ఏపీఎస్ ఆర్టీసీకి దండగ.. తెలంగాణ ఆర్టీసీకి పండుగ!

కీలకమైన సంక్రాంతి సీజన్‌లో ముఖం చాటేసిన మన ఆర్టీసీ

విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ, హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న తెలంగాణ ఆర్టీసీ బస్సులు

సాక్షి, అమరావతి: పండుగ ముసుగులో ఓవైపు టీడీపీ నేతలు కోడిపందేలు, కేసినోలు, గుండాట, కోత ముక్కలాట ఆడిస్తూ పండుగ నాలుగు రోజులు రూ.వేల కోట్లు దండుకున్నారు. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయకుండా ప్రైవేటు ట్రావెల్స్‌కు పెద్దపీట వేసింది. ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తుంటే పట్టించుకోకుండా యాజమాన్యాల నుంచి రూ.వందల కోట్లు దండుకుని అవినీతికి కొత్తదారులు తెరిచింది. ఇలా దేన్నీ వదిలిపెట్టకుండా అందినకాడికి టీడీపీ నేతలు దోచుకునేలా చంద్రబాబు ప్రభుత్వం దగ్గరుండి ప్రోత్సహించింది. మరోవైపు సంక్రాంతికి ఏపీఎస్ఆర్టీసీ ముఖం చాటేసింది. ప్రైవేట్ ట్రావెల్స్ మాఫియా దోపిడీకి కొమ్ము కాసింది. మరోవైపు తెలంగాణ ఆర్టీసీ మాత్రం సంక్రాంతి సీజన్‌ను సద్వినియోగం చేసుకోవడం గమనార్హం.

టీఎస్ ఆర్టీసీ 6 వేల సర్వీసులు

సంక్రాంతికి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేవారిలో అత్యధికులు హైదరాబాద్ నుంచే బయలుదేరుతారు. అందువల్లే హైదరాబాద్ నుంచి ఏపీలో వివిధ ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపటంపై నిర్వాహకులు దృష్టి సారిస్తారు. ఏపీఎస్ ఆర్టీసీ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విస్మయపరిచింది. గత కొన్నేళ్లుగా సంక్రాంతి సీజన్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు 2 వేలకుపైగా స్పెషల్ బస్ సర్వీసులను తిప్పిన ఏపీఎస్ ఆర్టీసీ ఈ ఏడాది మాత్రం కేవలం 200 సర్వీసులకే పరిమితం చేసినట్లు ప్రకటించడం గమనార్హం. టీడీపీ కూటమి ప్రభుత్వంలో కీలక నేత ఒకరు ప్రైవేటు ట్రావెల్స్ మాఫియాతో కుమ్మక్కు కావడమే దీనికి కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సంక్రాంతి సీజన్‌లో టికెట్ రేట్లను ఏకంగా ఐదారు రెట్లు అదనంగా పెంచేసి ఏకంగా రూ.2 వేల కోట్ల దోపిడీకి ప్రైవేటు ట్రావెల్స్ పన్నాగం పన్నింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక నేత ఒకరు వత్తాసు పలికారు. ఆయనకు భారీగా ముడుపులు ముట్టజెప్పడమే దీనికి కారణం. దాంతో ఈ ఏడాది ఏపీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ నుంచి సంక్రాంతి స్పెషల్ బస్సులకు భారీగా కోత పెట్టింది. కేవలం 200 స్పెషల్ సర్వీసులతో చేతులు దులుపుకొంది. దీనిపై తీవ్ర విమర్శలు రేగడంతో ఏటా మాదిరిగానే హైదరాబాద్ నుంచి స్పెషల్ బస్సు సర్వీసులను నిర్వహిస్తామని తూతూమంత్రంగా ప్రకటన చేసి పక్కకు తప్పుకుంది. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలో ఏ ప్రాంతాలకు ఎన్ని సర్వీసులు అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. తద్వారా ప్రైవేట్ ట్రావెల్స్ మాఫియాకు టీడీపీ కూటమి ప్రభుత్వం వత్తాసు పలికింది. మరోవైపు సంక్రాంతి సీజన్‌ను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ టీఎస్ ఆర్టీసీ ఏపీకి పెద్ద ఎత్తున బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు టీఎస్ ఆర్టీసీ ఏకంగా 6,430 సంక్రాంతి స్పెషల్ సర్వీసులను తిప్పడం గమనార్హం.

రికార్డు ‘కిక్’

సంక్రాంతి సీజన్‌లో ఏరులై పారిన మద్యం

సాక్షి, అమరావతి: సంక్రాంతి సీజన్‌లో టీడీపీ మద్యం సిండికేట్ పండుగ చేసుకుంది. మూడు బీర్లు.. ఆరు నిబ్బులుగా మద్యాన్ని ఏరులై పారించింది. ప్రైవేటు మద్యం దుకాణాలు, బార్లతో పాటు 75 వేలకుపైగా బెల్ట్ దుకాణాలు, కోడి పందేల బరులు, మట్కా జూదాల డెన్‌లు, బీచ్‌లు, వీధి వాడా విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు నెలకొల్పి యథేచ్ఛగా దందాకు తెగబడింది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తుండిపోయింది. ఫలితం.. మద్యం అమ్మకాల్లో చంద్రబాబు సర్కారు కొత్త రికార్డులు సృష్టించింది. టీడీపీ మద్యం సిండికేట్ అడ్డగోలు దోపిడీని మరోసారి చాటిచెప్పిన మద్యం అమ్మకాల తీరు ఇలా ఉంది...

రూ.3 వేల కోట్ల దిశగా..

సంక్రాంతి సీజన్‌లో మద్యం అమ్మకాల్లో ఏపీ కొత్త రికార్డులు సృష్టించింది. ఈ ఏడాది జనవరి 1వతేదీ నుంచి 17 వరకు రాష్ట్రంలో ఏకంగా రూ.1,797.57 కోట్ల విలువైన మద్యాన్ని విక్రయించడం గమనార్హం. మొత్తం 24.64 లక్షల మద్యం కేసులు, 11.36 లక్షల బీరు కేసులు విక్రయించారు. గతేడాది సంక్రాంతి సీజన్ సందర్భంగా జనవరి 1 నుంచి 17 మధ్య రూ.1,531.18 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది మరో రూ.266.39 కోట్ల మేర అధికంగా మద్యం విక్రయాలు సాగాయి. ఇక ఈ నెలాఖరుకు మద్యం విక్రయాలు రూ.3 వేల కోట్ల మార్కును దాటుతుందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది.

టాప్‌లో తిరుపతి జిల్లా

సంక్రాంతి సీజన్ మద్యం విక్రయాల్లో తిరుపతి జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలో అత్యధికంగా రూ.111.97 కోట్ల విలువైన మద్యం విక్రయించారు. తరువాత స్థానాల్లో రూ.108.17 కోట్ల విక్రయాలతో విశాఖ జిల్లా రెండో స్థానంలో ఉంది. రూ.97.43 కోట్ల మద్యం విక్రయాలతో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా మూడో స్థానంలో, రూ.91.91 కోట్ల అమ్మకాలతో ఎన్టీఆర్ జిల్లా నాలుగో స్థానంలో ఉన్నాయి.

మద్యం తాగి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి

అన్నమయ్య జిల్లా బండవడ్డిపల్లెలో విషాదఛాయలు

మద్యం టిన్‌లు సేకరిస్తున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు

మణికుమార్ (ఫైల్)

పుష్పరాజ్ (ఫైల్)

కేవీపల్లె/పీలేరు రూరల్: అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం బండవడ్డిపల్లెలో సంక్రాంతి పండుగ కోసం వచ్చిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మద్యం తాగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. బండవడ్డిపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు ఆవులకుంట మణికుమార్ (32) చెన్నైలో, గోవిందు కుమారుడు వేముల పుష్పరాజ్ (28) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. సంక్రాంతి పండుగకు వీరు స్వగ్రామానికి వచ్చారు. అదే గ్రామానికి చెందిన సమీప బంధువులైన శ్రావణ్, వేణు, శివమణి, అభిషేక్‌లతో కలసి శనివారం గ్రామ సమీపంలోని గుట్ట ప్రాంతంలో కూర్చుని మద్యం తాగారు. ఈ క్రమంలో మణికుమార్, పుష్పరాజ్‌లు రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇద్దరిని చికిత్స నిమిత్తం గర్నిమిట్ట పీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రి సిబ్బంది సూచన మేరకు అక్కడ నుంచి పీలేరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మణికుమార్ మృతి చెందాడు. పుష్పరాజ్‌ను పీలేరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని వారు సూచించారు. అక్కడి నుంచి పీలేరు ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పుష్పరాజ్ మృతి చెందాడు. వారు మద్యం తాగిన ప్రాంతాన్ని కలకడ సీఐ లక్ష్మన్న, కేవీపల్లె, కలకడ ఎస్ఐలు వెంకట శివకుమార్, రామాంజులు, పీలేరు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డిలు క్షుణ్ణంగా పరిశీలించారు. మిగిలిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా, పండుగ సంబరాలకు స్వగ్రామానికి వచ్చిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఇలా మృతి చెందడంతో బండవడ్డిపల్లెలో విషాదం నెలకొంది. మృతుడు మణికుమార్‌కు భార్య నాగశివరాణి తోపాటు ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. ఎంబీఏ చదివిన పుష్పరాజ్ గత ప్రభుత్వంలో గ్రామ వలంటీరుగా పనిచేశాడు. తండ్రి గోవిందు కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పుష్పరాజ్ మృతితో తల్లి సరోజ జీవనాధారం కోల్పోయింది.

మద్యం టిన్‌లు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు..

అతిగా మద్యం తాగడం వల్లే కేవీపల్లె మండలం బండవడ్డిపల్లెలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందారని అన్నమయ్య జిల్లా రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం పీలేరులోని సీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మణికుమార్, పుష్పరాజ్‌ల సమీప బంధువులైన శ్రావణ్, శివమణి, వేణుగోపాల్, అభిషేక్‌లతో కలసి గర్నిమిట్టలోని మద్యం దుకాణం నుంచి బడ్వైజర్ టిన్ బీర్లు 19 కొనుగోలు చేశారని తెలిపారు. బండవడ్డిపల్లె సమీపంలోని గుట్టలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తాగారన్నారు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో వారిద్దరూ అస్వస్థతకు గురై మృతి చెందారని చెప్పారు. మణికుమార్ తండ్రి ఆవులకుంట నరసింహులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతులుగా కేసు నమోదు చేశామన్నారు. పీలేరు ఎక్సైజ్ అధికారులు ప్రాథమిక దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారు తాగిన బీరు ఖాళీ టిన్నులు, మిగిలిన ఆహార పొట్లాలను సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తామని చెప్పారు.

ఆ మద్యం అసలైనదేనా?

యువకులు రెండు, మూడు బీర్లు తాగడం మామూలేనని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. బండవడ్డిపల్లె ఘటనలో ఆరుగురు కలిసి 19 టిన్ బీర్లు (ఒక్కో టిన్ 500 ఎంఎల్) తాగారని, అంటే ఒక్కొక్కరు రెండు బీర్లు (బాటిల్) తాగారని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో వారు తాగింది నకిలీ మద్యం కావొచ్చని గ్రామస్తులు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి నాలుగైదు మద్యం/బీరు బాటిళ్లలో ఒకటి నకిలీదని ఇప్పటికే బట్టబయలైంది. ఆధారాలతో సహా పలు ప్రాంతాల్లో పట్టుబడిన నకిలీ మద్యం తయారీ కేంద్రాలే ఇందుకు నిదర్శనం. అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నం, పాలకొల్లు, ఉభయ గోదావరి జిల్లాలు, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు బయట పడటం తెలిసిందే. ఇవన్నీ కూడా అధికార టీడీపీ నేతల కనుసన్నల్లో కొనసాగాయి. బయట పడనివి ఇంకా పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. వీటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని మద్యం దుకాణాలకు, బెల్ట్ షాపులకు నకిలీ మద్యం/బీరు సరఫరా అవుతోంది. తయారీ, పంపిణీ, విక్రయదారులంతా వాళ్లే కావడంతో అడిగే వారు లేరు. ప్రభుత్వ పెద్దలు లాభాల్లో నీకింత-నాకింత అంటూ వాటాలు పంచుకుంటూ పై నుంచి భరోసా ఇస్తుండటంతో ఈ దందా వ్యవస్థీకృతమైంది. అందువల్లే నకిలీ మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకుంటున్న, అనారోగ్యం పాలవుతున్న జనం సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో బండివడ్డిపల్లె ఘటనలో దర్యాప్తు ఎంత వరకు పారదర్శకంగా జరుగుతుందనే విషయమై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఫుడ్ మీదకో నెపం తోసేసి దోషులను తప్పించరని గ్యారంటీ ఏమిటని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యమాలతో మతోన్మాద శక్తులను అడ్డుకుంటాం

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హెచ్చరిక
- ఖమ్మంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ‘భారతదేశంలో మతోన్మాద శక్తులు విజృంభిస్తున్నాయి. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. ఇది దేశ భవిష్యత్తుకు మరింత ప్రమాదకరం. ఫాసిస్టు శక్తులను ఎదుర్కొనేందుకు అన్ని లౌకిక శక్తులు ఏకం కావాలి. బలమైన ఉద్యమ నిర్మాణాల ద్వారా మతోన్మాద శక్తులను అడ్డుకుంటాం’ అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా చెప్పారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ‘మోదీ తనకు తానే గొప్ప ధైర్యవంతుడినని చెప్పుకుంటారు. కానీ డొనాల్డ్ ట్రంప్ భారతదేశాన్ని నిందిస్తున్నప్పుడు, రష్యా నుంచి చమురు కొనొద్దని ఆంక్షలు పెట్టినప్పుడు నోరు మెదపడం లేదు. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారు. మోదీ ప్రధాని అయ్యాక దేశం గౌరవాన్ని కోల్పోయింది. కానీ వందేళ్ల సీపీఐ పార్టీ దేశంలోనే కాదు.. ప్రపంచంలో ఎక్కడైనా సామ్రాజ్యవాద శక్తులు ప్రజలను హింసిస్తే వారికి అండగా ఉంటుంది. ప్రజల కోసం మరో వందేళ్ల పోరాటానికి సిద్ధంగా ఉంటాం. మోదీని అధికారం నుంచి దించే వరకు పోరాడతాం’ అని డి.రాజా చెప్పారు. ‘కమ్యూనిజం లేదు, సోషలిజం లేదు.. టూరిజం అని చెప్పే పెద్ద మనిషి (ఏపీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి) మోదీ కళ్లజోడు పెట్టుకొని తిరుగుతా ఉన్నాడు.. ఆయన ఇక్కడకు వచ్చి చూస్తే ఎర్ర సైన్యం కనిపిస్తుంది’ అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఇక్కడ టీవీ వాళ్లు లైవ్‌ను ఏపీ సీఎం చంద్రబాబుకు కనిపించేలా పెట్టాలన్నారు. అది చూసి కమ్యూనిజం ఉందో, లేదో చెప్పాలన్నారు. చంద్రబాబు తన కళ్లతో కాకుండా మోదీ కళ్లతో చూడొద్దని ఎద్దేవా చేశారు. సభకు సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సీపీఐ అగ్రనాయకత్వం, దేశ, విదేశాల కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు రావడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలవడమే కాక సీపీఐ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

ఖమ్మంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు హాజరైన కార్యకర్తలు, జనసందోహం. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న డి.రాజా

విమానాల రాకపోకలకు పొగమంచు అంతరాయం

పొగమంచు కారణంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో ఆదివారం ఉదయం విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తెల్లవారుజాము నుంచి విమానాశ్రయ పరిసర ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా అలుముకుంది. దీంతో న్యూఢిల్లీ నుంచి ఉదయం 8.30 గంటలకు ఇక్కడికి చేరుకున్న ఎయిర్ ఇండియా విమానం రన్‌వే విజిబులిటీ లేకపోవడంతో సుమారు 40 నిమిషాలు గాలిలో చక్కర్లు కొట్టింది. అనంతరం రన్‌వేపై సురక్షితంగా దిగింది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విశాఖపట్నం విమాన సర్వీసులు కూడా ఆలస్యంగా నడిచాయి. – విమానాశ్రయం(గన్నవరం)

అరకులోయలో ఐస్‌గడ్డలుగా హిమసోయగం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలిపులి ప్రజలను వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో పాటు పొగమంచు దట్టంగా కురుస్తుంది. ఆంధ్ర ఊటీగా పేరొందిన అరకులోయలోని ప్రభుత్వ ఐటీఐ ఎదుట ఉన్న ఓపెన్ టెంట్ల వద్ద పర్యాటకుల కారు టాప్‌పై ఆదివారం అధికంగా మంచు ఐస్‌గడ్డలు మాదిరి కనబడటంతో పర్యాటకులు మురిసిపోయారు. అరకులోయలో ఆదివారం 3.9డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదవ్వగా పొగమంచు దట్టంగా కురిసింది. రెండేళ్ల క్రితం పాడేరులోనూ కార్లపై ఐస్ గడ్డలు ఏర్పడగా, ఈ ఏడాది జి.మాడుగులలో ఇలా ఐస్ గడ్డలు దర్శనమివ్వడం విశేషం. – సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

కన్నుల పండువగా అప్పన్న జలవిహారం

పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జలవిహారం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. కొండ దిగువన ఉన్న వరాహ పుష్కరిణిలో నిర్వహించిన ఈ వేడుకను చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వేణుగోపాలస్వామి అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా సింహగిరి నుంచి పల్లకీపై కొండ దిగువకు తీసుకొచ్చారు. అనంతరం పుష్కరిణిలో సర్వాంగ సుందరంగా సిద్ధం చేసిన హంస వాహనంపై స్వామివారిని వేంచేపు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. – సింహాచలం

క్లుప్తంగా...

శ్రీశైలంలో ముగిసిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో ఈ నెల 12 నుంచి వైభవంగా జరుగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అశ్వవాహనసేవ చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజాది హారతులిచ్చారు. సంక్రాంతి పర్వదినాన పార్వతీమల్లికార్జున స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంత సేవ నిర్వహించారు. ఆయా ఉత్సవాలతో బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి.

నేటి నుంచి అరసవల్లిలో రథసప్తమి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో రథ సప్తమి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర పండుగగా గుర్తింపు లభించడంతో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి మూడు రోజులు హెలికాప్టర్ రైడ్, క్రీడా సంబరాలు, ఫుడ్ ఎగ్జిబిషన్ జరుగుతాయి. 22, 23, 24 తేదీల్లో మెగా సూర్య నమస్కారాలు, థమన్ ఆర్కెస్ట్రా, జబర్దస్త్ నటులతో హాస్యప్రదర్శనలు, డ్రోన్, లేజర్ షోలు ఏర్పాటు చేయనున్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి: సీపీఎం

వి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని ఉప్పులూరు కోడి పందేల బరి వద్ద దళితులను బట్టలూడదీసి, తాళ్లతో కట్టేసి అమానుషంగా హింసించిన నిర్వాహకులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తోట్లవల్లూరుకు చెందిన 11 మందిని కూలి పనుల కోసం తీసుకెళ్లారని, వచ్చిన డబ్బుల్లో లెక్క తేడా రావడంతో కూలికి వచ్చినవారే ఆ సొమ్మును తీశారనే నెపంతో దాడి చేయడం దారుణమని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. హైకోర్టు తీర్పును సైతం ధిక్కరిస్తూ, అధికార పార్టీ అండదండలతో రాష్ట్రమంతా పందేలను నిర్వహించినా ప్రభుత్వం గుడ్లప్పగించి చూసిందే తప్ప ఎక్కడా నిలువరించే ప్రయత్నం చేయలేదన్నారు. పైగా ప్రజా ప్రతినిధులు, మంత్రులు సైతం ప్రత్యక్షంగా హాజరై ప్రోత్సహించారని దుయ్యబట్టారు. అలాంటి ప్రజా ప్రతినిధులపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడలో ఏకాత్మ మానవ దర్శన్ మహాసభ



పీవీఎన్ మాధవ్

సాక్షి, అమరావతి: జనవరి 23, 24 తేదీల్లో విజయవాడ మున్సిపల్ స్టేడియంలో ఏకాత్మ మానవ దర్శన్ జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్టు బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. 1965లో ఇదే నెలలో ఏకాత్మ మానవ దర్శన్ కార్యక్రమం విజయవాడలో నిర్వహించామని, ఇప్పుడు ఆ చారిత్రాత్మక తీర్మానాన్ని తిరిగి గుర్తు చేసుకోవడం కోసం మహాసభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో ఏకాత్మ మానవ దర్శన్ పోస్టర్‌ను మాధవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలో రాజకీయ, సాంస్కృతిక కోణాలు, భారతీయతతోపాటు ప్రపంచవ్యాప్తంగా దాని ప్రభావం, ఆర్థికాభివృద్ధి వికేంద్రీకరణ, సమగ్ర ఆలోచన విధానం ద్వారా విశ్వదర్శనం, భారత రక్షణ వంటి అంశాలపై చర్చిస్తామన్నారు.

వైద్య శాఖలో మరో అవినీతి టెం'ఢర్'

- సెకండరీ హెల్త్ ఆస్పత్రులకు 230 వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్‌ల కొనుగోలుకు నిర్ణయం
- కూటమి నేతలు, అధికారులకు భారీ ఎత్తున కమీషన్లు ముట్టజెప్పేలా ఒప్పందం

సాక్షి, అమరావతి: రూపాయి వస్తువును పది రూపాయలకు కొనడం.. అదనంగా వెచ్చించే సొమ్మును కాంట్రాక్టర్ ద్వారా కమీషన్ల రూపంలో జేబుల్లో వేసుకోవడంలో ఆరితేరిపోయారు ప్రభుత్వ పెద్దలు. వీరి ధనదాహానికి కొందరు అధికారులు కూడా తోడై ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. చివరకు ప్రజారోగ్యానికి భరోసాగా నిలవాల్సిన ఆరోగ్య శాఖను సైతం వదలకుండా దోచేస్తున్నారు. వైద్య పరికరాల మాటున భారీ స్కామ్‌లకు పాల్పడుతున్నారు. పరికరాల కొనుగోళ్లలో ధరలను అమాంతం పెంచేసి కమీషన్ల రూపంలో అధికారులు, నేతలు పెద్దఎత్తున దండుకుంటున్నారు. ప్రభుత్వాస్పత్రులకు వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్ పరికరాల కొనుగోలు కుంభకోణమే దీనికి తాజా ఉదాహరణ.

రూ.4 కోట్లకు పైనే కొట్టేసేలా కుట్ర

సాధారణ ప్రసవం సందర్భంగా తల్లి గర్భం నుంచి శిశువు బయటకు వచ్చే సమయంలో అవరోధాలు ఉంటే.. శిశువును బయటకు తీయడం కోసం వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్‌ను ఉపయోగిస్తారు. వీటిని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేయడం కోసం గత ఏడాది సెప్టెంబర్‌లో ఒక్కో పరికరానికి రూ.3,13,598 చొప్పున వెచ్చించేలా ఏపీఎంఎస్ఐడీసీ రేట్ కాంట్రాక్ట్ ఖరారు చేసింది. మెడిసిల్ కంపెనీకి చెందిన ఈ పరికరాలను ఆస్పత్రులకు సరఫరా చేసేందుకు విశాఖ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది. వాస్తవానికి ఇదే పరికరాన్ని తయారీ సంస్థ (మెడిసిల్) రూ.1.04 లక్షలకు హైదరాబాద్‌లోని పేట్లబుర్జు మహాత్మాగాంధీ మెటర్నిటీ హాస్పిటల్(ఎంజీఎంహెచ్)కు సరఫరా చేసింది. 2021–22 మధ్య రూ.1.15 లక్షల నుంచి రూ.1.25 లక్షల ధరకు తయారీ సంస్థ పరికరాలను విక్రయించింది. ఈ అంశాలన్నింటినీ గతేడాది తెలంగాణ ఎంఎస్ఐడీసీ నిర్వహించిన ఓ టెండర్‌లో మెడిసిల్ సంస్థ స్పష్టం చేసింది. కాగా, ఇదే కంపెనీకి చెందిన పరికరాన్ని ఏకంగా రూ.3.13 లక్షలకు కొనుగోలు చేసేలా ఏపీ వైద్య శాఖ రేట్ కాంట్రాక్ట్ ఖరారు చేయడం చర్చనీయాంశంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసిన ఒక్కో వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్ ధర రూ.1.50 లక్షల కంటే ఎక్కువ ఉండదని మెడికల్ ఏజెన్సీలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణంగా ఎంఎస్ఐడీసీ టెండర్లలో తయారీ సంస్థలు కాకుండా డీలర్స్ పాల్గొంటూ ఉంటారు. వీరు 10 శాతం నుంచి 20 శాతం మేర మార్జిన్ పెట్టుకుని టెండర్లు వేస్తుంటారు. అయితే, కాంట్రాక్ట్ సంస్థ ఏకంగా రెండు రెట్లు అధికంగా ధరలు వేయడం వెనుక నేతలు, అధికారుల హస్తం ఉందని తెలుస్తోంది.

భారీ అవినీతికి స్కెచ్

గతేడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం రేట్ కాంట్రాక్ట్ ఖరారు చేయడం వెనుక భారీ అవినీతి స్కెచ్ ఉంది. అప్పట్లో పది పరికరాలను కొనుగోలు చేయడానికి రేటు కాంట్రాక్టు ఖరారు చేశారు. అనంతరం రెండు నెలలకే సెకండరీ హెల్త్ ఆస్పత్రులకు 230 వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్‌ల అవసరం ఉందని ఎంఎస్ఐడీసీకి ఇండెంట్ వచ్చినట్టు సమాచారం. వీటి కొనుగోలు చేసేందుకు ఎంఎస్ఐడీసీ ఖరారు చేసిన ధర ప్రకారం రూ.7 కోట్లకు పైగానే ఖర్చవుతుంది. అదే తయారీ సంస్థ వాస్తవ ధరలతో పోలిస్తే రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్లలోపే ఖర్చు అవుతుంది. ఈ లెక్కన అధిక ధరకు పరికరాలు కొనుగోలు చేయడం ద్వారా ఏకంగా రూ.4 కోట్ల మేర కమీషన్ల రూపంలో కొందరు అధికారులు, నేతలు కొల్లగొట్టడానికి స్కెచ్ వేసినట్టు తేటతెల్లం అవుతోంది. ఇదే ధరలో కాంట్రాక్ట్ సంస్థకు పర్చేజ్ ఆర్డర్ ఇచ్చేందుకు వైద్య శాఖ సిద్ధమవుతోంది.

TAX INVOICE
GSTIN 33BALPS0809M1ZE
MEDISIL ENGINEERS
No 2/17 Plot No 35 2nd Cross St Srinivasapuram Gajalakshmi Nagar Iyyapanthangal Chennai-600 056
Contact # +91- 9380520543 09600146292 E-mail: medisil2011@gmail.com medisilmak@yahoo.co.in

CUSTOMER DETAILS		
SUPERINTENDENT AAROGYASRI DEPARTMENT MGMH PETLABURJ, HYDERABAD-500064	Invoice No	GST 139
	Date	02-12-2022
	PO Number	38/MGMH/Aarogyasri/2022
	P O Date	28-11-2022
	DC Number	
	SERIAL NO	22L02139-I
	Customer GST	

HSN ACS	Description of Goods	Price	Pcs	Amount
9018	MEDISIL Vacuum Extractor Machine Electrically operated with Twin Foot switch controlled with Stainless Steel Trolley (Digital LED Model with Alarming facility) – MVDS 02		1	
9018	MEDISIL Vacuum Extraction Cup Silicone cup 60 mm (PINK) with silicone tube		1	
9018	MEDISIL Vacuum Extraction Cup Silicone cup 55 mm (GREEN) with silicone tube		1	
9018	Caesarean Aid Cup 60 mm (LIGHT BLUE) for High Floating Head in the C Section (To be used in OT) with Silicone Tubing		1	
9018	Birds Modified Stainless Steel Metal Cup 50 mm (Occipito Anterior) OA CUP with Silicone Tubing		1	
9018	Birds Modified Stainless Steel Metal Cup 50 mm (Occipito Posterior) OPCUP with Silicone Tubing		1	
	BANK DETAILS	Total Rs		92,857.14

Name of Account : MEDISIL ENGINEERS
Bank : ICICI Bank,
Branch: Sakthi Nagar, Porur, Chennai.
Account No: 027505001582
IFSC Code: ICIC0000275

CGST @		NIL
SGST @		NIL
IGST @	12%	11,142.86
Grand Total Rs		1,04,000.00

Rupees ONE LAKH FOUR THOUSAND ONLY
Receiver's Signature & Seal
For Medisil Engineers
Authorised Signatory

మెడిసిల్ సంస్థ రూ.1.04 లక్షలకే వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్‌ను తెలంగాణలోని పేట్లబురుజు ప్రభుత్వాస్పత్రికి సరఫరా చేసినట్టు ఇన్వాయిస్

	Warranty 3 Years			Negotiated Price Rs.2,24,000/-	13,44,000			
10	Vacuum Extractor Machine (4th call) Quantity – 10 Nos	2/1	M/s Visakha Healthcare India Pvt.ltd. & Medisil&MVDS-02	3,13,598.88	31,35,988.80	80475.76		L1

రూ. 3.13 లక్షలతో వాక్యూమ్ ఎక్స్‌ట్రాక్టర్ సరఫరాకు విశాఖ హెల్త్ కేర్ సంస్థ ఎల్‌-1 గా నిలిచినట్టు బీఎఫ్‌సీ డాక్యుమెంట్‌లో పేర్కొన్న ఎంఎస్ఐడీసీ. ఆ బీఎఫ్‌సీలో ధర ఆమోదించారు.

బీసీలపై అగ్రవర్ణం దాడులు

- మహిళలు, చిన్నారులు సహా పలువురికి గాయాలు
- బాపట్ల జిల్లా నాగండ్లలో ఘటన

ఇంకొల్లు (చినగంజాం): దేవుని ఊరేగింపు విషయంలో తలెత్తిన వివాదం రెండువర్గాల మధ్య విద్వేషాలకు దారితీసింది. ఈ నేపథ్యంలో బీసీల ఇళ్లపై ఒక అగ్రవర్ణం దాడులకు దిగింది. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం నాగండ్లలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. నాగండ్ల గ్రామంలో ఏటా సంక్రాంతి పండుగ రోజున గ్రామంలో మాధవయ్యస్వామి ఊరేగింపును బీసీలు, కనుమ రోజున అగ్రవర్ణం నిర్వహించడం ఆనవాయితీ. సంక్రాంతి రోజున ఎప్పటిలా బీసీలు ఊరేగింపు నిర్వహిస్తుండగా అగ్రవర్ణం వారితో చిన్నపాటి ఘర్షణ జరిగింది. కనుమ రోజున అగ్రవర్ణం ఊరేగింపు నిర్వహించేందుకు సిద్ధంకాగా.. ఊరేగింపు వాహనం వెళ్లే మార్గంలో బీసీలు బైక్ స్లో రేసింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. దీంతో రెండువర్గాల మధ్య మరోసారి చిన్నపాటి గొడవ జరిగింది. దాంతో పోలీసులు రెండువర్గాల వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. అయితే, ఈ నెల 17వ తేదీన అగ్రవర్ణానికి చెందిన కొందరు బీసీ మహిళతో ఘర్షణకు దిగడంతో ఆమె బంధువులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇదే అదునుగా అగ్రవర్ణానికి చెందిన వ్యక్తులు సామూహికంగా బీసీల ఇళ్లపై దాడికి దిగారు. కర్రలు, ఇనుపరాడ్లతో దాడిచేసి మహిళలు, చిన్నపిల్లలు అని కూడా చూడకుండా విచక్షణారహితంగా కొట్టారు. దాడిలో కయ్యాల సింగయ్యకు తల పగలగా, కయ్యాల శ్రావణి, కయ్యాల కోటేశ్వరమ్మ, తిరుపతమ్మ, కయ్యాల రమణ, నాగరాజు, సర్పంచ్ పద్మ భర్త కంచుగంటి వెంకటేశ్వర్లుపై టీడీపీకి చెందిన వారు విచక్షణారహితంగా దాడి చేశారని బాధితులు వాపోయారు. తమపై పథకం ప్రకారమే దాడిపర్తి వాసు, పవన్, యర్రమాసు హరిబాబు, ఈదర వెంకటేశ్వర్లు, ఉమ, రామారావు, ఈదర వెంకటేశ్వర్లు, పేర్ని నవీన్, రవీంద్ర, రమేష్, కె.పవన్, అనిల్, సుజాత, అశోక్ తదితరులు దాడికి పాల్పడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆ సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గుంపును చెదరగొట్టారు. గాయాలపాలైన సింగయ్య తదితరులను చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాడిలో గాయపడిన కయ్యాల సింగయ్య ఫిర్యాదు మేరకు 8 మందితో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఘర్షణ పడుతున్న రెండు వర్గాలు

వైఎస్సార్‌సీపీ సర్పంచ్ హత్యకు టీడీపీ మూకల యత్నం

- పచ్చరౌడీల రాకను పసిగట్టి తప్పించుకున్న సర్పంచ్
- బీరువా పగులగొట్టి రూ.మూడు లక్షల నగదు, 10 సవర్ల బంగారం చోరీ
- టీడీపీ ఫ్లెక్సీ చించివేశారంటూ ప్రత్యారోపణలు

ఇంట్లో జొరబడి బీరువా పగులగొట్టిన దృశ్యం

వేమూరు: బాపట్ల జిల్లా చుండూరు మండలం కొత్తనారికేళ్లపల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అంగిరేకుల నాగేశ్వరరావుపై టీడీపీ మూకలు శనివారం అర్ధరాత్రి హత్యాయత్నం చేశారు. టీడీపీ మూకలు కేకలు వేస్తూ రావడంతో పసిగట్టిన సర్పంచ్‌తోపాటు కుటుంబ సభ్యులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. దీంతో పచ్చ రౌడీలు ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేశారు. బీరువా పగులగొట్టి రూ.మూడు లక్షల నగదు, 10 సవర్ల బంగారం ఆభరణాలు తీసుకెళ్లారు. చుండూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వుయ్యూరు శివశంకరరెడ్డిపైనా టీడీపీ దుండగులు దాడి చేశారు. సర్పంచ్ కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. చుండూరు మండలం కొత్తనారికేళ్లపల్లి గ్రామంలో 16న గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ ఫ్లెక్సీని దహనం చేశారు. రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ అంగిరేకులు నాగేశ్వరరావుకు ఫోన్‌చేసి టీడీపీ ఫ్లెక్సీ కాల్చి వేస్తున్నారని, చూసి రావాలని కోరారు. డీఎస్పీ కోరిక మేరకు సర్పంచ్ ఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లారు. గ్రామంలో గొడవలు జరగకుండా పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. చుండూరు గ్రామానికి చెందిన గుదేటి బాలకోటిరెడ్డి 70 మంది అనుచరులతో శనివారం అర్ధరాత్రి నాగేశ్వరరావును హత్య చేసేందుకు కొత్త నారికేళ్లపల్లి గ్రామానికి కర్రలతో, కత్తులతో వెళ్లారు. అనుచరుల కేకలు గమనించి నాగేశ్వరరావు అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన వ్యక్తులు పారిపోయారు. బాలకోటిరెడ్డితోపాటు ఇతర గ్రామాలకు చెందిన అనుచరులు నాగేశ్వరరావు కోసం ఇల్లంతా గాలించారు. నాగేశ్వరరావు లేకపోవడంతో ఇంట్లోని టీవీ, వాషింగ్ మెషిన్, బైకు ధ్వంసం చేశారు. కిటికీ అద్దాలు పగులగొట్టారు. బీరువా పగులగొట్టి రూ.3 లక్షల నగదు, 10 సవర్ల బంగారం ఆభరణాలు తీసుకెళ్లారు. నాగేశ్వరరావు భార్య, కోడలు పక్కన ఉన్న ఇంట్లో దాక్కున్నారు. దీంతో దుండగులు ఆ ఇంటికీ వెళ్లి వస్తువులు ధ్వంసం చేశారు. అనంతరం చుండూరులోని వైఎస్సార్‌సీపీ నేత వుయ్యూరు రవి శంకర్‌రెడ్డిపై కర్రలతో ఇష్టారాజ్యంగా దాడి చేశారు. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం కొత్తనారికేళ్లపల్లి గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. తహసీల్దారు నాగరాజు 144 సెక్షన్ విధించారు. పోలీసులు గ్రామంలోకి ఇతరులను రాకుండా అడ్డుకున్నారు. తనను హత్యచేసేందుకే వచ్చారని, తాను లేకపోయేసరికి ఇంట్లో సామగ్రి ధ్వంసం చేశారని సర్పంచ్ నాగేశ్వరరావు విమర్శించారు. టీడీపీకి చెందిన బాలకోటిరెడ్డి రౌడీగా వ్యవహరిస్తున్నాడని. పోలీసులు అతనిపై చర్య తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు.

వరికూటి అశోక్‌బాబు గృహ నిర్బంధం

నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును పోలీసులు ఆదివారం చెరుకుపల్లిలోని ఆయన ఇంట్లో గృహ నిర్బంధం చేశారు. పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొత్తనారికేళ్లపల్లి వెళ్లేందుకు అశోక్‌బాబు బయలు దేరారు. ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, అశోక్‌బాబుకు మధ్య వాగ్వాదం జరిగింది. 41 నోటీసు ఇవ్వకుండా నిర్బంధం చేసే హక్కు లేదని అశోక్‌బాబు వాదించారు. దీంతో పోలీసులు 41 నోటీసు అందజేసి గృహ నిర్బంధం చేశారు.

కేవీబీపురం పోలీసులకు చుక్కెదురు

- వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్లో జంతుబలి చేశారని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు
- శ్రీకాళహస్తి కోర్టులో పోలీసుల తీరును ప్రశ్నించిన న్యాయమూర్తి

వరదయ్యపాళెం: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, కేవీబీపురం మండల పోలీసుల అత్యుత్సాహానికి శ్రీకాళహస్తి న్యాయస్థానంలో చుక్కెదురైంది. గత ఏడాది డిసెంబర్ 21న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేవీబీపురంలో స్థానిక సర్పంచ్ కరపారెడ్డి గిరిబాబు నేతృత్వంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆ సమయంలో జంతుబలి చేశారని అదే గ్రామానికి చెందిన టీడీపీ నేత చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి సర్పంచ్ గిరిబాబు, మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు మురళి, శ్రీధర్‌ను శనివారం అరెస్టు చేశారు. వారిని జైలుకు పంపాలని టీడీపీ నేతలు ఒత్తిడి చేయడంతో పోలీసులు వారిని రోజంతా బంధించి సంఘటనకు, కేసుకు సంబంధం లేని సెక్షన్లు నమోదు చేసి రాత్రి 12 గంటలకు శ్రీకాళహస్తి న్యాయస్థానంలో హాజరు పరిచారు. అయితే పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు, వ్యవహరించిన తీరుపై బాధితుల తరఫున న్యాయవాది శేఖర్ సవివరంగా కోర్టుకు వివరించారు. దీనిపై న్యాయమూర్తి సైతం పోలీసుల తీరును ప్రశ్నించడంతోపాటు, జరిగిన ఘటనకు, కేసుకు సంబంధం లేకుండా పోలీసులు వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం బాధితులకు రిమాండ్‌ను తిరస్కరించి బెయిల్ మంజూరు చేశారు. అనంతరం వారిని విడుదల చేశారు.

శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి.శ్రీనివాస్, జస్టిస్ కిరణ్మయి మండవ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంప్రసాద్ ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి దర్శించుకున్నారు. – తిరుమల/కాణిపాకం

ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ

కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంప్రసాద్

మల్లన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథశర్మ దంపతులు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులను వేదపండితులు, అర్చకులు ఆశీర్వదించగా, ఈవో స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. – శ్రీశైలం టెంపుల్

టీడీపీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో రికార్డింగ్ డ్యాన్సులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌నాయుడు జన్మదినానికి చిత్తూరు మండలంలో రికార్డింగ్ డ్యాన్సులు వేసిన వీడియోలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో వీటిని పలువురు ట్రోల్ చేస్తున్నారు. తొలుత పుట్టిన రోజు వేడుకలు జరుపుకోనని ప్రకటించిన ఎమ్మెల్యే.. రూ.కోట్లు ఖర్చుచేసి రహస్యంగా వేడుకలు చేసుకున్నారు. నరిగపల్లెలోని ఓ టీడీపీ నేత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదినాన రికార్డింగ్ డ్యాన్సులు, అశ్లీల నృత్యాలు నిర్వహించినట్లు వీడియోల్లో తెలుస్తోంది. అభివృద్ధి పనులంటే ఇవేనా అంటూ పలువురు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నిస్తున్నారు.

బుద్ధి, హృదయానికి సేవకుడిగా ఉండాలి
తప్పితే బానిసగా మారకూడదు.
– ఫ్రెంచి తత్వవేత్త ఆగస్టే కామ్టే

సాక్షి
సోమవారం, 19 జనవరి 2026

కరుణ ముఖ్యం

ఒక రైతు పెంచుకుంటున్న కుక్క ఆ రోజు కనపడలేదు. ఇంటికి రాలేదు. రైతు వెతకబోయే వేళకు చీకటి పడిపోయింది. రైతు విలవిలలాడిపోయాడు. రైతుకూ కుక్కకూ ఉన్న అనుబంధం గ్రామస్థులకు తెలుసు. రాత్రంతా జాగారం చేస్తున్న రైతు బాధ గమనించి తెల్లవారుతూనే రైతుకు సాయంగా కుక్కను వెతక బయలుదేరారు. వెళ్లగా వెళ్లగా వంతెన కింద మట్టిలో కుక్క పడుకుని కనిపించింది. వంతెన మీద నుంచి గ్రామస్థులు ఎంత పిలిచినా అది లేచి రాలేదు. ఏమై ఉంటుందా అని గ్రామస్థులు వంతెన దిగి కుక్క దగ్గరకు వెళితే అక్కడ కుక్క కుక్కలా లేదు. వెచ్చటి రగ్గులా ఉంది. ఎవరిదో తెలియని కుక్కపిల్ల చలికి వణుకుతూంటే దాని ఒళ్లు వెచ్చబెట్టేందుకు రాత్రంతా ఇంటికి రాకుండా కరుణతో కాపాడుతూ ఉంది. గ్రామస్థులు ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడ్డారు. దీనికి ఉన్న కరుణ మనిషికి ఎందుకు లేదు?

దేశంలో ఈ గడ్డకట్టే చలిగాలుల్లో, నెత్తి మీద కాసింత నీడ లేక, ఉత్తబిత్తల ఆకాశం కింద, తోచిన గుడ్డ కప్పుకుని వేలాదిమంది అభాగ్యులు రాత్రుళ్లు దయనీయంగా పడుకుని ఉన్న దృశ్యాలు మీడియాలో వస్తున్న వేళ – 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో నోబెల్ శాంతి విజేత 'లైమా గ్బవీ' తమ ఆఫ్రికా దేశపు కథను చెప్పడం కేవలం యాదృచ్ఛికం.

ఆమె చెప్పిన కథకు కొనసాగింపుగా మరో నోబెల్ శాంతి విజేత కైలాశ్ సత్యార్థి తన జీవితంలో ఎదురైన ఘటనను చెప్పుకొచ్చారు – చాలా ఏళ్ల కిందటి మాట. ఒక తండ్రి నా తలుపు తట్టాడు. అయ్యా... నా కూతురిని రక్షించు అన్నాడు. అప్పుడు చిన్న పత్రికను నడుపుతున్నాను. ఉత్తరప్రదేశ్ నుంచి పంజాబ్‌కు 30 కుటుంబాలు పనికి వెళితే వారిని కట్టు బానిసలుగా చేశారనీ, మహిళలు, చిన్న పిల్లలు ఉన్నారనీ, తన కూతురు వయసుకు రావడం చూసి అమ్మేయబోతున్నారనీ, పోలీసులు సాయానికి రాకపోవడం వల్ల పత్రికలో రాస్తే ఏదైనా ప్రయోజనం ఉంటుందని వచ్చాననీ ఆ తండ్రి నాతో ఏడుస్తూ చెప్పాడు. పత్రికలో ఆ విషయం రాయడానికి కూచుని వెంటనే పెన్సిల్ పక్కన పడేశాను. అక్కడ ఉన్నది నా కూతురో, చెల్లెలో అయితే ఇలా వ్యాసం రాస్తూ కూచుంటానా? అనుకున్నాను. ఆ తర్వాత నా తల పగిలి ఉండొచ్చు. వెన్నుపూసను విరిచినంత పని చేసి ఉండొచ్చు. నా కాలిని విరగ్గొట్టి ఉండొచ్చు. కాని ఇప్పటికి లక్షా ముప్పై వేల మంది అలాంటి పిల్లలను కాపాడాను. వారి ఆనంద బాష్పాలలో నేను దేవుణ్ణి చూశాను. కరుణే నాకు ఇంత శక్తి ఇచ్చిందని అనుకుంటున్నాను.

'మనిషి మంచివాడే. నాగరికత వల్ల చెడిపోయాడు' అన్నాడు రూసో. నాగరికత అంటే గాలి కూడా పీల్చడానికి వీల్లేనంతగా అభివృద్ధి చెందడం కాబోలు! మరి చెడిపోవడం అంటే? కరుణ అడుగంటిన వాడు అవడమే! కరుణ లేకపోతే ఏమవుతుంది? పీడన, పెత్తనం, చెడు, దుర్మార్గం, నిస్సహాయత, హింస, దౌర్జన్యం... కళ్ల ముందు కనిపిస్తున్నా చలించని జడత్వం వస్తుంది. జడత్వం రాయి. కరుణ జల.

తల్లిదండ్రులకు తమ పిల్లల ఐ.క్యూ (ఇంటెలిజెన్స్ కోషియెంట్) బాగుండాలని ఉంటుంది. కాని పిల్లల్లో చూడాల్సింది, పాదుకొనేలా చేయాల్సింది సి.క్యూ. అంటే 'కంప్యాషన్ కోషియెంట్'. ఇది ఎంత ఎక్కువ ఉంటే అంత సంతోషపడాలి. చీకట్లో నల్లపూస దొరకగలదేమోగానీ నేటి మనిషిలో కరుణ దొరకడం దుర్లభం అవుతోంది. అందుకే మనిషికి ఇంకో మనిషి, వర్గం, ప్రాంతం, కులం, మతం... అన్నింటి పట్లా విరోధభావం, శత్రుత్వం. తుదకు పశుజాలం పట్ల కూడా మనిషి కరుణ చూపడం లేదు. మనిషికి కరుణ ఉంటే నదులు, పర్వతాలు, అడవులు ఇలా ఉండేవా? అన్నారు కైలాశ్ సత్యార్థి. అందుకే మనిషిలో 'సి.క్యూ' కొలవగలిగే యాప్‌ను కనిపెట్టాలి. అది ఎక్కువ కలిగిన వారినే వివాహానికి, ఉద్యోగానికి, రాజకీయ పదవులకి ఎన్నుకోవాలి. స్కిల్స్ పెంచుకోవడానికి శిక్షణ ఇచ్చినట్టే కరుణ పెంచుకోవడానికి శిక్షణ ఇవ్వాలి అన్నారు సత్యార్థి.

జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో ఆయన తాజా పుస్తకం 'కరుణ: ది పవర్ ఆఫ్ కంప్యాషన్' ఆవిష్కరణ వేడుకలో ఇంటిని, కుటుంబాన్ని, సరిహద్దులను దాటి ప్రపంచ వ్యాప్తంగా అందరికీ చేరగల కరుణ అవసరం గురించి ఇలాంటి మాటలెన్నో సాగాయి. 'త్రుంచ బోకుము... తల్లికి బిడ్డకు వేరు చేతువే' అని విలపించిన కరుణశ్రీ నడిచిన తెలుగు నేలకు కరుణ తెలియదా ఏమి? కాకుంటే కాస్త మరుగున పడి ఉంటుంది, మరుపున అణిగి ఉంటుంది అంతే!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.పాడ్యమి రా.2.09 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ప.12.20 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** సా.4.31 నుండి 6.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.33 నుండి 1.19 వరకు, తదుపరి ప.2.45 నుండి 3.32 వరకు, **అమృత ఘడియలు:** రా.2.33 నుండి 4.13 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం: 5.44
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

బిజినెస్

నా బిజినెస్ ఫిలాసఫీ : ఏ పరిస్థితుల్లోనూ అప్పుల ఉచ్చులో పడొద్దు; మార్కెట్ మార్పులను అంచనా వేస్తుండు; సంస్థలో కుటుంబ వాతావరణాన్ని ప్రవేశపెట్టు; అన్నిటి కంటే ముందు.. అత్యుత్తమమైన వ్యక్తులనే నియమించుకుని, మంచి టీమ్‌ను ఏర్పాటు చేసుకో!

– జే మెహతా, బిజినెస్‌మ్యాన్

ఛాంపియన్

కష్ట సమయాల్లో సానుకూల వైఖరితో స్థిరంగా ఉండే ప్రతి ఒక్కరూ ఒక ఛాంపియన్! ఓటమి, అనారోగ్యం, వచ్చిన అవకాశాలు వెనక్కు వెళ్లిపోవటం... ఇవన్నీ పరిస్థితులే తప్ప, తిష్ఠవేయటానికి వచ్చే కష్టాలు కాదు. ధైర్యంగా ఉండండి!!

– వినోద్ కాంబ్లీ, మాజీ క్రికెటర్

డిగ్రీలు

యుక్త వయసు అనేది ఒకరి జీవితానికి పునాది. అది జ్ఞానాన్ని సంపాదించటానికి, సరైన విలువలు నేర్చుకోవటానికి అనుకూల సమయం. విశ్వవిద్యాలయాలు డిగ్రీలను ప్రదానం చేయటం మాత్రమే కాదు, వారిని మంచి పౌరులుగా కూడా తీర్చిదిద్దాలి.

– ఆచార్య దేవవ్రత్, గుజరాత్ గవర్నర్

బలిమి

విదేశీ ఆక్రమణల వల్ల మాత్రమే దేశాలు పతనం కావు. ఐక్యతా బంధాలు తెగిపోయినప్పుడు కూడా అవి లోపలి నుండి కూలిపోతాయి. కులం, జాతి, మతం, స్త్రీ-పురుష వ్యత్యాస భావనలకు అతీతంగా అందరినీ సమానంగా చూడటమే మన దేశానికి బలం.

– నజీబ్ జంగ్, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్

బోధన



జీవావరణ శాస్త్రం అనేది మనిషి మనుగడకు సంబంధించిన విజ్ఞానం. మన జల, భూసంబంధ పర్యావరణ వ్యవస్థలను అర్థం చేసుకోవటం కేవలం విద్యాపరమైన వృత్తి మాత్రమే కాకూడదు. భవిష్యత్ తరాలకు అవసరం అనే గ్రహింపుతో బోధన సాగాలి.

– ప్రొ॥ పి.కె.అబ్దుల్ అజీజ్, ఎకాలజీ సైంటిస్ట్

ప్రయత్నం

మీరు పూర్తిగా కష్టపడి పని చేయనిదే విజయాన్ని సాధించలేరు. సగం ప్రయత్నం సగం ఫలితాన్నయినా ఇస్తుందని అనుకోకండి. అది ఎటువంటి ఫలితాన్నీ ఇవ్వదు. శక్తి మేరకు ప్రయత్నించండి. అది పని చేయలేదా, మళ్లీ ప్రయత్నించండి.

– జామీ డిమోన్, జేపీ మోర్గాన్ చేజ్ చైర్మన్

నవ లోకం... మన కోసం!

అభిప్రాయం

టి.వి. వెంకటేశ్వరన్

గతాన్ని సమీక్షించుకుంటూనే, రాబోయే కాలంలో శాస్త్ర, పరిశోధన రంగాల్లో భారత్ ఎటువంటి అద్భుతాలు సృష్టించనున్నది, ప్రపంచ యవనికపై మన దేశం ఏ ఏ మైలురాళ్లను అధిగమించబోతోంది అనే అంశాలను తరచి చూడాల్సిన సమయమిది. శాస్త్ర – సాంకేతిక రంగంలో ఆవిష్కరణలు ఒక్కోసారి యాదృచ్ఛికంగా జరుగుతుంటాయి. ఎక్స్–రే వంటివి కనిపెట్టడాలు అనుకోకుండా జరిగినవే అయినా, భారీ ప్రాజెక్టులు మాత్రం పక్కా ప్రణాళికతోనే పట్టాలెక్కుతాయి. ఏళ్ల తరబడి సాగే కఠోర శ్రమ, వ్యూహాల ఫలితంగానే ఆ యా రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది.

1969 తర్వాత మళ్లీ ఇప్పుడు జాబిల్లిపై మనిషిని దించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. 'నాసా' చేపట్టిన 'ఆర్టిమిస్' కార్యక్రమం ద్వారా వ్యోమగాములను చంద్రుడి పైకి పంపే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. మరోవైపు చైనా సైతం తన 'ఛాంగ్ ఈ–7' ప్రయోగం ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనలకు సిద్ధమైంది. సూర్యరశ్మి సోకని ఈ ప్రాంతంలో ఘనీభవించిన నీటి జాడలు ఉన్నట్లు తేలడంతో ప్రపంచ దేశాల్లో ఆసక్తి పెరిగింది. చైనా ఈ ఏడాదే 'జున్టియాన్' టెలిస్కోపును, 'మెంగ్‌ఝూ–1' వ్యోమ నౌకను పరీక్షించనుంది. 2026 నాటికి 'లాంగ్ మార్చ్–10' ద్వారా చంద్రుడిపైకి వ్యోమగాములను పంపాలన్నది చైనా లక్ష్యం.

అంతరిక్ష రక్షణ విషయానికొస్తే, నాసా 'డార్ట్' తరహాలోనే ఒక సరికొత్త ప్లానెటరీ డిఫెన్స్ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా '2015 ఎక్స్‌ఎఫ్261' అనే ఖగోళ శకలాన్ని నేరుగా ఢీకొట్టి దాని మార్గాన్ని మళ్లించే ప్రయత్నం చేయనున్నారు. గతంలో ఒక భారీ గ్రహశకలం భూమిని ఢీకొట్టడం వల్లనే రాక్షసబల్లులు అంతరించినట్లు శాస్త్రవేత్తలు చెబుతుంటారు. భవిష్యత్తులో అటువంటి ముప్పులు రాకుండా ఉండటంతో పాటు, ఆ యా గ్రహశకలాల్లో ఉండే అరుదైన ఖనిజాలను మన అవసరాలకు వాడుకోవడం ఈ ప్రయోగం ప్రధాన ఉద్దేశం. కిలోమీటరు పొడవుండే ఉల్కా శకలాలను ఒడిసిపట్టి ఆర్థిక ప్రయోజనాలు పొందడం ఇప్పుడు శాస్త్రవేత్తల ముందున్న సవాలు.

గగన్‌యాన్ పరీక్ష...

భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మానవసహిత అంతరిక్ష ప్రయోగం 'గగన్‌యాన్'కు 2026 సంవత్సరం చాలా కీలకం కానుంది. అసలు ప్రయోగానికి ముందు సిబ్బంది లేకుండా అనేక ప్రయోగాలు నిర్వహించనున్నట్లు ఇస్రో ఇప్పటికే ప్రకటించింది. హ్యూమనాయిడ్ రోబో 'వ్యోమమిత్ర', అత్యవసర పరిస్థితుల్లో వ్యోమనౌక నుంచి సురక్షితంగా బయటపడేందుకు ఉద్దేశించిన క్రూ ఎస్కేప్ సిస్టమ్, ప్యారాచ్యూట్ వ్యవస్థ పనితీరు, గగన్ యాన్ క్యాప్సూల్‌ను కక్ష్య వరకూ తీసుకెళ్లడం వంటివన్నీ ఉన్నాయి. 'బ్లూ ఆరిజిన్' తన హెవీ లాంచర్‌తో జాబిల్లిపైకి అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తమ్మీద ఈ ఏడాది అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ కంపెనీల అంతరిక్ష ప్రయోగాలు, జాబిల్లి యాత్రలు చాలానే ఉన్నాయన్నమాట.

◆ సముద్ర యాన్‌లో భాగంగా పూర్తి స్వదేశీ టెక్నాలజీతో నిర్మించిన 'మత్స్య–6000' జలాంతర్గామి ముగ్గురు శాస్త్ర వేత్తలను ఆరువేల మీటర్ల లోతు వరకూ తీసుకెళ్లనుంది. ఈ ప్రాంతాల్లో జలాంతర్గామి తొడుగులోని ప్రతి చదరపు సెంటీమీటర్ 600 కిలోల బరువును తట్టుకోవాల్సి ఉంటుంది.

భారతదేశం దశాబ్దాల క్రితం మొదలుపెట్టిన మూడంచెల అణుశక్తి కార్యక్రమం ఈ ఏడాది కీలకదశకు చేరనుంది. చెన్నై సమీపంలోని కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంలోని ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ (పీఎఫ్‌బీఆర్) ఈ ఏడాది పని చేయడం మొదలుపెడుతుంది. ముందుగా ప్రయోగాత్మకంగా మొదలై... ఈ ఏడాది చివరికల్లా పూర్తిస్థాయిలో పనిచేస్తుందని అంచనా. దేశంలో విస్తృతంగా లభ్యమయ్యే థోరియంను ఇంధనంగా ఉపయోగిస్తుందీ రియాక్టర్. విజయవంతమైతే దేశ ఇంధన భద్రత మరింత పటిష్ఠమవుతుంది.

దేశం మూడు దిక్కులా ఆవరించిన విశాల సముద్రాన్ని మానవ ప్రయోజనాలకు సద్వినియోగం చేసుకోవాలన్న భారతదేశ ఆశయం ఈ ఏడాది కార్యాచరణ దిశగా అడుగులు వేయనుంది. సముద్ర యాన్‌లో భాగంగా పూర్తి స్వదేశీ టెక్నాలజీతో నిర్మించిన 'మత్స్య–6000' జలాంతర్గామి ముగ్గురు శాస్త్రవేత్తలను ఆరువేల మీటర్ల లోతు వరకూ తీసుకెళ్లనుంది. సముద్ర మట్టంతో పోలిస్తే 600 రెట్లు ఎక్కువ పీడనం ఉండే ఈ ప్రాంతాల్లో జలాంతర్గామి తొడుగులోని ప్రతి చదరపు సెంటీమీటర్ 600 కిలోల బరువును తట్టుకోవాల్సి ఉంటుంది. అందుకే దీన్ని అత్యంత దృఢమైన ప్రత్యేకమైన టైటానియం మిశ్రమ లోహంతో తయారు చేశారు.

వాతావరణ అంచనాలు

అతి సంక్లిష్టమైన భారత దేశ వాతావరణ అంచనాల కోసం ఈ ఏడాది నుంచి కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్‌ల వినియోగం మొదలు కానుంది. ఏడాది చివరికల్లా ఇది సిద్ధమవుతుందని అంచనా. 'మిహిర్' వంటి సూపర్ కంప్యూటర్ల సాయంతో ఆరు కిలో మీటర్ల పరిధికి సంబంధించిన వాతావరణ అంచనాలను పది రోజుల ముందే ఇవ్వవచ్చునని భారత వాతావరణ విభాగం చెబుతోంది. వరదల్లాంటి విపత్తుల నుంచి మెరుగైన సన్నద్ధత కలిగి ఉండేందుకు, వ్యవసాయానికీ, పర్యాటక రంగానికీ ఎంతో ఉపయోగపడనుంది ఇది.

శిలాజ ఇంధన వినియోగాన్ని వేగంగా తగ్గించాలన్న లక్ష్యం వైపు భారత్ అడుగులేస్తోంది. ఇందుకు తగ్గట్టే సంప్రదాయేతర ఇంధన వనరుల సామర్థ్యంలో భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే నాలుగో స్థానంలో నిలిచింది. పవన విద్యుత్తులో నాలుగో స్థానంలో ఉంటే... సౌరశక్తి సామర్థ్యంలో మనది మూడో స్థానం. అయితే భారతదేశ స్థాపిత విద్యుదుత్పత్తి 482.82 గిగావాట్లలో ఇది సగం కంటే కొంచెం ఎక్కువ. అంతర్జాతీయ ఒప్పందాల ప్రకారం మనం నాలుగేళ్ల ముందుగానే ఈ స్థాయికి చేరుకున్నాం. 'ఒన్ సన్ ఒన్ వరల్డ్, ఒన్ గ్రిడ్' కార్యక్రమం కారణంగా సౌరశక్తి రంగంలో మన పురోగతి ఇకపై కూడా కొనసాగనుంది.

కృత్రిమ మేధ

ఏఐ వాడకంతో ఈ ఏడాది టిక్కెట్ల బుకింగ్ మొదలుకొని వాహనాల రవాణా వరకూ అనేక విషయాలు మరింత సౌకర్యవంతం కానున్నాయి. అతి తక్కువ బడ్జెట్‌తో చైనా సంస్థ అభివృద్ధి చేసిన 'డీప్‌సీక్' వంటివి ఏఐని మరింత వైవిధ్యభరిత అవసరాల కోసం వాడుకునే అవకాశం కల్పించనున్నాయి. స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్ వినియోగం కూడా ఈ ఏడాది మొదలయ్యే అవకాశం ఉంది. అంతే కాకుండా... ఇంగ్లీషులో కాకుండా కొరియన్ భాషలోనూ ఏఐ అందుబాటులోకి రావచ్చు.

బయో టెక్నాలజీ

జన్యుపరమైన తప్పులను వెతకడం కంటే... వాటిని సరిచేయడంపై ఇటీవలి కాలంలో ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. మన డీఎన్ఏలో జరిగే అతి చిన్న మార్పు కూడా వ్యాధులకు కారణమవుతుందన్నది తెలిసిందే. ఈ మార్పులను సరిచేసేందుకు 'క్రిస్పర్–క్యాస్9' వంటి ఆధునిక జన్యు ఎడిటింగ్ టూల్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఈ టెక్నాలజీలు ఒకే ఒక్క జన్యువులోని మార్పులను సరి చేసేందుకు ఉపయోగించవచ్చు. అంతేకాదు క్రిస్పర్ టెక్నాలజీతో అననుకూల వాతావరణాలను కూడా తట్టుకుని పండే పంటలను అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకోవడంలో, ఆహార భద్రత కోసం ఇది ఎంతో కీలకం. ఇలా ఈ ఏడాది సైన్స్–టెక్నాలజీ రంగంలో అనేక కీలక పరిణామాలు చోటుచేసు కుని మానవ చరిత్రలో మైలురాళ్లు కానున్నాయి.

వ్యాసకర్త విజిటింగ్ ప్రొఫెసర్, ఐసర్ మొహాలీ

గౌరవంతో బతికేలా చూడాలి!

ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ వ్యవస్థపై నేడు దేశవ్యాప్తంగా సాగుతున్న చర్చ కేవలం ఆర్థిక లెక్కలు, బడ్జెట్ లోటు గణాంకాలకే పరిమితమవుతోంది. నిజానికి పెన్షన్ అంటే కేవలం ఖజానాకు అయ్యే ఖర్చుల చిట్టా మాత్రమే కాదు; అది లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల జీవన భద్రత. వారి కుటుంబాల గౌరవం. సంక్షేమ రాజ్య భావనకు ప్రతీక. దేశానికి తమ జీవితాన్ని అంకితం చేసిన ఉద్యోగి పదవీవిరమణ తర్వాత ఆర్థిక భరోసా లేకుండా జీవించాల్సి వస్తే, అది పరిపాలనా వైఫల్యమే అవుతుంది. ఇది అక్షరాలా సామాజిక న్యాయానికి తూట్లు పొడవడమే.

2004కు ముందున్న పాత పెన్షన్ విధానం ఉద్యోగికీ, ప్రభుత్వానికీ మధ్య ఉన్న ఒక మౌన ఒప్పందం. తన యవ్వనాన్నీ, ఉత్పాదక సామర్థ్యాలనూ పాలనా యంత్రాంగంలో భాగంగా ఉండి దేశానికి అంకితం చేసిన ఉద్యోగికి... ప్రభుత్వం వృద్ధాప్యంలో భద్రత కల్పించడం అనేది దీని తాత్వికత. ఇందులో చివరి వేతనంలో సగం పెన్షన్‌గా, కరువు భత్యం వంటి హామీలు ఉండేవి. ఎటువంటి విరాళం చెల్లించకుండానే లభించే ఈ స్థిర ఆదాయం వృద్ధాప్యాన్ని గౌరవప్రదంగా మార్చేది.

'డి.ఎస్. నకారా కేసు'లో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును ఇచ్చింది. 'పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే దానం కాదు, అది ఉద్యోగి సంపాదించుకున్న చట్టబద్ధమైన హక్కు' అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. రిటైర్మెంట్ తేదీ ఆధారంగా పెన్షనర్ల మధ్య వివక్ష చూపడం రాజ్యాంగ విరుద్ధమని కూడా కోర్టు తేల్చింది. ఇది సామాజిక భద్రతా వ్యవస్థలో అంతర్భాగమని పేర్కొంది. అయితే ఆ తర్వాత 'నూతన పెన్షన్ విధానం' (ఎన్‌పీఎస్) ఈ భరోసాను దెబ్బతీసింది. ఇది మార్కెట్ పెట్టుబడుల పనితీరుపై ఆధారపడే వ్యవస్థ. ఆర్థిక మాంద్యాలు, నష్టాల భారాన్ని ఉద్యోగి మోయాల్సి రావడం ఆందోళనకరం. అందుకే రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాలు తిరిగి పాత పెన్షన్ వైపు అడుగులు వేస్తున్నాయి. కేవలం ఆర్థిక భారమనే నెపంతో ఉద్యోగి భద్రతను విస్మరించడం సరైనది కాదు. కార్పొరేట్లకు ఇచ్చే రాయితీలు భారం కానప్పుడు, ఉద్యోగి రక్షణ భారం మాత్రం ఎలా భారం అవుతుంది?

ఇటీవల ఒక మధ్యేమార్గంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) చర్చకు వచ్చింది. అయితే ఇందులో కనీస హామీ పెన్షన్, కరువు భత్యం తప్పనిసరిగా ఉండాలి. మార్కెట్ రిస్క్ ఉద్యోగిపై పడకూడదు. మరోవైపు వ్యాలిడేషన్ చట్టం ద్వారా పెన్షనర్ల హక్కులను నిర్వీర్యం చేయడం అన్యాయం. అలాగే 8వ వేతన సంఘం చర్చలు కూడా అభద్రతను పెంచుతున్నాయి. ఉద్యోగికి భద్రత ఉన్నప్పుడే పరిపాలనా సామర్థ్యం పెరుగుతుంది. దేశానికి వెన్నెముక వంటి ప్రభుత్వ ఉద్యోగి వృద్ధాప్యం భయంతో కాదు, గౌరవంతో గడిచేలా చూడటమే నిజమైన పాలన.

– టి.ఎం.బి. బుచ్చిరాజు, అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

భారత ప్లాస్మా ఫిజిక్స్ ధ్రువతార

విజ్ఞాన వేగుచుక్కలు-36

భారతదేశపు తొలి మహిళా ప్లాస్మా ఫిజిసిస్ట్ ప్రొఫెసర్ బిమ్లా బూటి ప్లాస్మా భౌతికశాస్త్ర రంగంలో ఆమె చేసిన అద్వితీయ పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీతో పాటు 'అకాడమీ ఆఫ్ సైన్స్ ఆఫ్ ది డెవలప్‌మెంట్ వరల్డ్' సంస్థలో సభ్యత్వం పొందిన తొలి భారతీయ మహిళా భౌతిక శాస్త్రవేత్తగా ఆమె చరిత్ర సృష్టించారు.

1933 సెప్టెంబర్ 19న లాహోర్‌లో జన్మించిన బిమ్లా బూటి బాల్యం ఎన్నో సవాళ్ల మధ్య సాగింది. రెండున్నరేళ్ల ప్రాయంలోనే తల్లిని కోల్పోయారు. గణిత శాస్త్రవేత్త అయిన తండ్రి బోధ్ రాజ్ సంరక్షణలో పెరిగారు. 1947 దేశ విభజన సమయంలో సర్వస్వం కోల్పోయి కాందిశీకులుగా ఢిల్లీ చేరారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లోనూ పట్టుదలతో చదివి ఢిల్లీ యూనివర్సిటీలో ఫిజిక్స్ ఆనర్స్ పూర్తి చేశారు. తండ్రి ప్రోత్సాహం, ఆయన ఉదారవాద దృక్పథం ఆమె విద్యా ప్రయాణంలో కీలక పాత్ర పోషించాయి.

ప్రొ॥ బిమ్లా బూటి

భారత ప్రభుత్వ ఉపకార వేతనంతో చికాగో విశ్వ విద్యాలయంలో చేరిన బిమ్లా, నోబెల్ విజేత సుబ్రహ్మణ్య చంద్రశేఖర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గురువు ప్రభావంతో ఆత్మవిశ్వాసం, కఠోర శ్రమను అలవర్చుకున్నారు. పరిశోధనే ప్రాణంగా భావించిన ఆమె, జీవితాంతం అవివాహితగా ఉండిపోయారు. రిలేటివిస్టిక్ ప్లాస్మాపై ఆమె చేసిన అన్వేషణలు ఆస్ట్రో ఫిజికల్ ప్రయోగాలకు కొత్త దారులు చూపాయి. అయాన్ హోల్ ఆవిష్కరణ పదార్థానికి ఘన, ద్రవ, వాయు రూపాలతో పాటు 'ప్లాస్మా' అనే నాలుగవ స్థితి ఉంటుందని ఆమె నిరూపించారు. 1980లో ఆమె ప్రతిపాదించిన 'అయాన్ హోల్' సిద్ధాంతాన్ని 1982లో 'ఎస్3–3 అంతరిక్ష నౌక' ఫలితాలు ధ్రువీకరించాయి. తదనంతరం వైకింగ్ 2, 3 నౌకలు సైతం ఆమె పరిశోధనలు సరైనవని చాటిచెప్పాయి.

నాసాలోని గొడార్డ్ స్పేస్ ఫ్లైట్ సెంటర్‌లో పనిచేస్తున్నప్పుడు, విక్రమ్ సారాభాయ్ ఆహ్వానం మేరకు ఆమె అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబరేటరీలో చేరారు. అక్కడ 23 ఏళ్ళు వివిధ హోదాల్లో సేవలందించి 1993లో రిటైరయ్యారు. 'ప్లాస్మా సైన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా' స్థాపనలో ఆమె పాత్ర మరువలేనిది. ఇటలీలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ థియరిటికల్ ఫిజిక్స్‌లో డైరెక్టర్‌గా పనిచేసిన బిమ్లా, 2003లో ఢిల్లీకి తిరిగి వచ్చి 'బూటి ఫౌండేషన్' స్థాపించారు. దీని ద్వారా విద్యార్థులకు ఉపకార వేతనాలు, అవార్డులు అందించారు. గ్రంథాలయాలు, శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 90 ఏళ్ల వయసులో 2024 ఫిబ్రవరి 24న ఆమె తుదిశ్వాస విడిచారు. స్పష్టమైన లక్ష్యం, నిరంతర పరిశోధనలతో సాగిన ఆమె ప్రయాణం భావితరాలకు స్ఫూర్తిదాయకం.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

దిగుమతులే ఎక్కువ!

డేటా పాయింట్

'ద సీఐఏ వరల్డ్ ఫ్యాక్ట్ బుక్' అంచనా ప్రకారం– ఇండియా ఎగుమతుల కంటే దిగుమతులే ఎక్కువ. ఎగుమతుల్లో ముఖ్యమైనవి రిఫైన్డ్ పెట్రోలియం, ఔషధాలు, వజ్రాలు, దుస్తులు కాగా; దిగుమతుల్లో ముడి చమురు, బంగారం, బొగ్గు లాంటివి ఉన్నాయి.



(విలువలు బిలియన్ డాలర్లలో)

సంవత్సరాల వారీగా

	ఎగుమతులు	దిగుమతులు
2022	767.6	902.3
2023	773.1	859.5
2024	822	923

జనారణ్యంలో తపస్సు

జ్యోతిర్మయం

'మనమున నింద్రియముల వర్తనమును సరిగా నొనర్చు ధర్మంబు దపంబని చెప్పుదురు'– మనిషి ఆలోచనలలో ఇంద్రియాల నడవడిని సరిగా ఉండేలా చూసే ధర్మమే తపస్సు అని పెద్దలు చెప్పారు అన్నాడు ఎఱ్ఱన ఆంధ్ర మహాభారతం, అరణ్యపర్వం, ముద్గలముని గురించిన ఒక కథలో. ఉంఛవృత్తితో జీవనం సాగిస్తూ, పక్షంరోజులకు ఒకసారి మాత్రమే భుజిస్తూ బ్రతుకీడుస్తున్న ముద్గలుడు, ఆకలిగొన్న దుర్వాసుడికి వచ్చినప్పుడల్లా అన్నం పెట్టాడు. ముద్గలుడు పెట్టిన అన్నం తిని ఆనందించిన దుర్వాసుడు, ముద్గలుడితో... 'నాలుక సామాన్యమైనది కాదు. ఒక్క పూట అన్నం తినకపోతే, అది పెట్టే బాధ అంతా ఇంతా కాదు. ఆకలి అంతకంటే బలమైనది. ధర్మవర్తనాన్ని, క్షమను నశింపజేసి మనిషిని రాక్షసునిగా మారుస్తుంది. ఇంత కఠినమైన స్థితిలో ఇంద్రియాలపై నియంత్రణ సాధించడానికి చాలా శక్తి కావాలి. ఆ నియంత్రణ శక్తిని సమకూర్చేదే తపస్సు. ఏ అడవులకూ వెళ్ళకుండా, ఇంట్లోనే ఉండి గృహస్థ జీవితం గడుపుతూ నీవు సాధించినది ఆ తపస్సునే!' అన్నాడు. ముద్గలుడి తపస్సును తలచి, అటువంటి తపస్సును చేయడం ద్వారా నీవు, నీ తమ్ములు విజయాన్ని సాధించాలి– అని వ్యాసులవారు ధర్మరాజుకు సలహా ఇచ్చాడని ఈ క్రింది పద్యంచెప్పింది.

కం. వినుు నీవును నాపదలకు / మనమున నొక్కింత యోర్చి మహనీయముగా / నొనరింపుము తపము; దపంబునన కదా సకల సౌఖ్యములు సిద్ధించున్. 'కష్టాలను ఓర్చుకుంటూ సాధించాల్సిన దాన్ని గురించి తపస్సు చెయ్యి. అన్ని సుఖాలు ఆ విధమైన తపస్సు వలననే సిద్ధిస్తాయి!' అని పై పద్యంలో వ్యాసులవారు చెప్పిన మాటలు అప్పుడు ధర్మరాజుకే కాదు, ఇప్పుడు తన కోసం, సమాజహితం కోసం విలువైనది సాధించాలని కాంక్షించే ప్రతి వ్యక్తికీ వర్తిస్తాయి. సమాజానికి దూరంగా అడవులలో కూర్చుని చేసే తపస్సు కంటే, జనారణ్యంలో ఏకాగ్ర చిత్తంతో చేసే తపస్సు మరింత కఠినమైనది. ఇహలోకంలో ఆస్వాదనీయమైన విజయాలను ఆ తపస్సు అందిస్తుంది. పరలోకంలో ఉత్తమ గతికి కూడా ఆ తపస్సు కారణమవుతుంది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

స్త్రీలకు ఇలాంటి పరిస్థితి ఊహించలేదు

జనసేన నేతపై ప్రముఖ గాయని చిన్మయి మండిపాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సంక్రాంతి సంబరాల మాటున మహిళల పట్ల టీడీపీ, జనసేన నాయకులు వికృత చేష్టలకు పాల్పడటంపై మహిళాలోకం మండిపడుతోంది. కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో రికార్డింగ్ చేసే మహిళా డ్యాన్సర్లను బట్టలు విప్పి డ్యాన్స్ చేయాలని జనసేన నాయకుడు చెప్పడంపై ప్రముఖ సినీ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద మండిపడ్డారు. ఇది మహిళల పట్ల ఎంతో నీచమైన సంస్కృతి అంటూ జనసేన నేత వ్యాఖ్యల వీడియోను ట్యాగ్ చేస్తూ 'ఎక్స్' లో చిన్మయి పోస్ట్ చేశారు. 'కిక్కిరిసిన జన సమూహం ముందు అమ్మాయిలకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని నేను అసలు ఊహించలేదు. ఒక వ్యక్తి అమ్మాయిలను బట్టలు విప్పమని చెబుతున్నారు. అక్కడున్న జనం ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ ఉత్సాహపరుస్తున్నారు. ఇదంతా చూస్తుంటే అసహ్యంగా, అసభ్యంగా ఉంది.' అని మండిపడ్డారు.

ఉద్యోగులకు సంక్రాంతి కానుక ఇచ్చాం

ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు



సాక్షి, అమరావతి : ఉద్యోగులకు సంక్రాంతి కానుక ఇచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వారికి ఇవ్వాల్సిన బకాయిల్లో కొన్నింటిని చెల్లించామన్నారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామన్నారు. భూముల రీ సర్వేను పక్కాగా చేస్తున్నామని, క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. కొందరు క్రెడిట్ చోరీ అని మాట్లాడుతున్నారని.. వాళ్ల భూములు, మైన్స్, లిక్కర్‌లో దోపిడీ చేస్తే తాము అమరావతి, కియా, భోగాపురం ఎయిర్‌పోర్టు తెచ్చామన్నారు. ఈ రెండింటికీ పొంతనలేదని.. కాబట్టి క్రెడిట్ చోరీకి అవకాశంలేదన్నారు. దేశంలో వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయన్నారు. అలాగే, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏఎం గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు కాకినాడలో శంకుస్థాపన చేశామని తెలిపారు. వచ్చే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయని చంద్రబాబు తెలిపారు. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఉగాది రోజున 5 లక్షల గృహ ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. మరో మూడేళ్లలో అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని అన్నారు.

ఎన్టీఆర్ అభిమానులు బాబు మోసాలను గ్రహించాలి

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి

సాక్షి,అమరావతి: తన ప్రతిష్ట దిగజారుతున్నప్పుడల్లా ఎన్టీఆర్ పేరుతో రాజకీయం చేయడం మొదటినుంచి చంద్రబాబుకి అలవాటేనని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. ఇప్పుడు ఎన్టీఆర్ విగ్రహం పేరుతో చంద్రబాబు చేస్తున్న హడావుడి కూడా అలాంటిదేనని చెప్పారు. ఆమె ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. 2014లో ముఖ్యమంత్రి అయినప్పుడే చంద్రబాబు నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం పెడతానని చెప్పి పక్కన భూములు కాజేశాడన్నారు. ఆయనకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఐదేళ్లలో విగ్రహం నిర్మాణం పూర్తిచేయలేడా? అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ అభిమానులు ఇప్పటికైనా చంద్రబాబు మోసాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. 'ఆరోగ్యశ్రీకి ఎన్టీఆర్ పేరు లేకుండా చేయాలని చూసిన వ్యక్తి చంద్రబాబు. చంద్రబాబు వల్ల తానెంత మానసిక క్షోభ అనుభవించిందీ స్వయంగా ఎన్టీఆర్ చెప్పిన మాటలను అభిమానులు గుర్తుకుతెచ్చుకోవాలి' అని లక్ష్మీపార్వతి పేర్కొన్నారు.

అబద్ధాలు.. దబాయింపులు

భూముల రీ సర్వేపై విస్తుగొలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి

రాష్ట్రంలో అద్భుతంగా రీ సర్వే చేశామంటూ రూ.400 కోట్ల రాయితీ కోరిన వైనం

వాస్తవంగా వైఎస్ జగన్ హయాంలో చేసిన రీ సర్వేపై కేంద్రం ప్రశంసలు

ఓ వైపు రీ సర్వేపై బురద జల్లుతూ మరో వైపు సర్వే బాగా చేశామని కేంద్రం వద్ద బాబు బిల్డప్పులు

> జగన్ ప్రభుత్వం చేస్తున్న రీ సర్వే వల్ల రైతులకు నష్టం. మీ భూములన్నీ ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకుని వాటిని ఆక్రమిస్తారు.. ఇక మీ భూములు మీవి కావు.. రీ సర్వే నెపంతో అవి ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో తెలుసుకోవడం కోసమే ఈ సర్వే చేస్తున్నారు.. మేము అధికారంలోకి రాగానే రీ సర్వేను ఆపేస్తాం.. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపండి.
>
> – ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారం
>
> ఆంధ్రప్రదేశ్‌లో రీ సర్వే అద్భుతం.. రీ సర్వే చాలా బాగా జరిగింది.. ఇంకా జరుగుతోంది.. ఆధునిక టెక్నాలజీ వాడుతున్నాం.. ఇప్పటికే సగానికిపైగా గ్రామాల్లో పూర్తి చేశాం.. ఏడాదిలోగా భూ సమస్యలే లేకుండా చేస్తాం.. రీ సర్వే వల్ల రైతులకు ఎంతో లాభం.
>
> – సీఎం హోదాలో కేంద్రానికి రాసిన లేఖలో చంద్రబాబు

సాక్షి, అమరావతి : నాడు దుష్ప్రచారంతో భూముల రీ సర్వేను అడ్డుకుని, ఇప్పుడు దాని క్రెడిట్‌ను చోరీ చేస్తుండడం ఏమిటనే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ముఖ్యమంత్రి చంద్రబాబు దబాయింపు మొదలు పెట్టారు. అసలు విషయాలపై మాట్లాడకుండా తానే భూముల రీ సర్వే చేయిస్తున్నానని, పట్టాదార్ పాస్‌పుస్తకాలపై క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టామని చెప్పిన అబద్ధాలనే మళ్లీ చెబుతున్నారు. ఎన్నికలకు ముందు భూముల రీ సర్వేను అడ్డుకున్న చంద్రబాబు.. విపరీతమైన దుష్ప్రచారం చేసిన విషయం జగమెరిగిన సత్యం. కానీ ఇప్పుడు దానిపై ఆయన యూటర్న్ తీసుకుని, అది తన గొప్పేనని ప్రచారం చేసుకోవడంపై అధికారులు, ప్రజలు నివ్వెరపోతున్నారు. వాస్తవానికి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో 2020లో ప్రారంభమై విజయవంతంగా జరిగిన భూముల రీ సర్వేకు కేంద్ర ప్రభుత్వం కితాబిచ్చింది. నీతి ఆయోగ్ సైతం దాన్ని ప్రశంసించింది. అయితే ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు దేశానికి ఆదర్శంగా మారిన రీ సర్వేపై పనిగట్టుకుని బురదజల్లారు. రీ సర్వే చేసి భూములు దోచేస్తున్నారంటూ ఎల్లో మీడియాతో కలిసి విష ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక రీ సర్వే ప్రయోజనాలు గొప్పగా ఉండడం, కేంద్రం దాన్ని కొనసాగించాల్సిందేనని స్పష్టం చేయడంతో ఒక్కసారిగా రూటు మార్చేశారు. ఏడాది పాటు రీ సర్వేను పూర్తిగా నిలిపివేసినా, చివరికి కొనసాగించారు.

రాయితీల కోసం యూటర్న్

భూ రికార్డులను ఆధునీకీకరణ చేసే రాష్ట్రాలకు ప్రత్యేక రాయితీలు ఇస్తామని, 50 ఏళ్లపాటు పావలా వడ్డీ రుణాలు ఇస్తామని కేంద్రం ప్రకటించింది. దీంతో చంద్రబాబు యూటర్న్ తీసుకుని, రీ సర్వే అద్భుతమని కేంద్రానికి లేఖలు పంపారు. తమ రాష్ట్రంలో రీ సర్వే చాలా బాగా జరిగిందని, ఇంకా జరుగుతోందని, ఇప్పటికే సగానికిపైగా గ్రామాల్లో పూర్తి చేశామని.. ఇందుకు ఆధునిక టెక్నాలజీ వాడుతున్నామని కేంద్రానికి తెలిపారు. అయితే అప్పటికే ఏపీలో జరుగుతున్న రీ సర్వేపై కేంద్రానికి స్పష్టంగా తెలిసి ఉండడంతో రీ సర్వేను ఆదర్శవంతంగా చేసినందుకు మొదటి విడతగా రూ.400 కోట్ల రాయితీని విడుదల చేసింది. దాన్ని చంద్రబాబు తన ఘనతగా చెప్పుకుంటూ రీ సర్వే తానే చేస్తున్నానని ఎల్లో మీడియా తోడుగా డప్పు కొట్టుకుంటున్నారు. వాస్తవానికి ఆ నిధులు విడుదలయ్యే సమయానికి రాష్ట్రంలో రీ సర్వేను చంద్రబాబు నిలిపివేశారు. అది జగన్ కార్యక్రమమనే కారణంతో దాన్ని ఆపేసి రాష్ట్రంలో బురద జల్లుతూనే, ఢిల్లీలో మాత్రం దాని గురించి గొప్పగా చెప్పుకున్నారు. ఇప్పుడు రీ సర్వేను అరకొరగా చేస్తూ అది మొత్తం తన ఘనతేనంటూ ప్రచారాన్ని ప్రారంభించారు. నిజానికి రీ సర్వే పేరుతో చంద్రబాబు వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాలను వెనక్కి తీసుకోవడం, పాతిన హద్దు రాళ్లను తొలగించడం మాత్రమే చేశారు.

వైఎస్ జగన్ హయాంలో ఏర్పాటు చేసిన ఒక కార్స్ బేస్ స్టేషన్

నాడు రీ సర్వే ప్రత్యేకత తెలిసేలా గ్రానైట్ హద్దు రాళ్లు

రీ సర్వే చేశాక వైఎస్ జగన్ ప్రతి భూమి పార్సిల్ మ్యాప్ ప్రకారం హద్దు రాళ్లను పాతించారు. ఏ రాయి పడితే ఆ రాయి వాడితే సర్వే ప్రాధాన్యం, సర్వే చేసిన విషయం తెలియదని.. ఒక మార్క్‌గా, గుర్తుగా ఉండేలా గ్రానైట్ రాళ్లు వాడారు. దానిపై నవ రత్నాల లోగో వేశారు. రీ సర్వే ప్రత్యేకతను తెలిపేందుకు వందేళ్ల తర్వాత జరిగిన కార్యక్రమం కావడంతో దానిపై లోగోను స్పష్టంగా ముద్రించారు. దానిపై చంద్రబాబు ఇష్టానుసారం తప్పుడు ప్రచారం చేసి అధికారంలోకి రాగానే వాటిని తొలగించారు. ఇప్పటికీ ఆ ప్రచారం చేస్తూనే రీ సర్వే ప్రయోజనాలను మాత్రం తనవిగా చెప్పుకుంటున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాలపై క్యూఆర్ కోడ్‌లు ముద్రించే విధానాన్ని తామే తీసుకువచ్చామని నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారు.

పాసు పుస్తకంపై క్యూఆర్ కోడ్ అనేది చంద్రబాబు తెచ్చింది కాదు... ఇదిగో 2022లోనే వైఎస్ జగన్ హయాంలో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకంపై ముద్రించి ఉన్న క్యూఆర్ కోడ్

అత్యాధునిక టెక్నాలజీతో రీ సర్వే

అత్యాధునిక టెక్నాలజీతో రీ సర్వేను ఒక మహా క్రతువులా చేయించిన వైఎస్ జగన్ ప్రభుత్వం పాస్ పుస్తకాలపై క్యూ ఆర్ కోడ్‌లు ముద్రించి కొత్త విధానానికి నాలుగున్నరేళ్ల క్రితమే శ్రీకారం చుట్టింది. దీని వెనుక పెద్ద టెక్నాలజీ వ్యవస్థనే అప్పట్లో వైఎస్ జగన్ ఏర్పాటు చేయించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 70 కార్స్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఇవి నిరంతరం పని చేసే శాశ్వత జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్) రిసీవర్ల వ్యవస్థగా పని చేస్తాయి. ఈ స్టేషన్లు ప్రతి క్షణం ఉపగ్రహ డేటాను సేకరించి సెంట్రల్ సర్వర్‌కి పంపుతాయి. దీని ద్వారా భూమిపై నిర్దేశిత స్థానం కచ్చితంగా తెలుస్తుంది. సర్వేయర్లు సొంత బేస్ స్టేషన్లు ఏర్పాటు చేసుకోకుండానే సెంటీమీటర్ స్థాయి కచ్చితత్వంతో భూములను కొలుస్తారు. ఈ టెక్నాలజీతోనే జగన్ హయాంలో రాష్ట్రంలోని 13,500 గ్రామాలకు గానూ 6,800 గ్రామాల్లో సర్వేను అన్ని దశల్లో పూర్తి చేశారు. అక్కడ ఇప్పుడు కొత్తగా డిజిటల్ రెవెన్యూ రికార్డులు, సర్వే నంబర్ల స్థానంలో ఎల్‌పీఎం నంబర్లు, పాస్ పుస్తకాలపై క్యూ ఆర్ కోడ్‌లు, జియో హద్దులు ముద్రించారు. ఇవన్నీ గతంలో వైఎస్ జగన్ తీసుకువచ్చిన అత్యాధునిక టెక్నాలజీ ఫలితమే. దాన్ని కూడా తానే తెచ్చినట్లు చంద్రబాబు అబద్ధాలు వల్లె వేస్తున్నారు.

ఇదీ రీ సర్వే స్పెషాలిటీ

అత్యాధునిక టెక్నాలజీ అయిన జీపీఎస్‌ను కార్స్ (కంటిన్యూయస్లీ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్) నెట్‌వర్క్‌లో ఉపయోగించి రీ సర్వే చేయించారు. ఇది 24 గంటలు పని చేస్తుంది. దీనిలో భాగంగా రాష్ట్రమంతా 70 కిలోమీటర్ల దూరంలో 70 బేస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. అంతరిక్షంలో సుమారు 150 శాటిలైట్స్ నుంచి వచ్చే రేడియో సిగ్నల్‌ని ప్రతి బేస్ స్టేషన్ స్వీకరించి జియో కో ఆర్డినేట్స్‌ను సర్వే శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ కంట్రోల్ చేసిన స్టేషన్‌కు పంపుతుంది. 200 వరకు డ్రోన్లు, నాలుగు హెలికాప్టర్లు, 2 విమానాలు, 3,240 జీఎన్ఎస్ఎస్ రోవర్ల సహాయంతో సర్వే చేశారు. ఇప్పుడు ఈ నెట్‌వర్క్‌ను కేంద్రం కూడా వినియోగించుకుంటోంది. జగన్ తెచ్చిన ఈ వ్యవస్థను నేషనల్ ప్లాట్‌ఫాంకు అనుసంధానించేందుకు అంగీకరిస్తూ 2024 అక్టోబర్ 18న ఏపీ సర్వే శాఖతో సర్వే ఆఫ్ ఇండియా ఒప్పందం చేసుకుంది. ఇదీ రీ సర్వే స్పెషాలిటీ. అందుకే దాన్ని నాడు వ్యతిరేకించి అడ్డుకున్న విషయాన్ని పక్కనపెట్టి, ఇప్పుడు తన ఖాతాలో వేసుకునేందుకు చంద్రబాబు ఆరాట పడుతున్నారు.

విజనరీ సీఎం జగన్ వల్లే ఏపీలో రీ సర్వే

ఎస్‌వీ సింగ్, సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్

2023 నవంబర్ 22న శ్రీకాకుళం జిల్లా నర్సీపట్నంలో రీ సర్వే రెండవ దశ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభలో అప్పటి సీఎం జగన్‌తో కలిసి, అప్పటి సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎస్‌వీ సింగ్ పాల్గొన్నారు. ఆ సభలో సింగ్ మాట్లాడుతూ ఒక విజనరీ సీఎం ఉండడం వల్లే దేశంలో ఇంత వరకు ఎక్కడా జరగని విధంగా ఏపీలో భూముల రీ సర్వే జరుగుతోందని స్పష్టం చేశారు. దేశంలో భూ రికార్డుల పరిస్థితి అస్తవ్యస్థంగా ఉందని, వాటిని మార్చాలని చాలా ప్రయత్నాలు జరుగుతున్నా సాధ్యం కాలేదన్నారు. కానీ జగన్ నేతృత్వంలో ఏపీలో 5 సెంటీమీటర్ల కచ్చితత్వంతో ప్రతి భూమికి మ్యాప్ తయారు చేశారని, దేశంలో ఇదొక మైలు రాయి అని చెప్పారు. దేశంలో భూ రికార్డులు సరిదిద్దిన మొదటి రాష్ట్రం ఏపీయేనని తెలిపారు. సీఎం స్వయంగా నిరంతరం పర్యవేక్షణ చేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. డ్రోన్లు, హెలికాప్టర్లు, విమానాలతో భూముల సర్వే చేయడం దేశంలో ఎప్పుడూ జరగలేదని, ఏపీలో మొదటిసారి జరిగిందన్నారు. ఈ మోడల్‌ను అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఏపీ రీ సర్వే దేశానికి ఆదర్శం

అజయ్ తిర్కీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి

2023 అక్టోబర్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ (భూ వనరుల శాఖ) కార్యదర్శి అజయ్ తిర్కీ విశాఖపట్నం జిల్లా ఆనందపురంలో పర్యటించి భూముల రీ సర్వే క్షేత్ర స్థాయిలో ఎలా జరుగుతుందో పరిశీలించి అభినందించారు. ఏపీలో చేపట్టిన రీ సర్వే దేశానికి ఆదర్శమని కొనియాడారు. ఇతర రాష్ట్రాలకు ఇక్కడ జరుగుతున్న రికార్డుల డిజిటలైజేషన్ ఒక ఆదర్శమని, దీనివల్ల భూ వివాదాలు తగ్గుతాయని తెలిపారు. అధునాతన టెక్నాలజీ వాడడం వల్ల సర్వేలో పారదర్శకత ఏర్పడిందన్నారు. ఆ తర్వాత మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందిన రెవెన్యూ శాఖాధికారులు ఏపీకి వచ్చి ఇక్కడ జరుగుతున్న సర్వే విధానాన్ని పరిశీలించారు. సర్వే ఎలా చేయాలో తమకు నేర్పించాలని కోరడంతో ఏపీ సర్వే శాఖాధికారులు డెహ్రాడూన్ వెళ్లి రీ సర్వే జరుగుతున్న తీరును వివరించారు. 2020–2024 మధ్యలో భూ రికార్డుల ఆధునికీకరణకు సంబంధించిన అనుమానాలు, పరిశీలనలు వంటి దేనికైనా కేంద్రం ఏపీనే సంప్రదించేది.

చిల్లర కథనాలతో భయపెట్టాలని చూస్తే సహించను

ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ 'కొత్తపలుకు'పై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి మండిపాటు

సాక్షి, హైదరాబాద్: 'నేను రాజకీయాల్లోకి గాలికి రాలేదు, 40 ఏళ్లపాటు సభల్లోనూ, బయట పోరాడి భవిష్యత్తు తరాలకు తెలంగాణ సంపదను అందించాలనే లక్ష్యంతో వచ్చా. దారి దోపిడీదారులు, గద్దల్లాంటి వాళ్లు సమాజం మీద పడి పీక్కు తింటుంటే వాళ్లను రక్షించడం కోసం, వాళ్ల తరఫున మాట్లాడటం కోసం రాజకీయాల్లోకి రాలేదు. తెలంగాణ ఆస్తులు, వనరులు, వ్యవస్థలను సమాజంలోని అన్ని వర్గాలకు పంచడమే నా లక్ష్యం' అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ కృష్ణభాస్కర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ తన పేరును పెద్ద అక్షరాలతో పెట్టి ఓ కట్టుకథ, పిట్టకథను అల్లి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశాడని మండిపడ్డారు. ఆయన ఎవరిపై ప్రేమతో, ఎవరి మెప్పు కోసం ఈ కథనం రాశారో, ఏ ఉద్దేశంతో రాశారో, దీని వెనుక ఏ రాజకీయ ఉద్దేశం ఉందో, దాని వెనుక ఎవరుండి రాయిస్తున్నారో త్వరలోనే వెల్లడిస్తానని చెప్పారు. 'నా జీవితం చాలా పారదర్శకమైనది. ఆస్తులు సృష్టించుకోవడం కోసమో, వ్యాపార సామ్రాజ్యాలు విస్తరించుకోవడం కోసమో, అధికారాన్ని హోదాగా అనుభవించడం కోసమో రాజకీయాల్లోకి రాలేదు. ఇలాంటి చిల్లర కథనాలకు భయపడే వారు ఎవరూ లేరు. నేను దేనికీ తల వంచను' అని భట్టి స్పష్టం చేశారు.

టెండర్లు రద్దు చేయమని చెప్పా

సింగరేణి గనులు తెలంగాణ ప్రజల ఆత్మ అని, అవి రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఆ ఆస్తులు, ఆత్మను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడమే తన లక్ష్యమన్నారు. తనకు ఒక బాధ్యత, విధానం ఉంది కనుక ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ మాదిరి ఎలా అంటే అలా మాట్లాడలేనని, రాయలేనని చెప్పారు. 'ఎవరికో ఏదో ఉపయోగపడటం కోసం డిప్యూటీ సీఎం పాత్ర ఉందని ఆ కథనంలో రాశారు. బొగ్గు బ్లాకు టెండర్ పిలిచింది సింగరేణి సంస్థ, ఆ సంస్థ బోర్డు. టెండర్ నిబంధనలు పెట్టేది బోర్డు.. మంత్రి కాదు. ఈ మాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా తోచింది రాయడం కాదు' అని మండిపడ్డారు. నేను మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉండి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉండటం వల్ల, ఆయన మీద ఉన్న కోపంతో నా మీద కూడా కోపం చూపించడానికి రాసి ఉండొచ్చు. అనుమానం వచ్చింది కాబట్టి రద్దు చేయండి. మిగిలిన విషయాలు నేను, రాధాకృష్ణ తేల్చుకుంటాం అని అధికారులకు చెప్పా' అని భట్టి చెప్పారు.

ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో సచివాలయ ఉద్యోగి మృతి

వైఎస్సార్ కడప జిల్లాలో ఘటన

కడప కార్పొరేషన్: ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు సచివాలయంలో పనిచేసే హెల్త్ సెక్రటరీ బలయ్యారు. వైఎస్సార్ జిల్లా కడప నగరం 27/2 గౌస్ నగర్ సచివాలయంలో పనిచేస్తున్న జి.విజయకుమారి (42) అకస్మాత్తుగా మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... ఈ నెల 17న మధ్యాహ్నం పాత కడప యూపీహెచ్‌సీలో విజయకుమారి విధి నిర్వహణలో ఉన్నప్పుడు... ఉన్నతాధికారులు ఫోన్ చేసి సర్వేలు ఎందుకు చేయలేదు.., పై నుంచి చాలా ఒత్తిడి ఉంది.., తప్పకుండా ఆ సర్వేలు చేయాల్సిందేనని.. ఫోన్‌లో గట్టిగా మాట్లాడినట్లు సమాచారం. పండుగ సమయంలో విధి నిర్వహణలో ఉన్నా ఉన్నతాధికారులు గట్టిగా మాట్లాడడంతో ఆమె ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. అప్పటికే ఆమెకు శ్వాస సమస్య ఉండడంతో ఇంటికి వచ్చాక తలనొప్పిగా ఉందని, మోషన్స్ అవుతున్నాయని కుమార్తెతో చెప్పినట్లు తెలిసింది. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఊపిరి ఆడడం లేదని చెప్తూ కళ్లు మూసుకుని అలాగే ఒరిగిపోయిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ తల్లి మరణించడానికి అధికారుల ఒత్తిళ్లే కారణమని వారు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు ఆమె నివాసానికి చేరుకుని విజయకుమారి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల ఒత్తిడి భరించలేక గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక సచివాలయానికి 8 మంది కార్యదర్శులు, 20 మంది వలంటీర్లు ఉండేవారని, ఇప్పుడు ఐదారు మంది మాత్రమే ఉన్నారని, వలంటీర్లు చేసే పని వారిపైనే పడిందన్నారు. దీనివల్ల తీవ్ర ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. విజయకుమారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విజయకుమారి మృతదేహం

యరపతినేని సవాల్‌కు సిద్ధమే..

స్పష్టం చేసిన గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట: గురజాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం, దాడులు, హత్యలు, అక్రమాలు తదితర ఏ విషయాలపైనైనా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు. యరపతినేని చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానన్నారు. ఏ చానల్‌లోనైనా, యరపతినేని ఇంట్లోనైనా బహిరంగచర్చకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డిపై బురద చల్లేందుకు ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రికలు తీవ్రంగా ప్రయత్నించాయన్నారు. నిజం నిర్భయంగా ప్రజలకు తెలియాలని పుట్టిన సాక్షి పత్రిక, చానల్.. నిజాలను నిజాయితీగా ప్రజలకు వివరించి, చూపించబట్టే 2009లో రాజశేఖరరెడ్డి రెండోసారి గెలిచారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పచ్చపత్రికలు విషం కక్కుతున్నాయని మహేష్‌రెడ్డి మండిపడ్డారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

- ప్రభుత్వాస్పత్రి డాక్టర్, సిబ్బంది, పేషెంట్లపై దాడి

కోట : మద్యం మత్తులో కొందరు యువకులు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌తోపాటు సిబ్బంది, రోగులపై శనివారం రాత్రి దాడికి తెగబడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. మండలంలోని రాఘవాపురానికి చెందిన నరేంద్ర, భూపతి బైక్ ప్రమాదంలో గాయపడడంతో వారిని సీహెచ్‌సీకి తరలించారు. వారితోపాటు పదిమంది స్నేహితులు ఆస్పత్రి వద్దకు వచ్చారు. చికిత్స అందిస్తున్న డాక్టర్ పృథ్వీ అందరూ బయటకెళ్లాలని, పేషెంట్ దగ్గరకు ఎవరూ రావొద్దని సూచించారు. దీంతో సెక్యూరిటీ గార్డు రాకేష్ వారందరినీ వెళ్లాలని చెప్పారు. వీరిలో కొందరు ఫూటుగా మద్యం తాగి ఉండడంతో రాకేష్‌ను చితకబాదారు. వైద్యం కోసం వచ్చిన మస్తాన్ అనే వ్యక్తి వారిని అడ్డుకోగా అతనిపైనా రాడ్డుతో దాడిచేశారు. దీంతో అతని తలకు గాయాలయ్యాయి. అనంతరం ఆస్పత్రిలోకి ప్రవేశించి డాక్టర్‌ని దూషించి దాడికి యత్నించారు. ఇంతలో రాకేష్ బంధువులు అక్కడకు రావడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని మద్యం మత్తులో ఉన్న యువకులను స్టేషన్‌కు తరలించారు. నిందితులంతా రాఘవాపురం, తిమ్మనగారిపాళేనికి చెందిన వారిగా గుర్తించారు. డాక్టర్ పృథ్వీ, రాకేష్, మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడినవారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడిలో గాయపడిన పేషెంట్ మస్తాన్

డాక్టర్ ఆదినారాయణరావుకు ఘన నివాళి

అంతిమయాత్రకు హాజరైన ప్రముఖులు

మహారాణిపేట (విశాఖ): ప్రేమ ఆస్పత్రి అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణరావు భౌతికకాయానికి ఆదివారం పలువురు ప్రముఖులు ఘన నివాళులర్పించారు. ఆయన శనివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఉదయం మహారాణిపేటలోని ఆయన నివాసం నుంచి పార్థివదేహాన్ని ఊరేగింపుగా జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలోని అంకోశా ఆడిటోరియానికి తరలించారు. అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచిన అనంతరం అంతిమ యాత్ర నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు. డాక్టర్ ఆదినారాయణరావు పార్థివ దేహానికి శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదినారాయణరావు మరణం వైద్య రంగానికి తీరని లోటన్నారు. పేదలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, చింతలపూడి వెంకటరామయ్య, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్య రంగ ప్రముఖులు ఉన్నారు.

బంధువులు, స్నేహితుల ఆధ్వర్యంలో ఆదినారాయణరావు అంతిమయాత్ర

ఇక మిగిలింది మూడేళ్లే.. బాబూ జాగ్రత్త

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు హెచ్చరిక

సాక్షి,అమరావతి: హత్యా రాజకీయాలపై మాట్లాడే నైతిక హక్కు చంద్రబాబు నాయుడుకి లేదని, ఎన్టీఆర్ వర్ధంతి సభలో ఆయన చేసిన ప్రసంగం పూర్తిగా నేలబారు, ఛండాల రాజకీయానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పేరును వాడుకుంటూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చంద్రబాబు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని దుయ్యబట్టారు. ఇక మిగిలింది మూడేళ్లే చంద్రబాబూ జాగ్రత్త! అని సుధాకర్‌బాబు హెచ్చరించారు. ''ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఈ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే. రాసిపెట్టుకోండి. మమ్మల్ని నిందిస్తూ నోరు పారేసుకుంటే.. ఖబర్దార్'' అని టీజేఆర్ సుధాకర్‌బాబు ధ్వజమెత్తారు.

చంద్రబాబు ఎన్ని తాళిబొట్లు తెంచాడో!

''వంగవీటి మోహన రంగాను అర్థాంతరంగా చంపించింది ఎవరు? పల్నాడులో మందా సాల్మన్‌ను హత్య చేయించిన దుర్మార్గుడు చంద్రబాబే. పత్తికొండలో చెరుకులపాడు నారాయణరెడ్డిని హత్య చేయించి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తాళిబొట్టు తెంచింది చంద్రబాబే. వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై నరికి చంపింది ఎవరు? ఎన్నో తాళిబొట్లు తెంచిన చంద్రబాబు హత్యా రాజకీయాలపై మాట్లాడటం, ఈ రాష్ట్రం వినడం మన దౌర్భాగ్యం. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధికారం శాశ్వతమని భావిస్తున్నారేమో.. టీడీపీ కూటమికి ఉంది మూడేళ్లే. ఆ తర్వాత వైఎస్ జగన్ సీఎం అయ్యాక కూటమి నేతల సంగతి తేలుస్తాం'' అని సుధాకర్‌బాబు హెచ్చరించారు.

మౌని అమావాస్య పుణ్యస్నానాలు
4.5 కోట్లు!
త్రివేణి సంగమానికి పోటెత్తిన భక్తులు

ప్రయాగ్‌రాజ్ (యూపీ): మౌని అమావాస్య సందర్భంగా ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణిసంగమ స్థలిలో కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సాయంత్రానికి వారి సంఖ్య 4.52 కోట్లు దాటిందని ఉత్తర ప్రదేశ్ అధికారులు వెల్లడించారు. దట్టంగా కమ్ముకున్న పొగమంచును, వణికించే చలిని సైతం లెక్కచేయకుండా భక్తులు శనివారం అర్ధరాత్రికల్లా త్రివేణి సంగమ ఘాట్లకు చేరుకున్నారు. తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులపై హెలికాప్టర్ ద్వారా గులాబీ రేకుల వర్షం కురిపించారు. ఇటీవల మకర సంక్రాంతి సందర్భంగా సంగమంలో కోటి మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు చేయగా ఏకాదశి రోజున 85 లక్షల మంది పుణ్యస్నానాలు చేశారు. ''విన్న మార్గాల నుంచి వస్తున్న భక్తులు నడిచిన ఘాట్లకు చేరుకునేందుకు వీలుగా మార్గనిర్దేశాలు ఏర్పాటు చేశాం. భక్తులకు సాయపడేందుకు పెద్ద సంఖ్యలో పోర వలంటీర్లను రంగంలోకి దించాం. మాఘ మేళా ప్రాంతమంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేశాం. 800 హెక్టార్లలో జరుగు తున్న మేళాను ఏడు సెక్టార్లుగా విభజించాం. 25,000 మరుగుదొడ్లను నిర్మించాం. శుభ్రతా కార్యక్రమాల కోసం 3,500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు'' అని డివిజనల్ కమిషనర్ సౌమ్యా అగర్వాల్ చెప్పారు.

ఆదివారం పుణ్యస్నానాల కోసం సంగమం ప్రాంతానికి అసంఖ్యాకంగా తరలివచ్చిన భక్తులు

కళకళలాడుతున్న టెంట్ సిటీ

స్వల్పకాలిక కల్పవాస్ దీక్ష కోసం, మేళాను తిలకించేందుకు విచ్చేసే లక్షలాది మంది విదేశీ పర్యాటకులు, సందర్శకుల కోసం యూపీ సర్కార్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ''వారికోసం టెంట్ సిటీ నిర్మించాం. ధ్యానం, యోగాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. వృద్ధులు, అలసిపోయిన భక్తులు వెంటనే తిరుగుపయనం అయ్యేందుకు వీలుగా బైక్ ట్యాక్సీలు, గోల్ఫ్ కార్ట్ వాహనాలను సిద్ధంగా ఉంచాం'' అని సౌమ్య పేర్కొన్నారు. ''మేళాలో భద్రత, రక్షణ, ప్రత్యేక విధుల నిమిత్తం 10,000 మందికిపైగా పోలీస్ సిబ్బందిని మోహరించాం. జనం ఒకే ఘాట్‌లో గుమికూడకుండా చూసేందుకు, వాహనాలను వేర్వేరు చోట్ల నిలిపి ఉంచేందుకు 42 తాత్కాలిక పార్కింగ్ జోన్‌లను ఏర్పాటుచేశాం. ఒకేసారి 1,00,000 వాహనాలు నిల్పగలిగేలా పార్కింగ్ చేసేలా పార్కింగ్ జోన్‌ల సామర్థ్యాన్ని పెంచాం'' అని మేళా సూపరింటెండెంట్ నీరజ్ పాండే వెల్లడించారు. ఈ ఏడాది మేళా కోసం 12 వేల అడుగుల పొడవునా స్నాన ఘాట్లను నిర్మించారు. కనీస సదుపాయాలన్నింటినీ సమీపంలోనే అందుబాటులో ఉంచారు.

ఖమేనీని సాగనంపాల్సిందే
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్: ఇరాన్‌లో సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ శకం పరిసమాప్తి కావాల్సిన సమయం ఆసన్నమైందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. పొలిటికో వార్తాసంస్థకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఇరాన్ అంశంపై మాట్లాడారు. ''ఇరాన్‌లో నూతన నాయకత్వం తెరమీదకు రావల్సిన తరుణం ఆసన్నమైంది. ఖమేనీని సాగనంపాల్సిందే'' అని అన్నారు. తమ దేశంలో హింసకు ట్రంప్ కారణమని ఖమేనీ వలువార్లు ఆరోపణలు గుప్పించిన వేళ ఇరాన్‌లో నాయకత్వ మార్పుపై ట్రంప్ వ్యాఖ్యలు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ''దేశంలో అత్యంత పేలవపాలనా హోదాలో కొనసాగుతూ కూడా దేశం సర్వనాశనమవుతుంటే ఆయన(ఖమేనీ) పట్టించుకోలేదు. హైపోలీసు చర్యతో ఉద్యమాలను అణచివేస్తూ హింసను ప్రోత్సహించారు. గతంలో ఎన్నడూ లేని స్థాయిలో హింసాత్మక ఘటనలకు కారకుడయ్యారు. నాయకులు నాలా దేశాన్ని సవ్యంగా పరిపాలించడంపై దృష్టి సారించాలి. అధికారంలో కొనసాగేందుకు ఆయనలాగా వేల మందిని చంపకూడదు. అసమర్థ ఖమేనీకి పరిపాలించే అర్హతలేదు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

వివేకమే ప్రధానం
సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు

కోల్‌కతా: జ్ఞానంతో పోలిస్తే వివేకం అనేది భిన్నమైనదని సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఆదివారం కోల్‌కతాలోని పశ్చిమబెంగాల్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యుడీషియల్ సైన్సెస్ స్నాతకోత్సవంలో సీజేఐ ప్రసంగించారు. ''శిక్షణ ద్వారా జ్ఞానాన్ని సముపార్జించవచ్చుకానీ వివేకం తప్పనిసరిగా సాధించుకుంటూ అనుభవం ద్వారా సంక్రమిస్తుంది. అత్యంత నాయబద్ధమైన, నిష్పక్షపాత, వివేకవంత తీర్పు అందుకు వివిధ విషయంగా తయారైంది. న్యాయం, సామర్థ్యం ఇప్పుడు పోటీపడుతున్నాయి. వృత్తిపరమైన విజయానికి అంతేకే కొలమానంగా మారిపోవడం దురదృష్టకరం. ఈ కాలంలో కేవలం నియమాలు మనకు మార్గదర్శకాలుగా సరిపోవు. వివేకంతోనే మన పథంలో ముందడుగు వేయగలం. న్యాయ వృత్తిలో కేవలం తెలివితేటలు సరిపోవు. భావోద్వేగాల పరంగానూ, మానసికంగానూ శక్తివంతులుగా ఉండాలి. అప్పుడే అత్యధిక పని గంటలు, విపరీతమైన పని ఒత్తిడిలోనూ స్వల్పకాలంలోనూ సరైన నిర్ణయాలు తీసుకోగలం. చట్టాలు అనేవి లా కాలేజీ తరగతుల్లో బోధించినట్టు కోర్టుల్లో ఉండవు. పాఠ్యపుస్తకాల కంటే కోర్టు దాఖ్యుమెంట్లు బరువుగా ఉంటాయి. అకడమిక్ క్యాలెండర్ కంటే కోర్టుల్లో కాలం మరింత సుదీర్ఘంగా ఉంటాయి. ఒక్కోసారి చిన్నపాటి సంవాదాలతో తీర్పులు రావొచ్చు'' అని ఆయన అన్నారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందానికి బ్రేక్
ఐరోపా సమాఖ్య ఆకస్మిక నిర్ణయం ● ట్రంప్ 10% సుంకంపై ఈయూ పార్లమెంట్ కన్నెర్ర

స్ట్రాస్‌బర్గ్/ఆస్లియన్: గ్రీన్‌లాండ్ విషయంలో తన వెంట నిలవని 8 ఐరోపా దేశాలపై ట్రంప్ 10 శాతం అదనపు సుంకాలు విధించడాన్ని యూరోపియన్ యూనియన్ సమాఖ్య తీవ్రంగా తప్పుబట్టింది. ట్రంప్‌కు బుద్ధిచెప్పేలా అమెరికాతో గత ఏడాది జూలైలో కుదుర్చుకున్న చరిత్రాత్మక యూరోపియన్ యూనియన్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని తాత్కాలికంగా పక్కనపెడుతున్నట్లు ఈయూ పార్లమెంట్ ఆదివారం ప్రకటించింది. దీంతో ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వానికి నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. పారదర్శక, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో లక్ష్యంగా జరిగిన ఈయూ-యూఎస్ డీల్‌ను తక్షణం స్తంభింపజేసిన్నామని యూరోపియన్ యూనియన్ పార్లమెంట్ స్పష్టంచేసింది. ''ఐరోపా దేశాల వాణిజ్య ప్రయోజనాలకు భంగం కల్గించే ఎలాంటి చర్యలకైనా మేం దీటుగా ప్రతిచర్యలు, నిర్ణయాలు తీసుకుంటాం. ఇందులో అమెరికాకు ఎలాంటి మినహాయింపులు లేవు''అని ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా వ్యాఖ్యానించారు. గ్రీన్‌లాండ్ విషయంలో తమ విధానాన్ని వ్యతిరేకిస్తున్న దేశాలపై 10 శాతం అదనపు సుంకాన్ని విధిస్తున్నామని, జూలై ఒకటోతేదీలోపు గ్రీన్‌లాండ్ కొనుగోలు ఒప్పందం పూర్తికాకపోతే మరో 25 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించడం తెల్సిందే. దీనిపై యూరోపియన్ పార్లమెంట్‌లోని పలు రాజకీయ పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. ''గ్రీన్‌లాండ్ విషయంలో మనల్ని బెదిరిస్తున్న ట్రంప్ అనుకూలంగా ఈయూ-యూఎస్ డీల్‌ను ముందుకు తీసుకెళ్లకూడదు. అమెరికా ఉత్పత్తులపై సున్నా టారిఫ్ బుజ్జగింపులకు మనం చరమగీతం పాడదాం''అని యూరోపియన్ పీపుల్స్ పార్టీ చీఫ్ మ్యాన్‌ఫ్రెడ్ వెబర్ అన్నారు. ''ఈయూ-యూఎస్ డీల్‌కు ఈయూ పార్లమెంట్ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదముద్ర వేయొద్దు. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలను స్వీడన్‌లాంటి దేశాలు తమ ప్రతీకార చర్యలతో అడ్డుకోవాల్సిందే''అని ఈయూ పార్లమెంట్ సభ్యురాలు, స్వీడన్ రాజకీయ నాయకురాలు కరిన్ కార్ల్స్‌బ్రో అన్నారు.

దక్షిణ అమెరికా దేశాలతో డీల్..

ఉత్తర అమెరికా ఖండంలోని అమెరికాతో డీల్‌ను స్తంభింపజేసిన ఐరోపా సమాఖ్య వెనువెంటనే దక్షిణ అమెరికాలోని మెర్కోసర్ కూటమి దేశాలతో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పశ్చిమాసియాలో యుద్ధాలతో అంతర్జాతీయ వాణిజ్యంలో రక్షణాత్మకధోరణి పెరుగుతున్న వేళ దక్షిణఅమెరికా దేశాలతో ఈయూ వాణిజ్య ఒప్పందం చేసుకోవడం గమనార్హం. దాదాపు పాతికేళ్లుగా హింసాత్మక ఘటనల నడుమ చర్చలు కొనసాగిన ఎట్టకేలకు స్వేచ్ఛా వాణిజ్యం కుదిరింది. పరాగ్వే దేశ రాజధాని అసన్షియన్ ఉందుకు వేదికైంది. అమెరికా నుంచి అధిక టారిఫ్‌ల బెడద, చైనా నుంచి చౌక ఉత్పత్తుల వరదల నడుమ మెర్కోసర్ కూటమితో ఈయూ ఒప్పందం చేసుకుంది. మెర్కోసర్ కూటమిలో అర్జెంటీనా, బ్రెజిల్, పరాగ్వే, ఉరుగ్వే సభ్యదేశాలుగా ఉన్నాయి. బొలీవియా కొత్తగా చేరినప్పటికీ వాణిజ్య ఒప్పందంలో పాలుపంచుకోవట్లేదు. వెనెజువెలాను గతంలో కూటమి నుంచి బహిష్కరించారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా అర్జెంటీనా గొడ్డు మాంసం మొదలు జర్మనీ కార్ల దాకా పలు రకాల వస్తూత్పత్తులపై 90 శాతం టారిఫ్‌లను దశలవారీగా తొలగించనున్నారు. దీంతో ఈ వాణిజ్య ఒప్పందం ప్రపంచంలోనే అతి పెద్ద స్వేచ్ఛావాణిజ్య జోన్‌లలో ఒకటిగా మారనుంది. 70 కోట్ల మంది వినియోగదారులు ఈ డీల్‌తో లాభపడనున్నారు. ఈ ఒప్పందం చరిత్రాత్మకమైనదని యూరోపియన్ కమిషన్ మహిళా అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డీర్ లెయిన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లూలా డసిల్వా అన్నారు.

గ్రీన్‌లాండ్ టారిఫ్‌లు పూర్తిగా తప్పు
ట్రంప్ ప్రకటనపై యూరప్ దేశాల నేతల స్పందన

లండన్: గ్రీన్‌లాండ్‌స్వాధీన ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామనే కారణంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమపై టారిఫ్‌లను ప్రకటించడాన్ని యూరప్ దేశాల నేతలు ఖండించారు. ట్రంప్ ప్రభుత్వ వైఖరిని డెన్మార్క్, యూకే, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్ తప్పుబట్టారు. 'గ్రీన్‌లాండ్ విషయంలో మా వైఖరి సుస్పష్టం. ఆ ప్రాంతం డెన్మార్క్ సామ్రాజ్యంలోనిదే. దాని భవిష్యత్తును నిర్ణయించుకోవాల్సింది డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రజలు మాత్రమే' అని వారు పేర్కొన్నారు. 'టారిఫ్ హెచ్చరికలు అట్లాంటిక్ దేశాల మధ్య ఉన్న సంబంధాలను దెబ్బతీస్తాయి. ప్రమాదకరమైన పరిణామాలకు దారితీసే ప్రమాదముంది. యూరప్, అమెరికా మధ్య ఉండాల్సిన సహకారంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నాం' అని వారు పేర్కొన్నారు. ఆర్కిటిక్ ప్రాంత రక్షణ మొత్తం నాటో కూటమికి కీలకమైన అంశం. ఆర్కిటిక్‌లోని వివిధ ప్రాంతాలకు రష్యా నుంచి ఎదురయ్యే ముప్పును ఎదుర్కోవడానికి మిత్రదేశాలన్నీ కలిసి మరిన్ని చర్యలు చేపట్టాలి. నాటో మిత్రదేశాల సమిష్టి భద్రత కోసం కృషి చేస్తున్న మిత్రపక్షాలపైనే టారిఫ్‌లు విధించడం పూర్తిగా తప్పు. ఈ విషయాన్ని అమెరికా ప్రభుత్వంతో నేరుగా చర్చిస్తాం' అని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ట్రంప్ బెదిరింపులకు తాము లొంగబోమని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ స్పష్టం చేయగా యూరప్ మిత్ర దేశాలను ట్రంప్ బ్లాక్ మెయిల్ చేయడం సరికాదని స్వీడన్ ప్రధాని క్రిస్టెర్సన్ పేర్కొన్నారు. ఈ అంశంపై ఉమ్మడి స్పందన కోసం నార్వే, స్వీడన్, యూకేలతో తీవ్రంగా చర్చిస్తున్నామన్నారు. ఈ విషయంలో సంయమనంతో వ్యవహరించాలని, వాణిజ్య ఉద్రిక్తతలను మరింత ముదిరేలా వ్యవహరించరాదని నార్వే ప్రధాని జోనాస్ పేర్కొన్నారు. ఇది ఎవరికీ మంచిది కాదన్నారు. గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా ప్రయత్నాలకు అడ్డు చెబుతున్న డెన్మార్క్, యూకే, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, ఫిన్లాండ్, జర్మనీ, నెదర్లాండ్స్ ఉత్పత్తులపై ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 10 శాతం టారిఫ్‌ను వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌ను ఈ దేశాలు తమతో ఒక అంగీకారానికి రాని పక్షంలో జూన్ నుంచి టారిఫ్‌ను 25 శాతానికి పెంచుతామని ఆయన హెచ్చరించడం తెల్సిందే.

మహా జంగిల్‌రాజ్‌ను అంతం చేయండి
బీజేపీ డబుల్ ఇంజన్ మోడల్‌ను ఆదరించండి
● బెంగాల్ ప్రజలకు మోదీ పిలుపు

సింగూర్: ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదార్లను కాపాడుతూ దేశ భద్రతతో ఆటలాడుతున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని పశ్చిమబెంగాల్ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ''రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొల్పాలంటే 'మహా జంగిల్‌రాజ్'ను అంతం చేయాల్సిందే. అభివృద్ధి కావాలన్నా, పెట్టుబడిదారులు ఆకర్షించాలన్నా తృణమూల్‌ను తక్షణమే ఓడించాల్సిందే'' అన్నారు. మోదీ ఆదివారం హుగ్లీ జిల్లాలోని సింగూర్‌లో పర్యటించారు. రూ.830 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మూడు వందేభారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. రాబోయే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మహా జంగిల్‌రాజ్, బీజేపీ సుపరిపాలనకు పోరు జరుగుతుందన్నారు. తప్పుడు దాఖ్యుమెంట్లతో స్థిరపడిన చొరబాటుదార్లను తాము అధికారంలోకి రాగానే వెనక్కి పంపిస్తామని పునరుద్ఘాటించారు. బీజేపీ డబుల్ ఇంజన్ మోడల్‌ను ఆదరించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తామన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని శిక్షించాలి

''బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చొరబాట్లు విపరీతంగా పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో సరిహద్దుల్లో కంచె నిర్మాణం ఆగిపోయింది. చొరబాటుదార్లు ప్రభుత్వ సహకారంతో తప్పుడు పత్రాలు సృష్టించి, ఇక్కడే తిష్టవేస్తున్నారు. వారిని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం నిస్సిగ్గుగా కాపాడుతోంది. మేమొచ్చాక వారందరినీ ఏరేస్తాం. బెంగాలీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తున్న అరాచక ప్రభుత్వాన్ని ప్రజలే శిక్షించాలి. అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న ప్రభుత్వాలను ప్రజలు పూర్తిగా తిరస్కరిస్తున్నారు. దేశమంతటా ఈ ధోరణి కనిపిస్తోంది. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రజలకు అందకుండా నిలిపివేసిన ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకం బెంగాల్‌లో అమలు కావడం లేదు. పేద ప్రజలు నష్టపోతున్నారు. వారంతా తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించడం ఖాయం. మేము వచ్చాక ఆయుష్మాన్ భారత్ స్కీమ్ అమలు చేస్తాం.

ఇదీ నా గ్యారంటీ

తృణమూల్ కాంగ్రెస్ పాలనలో మాఫియా నాయకులు, సిండికేట్లు, నేరగాళ్లు చెలరేగిపోతున్నారు. ప్రజలను పీడిస్తున్నారు. ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. బీజేపీ పాలనలో వారి ఆట కట్టిస్తాం. ప్రజలకు సుపరిపాలన అందిస్తాం. ఇదే నా గ్యారంటీ. సిండికేట్ రాజ్ ఆగడాలు తట్టుకోలేక పరిశ్రమలు వెళ్లిపోయాయి. తృణమూల్ కాంగ్రెస్ నాయకులు సొంత సామ్రాజ్యాలు సృష్టించుకున్నారు. సిండికేట్ రాజ్, మాఫియా సంస్కృతిని అంతం చేయడమే మా లక్ష్యం. రాష్ట్రంలో మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయి. సందేశ్‌ఖాలీలో భూములు ఆక్రమించారు. టీచర్ల నియామకంలో భారీ అవినీతి జరిగింది. విద్యా వ్యవస్థను మాఫియాలు నియంత్రిస్తున్నాయి. బీజేపీ అధికారంలోకి వస్తేనే ఇలాంటివి ఆగిపోతాయి. మహిళలు, యువత, రైతులకు తృణమూల్ కాంగ్రెస్ శత్రువులా మారింది. వారి జీవితాలతో చెలగాటం ఆడుతోంది'' అన్నారు.

చొరబాటుదార్లకు కాంగ్రెస్ అండ

కలియాబోర్: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. అస్సాంలో ఆ పార్టీ హయాంలో ఓట్ల కోసం భూములను చొరబాటుదార్లకు కట్టబెట్టిందని మండిపడ్డారు. దాంతో చొరబాటుదార్ల జనాభా విపరీతంగా పెరిగిపోయిందన్నారు. వారు భూములు, అడవులను విచ్చలవిడిగా ఆక్రమించుకున్నారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక చొరబాటుదార్లను ఖాళీ చేయిస్తున్నట్లు తెలిపారు. అస్సాంలోని నాగావ్ జిల్లాలో రూ.6,957 కోట్ల విలువైన కజిరంగా ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు మోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రెండు అమృత్‌భారత్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. ''చొరబాటుదారులు అస్సాం సంస్కృతిని దెబ్బ తీస్తున్నారు. స్థానిక యువత ఉపాధిని కొల్లగొడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో భూములు కబ్జా చేస్తున్నారు. చొరబాటుదార్ల కారణంగా అస్సాంకే కాకుండా మొత్తం దేశ భద్రతకు ముప్పు పొంచి ఉంది. చొరబాటుదార్లను కాపాడి అధికారం దక్కించుకోవడమే కాంగ్రెస్ విధానంగా మారిపోయింది. చొరబాటుదార్లకు మద్దతుగా బిహార్‌లో ర్యాలీలు నిర్వహించిన కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు. అస్సాంలోనూ కాంగ్రెస్ కూటమికి అదే గతి పడుతుంది. కాంగ్రెస్‌కు అభివృద్ధి అజెండా అనేదే లేదు. ప్రతికూల రాజకీయాలతో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది'' అన్నారు.

శాంతి మండలిలో సభ్యత్వం...
బిలియన్ డాలర్లే!
ప్రపంచ దేశాలకు ట్రంప్ ఆఫర్

వాషింగ్టన్: గాజా పునర్నిర్మాణ క్రతువు కోసం కొలువుదీరే 'శాంతి మండలి'లో శాశ్వత సభ్యత్వం కోసం ఒక్కో దేశం 100 కోట్ల డాలర్లు (దాదాపు రూ.9,071 కోట్లు) చెల్లించాలి! అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఈ మేరకు ప్రకటించారు!! ఈ మండలికి ఆయనే సారథ్యం వహిస్తుండటం తెలిసిందే. గాజా పునర్నిర్మాణం కోసమే శాంతి మండలి (బోర్డ్ ఆఫ్ పీస్) అని తొలుత చెప్పినా నిజానికి దీన్ని ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా ట్రంప్ ఏర్పాటు చేస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రతిపాదిత మండలికి సంబంధించిన ముసాయిదా చార్టర్‌లోని వివరాలను అంతర్జాతీయ మీడియా సంపాదించింది. అందులోని అంశాలతో కథనాలు వెలువడ్డాయి. ఐరాస, దాని అనుబంధ శాఖలు, సంస్థలు, కమిషన్లు, సలహా మండళ్లలో ఇతర దేశాల ఆధిపత్యం కొనసాగుతుండటంతో విసిగిపోయిన ట్రంప్ ఈ కసుసన్నల్లో పనిచేసే శక్తిమంతమైన అంతర్జాతీయ కూటమి ఏర్పాటుకు మొగ్గుచూపి ఆ మేరకే కొత్తగా ఈ శాంతిమండలిని తెరమీదకు తెచ్చారు. తనకు నచ్చిన దేశాలకు ఇష్టానుసారం సభ్యత్వం ఇస్తున్నారు. దీనిపై అమెరికా ఉన్నతాధికారి ఒకరు వివరణ ఇచ్చారు. ''దేశాలకు ముడేళ్ల వరకు శాంతి మండలి సభ్యత్వం ఉంటుంది. ఆ తర్వాత శాశ్వత సభ్యత్వం కోసం కనీసం 100 కోట్ల డాలర్లు చెల్లించాల్సిందే. అది కూడా నగదు రూపంలో. ఐదేళ్ల గడువులో పూర్తి మొత్తాలను చెల్లించాలి. శాశ్వత సభ్యత్వం ఎవరికివ్వాలనే విషయంలో తుది నిర్ణయం ట్రంప్‌దే. శాంతి మండలిలో తీసుకునే నిర్ణయాలపై ప్రతి దేశం ఓటు హక్కు కల్గిఉంటుంది. కానీ ఆ ఓటు చెల్లుబాటయ్యేదీ లేనిదీ ట్రంప్ నిర్ణయిస్తారు. మండలి ఆర్థిక వ్యవహారాలు చైర్మన్ ఆదేశాల మేరకు జరుగుతాయి. సభ్యులకు తెలియచేసే అధికారాలు పరోక్షంగా ఆయనవే'' అని చెప్పారు. ఈ కూటమిలో భాగస్వాములు ఉండాలంటూ భారతకు ట్రంప్ స్వయంగా ఆహ్వానం పంపారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
లక్నోలో అత్యవసర ల్యాండింగ్

లక్నో: 'విమానంలో బాంబు ఉంది'అని ఉన్న టిష్యూ పేపర్ తీవ్ర కలకలానికి కారణమైంది. ఢిల్లీ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని బగ్డోగ్రాకు బేఫ్ తీసుకున్న ఇండిగో విమానంలో ఈ పేపర్ కనిపించడంతో లక్నో విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరు పైలెట్లు, ఐదుగురు సిబ్బందితోపాటు 8 మంది చిన్నారులు సహా 222 మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 8.46 గంటల సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు ఈ సమాచారం అందింది. అప్రమత్తమైన అధికారులు విమానాన్ని లక్నోలో 9.17 గంటలకు ల్యాండ్ చేయించారు. విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించి ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దించి వేశారు. అనంతరం బాంబ్ స్క్వాడ్ శోధించి, ఎలాంటి అనుమానాస్పద ప్రమాదకర వస్తువులు లేవని ధ్రువీకరించారు. 'విమానంలో బాంబు ఉంది అని రాసున్న ఓ టిష్యూ పేపర్ విమానంలో దొరికిందని, దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

ఉక్రెయిన్‌లో 2 లక్షల ఇళ్లకు కరెంట్ కట్

కీవ్: రష్యా ఆక్రమిత దక్షిణ ఉక్రెయిన్‌లోని వేలాది నివాసాల్లో ఆదివారం చీకట్లు అలుముకున్నాయి. మైనస్ ఉష్ణోగ్రతలతో తీవ్ర శీతల వాతావరణంలో హీటింగ్ వ్యవస్థలు పనిచేయకపోవడంతో జనం అల్లాడుతున్నారు. విద్యుత్ సరఫరా లైన్లే లక్ష్యంగా ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడుల కారణంగా జపొరిజియా ప్రాంతంలోని 400 గ్రామాల్లోని 2 లక్షలకు పైగా నివాసాలకు సరఫరా నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. మరోవైపు, సుమీ, ఖర్కివ్, ఒడెసా, నిప్రొపెట్రొవ్‌స్కీ ప్రాంతాలపై శనివారం రాత్రి విద్యుత్ పవర్ గ్రిడ్‌పై రష్యా డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ యంత్రాంగం తెలిపింది.

600వ సారి నింగిలోకి
చరిత్ర సృష్టించిన ఫాల్కన్ శ్రేణి రాకెట్

వాషింగ్టన్: ఆధునిక ప్రైవేట్ అంతరిక్ష రంగంలో తనను మించిన విశ్వసనీయ రాకెట్ మరోటి లేదని ఫాల్కన్-9 రాకెట్ నిరూపించుకుంది. అమెరికా స్థానికకాలమాన ప్రకారం శుక్రవారం రాత్రి కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్‌ఫోర్స్ బేస్ ప్రయోగ కేంద్రం నుంచి ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఫాల్కన్-9 రకం రాకెట్‌ను ప్రయోగించడం ఇది 600వసారి. దీంతో అమెరికా అంతరిక్ష రంగంలో అత్యధిక సార్లు ఉపయోగించిన రాకెట్‌గా 'ఫాల్కన్' చరిత్రకెక్కింది. అమెరికా ప్రభుత్వ నేషనల్ రికాన్ యిసెన్స్ ఆఫీస్(ఎన్‌ఆర్‌ఓ)105 మిషన్‌లో భాగంగా ఈ రాకెట్‌ను స్పేస్‌లాంచ్ కాంప్లెక్స్-4ఈ నుంచి ప్రయోగించారు. అమెరికా నిఘా, సైనిక, పౌర అవసరాలు తీర్చే డజన్ల కొద్దీ కృత్రిమ ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి ఎన్‌ఆర్‌ఓఎల్ మిషన్ ద్వారా నేషనల్ రికానాయిసెన్స్ ఆఫీస్, స్పేస్ఎక్స్ భాగస్వామ్యంతో నింగిలోకి పంపిస్తోంది.

2010లో మొదలైన ప్రస్థానం

2010 జూన్ 4వ తేదీన తొలిసారిగా ఫాల్కన్ రకం రాకెట్‌లను ఉపయోగించారు. ఆరోజు డ్రాగన్ వ్యోమనౌకను ఇది తొలిసారిగా విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. ఫాల్కన్ రాకెట్ల ఏ మేరకు విజయవంతమవుతాయనే అనుమానాలు తొలినాళ్లలో ఉండేవి. అనాటి దశ నుంచి ప్రతి వారం ఒక ఫాల్కన్‌ను ప్రయోగించే విశ్వసనీయ దశకు ఫాల్కన్ రాకెట్లు చేరుకున్నాయి. 600వసారి విజయవంతం అనే ఘటన కేవలం ప్రయోగంగా కాకుండా అంతరిక్షంలోకి వచ్చిన అద్భుతమైన సాంకేతిక సాధనంగా పరిణామంచెందిన సంస్థ ప్రయాణాన్ని పేర్కొంది. ఫాల్కన్ రాకెట్ల ప్రస్థానంలో 2015 ఏడాది అత్యంత కీలకమైనదిగా చెప్పొచ్చు. ఆ ఏడాదిలో ఫాల్కన్‌ను తయారుచేసిన స్పేస్ఎక్స్ కంపెనీ ఆర్బిటల్-తరగతి బూస్టర్ సాయంతో రాకెట్‌ను నింగిలోకి ప్రయోగించాక తిరిగి నిట్టనిలువుగా ల్యాండింగ్ చేసే సాహసం చేసింది. ఆ తర్వాత కేవలం మూడేళ్లకే ఫాల్కన్ హెవీ రాకెట్ టెస్లా రోడ్‌స్టర్‌ను నింగిలోకి విజయవంతంగా తీసుకెళ్లింది. తర్వాత డెమో-2 మిషన్ ద్వారా 2020లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్‌ఎస్)కు వ్యోమగాములను తీసుకెళ్లిన తొలి ప్రభుత్వేతర సంస్థగా స్పేస్ఎక్స్ రికార్డులకెక్కింది. ఈ ప్రయోగానికి సైతం ఫాల్కన్ రాకెట్‌నే ఉపయోగించారు. దీంతో వ్యోమగాములను ఐఎస్‌ఎస్‌కు చేర్చేందుకు విదేశీ రాకెట్లపై ఆధారపడే సంస్కృతికి చరమగీతం పాడిన ట్లయింది. ఈ ఘటన తర్వాత క్రూ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్ వంటి ఫాల్కన్-9 రాకెట్ల విశ్వసనీయ అనేది సర్వసాధారణ మైంది. దీంతో 2020 తర్వాతి నుంచి వ్యోమగాముల అంతరిక్ష ప్రయాణాలకు ఫాల్కన్ వారి స్పేస్ఎక్స్ అనేది ప్రైమరీ ట్యాక్సీగా మారిపోయింది. ఆ తర్వాత ఫాల్కన్-9 విజయాల శాతం ఏకంగా 99 శాతం దాటడం విశేషం. దీంతో అత్యంత నమ్మకస్తమైన అంతరిక్ష వాహకంగా ఫాల్కన్-9 చరిత్రలోకెక్కనే తన పేరిట రికార్డ్‌ను లిఖించుకుంది.

ఇండియాలో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లించాలి?
వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఆక్షేపణ

వాషింగ్టన్: ఇండియాలో కృత్రిమ మేధ(ఏఐ) సేవల కోసం అమెరికా వనరులను ఉపయోగించాల్సి వస్తోందని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఆక్షేపించారు. ఇండియాలో ఏఐ కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లించాలని ప్రశ్నించారు. ఆయన శనివారం ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. చాట్‌జీపీటీ వంటి వేదికలు అమెరికా భూభాగంలో ఉన్నాయని, ఇక్కడి విద్యుత్‌ను ఉపయోగించుకుంటున్నాయని చెప్పారు. కానీ, భారత్ వంటి ఇతర దేశాల్లోని ప్రజలకు సేవలు అందిస్తున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా వంటి దేశాల ప్రజలు ఈ సేవలు వాడుకుంటున్నారని గుర్తుచేశారు. అమెరికా వనరులతో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలు ఇతర దేశాలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నవారో స్పష్టంచేశారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలు బలహీనపడిన సంగతి తెలిసిందే.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
8మంది జవాన్లకు గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్‌లో ఆదివారం ఉగ్రవాదులతో ఎదురుకాల్పుల్లో ఎనిమిది మంది జవాన్లు గాయపడ్డారు. ఛత్రూకు సమీపంలోని సొన్నార్‌లో బలగాలకు తారసపడిన ఉగ్రవాదులు కాల్పులకు దిగడంతో పాటు గ్రెనేడ్లు విసిరాయి. ఎదురుకాల్పుల్లో 8 మంది జవాన్లకు బుల్లెట్ గాయాలయ్యాయి. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఉగ్రవాదులు పాక్ కేంద్రంగా పని చేసే జైషే మహ్మద్‌కు చెందినవారని భావిస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడం లేదు. దిగువకు 2,900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 38.2697 టీఎంసీలు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 552.70 అడుగులకు చేరింది. కుడి కాలువకు 7,528, ఎడమ కాలువకు 7,110 క్యూసెక్కులు వదిలారు.

తిరుపతమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ వారిని ఆదివారం భక్తులు భారీగా దర్శించుకున్నారు. సెలవు దినంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో పలు జిల్లాల నుంచి తరలివచ్చారు.

న్యూస్‌రీల్

కపోతేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

నకరికల్లు: నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలోని శ్రీ కపోతేశ్వర స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఆదివారం దర్శించుకున్నారు. శతాబ్దాల చరిత్ర కలిగిన స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఆయన వెంట నరసరావుపేట అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.సలోమి ఉన్నారు. వీరికి ఆలయ అర్చకులు కొండకావూరి వెంకట్రామయ్య శర్మ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. నరసరావుపేట అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.సలోమి కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. ఎస్ఐ కె.సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

బగళాముఖి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత

చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత దర్శించుకుని, పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా జరిగిన కుంకుమ పూజలలో జస్టిస్ సుజాత పాల్గొని గుమ్మడి కాయతో దీపారాధన చేసి హారతులిచ్చారు. న్యాయమూర్తికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేయగా, ఈవో నరసింహమూర్తి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కలకోట చక్రధర్‌రెడ్డి, న్యాయమూర్తికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమావాస్య సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహంకాళికి అమావాస్య పూజలు

నరసరావుపేట రూరల్: ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. భక్తులతో ఆలయ క్యూలైన్‌లో రద్దీ నెలకొంది. ఆలయంలో నిర్వహించిన చండీ హోమం, పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ,ప్రసాదాలు భక్తులు స్వీకరించారు. ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో నలబోతు మాధవీదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో లలిత సహస్ర నామ పారాయణం



అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడ గ్రామంలోని పుణ్య క్షేత్రం శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం పుష్య అమావాస్య కోటి కుంకుమార్చన, సామూహిక లలిత సహస్ర నామ పారాయణ మహోత్సవం నిర్వహించారు. ఓం నమో భగవతే మలయాళ యతీన్మాయ సద్గురు మలయాళ స్వాముల సాధురత్నాంబ ఆశీస్సులతో గూడవల్లి ఆధ్వర్యంలో మహా అన్న ప్రసాద వితరణ శ్రీ మైత్రే యాశ్రమంలో ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్య నిర్వహణాధికారి మంతెన విఠల్ శ్రీనివాస వర్మ, చైర్మన్ పావులూరి రమేష్, ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మైత్రేయి ఆశ్రమ నిర్వహకురాలు గంటా నిర్మలమ్మ, ఉప్పల పద్మజ, మండవ నాగమల్లేశ్వరి, ఇంకొల్లు రంగారావు, ఎస్ఎస్ఎఫ్ నిర్వాహకులు పడమటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు కిటకిట

సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలు, నగరానికి వచ్చిన వారు తిరిగి వెళ్లేందుకు బస్టాండుకు రావడంతో ప్రాంగణం ఆదివారం కిటకిటలాడింది. బస్సులు తక్కువగా ఉండటం, సమయానికి రాకపోవటంతో ప్రయాణికులు ఎదురు చూపులు చూశారు. గంటల తరబడి పడిగాపులు తప్పలేదు. ఎక్కాల్సిన బస్సు రాగానే అందులోకి వెళ్లేందుకు నానా తంటాలు పడ్డారు. ముఖ్యంగా బస్సుల్లో ఉచిత ప్రయాణం కావటంతో మహిళల సంఖ్య ఎక్కువగా కనిపించింది. చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

రద్దీ వేళ అడ్డగోలు దోపిడీ

- గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల జేబులు గుల్ల
- ఎమ్మార్పీపై విక్రయాలకు దుకాణదారులు తిలోదకాలు
- పట్టించుకోని ఆర్టీసీ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు

బస్టాండ్‌లో అధిక ధరకు వస్తువులు విక్రయిస్తున్న ఒక దుకాణం

పట్నంబజారు: సంక్రాంతి పండుగ కోసం ఊరికి బయలుదేరిన ఓ సాధారణ కుటుంబానికి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎదురైన అనుభవంతో ఇది బస్టాండా.. దోపిడీ అడ్డానా..? అనే ప్రశ్న లేవనెత్తింది. పిల్లల దాహం తీర్చేందుకు రెండు వాటర్ బాటిళ్లు కొనాలనుకున్న ఆ కుటుంబం.. రూ. 20 ఎమ్మార్పీ ఉన్న ఒక్కో బాటిల్‌కు రూ.30 చెల్లించాల్సి వచ్చింది. ఆఖరికి పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే.. స్వయంగా దుకాణదారులు వాటర్ బాటిల్‌పై ముద్రించి విక్రయాలు జరుపుతున్నారు. ప్రశ్నిస్తే దుకాణదారుడి సమాధానం మరింత ఘోరం. ''ఇక్కడ అంతే. కావాలంటే తీసుకోండి, లేకపోతే వదిలేయండి.'' అని అతడు పేర్కొనడం గమనార్హం. ఇదీ గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో నడుస్తున్న దోపిడీ రాజ్యం.

నాణ్యత ప్రశ్నార్థకం

ధరల దోపిడీకి తోడు నాణ్యత లేని, కాలపరిమితికి చేరువైన తినుబండారాలు ప్రయాణికుల చేతిలోకి వెళుతున్నాయి. చిప్స్ ప్యాకెట్లు, బిస్కెట్లు, పాప్‌కార్న్‌లపై అసలు ధరలు లేవు. నిల్వ ఉన్నవి వేడి చేసి అమ్మేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా పిల్లలతో ప్రయాణించే కుటుంబాలకు ఇది నేరుగా ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. కానీ దుకాణదారులకు లాభం తప్ప ప్రయాణికుల ఆరోగ్యం అవసరం లేనట్టుగా వ్యవహారం సాగుతోంది. బస్టాండ్ బయటకు వెళ్లి కొనుగోలు చేసే అవకాశం లేకపోవడం ప్రయాణికుల బలహీనతగా మారింది. ''బస్టాండ్‌లోనే కొనాలి'' అనే పరిస్థితిని ఆయుధంగా మార్చుకుని, దుకాణదారులు బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రశ్నించే ప్రయాణికులపై నిర్లక్ష్యపు చూపు, అహంకారపు మాటలే సమాధానంగా మారుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ విభాగం అధికారులు కనీసం స్పందించడం లేదు. బస్టాండ్‌లోని దుకాణాలలో తరచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా పండుగ సమయంలో కూడా కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలపై చర్యలు లేకపోవడం వల్లే ఈ దోపిడీ మరింత పెరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రజల అవసరాలను లాభంగా మార్చుకునే ఈ దోపిడీకి ఇకనైనా చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది. ధరల నియంత్రణ, నాణ్యత తనిఖీలు, కాలపరిమితి లేని ఆహార పదార్థాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది.

పండుగ వేళ అదనుగా...

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్వగ్రామాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణం అయ్యారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రస్తుతం సుమారు వంద దుకాణాల వరకు ఉన్నాయి. వీటిలో కనీసం నలభై వరకు కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్, పాప్‌కార్న్, చిప్స్, బిస్కెట్లు, చాక్లెట్లు వంటి తినుబండారాలు విక్రయించే దుకాణాలే. సంక్రాంతి రద్దీని ఆసరాగా చేసుకుని దుకాణాలు నిబంధనలను పూర్తిగా చెత్తబుట్టలో వేసి, ప్రయాణికుల జేబులను గుల్ల చేస్తున్నాయి. ఎమ్మార్పీ అనే పదం మచ్చుకైనా కనపడటం లేదు. అత్యంత ప్రముఖ కంపెనీలు అయిన కిన్‌లే, బెయిలీ, ఆక్వామైన్, బిస్లరీ వంటి కంపెనీల వాటర్ బాటిళ్లపై రూ. 20 ఎమ్మార్పీ ఉంటే.. ఇక్కడ ఆక్సిజెమ్, ఆక్వా ఫ్రెష్‌తోపాటు ఇతర లోకల్ కంపెనీలకు చెందిన వాటర్ బాటిళ్లు నేరుగా రూ. 30 ముద్రించి విక్రయించటం కొసమెరుపు. ప్రముఖ కంపెనీల వాటర్ బాటిళ్లు సైతం డూప్లికేటు తయారు చేయించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూల్‌డ్రింక్ చిన్న బాటిల్ అయితే రూ.5, అరలీటర్ రూ.10, లీటర్‌కు రూ.25 వరకు అధికంగా తీసుకుంటున్నారు. ఈ విధంగా విక్రయాలు జరుగుతున్నా.. ఈ పది రోజులలో లీగల్ మెట్రాలజీ అధికారులు కనీస తనిఖీ చేసిన పాపాన పోలేదని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దూరవిద్య విభాగంలో కదలిక

- ఆరోపణలు ఎదుర్కొన్న అబ్జర్వర్లపై యూనివర్సిటీ చర్యలు
- కొంతమందిని పరీక్షల విధుల నుంచి తొలగించిన అధికారులు
- అన్ని సౌకర్యాలు ఉన్న కళాశాలలకే పరీక్ష కేంద్రాలుగా అనుమతి
- క్యాంపస్‌లో పనిచేసే వారికే అబ్జర్వర్‌గా విధులు కేటాయింపు
- పరీక్షల వేళ వివాదాస్పదంగా మారిన కోఆర్డినేటర్ తీరు

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి టౌన్: ఈ నెల 17వ తేదీన 'సాక్షి'లో ప్రచురించిన 'దూరవిద్యలో అవినీతి దందా' అనే ప్రత్యేక కథనం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తీవ్ర చర్చకు దారితీసింది. దూరవిద్యలో గత పరీక్షల్లో పలు ఆరోపణలు ఎదుర్కొన్న కొందరు అతిథి అధ్యాపకులను తొలగించి వారి స్థానంలో వేరే వారిని అబ్జర్వర్లుగా విధులు కేటాయిస్తున్నట్లు దూర విద్యాకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వరరావు ఆదివారం 'సాక్షి' ప్రతినిధికి తెలిపారు. ఈ కథనానికి స్పందించి అధికారులు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు తెలియవచ్చింది. గతంలో కొంతమంది పరిశీలకులుగా వెళ్లినవారు ఆయా పరీక్షా కేంద్రాల నిర్వాహకులను మభ్యపెట్టి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వర్సిటీ పలు చర్యలు తీసుకుంది. పరీక్ష కేంద్రాల కేటాయింపు విషయంలో వర్సిటీ నియమించిన కమిటీ ఆయా కేంద్రాలను పరిశీలించి, అన్ని వసతులు ఉన్న వాటినే ఎంపిక చేసినట్లు ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ పరీక్షలకు మొత్తం 114 కేంద్రాలను ఎంపిక చేశామని, వాటికి ఒక్కొక్కరు చొప్పున అబ్జర్వర్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఏదైనా అవకతవకలు జరిగితే అబ్జర్వర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. వర్సిటీలో పనిచేసే అధ్యాపకులకు మాత్రమే విధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దూరవిద్య పరీక్షలకు యూజీ, పీజీ కోర్సులకు సుమారు 63 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణ విధివిధానాలపై సోమవారం పరిశీలకులుగా నియమించిన వారికి ప్రత్యేక సూచనలు చేయనున్నట్లు తెలిపారు.

కో ఆర్డినేటర్ నిర్లక్ష్యం

ఇదిలా ఉండగా పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో దూరవిద్య కేంద్రంలో కీలకంగా వ్యవహరించే కోఆర్డినేటర్ సెల్‌ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో ఆయా కేంద్రాల నిర్వాహకులు, పరిశీలకులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. వర్సిటీలో విద్యార్థి కాని మంగళగిరికి చెందిన ఓ వ్యక్తికి గత పరీక్షల్లో పరిశీలకులుగా కృష్ణా జిల్లాలో నియమించినట్లు సమాచారం. అయితే గతంలో ఆరోపణలు ఎదుర్కొన్నవారిలో పలువురిని మాత్రమే తొలగించి, మిగిలిన వారిని కొనసాగించారని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. వీటన్నింటికీ యూనివర్సిటీలో పలువురు కీలకపదవుల్లో ఇన్‌చార్జులుగా ఉండటమే కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమందికి విధులు కేటాయించినా హాజరు కాకుండా రెండు మూడు రోజులు ఎక్కడో ఉంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. దూరవిద్య కేంద్రం వ్యవహారాలను గాడిలో పెట్టాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు. వివరణ కోరేందుకు కో ఆర్డినేటర్‌కు పలు మార్లు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది.

లారీ ఢీకొని వివాహిత మృతి

- ప్రమాదంలో భర్తకు గాయాలు
- పశ్చిమ బైపాస్ వద్ద దుర్ఘటన

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం చినకాకాని పశ్చిమ బైపాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా, భర్త గాయాలపాలైన ఘటన చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. మంగళగిరి పట్టణం, బాపనయ్యనగర్‌కు చెందిన షేక్ సుభాని, సాధిక (35) దంపతులు. మంగళగిరిలో ఆయన వెల్డింగ్ పనులు చేస్తుంటారు. సాధిక, బంధువులతో కలసి శనివారం సాయంత్రం గుంటూరు లాం గ్రామం వద్దకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. రాత్రి 10.30 గంటల సమయంలో చినకాకాని పశ్చిమ బైపాస్ నుంచి మంగళగిరి పట్టణంలోకి వచ్చే క్రమంలో దంపతులు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని పశ్చిమ బైపాస్ వైపు వెళ్తున్న ఓ లారీ ఢీకొట్టింది. ద్విచక్రవాహనం వెనుక ఉన్న సాధిక రోడ్డుపై పడిపోవడంతో ఆమెపై నుండి లారీ వెళ్లడంతో ఆమె శరీరం ఛిద్రమైంది. భర్త సుభాని గాయాల పాలవడాన్ని వెనుక వేరే వాహనంలో వస్తున్న బంధువులు గమనించి 108కు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలంలోనే సాధిక మృతి చెందగా, సుభానిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పశ్చిమ బైపాస్‌కు వెళ్లే క్రమంలో ఎలాంటి సూచిక బోర్డు లేకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు.

పార్టీ సంస్థాగత నిర్మాణం అత్యంత కీలకం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- పశ్చిమ నియోజకవర్గ సమావేశం

మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, పక్కన టీజేఆర్ సుధాకర్‌బాబు తదితరులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): సంస్థాగతంగా పార్టీ నిర్మాణం చేయాలనేది.. అత్యంత కీలకమైన బాధ్యత అని, మన అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు స్పష్టం చేశారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి సంస్థాగతంగా పార్టీ నిర్మాణం అంశంపై సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, టాస్క్‌ఫోర్స్ సభ్యుడు టీజేఆర్ సుధాకర్ బాబు హాజరయ్యారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ ఏ మాత్రం గురి తప్పకుండా పూర్తి చేయాల్సిన కార్యక్రమం కమిటీ నిర్మాణామని తెలిపారు. డివిజన్‌ల వారీగా కమిటీలను డివిజన్ అధ్యక్షుడు, ఆయా విభాగాల అధ్యక్షులు చర్చించి ఏర్పాటు చేయాలని సూచించారు. 26 డివిజన్‌లు ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో అన్ని అనుబంధ విభాగాల కమిటీలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందన్నారు. దీనితో పాటుగా ముఖ్యంగా డివిజన్ పరిధిలో ఎన్ని సచివాలయాలు ఉంటే.. అన్ని సచివాలయాల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కమిటీలు డిజిటైలేజ్ అయి వైఎస్ జగన్ డ్యాష్ బోర్డుకు వెళ్తాయని వివరించారు. భారతదేశంలో వైఎస్సార్ సీపీకి ఉన్న మాస్ బేస్ ఎవరికీ లేదని, దీనిని పార్టీ నిర్మాణం చేయాలన్నదే వైఎస్ జగన్ తలంపు అని చెప్పారు. కమిటీ నిర్మాణ బాధ్యత డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్‌లు, అనుబంధ విభాగాల నేతలపై ఉందని స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఉదయం ఒక డివిజన్, సాయంత్రం మరో డివిజన్‌లో తాను కూడా పర్యటిస్తానన్నారు. గుంటూరు పశ్చిమలో గతంలో మూడు సార్లు ఓటమి పాలయ్యామని, వాటిని అధ్యయనం చేసి, ఆ చిక్కులను తప్పుకుని ముందుకు వెళ్లాలన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో తాను పోటీ చేయాలని వైఎస్ జగన్ ఇక్కడకు పంపారని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, టాస్క్‌ఫోర్స్ సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో, డివిజన్‌లో, వార్డులో పదవి పొందే ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యుడేనన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఉగాది పండుగ లోపల పార్టీ సంస్థాగతంగా నిర్మించుకుని, ఐడీ కార్డులు ఇవ్వాలన్నదే వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. మరో 700 రోజులు దాటితే వచ్చేది వైఎస్ జగన్ ప్రభుత్వమేనని, తాను ఎక్కడికి వెళ్లినా, పార్టీ నేతలు, కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. బాధ్యతతో పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందని స్పష్టం చేశారు. కమిటీల్లో మహిళలకు పెద్దపీట వేయటంతో పాటు, యువత ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కచ్చితంగా అనుకున్న సమయానికి కమిటీ నిర్మాణం పూర్తి అయ్యేలా పాటుపడదామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ నేతలు మామిడి రాము, వంగల వలివీరారెడ్డి, ఈమని రాఘవరెడ్డి, పఠాన్ సైదాఖాన్, యేటి కోటేశ్వరరావుయాదవ్, చదలవాడ వేణు, చింతపల్లి వెంకటరమణ, దేవా, సింగు నరసింహారావు, పల్లపు మహేష్, దేవరశెట్టి చిన్ని, వేలూరి అనిల్‌రెడ్డి, కీసరి సుబ్బులు, కీసరి సుబ్బారెడ్డి, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, సూరగాని వెంకటరెడ్డి, కొత్తా చిన్నపరెడ్డి, ఆలా కిరణ్, షరీఫుద్దీన్, షేక్ హుస్సేన్‌వలి, ప్రభు, కొరిటిపాటి ప్రేమ్, కార్పొరేటర్‌లు ఆచారి, రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నగర, జిల్లా, రాష్ట్ర కమిటీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

రాహు కేతు పూజలకు పోటెత్తిన భక్తులు

పెదకాకాని: శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో రాహుకేతు పూజలు జరిపించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం మౌని అమావాస్య పురస్కరించుకుని పెదకాకాని శివాలయంలో రాహు కేతు పూజలు భక్తులు అధిక సంఖ్యలో జరిపించుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి సాయంత్రం రాహుకాలం 4:30 గంటల వరకూ 1276 టికెట్లు విక్రయించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. రాహు కేతు పూజల ద్వారా ఆదివారం రూ.6,38,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆదివారం ఆలయంలో అంత్రాలయ అభిషేకాలు, అంత్రాలయ దర్శనాలు, వాహనపూజలు, అన్నప్రాసనలు, నవగ్రహ పూజలు అధికసంఖ్యలో జరిగాయి. భక్తులందరికీ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గండాలయ స్వామికి ప్రత్యేక పూజలు

స్వామి వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మంగళగిరి టౌన్: మంగళగిరి కొండపై ఉన్న శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి కొండపైన ఉన్న గండాలయ స్వామి వారికి అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నూనె సమర్పించి దీపాలు వెలగించారు. గండాలు రాకుండా స్వామి వారి రక్షణ కోరారు. తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు కొండ మెట్ల మార్గంలోను, ఎయిమ్స్ ప్రధాన ద్వారం వద్ద ఉన్న కొండ ఘాట్‌రోడ్ మార్గం ద్వారా స్వామిని చేరుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సునీల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తులకు అన్నదానం

భక్తులకు అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మంగళగిరి పట్టణంలోని శివాలయం వద్ద అమావాస్యను పురస్కరించుకుని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. పలువురు ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ కార్యక్రమం విరామం లేకుండా కొనసాగుతోందని, గత మూడు సంవత్సరాలుగా ప్రతి అమావాస్య రోజున అన్నదానం చేస్తున్నామని చెప్పారు. సుమారు 4 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. 40 మంది దాతల సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ సాంబశివరావు, సభ్యులు శివసత్యనారాయణ, ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాలో విజిబుల్ పోలీసింగ్

నగరంపాలెం: జిల్లాలోని ప్రజల భద్రత, భరోసా కోసం క్షేత్రస్థాయిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆసుపత్రులు, బ్యాంక్‌లు, ఇతరత్రా ప్రాంతాల్లో పోలీస్ అధికార, సిబ్బంది ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారని అన్నారు. తద్వారా ప్రజా స్వేచ్ఛ, శాంతి భద్రతలను పరిరక్షిస్తారని పేర్కొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్..

జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగించారు. ఇకనైనా రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో మెలగాలని, చెడు అలవాట్లకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐలు, ఎస్ఐలు సూచించారు.

'క్లాస్ -4 ఎంప్లాయీస్' రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లేశ్వరరావు

గుంటూరు వెస్ట్: ఏపీ గవర్నమెంటు క్లాస్–4 ఎంప్లాయీస్ సెంట్రల్ అసోసియేషన్ (ఏపీ జేఏసీ అమరావతి అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులుగా ఎస్.మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా టి.చెన్నప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానికంగా ఒక ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో కోశాధికారిగా ఎస్.వి. కృష్టారావు, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఇ.సుబ్రమణ్యంతోపాటు రాష్ట్ర కార్యదర్శులుగా ఇద్దరు, ప్రచారకార్యదర్శి ఒకరు, కార్యనిర్వహణ కార్యదర్శి ఒకరుతోపాటు ఉపాధ్యక్షులు నలుగురు, సభ్యులతో మొత్తం రాష్ట్రకార్యవర్గం 13 సభ్యులతో ఎన్నుకున్నామన్నారు. ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారని పేర్కొన్నారు.

నేటి పీజీఆర్ఎస్‌ను ఉపయోగించుకోవాలి

బాపట్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలపై ఉదయం తొమ్మిది నుంచి 10 గంటల వరకు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తామని, జిల్లా కలెక్టరేట్‌తోపాటుగా ప్రతి రెవెన్యూ డివిజన్, మండల తహసీల్దార్లు కార్యాలయాలలోను తహసీల్దార్లు, ఎంపీడీఓలు ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు. అర్జీదారులు అందజేసిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నడి వయస్సులోనూ తగ్గేదేలే!

వేటపాలెం: వయసుతో సంబంధమేంటి స్ఫూర్తి ఉండాలి కానీ. ఇలాగే 45 సంవత్సరాల వయస్సు పైబడినా తగ్గేదేలే అని వేటపాలేనికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు గాత్రం ఉమామామశ్వరరావు నిరూపించుకొంటున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీ స్థాయి అథ్లెటిక్స్‌లో తన చత్తా చాటుతున్నారు. ఎటువంటి శిక్షణ తీసుకోకుండానే తానే స్వయంగా పట్టుదల క్రమశిక్షణతో సాధన చేసుకుంటూ అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం ఉమామహేశ్వరరావు వయస్సు 49 ఏళ్ల అయినప్పటికీ తగ్గేదేలు అంటున్నారు. ప్రస్తుతం ఆల్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 45 ప్లస్‌లో సత్తా చాటి అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. రెండేళ్ల కిందట నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి 41వ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో 45 సంవత్సరాల ప్లస్ ఏజ్‌లో జరిగిన 5 కిలోమీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం సాధించారు. ట్రిపుల్ జంప్‌లోనూ ద్వితీయ స్థానం సాదించారు. 800 మీట ర్లు పరుగుపందెంలో తృతీయ స్థాయినం సాధించి మూడు మెడల్స్ దక్కించుకున్నారు. 2023లో జాతీయ స్థాయి లో చెన్నైలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఆరో స్థానం సాధించారు. 2023 సంవత్సరంలో మార్చిలో అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్నారు.

భర్తతో పాటు భార్య కూడా..

ఉమామహేశ్వరరావు భార్య వెంకటలక్ష్మి ఒంగోలులోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్నారు. తన భర్తతో పాటు తాను మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో తన సత్తా చాటుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణిస్తున్నారు. 6,7 తేదీలో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 4–100 రిలేలో ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, షాట్ పుట్‌లో తృతీయ స్థానం దక్కించుకున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మతోన్మాద విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలి

ఫిబ్రవరి 12న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి

లక్ష్మీపురం: కేంద్రంలో బీజేపీ నాయకత్వంతో అధికారంలో వున్న ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక మతోన్మాద విధానాలకు నిరసనగా ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాతగుంటూరులోని ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాద చర్యలను రెచ్చగొడుతుందన్నారు. కార్మిక వర్గం దీర్ఘకాలంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కృషి చేస్తుందన్నారు. ఓటర్ల ప్రత్యేక సవరణ పేరుతో బీజేపీకి వ్యతిరేకంగా వున్న ఓట్లను తొలిగిస్తుందన్నారు. ఇది అప్రజాస్వామిక చర్యలన్నారు. జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించిన గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్ర బోస్ వంటి వారి చరిత్రలను మరుగున పర్చే ప్రయత్నం చేస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని, నల్లమడ ఆధునికీకరణ కోసం నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, వివిధ రకాల పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు గుంటూరులో జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని, దీనికోసం విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, ఎం.రవి, బూరుగు వెంకటేశ్వర్లు, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు ఎల్.అరుణ, కె.అజయ్‌కుమార్, దుర్గారావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసీ మెకానిక్ హత్యకేసులో ఐదుగురు అరెస్ట్

సహజీవనం చేస్తున్న మహిళ మాజీ ప్రియుడితో కలిసి అంతమొందించిన వైనం

వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాంబశివరావు,, వెనుక ముసుగులో నిందితులు

తెనాలిరూరల్: పట్టణంలో ఇటీవల జరిగిన ఏసీ మెకానిక్ హత్య కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వివరాలను త్రీ టౌన్ సీఐ ఎస్.సాంబశివరావు ఆదివారం రాత్రి వెల్లడించారు. పట్టణ నందులపేటకు చెందిన షేక్ ఫయాజ్ అహ్మద్‌కు 2016లో వ్యభిచార వృత్తిలో ఉన్న పల్లప్రోలు హిమబిందు అలియాస్ మాధవి పరిచయమైంది. అప్పటి నుంచి ఆమె వద్దకు వెళుతూ ఆమె వ్యభిచార వృత్తికి సహకరించేవాడు. హిమబిందుకు గుంటూరుకు చెందిన జొన్నకూటి క్రాంతికిరణ్‌తో 2016కు ముందే పరిచయముంది. ఇద్దరూ కలసి వ్యభిచార వృత్తి నిర్వహిస్తూ ఉండేవారు. ఫయాజ్‌తో పరిచయమయ్యాక హిమబిందు వ్యభిచారం చేస్తూ పట్టుబడి జైలుకు వెళ్లింది. తనకు బెయిలు ఇప్పించకపోవడం, తన వద్దే డబ్బులు తీసుకుంటుండడంతో హిమబిందు తిరిగి తనకు గతంలోనే పరిచయమున్న క్రాంతికిరణ్‌తో ఫోన్‌లో మాట్లాడడం చేస్తోంది. ఇది గమనించిన ఫయాజ్ ఆమెను హెచ్చరించాడు. ఫయాజ్‌ను అడ్డు తొలగించుకుని తాము ఇద్దరం కలసి వ్యభిచార వృత్తిని కొనసాగించుకోవచ్చని హిమబిందు, క్రాంతికిరణ్ నిర్ణయానికి వచ్చారు. ఈ నేపధ్యంలో ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఫయాజ్ హిమబిందు ఇంటికి వస్తున్నానని ఫోన్ చేసి వెళ్లాడు. ఇదే విషయాన్ని హిమబిందు క్రాంతికిరణ్‌కు చేరవేసింది. రాత్రి వరకు ఫయాజ్ అక్కడే ఉంటాడని తెలిసిన క్రాంతికిరణ్, మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన షేక్ నాగూర్‌వలి అలియాస్ చోటు, కమాదుల జయంత్, ఉప్పు రంగారావులతో ఫయాజ్‌ను హత్యచేస్తే రూ. 10 వేలు ఇస్తానని ఒప్పించి తన వెంట తీసుకెళ్లాడు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ఫయాజ్ ఇంటి నుంచి బయలుదేరగా అదే విషయాన్ని హిమబిందు క్రాంతికిరణ్‌కు చేరవేసింది. ఇంటి సమీపంలోనే మాటు వేసి ఉన్న నిందితులు ఫయాజ్‌పై కర్రలు, సిమెంటు రాయితో దాడి చేసి హతమార్చారు. న్యాయవాది ద్వారా లొంగిపోదామని నిందితులు వస్తున్న సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఐదుగురు నిందితులకు 15 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐలు ప్రకాశరావు, కరిముల్లా ఉన్నారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

కొరిటెపాడు: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (2026–27) వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈనెల 20, 22, 23, 27 వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా గుంటూరు సర్కిల్‌లోని పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయం (సంగడిగుంట) విద్యుత్ భవన్, నల్లచెరువు విద్యుత్ ఈఈ కార్యాలయంలో, తెనాలి ఈఈ కార్యాలయం చెంచుపేట ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేసినట్టు పర్యవేక్షక ఇంజినీర్ రమేష్, ఈఈ పఠాన్ హుస్సేన్‌ఖాన్, సత్యనారాయణ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20న ఏపీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం తిరుపతిలో, 22, 23 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో, 27న ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయంలో, కర్నూలులో వ్యక్తిగతంగా ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగన్నర వరకు వీసీ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని తెలిపారు. ఆయా రోజుల్లో గుంటూరు సర్కిల్‌లోని పర్యవేక్షిక ఇంజనీర్ కార్యాలయం, సంగడిగుంట విద్యుత్ భవన్ నల్లచెరువు విద్యుత్ ఈఈ కార్యాలయంలో, తెనాలి ఈఈ కార్యాలయం చెంచుపేటలో రెండు గంటల నుంచి 4.30 గంటల వరకు జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు అభిప్రాయాలను తెలియజేయవచ్చునని తెలిపారు.

సంకురాత్రిపాడులో డీఎస్పీ విచారణ

నాదెండ్ల: సంకురాత్రిపాడులో దళిత మహిళల పట్ల నాదెండ్ల ఎస్సై వెంకటేశ్వరరావు దురుసుగా వ్యవహరించి కొట్టాడంటూ ఆరోపిస్తూ కొద్దిరోజులుగా దళిత సంఘాలు ఆందోళన చేస్తున్న విషయం విదితమే. ఈ విషయమై నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు ఆదివారం సంకురాత్రిపాడు గ్రామంలో విచారించారు. గ్రామానికి చెంది పలువురు రైతులు జరిగిన సంఘటనపై వివరించారు. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన ఐదుగురు మహిళలు నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో ఇటీవల పత్తి దొంగిలించారంటూ రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పొలంలో పత్తి తీస్తున్న సమయంలో రైతులు గమనించి ఐదుగురు మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద క్వింటాన్నర బరువైన ఐదు పత్తి గోతాలు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో మహిళల పట్ల ఎస్సై దురుసుగా వ్యవహరించి కొట్టాడన్న ఆరోపణలు అవాస్తవమని నిర్ధారించారు.

మంగళగిరిలో పవర్ లిఫ్టింగ్ సెలక్షన్ పోటీలు

ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి పట్టణంలోని ఫిట్‌జోన్ జిమ్‌లో సీనియర్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ పవర్‌లిఫ్టింగ్ టీమ్ సెలక్షన్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి యస్‌కె. సంధాని తెలియజేశారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, ఈ సెలక్షన్ పోటీల్లో గెలుపొందిన వారు ఫిబ్రవరి 14,15 తేదీల్లో రాజమండ్రిలో జరిగే 13వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సెలక్షన్ పోటీల్లో మెన్ టీం నుంచి ప్రదీప్‌కుమార్, జస్వంత్, రాజు, దినేష్, మొహిద్దీన్, కౌషిక్, పృధ్వికుమార్‌లు, ఉమెన్ టీం నుంచి చంద్రిక, హర్షిత, చాతర్యలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వంశీకృష్ణ, సభ్యులు పవన్‌కుమార్, సందీప్ తదితరులు అభినందించారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

రాజేష్‌కుమార్ (ఫైల్)

రాజేష్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న గుంటూరు రైల్వే పోలీసులు

మంగళగిరి టౌన్: మనస్తాపానికి గురై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళగిరిలో ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. మంగళగిరి పట్టణం ఇందిరా నగర్‌కు చెందిన కోలా రాజేష్ కుమార్ (22) ఇంట్లో తన తండ్రితో గొడవపడి వచ్చిన రాజేష్‌కుమార్ నాలుగు రోజుల నుంచి బాబాయ్ దగ్గర ఉంటున్నాడు. ఆదివారం తిరిగి ఇంటికి వెళ్లిన క్రమంలో మరల తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది నిడమర్రు రైల్వేగేటు సమీపంలో ట్రాక్ వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుంటూరు రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుంటూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు చిన్నారుల ఎంపిక

- నేటి నుంచి 23 వరకు జైపూర్‌లో జరిగే పోటీలకు పయనమైన రంజయ్ లోచన్, నిక్షిప్త విజయ్
- చిన్నారులను అభినందించిన ఏఆర్ డీఎస్పీ విజయ సారధి, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు డాక్టర్ అమృతపాణి

జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైన చిన్నారులు

చీరాల రూరల్/వేటపాలెం: జాతీయ స్థాయిలో నిర్వహించే తైక్వాండో పోటీలకు చీరాలకు చెందిన మల్లెల రంజయ్ లోచన్, మల్లెల నిక్షిప్త విజయ్‌లు ఎంపికయ్యారు. గతేడాది డిసెంబర్ 28న గుంటూరు జిల్లా తెనాలిలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన రెండో ఏపీ స్టేట్ కిడ్స్, ఫెడరేషన్ కప్‌లో చీరాలకు చెందిన చిన్నారి క్రీడాకారులు మల్లెల రంజయ్ లోచన్, మల్లెల నిక్షిప్త విజయ్‌లు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరచారు. దీంతో సెలక్టర్లు వీరిరువురిని ఈ ఏడాది జనవరి 18 నుంచి 23 వరకు జైపూర్‌లో జరిగే ఇండియన్ తైక్వాండో మూడో కిడ్స్ చాంపియన్ షిప్–2026 జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జైపూర్‌కు పయనమైన వీరిని ఆదివారం ఏర్ డీఎస్పీ విజయ సారధి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యుడు డాక్టర్ వరికూటి అమృతపాణిలు అభినందించారు. భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి దేశానికి పాతినిథ్యం వహించాలని వారు ఆకాంక్షించారు. క్రీడాకారులు జైపూర్ వెళ్లేందుకు డాక్టర్ అమృతపాణి కొంత ఆర్థిక సాయం అందించారు. కొత్తపేట బీఆర్‌కే హైస్కూల్‌లో 2,4 తరగతులు చదువుతున్న మల్లెల నిక్షిప్త విజయ్, మల్లెల రంజయ్ లోచన్ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో ప్రతిభ కనబర్చి విజేతలగా నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారని స్కూలు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి ఆదివారం తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో సెమీస్‌కు చేరిన ఆరు జట్లు

కేఎల్‌యూలో జరుగుతున్న బ్యాడ్మింటన్ టోర్నమెంట్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో జరుగుతున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్ 2026 ఆదివారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సౌత్ జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ మొదటి, రెండవ రోజులు మొత్తం 16 జట్లు పోటీపడ్డాయని, ఆదివారానికి 8 జట్లు గెలుపొందాయని తెలిపారు. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్న వాటిలో కేరళకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, ఆర్ఎన్‌టీయూ భోపాల్ జట్లతో పాటు మరో ఆరుజట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం సెమీ ఫైనల్స్ అనంతరం మంగళవారం ఫైనల్ పోటీలు జరుగనున్నాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వేమూరు సీఐకి గాయాలు

పెరవలిపాలెంలో ప్రమాదానికి గురైన వేమూరు సీఐ కారు

కొల్లూరు: బందోబస్తు కోసం వెళుతున్న వేమూరు సీఐ కారు ప్రమాదానికి గురైన సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం మేరకు.. వేమూరు సీఐగా విధులు నిర్వర్తిస్తున్న పసుపులేటి వీరాంజనేయులు కొల్లూరులో నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి చుండూరు మండలంలో వైఎస్సార్ సీపీ వర్గీయుల గృహాలపై ఆ మండల టీడీపీ నాయకులు విచక్షణా రహితంగా దాడులకు పాల్పడి అలజడి సృష్టించారు. దాడుల సమాచారం అందుకున్న పోలీసు ఉన్నతాధికారులు అదనపు బందోబస్తు నిమిత్తం వేమూరు సీఐని సంఘటనా ప్రాంతానికి వెళ్లాలని ఆదేశించారు. అర్ధరాత్రి సమయంలో సీఐ కారును స్వయంగా నడుపుకుంటూ బందోబస్తుకు పయనమయ్యారు. వేమూరు మండలం పెరవలిపాలెం గ్రామంలోని మలుపు వద్ద పొగమంచు కారణంగా రహదారి కనిపించకపోవడంతో రోడ్డు వెంబడి భవనం గోడను బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో కారు ధ్వంసమవడంతోపాటు, సీఐ వీరాంజనేయులు గాయాలబారిన పడి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన కారును గమనించిన స్థానికులు కొద్ది సమయానికి అదే మార్గంలో చుండూరు మండలం వెళుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు వాహనాన్ని ఆపి కారు ప్రమాదానికి గురై ఓ వ్యక్తి గాయాలకు గురయ్యాడని తెలియజేశారు. డీఎస్పీ తన సిబ్బందితో కలసి ప్రమాద స్థలంలో కారును పరిశీలించగా వేమూరు సీఐగా గుర్తించారు. వెంటనే అపస్మారక స్థితిలో ఉన్న సీఐను గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఆయనను పరీక్షించిన వైద్యులు ఎటువంటి ప్రమాదం లేదని వెల్లడించినట్లు సమాచారం.

సరస్ మేళా ద్వారా రూ.25 కోట్ల ఆదాయం

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- 13 రోజుల్లో 25లక్షల మంది సందర్శించారు
- ముగింపు సభలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు రూరల్: గుంటూరు నగరంలో 13 రోజుల పాటు జరిగిన సరస్ మేళా–2026 అఖిల భారత డ్వాక్రా బజార్ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ మొత్తం 343 స్టాల్స్ ఈ మేళాలో ఏర్పాటవ్వగా 25 లక్షల మంది ప్రజలు మేళాను సందర్శించారన్నారు. ఈ మేళా ద్వారా మొత్తం రూ.25 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. సరస్ మేళా టెస్ట్ మ్యాచ్ తరహాలో అద్భుతంగా జరగడం శుభపరిణామని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో ఇతర అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్‌భూములు ఇతర అవసరాలకు మళ్లించడానికి వీల్లేదు

ఏపీ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ కలీం

క్రీడాకారిణి షేక్ షబీనాకు ఆర్థికసాయం

తెనాలి: వక్ఫ్ భూములు ముస్లిం సమాజానికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించటానికి వీల్లేదని ఏపీ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ కలీం స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, గుంటూరు పార్లమెంటు కమిటీ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మారీసుపేటలోని కాంగ్రెస్‌పార్టీ సమావేశ మందిరంలో జరిగింది. ఫ్రంట్ పార్లమెంట్ కన్వీనర్ షేక్ ఖలీల్ అధ్యక్షత వహించారు. గుంటూరు ఈస్ట్, వెస్ట్, తాడికొండ, ప్రత్తిపాడు, పొన్నూరు, మంగళగిరి, తెనాలి నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు. వక్ఫ్ భూములను ఇతర అవసరాలకు వినియోగించరాదనీ, బలవంతంగా స్వాధీనం చేసుకోరాదని తీర్మానం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం ముస్లిం అమ్మాయిల పెళ్లికి రూ.లక్ష, రంజాన్ పండుగకు తోఫా, మైనారిటీ రుణాలు వెంటనే అమలుచేయాలని కోరుతూ తీర్మానం చేశారు. 45 వేల ముస్లిం జనాభా ఉన్న తెనాలిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు చేయాలని, రానున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ముస్లింలకు అధిక సీట్లను కేటాయించాలని కోరుతూ తీర్మానం చేశారు. బంగ్లాదేశ్‌లోని మైనారిటీ మతస్తుల హక్కులను కాపాడాలని తీర్మానించారు. సమావేశంలో అంతర్జాతీయ పవర్‌లిఫ్టర్ షేక్ షబీనాకు ఆర్థికసాయం అందజేశారు. ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ కలీంతోపాటు గౌస్ బాషా, ఆదంసాహెబ్, కరిముల్లా, మెమన్‌బాషా, మాజీ ఎంపీటీసీ కరిముల్లాఖాన్, బాబా రహీమ్‌ఖాన్, కరిముల్లాఖాన్, జమయతుల్ ఉల్మా, షబ్బీర్‌బాషా, ఖాజి అబ్దుల్ రవూఫ్, నాగూర్, మస్తాన్ షరీఫ్, షంషుద్దీన్, దావూద్, జానిబాషా, షేక్ సలాం పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొలిపేవి నాటికలే..

నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి, విశ్రాంత డీజీపీ మాలకొండయ్య

అనంతవరంలో ముగిసిన నాటిక పోటీలు

యద్దనపూడి: నాటికల్లోని పాత్రల్లో ప్రేక్షకులు తామను తాము చూసుకోవటం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ప్రదర్శిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీల్లో భాగంగా చివరిరోజు ప్రదర్శించిన నాటిక పోటీలు ఆద్యంతం ప్రేక్షకులను రంజింపచేశాయి. తొలుత మంత్రి జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్రాంత డీజీపీ ఎం. మాలకొండయ్య మాట్లాడుతూ భాషా ఉన్నతికి చిరునామాగా, సామాజిక హితాన్ని కాంక్షిస్తూ ప్రజలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని వాస్తవ పరిస్థితులను తెలిపే నాటికలకు పూర్వవైభవం రావాలని ఆకాంక్షించారు. కళాపరిషత్‌ల ద్వారా నాటికల పోటీలు నిర్వహించి కళాకారులను అభినందిస్తూ గౌరవించటం అభినందనీయమని కొనియాడారు. ముఖ్యంగా స్త్రీల ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసేలా మంచి నాటకాలు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, తారక రామారావు, కొరిటాల వంశీకృష్ణ, ఈశ్వరప్రసాద్, పోపూరి హనుమంతరావు, సాంబశివరావు, రావి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటిక పోటీలు..

న్యూస్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి అఖండపర్వం, యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి ధర్మో రక్షతి, శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారి నాలుగుకాళ్ల మండపం నాటికలు ప్రేక్షకులను అలరించాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

■ సంక్రాంతి స్పెషల్ డిస్కౌంట్‌తో నల్లపాడు రోడ్ సాయిభార్గవి కన్‌స్ట్రక్షన్ మధు ఎన్క్లేవ్ 2BHK ఫ్లాట్స్ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఫ్లాట్లు అమ్మకానికి కలవు. 9849851331, 7989958789

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక దరకి తీసుకుంటాం. ✆ 83338 33368

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక దరకు కొనబడును. ✆ 87907 41166

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు గుంటూరు నవభారత్ నగర్ పలకలూరు పేరేచర్ల లలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను మంచి జీతం. 73867 43664

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు విశ్రాంతి ఉద్యోగులు, హౌస్‌వైఫ్స్ 10th పాస్ 50 సం॥పై వయస్సువారు కావలెను. 70367 61665

■ ఆఫీసు అసిస్టెంట్ కావలెను. బికాం, 3 సం॥లు కంప్యూటర్ అకౌంట్స్ పై అనుభవం, తెలుగు, ఇంగ్లీష్ భాషల పై పరిజ్ఞానం, రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ సిరి స్వీట్స్ షాపు నందు ఆటో కం కారు నడుపుటకు డ్రైవర్ కావలెను. జీతం: 15 – 20వేలు భోజన వసతి కలదు. మా బ్రాంచ్ బృందావన్ గార్డెన్స్, సంప్ర: 8374815999

■ Wanted experienced Telicallers / Computer Operators(F) Education Consultancy, Lakshmipuram, Sal: 15k to 20k, Qul: Degree, Contact: 9052975353

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18–28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ తుమ్మల పాలెం ప్రముఖ కంపెనీలోకి మేల్ సెక్యూరిటీ గార్డ్స్&ASO కావలెను .మంచి జీతం PF/ESI Q:10th, ఇంటర్ 26 రో 8గం॥ వ.48లోపు 6300521289

■ సత్య ఎంటర్‌ప్రైజెస్‌లో టెలికాలర్ & డేటా ఆపరేటర్‌గా పనిచేయుటకు యువతి/యువకులు కావలెను. అర్హత 10th పైన వర్క్ ఫ్రం హోమ్ కలదు. సంప్ర: 9573841953.

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు

7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

కార్మెల్‌మాతకు విశ్వాసుల ప్రార్థనలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్‌కొండపై గల కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలు ప్రాంతాల విశ్వాసులు ఆదివారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయాన్నే బాల ఏసుదేవాలయంలో నిర్వహించిన దివ్యపూజాబలిలో పాల్గొని కొండను ఎక్కారు. తలనీలాలు సమర్పించి కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టారు. దిగువ భాగాన ఉన్న కార్మెల్ మాతను కొండ ఎక్కలేని వృద్ధులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అమర్చి.. పరిశీలించడం మరచి

తాడేపల్లి రూరల్: ప్రజల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన పబ్లిక్ కొళాయిని యుద్ధప్రాతిపదికన కార్పొరేషన్ సిబ్బంది అమర్చారు. కానీ దాని పని విధానాన్ని పరిశీలించకపోవడంతో ఆదివారం కొత్తగా ఏర్పాటు చేసిన కొళాయి నుంచి రెండు గంటల పాటు తాగునీరు వృథాగా పోయింది. తాడేపల్లి కొత్తూరుకు వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జి వద్ద కార్పొరేషన్ అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఆ మొక్కలకు, స్థానికంగా ఉండేవారి అవసరాల నిమిత్తం కొళాయిని ఏర్పాటు చేశారు. కొళాయి ఏర్పాటు చేసిన దగ్గర నుంచి భారీగా తాగునీరు వృథాగా పోతున్నా సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడలేదు. కార్పొరేషన్‌లో కిందస్థాయి సిబ్బంది పలుచోట్ల ఇదే విధంగా ప్రవర్తిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం కాజా గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులైన స్థానికులు బూనం దేవిక, మర్రి గంగరాజుల నివాసాలకు వెళ్లి నాయకులు చెక్కులను అందజేశారు. మొత్తం రూ.72,105 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు నాయకులు పేర్కొన్నారు.

కర్మకాండలకు భవనం అప్పగింత

దుగ్గిరాల: కర్మకాండల కోసం నిర్మించిన భవనాన్ని పీ4 కమిటీ సభ్యులు జంపాల సుబ్బారావు జంపాల కల్యాణ మండపం కమిటీకి ఆదివారం అప్పగించారు. దుగ్గిరాల మండల కేంద్రంలోని గ్రంథాలయ పక్కన గల ఖాళీ స్థలంలో సుబ్బారావు సొంత నిధులతో కర్మకాండల భవనాన్ని నిర్మించారు. అందరూ ఉపయోగించుకునే విధంగా గదులు, మరుగుదొడ్లు, నీటి వసతి కోసం ట్యాంకులు వంటి సౌకర్యాలతో అధునాతనంగా నిర్మించిన భవనాన్ని సుబ్బారావు కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారావుని పలువురు అభినందించారు.

మంచినీటి పథకం లీకేజీని అరికట్టాలి

తెనాలిటౌన్: మంచినీటి పథకం లీకేజిలను అరికట్టటంలో మున్సిపాలిటీ నిర్లక్ష్యం తగదని, అరకొర చర్యల వల్ల ప్రమాదాలు జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని లోక్‌సత్తా రాష్ట్ర కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు జి.శరత్ చంద్ర ఆరోపించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం రోడ్డులో రెడ్‌క్రాస్ భవనం ఎదుట మంచినీటి పథకం పైపులైను లీకేజీ వద్ద ఆదివారం సాయంత్రం లోక్‌సత్తా రాష్ట్ర కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు జి.శరత్ చంద్ర మీడియాతో మాట్లాడారు. లీకేజీని అరికట్టేందుకు మున్సిపాలిటీ చేసిన ప్రయత్నం విఫలమైందన్నారు. మళ్లీ లీకేజీ అవుతూ అక్కడ నీరు నిలుస్తోందని, బురదలో పందులు దొర్లుతున్నాయని చెప్పారు.

ఫలితంగా రోడ్డు పాడైందన్నారు. శాశ్వతంగా లీకేజీని అరికట్టి, రోడ్డు బాగు చేయాలని కోరారు. వాహనదారులకు ఏదైనా ప్రమాదం జరిగితే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాంతంలో వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా ప్రతి సోమవారం తెనాలి డివిజన్ పరిధిలోని ప్రజలు సబ్ కలెక్టర్ కార్యాలయానికి గ్రీవెన్స్ నిమిత్తం వస్తుంటారని గుర్తు చేశారు. ప్రధాన కోర్టులు ఈ రోడ్డులోనే ఉన్నందున ట్రాఫిక్ రద్దీగా ఉంటుందని చెప్పారు. తక్షణం అధికారులు స్పందించి మంచి నీటి పథకం లీకేజ్ అరికట్టాలని, పాడైన రోడ్డును నిర్మాణం చేయాలని కోరారు.

రహదారులకు మరమ్మతులు కరువు!

- వర్షాకాలంలో గుంతలు, నేడు దుమ్ము ధూళితో అవస్థలు
- రాజధాని రోడ్లకు 6 నెలలుగా ఇదే దుస్థితి
- పట్టించుకోని అధికారులు

గుంతల్లో ఫ్లైయాష్ డస్ట్‌పోసి వదిలేయడంతో రహదారిలో లేస్తున్న దుమ్ము

తాడికొండ: అమరావతి రాజధానికి వెళ్లే ప్రధాన రహదారి అవస్థలమయంగా మారింది. గత 6 నెలలుగా ఇదే దుస్థితి నెలకొని ఉన్నా పట్టించుకొనే నాథుడు కరువవడంతో ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని పలువురు వాపోతున్నారు. గుంటూరు జిల్లా కేంద్రం నుంచి రాజధానిలోని ఏపీ సచివాలయం, హైకోర్టు, ప్రతిష్టాత్మక విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలతో పాటు సీఆర్డీఏ పలు విభాగాలకు రాష్ట్రం నలుమూలల నుంచి రాజధానికి రోజూ వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఇటీవల కాలంలో ఈ వాహనాల తాకిడి బాగా పెరిగినప్పటికీ కనీస మరమ్మతులు లేకపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీస మరమ్మతులు చేయాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.

రహదారులు దుమ్మమయం..

వర్షాకాలంలో భారీగా గుంతలు పడడంతో లారీలు సైతం ఇరుక్కుపోయి బోల్తా కొట్టిన సంఘటనలు కోకొల్లలు. ఇప్పుడు వర్షాలు తగ్గి నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కొన్ని చోట్ల గుంతల్లో ఫ్లైయాష్ డస్ట్ వేసి వదిలేయడంతో దుమ్ములేచి వాహనదారులపై పడటంతో పాటు పక్కనే ఉన్న పంట పొలాల్లో దుమ్ము పేరుకుపోతోంది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఏర్పడిన మరికొన్ని పెద్ద గుంతలలో ప్రయాణం చేయాలంటే నరకప్రాయమే అనిపించేలా రాజధాని రహదారి తయారయ్యాయని ప్రయాణికులు వాపోతున్నారు.

లారీ చక్రాల బేస్ విరగడంతో రోడ్డుపై మరమ్మతులు

పంటపొలాలపై పేరుకుపోయిన దుమ్ము

ప్రజా ప్రతినిధులు స్పందించాలి..

ఈ రోడ్డు వ్యవహారంపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రస్తావించినా కనీస మార్పు లేకపోవడం సర్కారు పాలన, అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కనీస మరమ్మతులైనా చేయాలని కోరుతున్నారు.

కార్మికుల సమస్యపై ప్రభుత్వం స్పందించాలి

తాడేపల్లి రూరల్: పాలకవర్గ పార్టీల అవకాశవాద ధోరణి కారణంగానే ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారం కావడంలేదని యూనియన్ నాయకులు కె.స్టీవెన్ అన్నారు. ఆదివారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ.. న్యాయంగా తమకు రావాల్సిన బకాయిల కోసం కార్మికులు 411 రోజులుగా దీక్షలు చేస్తున్నారని అన్నారు. నష్టపరిహారం చెల్లించకుండా 170 మంది కార్మికుల మృతికి కారణమైన యాజమాన్యం చర్యలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఇచ్చిన వాగ్దానం మేరకు కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సుభాని, సూర్యప్రకాష్, సాంబశివరావు, బాషా, నవనీతమ్మ, రిబ్కా తదితరులు పాల్గొన్నారు. దీక్షలో ఆదినారాయణ, సుబ్బారావు, గురవయ్య, హగ్గయ్య తదితరులు కూర్చున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు ధీటుగా పుష్కర ఘాట్

మందుబాబుల మధ్య ఇబ్బందిగా పుణ్యస్నానాలు

ఆదివారం ఉదయం ఘాట్ వద్ద మందుబాబులు ఉంచిన మద్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం పుణ్యక్షేత్రాల వద్ద ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్లు బార్ అండ్ రెస్టారెంట్‌లకు ధీటుగా మారాయి. పుష్కర ఘాట్‌ల ఒడ్డున రెండు బెల్టుషాపులు ఉండడంతో 24 గంటలు మద్యం లభిస్తోంది. రోజువారీ పనుల కోసం వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చే కార్మికులు రేయింబవళ్లు ఈ పుష్కర ఘాట్ల వద్ద సేద తీరుతూ ఉంటారు. మద్యం అక్కడే లభిస్తుండడంతో పనిచేసుకుని వచ్చి ఇక్కడే మద్యం తాగుతూ మాంసాహారాలను తిని అక్కడే పడవేస్తున్నారు. కొందరు గాజు సీసాల్లో మద్యం కొనుగోలు చేసి వాటిని ప్రమాదకరంగా అక్కడే విసిరేస్తున్నారు. పగిలిన గాజు సీసాల వల్ల తెల్లవారుజామున, రాత్రి సమయాల్లో కృష్ణానదిలో పుణ్యస్నానాలకు వెళ్లే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పోలీసులు ఎన్నోసార్లు తనిఖీలు చేసినా పరిస్థితి షరా మామూలే. స్థానికంగా 24 గంటలు మద్యం అమ్ముతున్నారని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎక్సైజ్ అధికారులు నామమాత్రంగా దాడులు చేస్తున్నారు కానీ బెల్ట్ షాపుని నివారించడానికి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగిరెడ్డి
- నేటి నుంచి 31 వరకు గ్రామాల్లో పశు ఉచిత వైద్య శిబిరాలు

వైద్యశాలలో కుక్కకు శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ నాగిరెడ్డి

తెనాలిటౌన్: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగిరెడ్డి తెలిపారు. పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని పశు వైద్యశాలలో ఆదివారం పశువులను పరీక్షించి అవసరమైన వైద్యసేవలు అందించడంతో పాటు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నాలుగు విలేజ్ డిస్పెన్సరీల పరిధిలో ఉన్నటువంటి 18 గ్రామాల్లో నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం పశువైద్యులు, సిబ్బంది సేవలందిస్తారని చెప్పారు. ఉదయం 9 గంటల నుండి వైద్య శిబిరం సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆవులు, గెదేలు, కుక్కలు, కోళ్లు, ఇతర జతువులకు ఈ వైద్య శిబిరంలో అవసరమైన వైద్యం అందించడంతో పాటు మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ముఖ్యంగా నట్టల నివారణ (డీ వార్మింగ్) మందును గెదేలు, ఆవులు, దూడలు, ఇతర జీవాలకు వేయనున్నట్లు చెప్పారు. ఆవులు, గెదేలు, దూడలకు ఆరు నెలలకు ఒక సారి నట్టల నివారణ మందు ఇవ్వాలని, గొర్రెలు, మేకలు, ఇతర జీవాలకు మూడు నెలలకు ఒకసారి ఇవ్వాలని వెల్లడించారు. బుర్రిపాలెం పశు వైద్యశాలలో రోజుకు 60 నుంచి 70 కేసుల వరకు పరీక్షించి అవసరమైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో నిర్వహించే పశు ఆరోగ్య శిబిరాలను తప్పని సరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గృహ యజమానుల సంక్షేమ సంఘం కార్యవర్గం

ఎన్నికైన నూతన కార్యవర్గం

తెనాలి: పట్టణ చెంచుపేటలోని అమరావతి కాలనీ గృహయజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా గుమ్మడి నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గుండపనేని పూర్ణచంద్రరావు, ఉపాధ్యక్షులుగా కె.జయపాల్, షేక్ నన్నెసాహెబ్, ఎ.శ్రీనివాసరావు, కేఎస్ రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.శ్యాంబాబు, కోశాధికారిగా బి.రామ్మోహనరావు తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

కాలనీలో కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కాలనీలో మౌలిక వసతుల మెరుగుదలకు పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

హెచ్చరిక!

రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు. తెనాలి–గుంటూరు రహదారిలోని సంఘం జాగర్లమూడి నుండి అంగలకుదురు వరకు, తెనాలి–విజయవాడ రహదారిలోని కఠెవరం నుండి నందివెలుగు జంక్షన్ వరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ రహదారుల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రదేశాల్లో సిబ్బందితో కలిసి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఆదివారం ఏర్పాటు చేశారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతన్నాయని, రోడ్డు పై ప్రయాణించే వాహనదారులకు అర్థమయ్యే విధంగా ప్రకటనలు ద్వారా డ్రైవర్లకు, ప్రయాణికులకు రహదారిపై అవగాహన కలిగేలా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని ఎస్ఐ ఈ సందర్భంగా తెలిపారు. వీటి ద్వారా ప్రమాదాలను నివారించే ఆస్కారముందని చెప్పారు.

–తెనాలి రూరల్

ఆరోగ్య అవగాహనలో వాకర్స్ క్లబ్ కృషి ప్రశంసనీయం

తెనాలి: ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడంలో వాకర్స్ క్లబ్ వంటి సంఘాలు కీలకపాత్ర వహించటం అభినందనీయమని మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ అన్నారు. వాకర్స్ క్లబ్, తెనాలి 26వ వార్షికోత్సవ సమావేశం ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని సీనియర్ సిటిజన్స్ హాల్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెనాలి మండల తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ నడకను ప్రోత్సహించటంతో వాకర్స్ క్లబ్ కృషిని ప్రశంసించారు. నిత్యం నడక అలవాటు చేసుకోవడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవనశైలిలో నడకను భాగం చేసుకోవాలని సూచించారు. డీ3 శారద సర్వీసెస్ సొసైటీ నిర్వాహకురాలు డాక్టర్ శారద మాట్లాడుతూ నడక అనేది అన్ని వయసుల వారికి అనువైన ఉత్తమ వ్యాయామమని అన్నారు. జీవనశైలి సంబంధిత వ్యాధులను దూరం చేసేందుకు వాకింగ్ ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. మహిళలు, వృద్ధులు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వాకింగ్‌ను అలవాటు చేసుకోవాలని ఆమె సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ వాకర్‌గా కురగంటి ఆంజనేయులు, ఉత్తమ మహిళా వాకర్‌గా డాక్టర్ ఇందిర వెలివోలు, ఉత్తమ యోగ సాధకురాలిగా ఆత్మూరి వెంకట సుజాతలను ఘనంగా సత్కరించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, క్లబ్ అధ్యక్షులు గుత్తా వెంకటరత్నం, కార్యదర్శి రవిబాబు, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం

తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ ఆంధ్రాప్యారిస్ ఆధ్వర్యంలో ఆదివారం సుల్తానాబాద్ లోని శ్రీనివాస కల్యాణం మండపంలో ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో 200 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందికి శుక్లాల ఆపరేషను అవసరమని నిర్ధారించారు. క్లబ్ అధ్యక్షులు రావి కృష్ణమోహన్, కార్యదర్శి దేవరపల్లి సాగర్‌బాబు, కోశాధికారి ముక్కామల మధుబాబు పర్యవేక్షించారు. ఎమ్మెల్సీ ఆలపాటితోపాటు రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పాల్గొన్నారు. నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌చే ఆవిష్కరించారు. 16 వార్డు కౌన్సిలర్ దివి అనిత సూచనతో వార్డులోని ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థి కొడాలి వంశీకృష్ణ కు ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారి చేతుల మీదగా ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ తరపున ల్యాప్‌టాప్‌ను ట్రస్ట్ అధ్యక్షులు ఈదర వెంకట పూర్ణచంద్ అందజేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ కుద్దూస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి పథకం పేరు మార్చడం హేయం

మాట్లాడుతున్న డాక్టర్ సాంబశివుడు

తెనాలిటౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై తెనాలి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన మోదీ నిరంకుశ విధానాలకు ఈ చర్య పరాకాష్టగా చెప్పారు. మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి కేంద్రప్రభుత్వం కొత్త పేరు పెట్టడం దారుణమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులు లేని రోజుల్లో ఉపాధినిస్తుందని గుర్తు చేశారు. గతంలో ఈ పథకానికి సంబంధించిన పూర్తి భారాన్ని కేంద్రమే భరించేదనీ, ఇప్పుడు 40 శాతం నిధులను రాష్ట్రం భరించాలనే నిబంధన విధించారని తెలిపారు. ఈ భారాన్ని మోయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయా అని ప్రశ్నించారు. మూడు రోజుల్లోనే చట్టం చేశారనీ, దీనిపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మాట్లాడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ తెనాలిటౌన్ ప్రెసిడెంట్ పొన్నూరు నాగ సూర్యశశిధరరావు, జిల్లా జనరల్ సెక్రటరీ యన్నం శెట్టి శివరామకృష్ణ ప్రసాద్, మీడియా కో–ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, పెనుగొండ శివకుమార్, భీమా రమేష్, పి.స్టీవెన్ బాబు, కె.కోటేశ్వరరావు, యస్.సుబ్బారావు, కె.వీరాస్వామి, బి.శ్రీను, యన్.మల్లికార్జునరావు పాల్గొన్నారు

నాలుగులైన్ల రహదారిపై ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి

మాట్లాడుతున్న న్యాయవాది డానియేల్

తెనాలిటౌన్: తెనాలి నుండి విజయవాడ వెళ్లే నాలుగు లైన్ల ప్రధానహదారిపై జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు హైకోర్టు న్యాయవాది పెరికల డేనియల్ విజ్ఞప్తి చేశారు. వీఎస్ఆర్ కళాశాల ఎదురు గల నాలుగు లైన్ల ప్రధాన రహదారికి ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు ఆదివారం ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కఠెవరం వంతెన ప్రాంతం ప్రమాద భరితంగా ఉందని ఈ సమస్యపై కూడా అధికారులు దృష్టి సారించాలని కోరారు. వంతెనకు రక్షణ గోడ నిర్మించాలని అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుంటే, సమస్యను గుర్తించి ముందుగానే అప్రమత్తమై ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. వాహన వేగాన్ని నియంత్రించే సూచికలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు వేములపల్లి శ్రీనివాస్, రామకృష్ణ, జి.శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

దళితులంటే చంద్రబాబుకు చులకన

నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొన్నూరు: ముఖ్యమంత్రి చంద్రబాబుకు దళితులంటే చులకన అని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు మందా సాల్మన్ హత్యకు నిరసనగా ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాల్మన్ హత్యకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎస్టీ, ఎస్సీ సెల్, క్రిస్టియన్ మైనారిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు దేవరకొండ గోపి, ఇమ్మానియేల్, కారుమూరి అంకమ్మరావు, మహిళా అధ్యక్షురాలు మండ్రు అనిత, నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు చిర్ర అక్కిరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పొనుగుపాటి పాల్ రాజు, పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష, మహిళా అధ్యక్షురాలు కూచిపూడి మరియరాణి, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ మౌలాలి, కార్మిక విభాగం అధ్యక్షులు రుద్రపాటి నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు గేరా సంజీవ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ పీరు, బీసీ సెల్ అధ్యక్షులు పలగాని రమేష్, బూత్ కమిటీ అధ్యక్షులు గోపిశెట్టి వాసు పాల్గొన్నారు.

సద్గురు సాయినాథునికి విశేష పూజలు



తెనాలి: సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రం 34వ వార్షికోత్సవ వేడుకలను తెనాలిలో వైభవంగా జరిపారు. రెండురోజులపాటు జరిగిన వేడుకల్లో చివరిరోజైన ఆదివారం బుర్రిపాలెంరోడ్డులోని టీజీకే కళ్యాణమండపంలోని గరుడధామంలో విడిది చేసిన ఉత్సవ సత్సంగమూర్తులకు ఆరతి, ప్రసాద వినిమయం చేశారు. ఉదయం బాబా భజనతో కార్యక్రమాలను ఆరంభించారు. సత్సంగ సదస్సులను నిర్వహించారు. సామూహికంగా సాయి సచ్చరిత్ర పారాయణం, నారాయణం సాయిసత్య శ్రావణి, కె.హంసికరెడ్డిచే కూచిపూడి నాట్యం ప్రదర్శన అనంతరం గురుధామంలో బాబా గురువులకు మధ్యాహ్న ఆరతినిచ్చారు. సుగ్గున రమేష్‌బాబు ఆధ్వర్యంలో కోదండరామ కోలాట భజన సమాజం, కాకర్లమూడి వారిచే కోలాట ప్రదర్శన ఆకర్షణీయంగా ఉంది. మధ్యాహ్న కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. బాబా గురువులను దర్శించుకున్నారు. సత్సంగ కేంద్రం కన్వీనర్ వీఎస్ నాగభూషణరెడ్డి పర్యవేక్షించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

వరుసగా ఐదో విజయంపై ఆర్‌సీబీ గురి... నేడు గుజరాత్ జెయింట్స్‌తో ‘ఢీ’

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరో పోరుకు సిద్ధమైంది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి 8 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో ఉన్న ఆర్‌సీబీ... సోమవారం గుజరాత్ జెయింట్స్‌తో తలపడనుంది. లీగ్ తొలి దశ మ్యాచ్‌లు నవీ ముంబైలో శనివారం ముగిశాయి. ఆదివారం విశ్రాంతి దినం తర్వాత... నేటి నుంచి వడోదర వేదికగా మ్యాచ్‌లు సాగనున్నాయి. స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరు జట్టు అన్ని రంగాల్లో పటిష్టంగా ఉంది. తాజా సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరిగిన పోరులో ఆర్‌సీబీనే విజయం వరించింది. ఆ పోరులో టాపార్డర్ విఫలమైనా... రాధా యాదవ్, రిచా ఘోష్ రాణించారు. బౌలింగ్‌లో శ్రేయాంక దుమ్మురేపుతోంది. మరోవైపు ఆష్లే గార్డ్‌నర్ సారథ్యంలోని గుజరాత్ 4 మ్యాచ్‌లాడి 2 విజయాలు, 2 పరాజయాలు చవిచూసింది. ఫుల్‌జోష్‌లో ఉన్న ఆర్‌సీబీని అడ్డుకోవాలంటే... గుజరాత్ శక్తికి మించి పోరాడాలి.

రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

కోహ్లి వీరోచితం సరిపోలేదు

ఆఖరి వన్డేలో 41 పరుగులతో ఓడిన భారత్

తొలిసారి భారత గడ్డపై వన్డే సిరీస్ గెలిచిన న్యూజిలాండ్

• మిచెల్, ఫిలిప్స్ సెంచరీలు • భారత టాపార్డర్ విఫలం • రాణించిన నితీశ్ రెడ్డి, హర్షిత్

భారత్ ముందున్న లక్ష్యం 338 అసాధారణమైంది. దీన్ని ఛేదించే క్రమంలో 71/4 స్కోరు వద్దే టీమిండియా కుదేలైంది. అప్పటికే రోహిత్ శర్మ, గిల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ అవుట్! ఉన్నది కోహ్లి ఒక్కడే! ఈ చేజింగ్ కింగ్... నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి 159 స్కోరు వరకు తీసుకెళ్లాడు. జడేజా నిర్లక్ష్యంగా ఆడినా... హర్షిత్ రాణాతో ఒడ్డున పడేసేందుకు కడదాకా శ్రమించాడు. 40 బంతుల్లో 61 పరుగుల సమీకరణం గెలుపుపై ధీమాను తెచ్చింది. ఇలాంటి తరుణంలో 277 స్కోరు వద్ద హర్షిత్ నిష్క్రమించడంతో భారత్ ఆశలు ఆవిరయ్యాయి. కోహ్లి వీరోచిత పోరాటానికి అండగా నిలిచేవారే లేకపోవడంతో చివరకు 41 పరుగులతో మ్యాచ్ ఓడిన భారత్ సిరీస్‌ను 1–2తో చేజార్చుకుంది.

ఇండోర్: ఏడాదిన్నర క్రితం భారత గడ్డపై టీమిండియాను టెస్టుల్లో దెబ్బ కొట్టిన న్యూజిలాండ్... ఈ ఏడాది ఆరంభంలో వన్డేల్లోనూ కంగుతినిపించింది. మూడు వన్డేల సిరీస్‌ను ఓటమితో మొదలుపెట్టిన బ్రేస్‌వెల్ సారథ్యంలోని కివీస్ ఆ తర్వాత వరుస మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత్ 41 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చేతిలో ఓడింది. వన్డే సిరీస్‌ను చేజార్చుకుంది. టాస్ నెగ్గిన టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీస్కోరు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’.. ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ డరైల్ మిచెల్ (131 బంతుల్లో 137; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు), గ్లెన్ ఫిలిప్స్ (88 బంతుల్లో 106; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. 58 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన కివీస్‌ను నాలుగో వికెట్‌కు 219 పరుగులు జోడించడం ద్వారా మిచెల్, ఫిలిప్స్ భారీస్కోరుకు బాట వేశారు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన భారత్ 46 ఓవర్లలో 296 పరుగుల వద్ద ఆలౌటై ఓడిపోయింది. విరాట్ కోహ్లి (108 బంతుల్లో 124; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) వన్డేల్లో 54వ శతకం సాధించాడు. ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (57 బంతుల్లో 53; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్షిత్ రాణా (43 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో రాణించారు. తదుపరి ఇరు జట్ల మధ్య ఐదు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ 21న నాగ్‌పూర్‌లో జరగనుంది.

నిర్లక్ష్యంగా ఆడి...

పెద్ద లక్ష్యం ముందుంటే బ్యాటింగ్‌కు స్వర్గధామమైన పిచ్‌పై పెద్దగా కష్టపడకుండానే రోహిత్ (11), గిల్ (23), శ్రేయస్ (3), కేఎల్ రాహుల్ (1) నిర్లక్ష్యంగా అవుటయ్యారు. 13వ ఓవర్ ముగియకముందే 71/4 స్కోరు వద్ద భారత్ లక్ష్యానికి దూరమైంది. వచ్చిరాగానే సిక్స్‌తో అలరించిన కోహ్లి అడపాదడపా బౌండరీలు బాదాడు. నితీశ్ రెడ్డితో కలిసి మొదట వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. తర్వాత సింగిల్స్, డబుల్స్‌తో ఇన్నింగ్స్‌ను చక్కబెట్టాడు. నితీశ్ కొట్టిన ఫోర్‌తో భారత్ స్కోరు 20వ ఓవర్లో 100కు చేరింది. తర్వాత కోహ్లి 51 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. భారీ సిక్స్‌లు బాదిన నితీశ్ కూడా 52 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే నితీశ్‌ను క్లార్క్ అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

కోహ్లి ముందుండి...

తర్వాత కోహ్లికి జతయిన జడేజా (12) నిరాశపరిచాడు. కానీ హర్షిత్ రాణా బ్యాటర్‌ను తలపించే ఆటతీరుతో చక్కని భాగస్వామ్యానికి బాట వేశాడు. 37వ ఓవర్లో భారత్ 200 దాటింది. హర్షిత్‌తో పాటు కోహ్లి కూడా షాట్లు ఆడటంతో ఈ దశలో వేగంగా పరుగులు వచ్చాయి. ఈ జోరు సాగుతుండటంతో పోయిన ప్రాణం లేచివచ్చినట్లుగా భారత్ గెలుపుపై ఆశలు చిగురించాయి. దీంతోపాటు ‘కింగ్’ కోహ్లి 91 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. జట్టు స్కోరు 250 పరుగులకు చేరుకుంది. భారీ సిక్స్‌లతో విరుచుకుపడుతున్న హర్షిత్ 41 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. వెంటనే అతను అవుటవడంతో 69 బంతుల్లో 99 పరుగుల భాగస్వామ్యానికి, భారత్ ఆశలకు తెరపడింది. 292 పరుగుల వద్ద కోహ్లి నిష్క్రమించగా, మరో రెండు బంతులకే భారత్ ఆలౌటైంది.

విన్నర్స్ ట్రోఫీతో న్యూజిలాండ్ సంబరం

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) రోహిత్ (బి) హర్షిత్ 5; నికోల్స్ (బి) అర్‌్షదీప్ 0; యంగ్ (సి) జడేజా (బి) హర్షిత్ 30; మిచెల్ (సి) కుల్‌దీప్ (బి) సిరాజ్ 137; ఫిలిప్స్ (సి) రాహుల్ (బి) అర్‌్షదీప్ 106; బ్రేస్‌వెల్ (నాటౌట్) 28; మిచెల్ హే (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 2; జాక్ ఫోక్స్ (సి) కుల్దీప్ (బి) అర్‌్షదీప్ 10; క్లార్క్ (బి) హర్షిత్ 11; జేమీసన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 337. వికెట్ల పతనం:** 1–5, 2–5, 3–58, 4–277, 5–283, 6–286, 7–304, 8–327. **బౌలింగ్:** అర్‌్షదీప్ 10–1–63–3, హర్షిత్ 10–0–84–3, సిరాజ్ 10–0–43–1, నితీశ్ 8–0–53–0, కుల్దీప్ 6–0–48–1, జడేజా 6–0–41–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) క్లార్క్ (బి) ఫోక్స్ 11; గిల్ (బి) జేమీసన్ 23; కోహ్లి (సి) మిచెల్ (బి) క్లార్క్ 124; అయ్యర్ (సి) ఫోక్స్ (బి) క్లార్క్ 3; రాహుల్ (సి) ఫిలిప్స్ (బి) లెనాక్స్ 1; నితీశ్ (సి) యంగ్ (బి) క్లార్క్ 53; జడేజా (సి) యంగ్ (బి) లెనాక్స్ 12; హర్షిత్ (సి) నికోల్స్ (బి) ఫోక్స్ 52; సిరాజ్ (సి) హే (బి) ఫోక్స్ 0; కుల్దీప్ (రనౌట్) 5; అర్‌్షదీప్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (46 ఓవర్లలో ఆలౌట్) 296. వికెట్ల పతనం:** 1–28, 2–45, 3–68, 4–71, 5–159, 6–178, 7–277, 8–277, 9–292, 10–296. **బౌలింగ్:** జేమీసన్ 9–0–58–1, ఫోక్స్ 9–0–77–3, క్లార్క్ 9–0–54–3, లెనాక్స్ 10–0–42–2, మిచెల్ 1–0–10–0, ఫిలిప్స్ 8–0–54–0.

కోహ్లి సెంచరీ అభివాదం

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సబలెంకా గెలుపు బోణీ

విజయ్ హజారే ట్రోఫీలో తొలిసారి విజేతగా నిలిచిన విదర్భ జట్టు

మరిన్ని క్రీడా వార్తలు

సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో అప్రెంటిస్

ప్రభుత్వ రంగ బ్యాంకు... బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ బ్రాంచ్‌ల్లో 2025–26 సంవత్సరానికి అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 600
» **శిక్షణ కాలం:** ఒక ఏడాది
» **స్టైపెండ్:** నెలకు రూ.12,300
» **అర్హత:** గుర్తింపుపొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 30.11.2025 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 15.01.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 25.01.2026
» **వెబ్‌సైట్:** https://nats.education.gov.in

ఈడీసీఐఎల్, న్యూఢిల్లీలో 15 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన మినీ రత్న కేటగిరి–1 సీపీఎస్‌ఈ సంస్థ ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(ఈడీసీఐఎల్).. అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 15.
» **గ్రాడ్యుయేషన్ విభాగాలు:** బీటెక్(సీఎస్/ఐటీ/ఈసీఈ), బీకాం, సీఏ (ఇంటర్మీడియట్), సీఎంఏ, బీబీఏ(హానర్స్)/బీఏ(హెచ్‌ఆర్‌ఎం)/బీఎంఎస్, బీబీఏ(జనరల్)/బీఏ(ఇంగ్లిష్)/సోషియాలజీ/సోషల్ సైన్స్)
» **అర్హత:** 01.04.2024 తర్వాత ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 19.01.2026 నాటికి 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.01.2026
» **వెబ్‌సైట్:** https://edcilindia.co.in

ఐఆర్‌ఈడీఏ, న్యూఢిల్లీలో 10 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ రెన్యూబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్ (ఐఆర్‌ఈడీఏ).. అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 10.
» **ఖాళీల వివరాలు:** ఫైనాన్స్–అకౌంట్స్–05, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి బీకాం, బీసీఏ, డిప్లొమా(సీఎస్/ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్స్‌కు రూ.18,000, డిప్లొమా అభ్యర్థులకు రూ.16,000.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, విద్యార్హతల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.01.2026.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.01.2026
» **వెబ్‌సైట్:** https://www.ireda.in

పదో తరగతితో ఆర్‌బీఐలో ఉద్యోగాలు

కేంద్ర బ్యాంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ).. ఆఫీస్ అటెండెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పోస్టు పేరు:** ఆఫీస్ అటెండెంట్
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 572
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.01.2026 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** ప్రారంభంలో నెలకు రూ.46,029
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాత పరీక్ష, లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 15.01.2026
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 04.02.2026
» **వెబ్‌సైట్:** https://www.rbi.org.in

నీట్‌లో నెగ్గే వ్యూహం

» నీట్–యూజీ 2026 సిలబస్ విడుదల
» మే 3వ తేదీన పరీక్ష నిర్వహణకు అవకాశం
» వ్యూహాత్మక ప్రిపరేషన్‌తోనే విజయం

నీట్ యూజీ-2026

నీట్ యూజీ.. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-అండర్ గ్రాడ్యుయేట్! ఇది దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్, డెంటల్, ఆయుష్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుర్వేద, హోమియోపతి తదితర మెడిసిన్ అనుబంధ బ్యాచిలర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. ఇందులో ర్యాంకు సాధించేందుకు బైపీసీ విద్యార్థులు నిరంతరం శ్రమిస్తుంటారు. నీట్‌లో బెస్ట్ స్కోర్‌తో తమ మెడికల్ కల సాకారం చేసుకోవాలని కృషి చేస్తుంటారు. ఈ విద్యార్థులంతా తమ ప్రిపరేషన్‌ను ముమ్మరం చేసుకోవాల్సిన సమయం వచ్చేసింది. ఎందుకంటే.. నీట్ యూజీ-2026 సిలబస్‌ను నిర్వాహక సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తాజాగా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. నీట్ యూజీ సిలబస్ వివరాలు, ప్రిపరేషన్ విధానంపై ప్రత్యేక విశ్లేషణ..

పెరుగుతున్న పోటీ

నీట్–యూజీకి పోటీ పెరుగుతోంది. దేశంలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నీట్–యూజీ స్కోర్‌నే ప్రామాణికంగా పరిగణిస్తుండటంతో ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటోంది. ఆల్ ఇండియా కోటా పేరిట దేశంలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 15 శాతం సీట్లను; రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని సీట్లను; డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ వర్సిటీలు ఇలా అన్ని కేటగిరీల యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లో ప్రవేశాలను నీట్ స్కోర్ ఆధారంగానే నిర్వహిస్తారు. అదే విధంగా ఆయుష్ కోర్సులుగా పిలిచే బీహెచ్‌ఎంఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ తదితర కోర్సులకు కూడా నీట్ స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకుంటారు.

నీట్ యూజీ స్వరూపం

నీట్–యూజీ పరీక్షను మొత్తం నాలుగు సబ్జెక్ట్‌లలో 720 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఫిజిక్స్ 45 ప్రశ్నలు–180 మార్కులకు, కెమిస్ట్రీ 45 ప్రశ్నలు–180 మార్కులకు, బోటనీ 45 ప్రశ్నలు–180 మార్కులకు, జువాలజీ 45 ప్రశ్నలు–180 మార్కులకు ఉంటాయి.

గతేడాది మాదిరిగానే

తాజాగా విడుదల చేసిన నీట్ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. గత ఏడాది మాదిరిగానే ఉందని సబ్జెక్ట్ నిపుణులు అంటున్నారు. పరీక్ష విధానంలోనూ మార్పులు ఉండకపోవచ్చని చెబుతున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా పార్ట్–బిలో ఛాయిస్ ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సబ్జెక్ట్ వారీగా ముఖ్యమైన టాపిక్స్

నీట్ సిలబస్ ఖరారైన నేపథ్యంలో సబ్జెక్ట్ వారీగా సన్నద్ధతకు, ఆయా సబ్జెక్ట్‌లలో దృష్టి పెట్టాల్సిన అంశాలు..

ప్రాక్టీస్‌తో ఫిజిక్స్‌లో మంచి మార్కులు

పరీక్షలో మొదటి విభాగంగా ఉండే ఫిజిక్స్‌లో విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో ప్రతి చాప్టర్‌కు చివర ఇచ్చిన ప్రశ్నలను తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాలి. అవకలనం, సమాకలనం అనువర్తనాలపై పట్టు సాధించాలి. ఇంటర్ రెండేళ్ల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. రొటేషనల్ డైనమిక్స్, సిగ్మా పార్టికల్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. అదేవిధంగా ఎలక్ట్రోమ్యాగ్నటిజం, ఇండక్షన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ వంటి చాప్టర్లను చదవడంతో పాటు పదే పదే ప్రాక్టీస్ చేయాలి.

కెమిస్ట్రీ.. కాన్సెప్ట్స్, రివిజన్

ఈ సబ్జెక్ట్‌లో ఆయా విభాగాలకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీకి కొంత వెయిటేజీ ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. కాబట్టి నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. కెమిస్ట్రీలో ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను వాటి వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఫార్ములాలతో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. పీరియాడిక్ టేబుల్‌పై పట్టు సాధిస్తే.. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో మంచి స్కోర్‌కు ఆస్కారం ఉంటుంది.

బోటనీకి ఇలా

నీట్‌లో కీలకంగా భావించే బోటనీపై విద్యార్థులు ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్, సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. అన్ని అంశాలకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాపులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్ పాఠ్యాంశాలపై ఫోకస్ చేయడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్స్ అండ్ ఫంక్షన్స్‌లో కణ విభజన (సమ విభజన, క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు, కణచక్రం తదితరాలను అధ్యయనం చేయాలి. బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో రెప్లికేషన్, ట్రాన్స్‌క్రిప్షన్, ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్‌లపై దృష్టిపెట్టాలి.

జువాలజీ

జువాలజీలో రాణించేందుకు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనిటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై విద్యార్థులు ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఎన్‌సీఈఆర్‌టీతోపాటు ఇంటర్ పుస్తకాల నుంచీ ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి గత ప్రశ్న పత్రాలను, ఇంటర్‌లో ఆయా చాప్టర్స్ చివరలో అడిగే ప్రశ్నలను సాధన చేయాలి. ఎన్‌సీఈఆర్‌టీ, ఇంటర్ పుస్తకాలను క్షుణ్ణంగా చదివితే ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రతి సబ్జెక్ట్‌లో 130 మార్కులు

నీట్‌లో మెరుగైన స్కోర్ ద్వారా మెడికల్ సీటు సొంతం చేసుకునేందుకు ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 130 మార్కులు సాధించేలా సిలబస్ అంశాలను ఔపోసన పట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు సాధించేలా కృషి చేస్తే.. మెడికల్ కోర్సుల కల నెరవేరుతుంది.

బోర్డ్ పరీక్షలతో సమన్వయం

- నీట్–యూజీకి సన్నద్ధమయ్యే విద్యార్థులు బోర్డ్ పరీక్షలతో ప్రిపరేషన్‌ను సమన్వయం చేసుకోవాలి. బోర్డ్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు ఇంటర్, నీట్ సిలబస్‌లను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. బోర్డ్ పరీక్షలు పూర్తయిన తర్వాత.. నీట్ సిలబస్‌కు అనుగుణంగా వెయిటేజీని అనుసరిస్తూ సమయం కేటాయించుకోవాలి. పరీక్షలో ఎక్కువ వెయిటేజీ ఉన్న అంశాలను ఎక్కువ సేపు చదవాలి. ఈ విషయంలో అభ్యర్థులు స్వీయ సామర్థ్యాలపై స్పష్టతతో వ్యవహరించాలి.
- రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. మాక్ టెస్టులకు హాజరవ్వాలి. మోడల్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ కొశ్చన్స్‌నే ఎక్కువగా అడుగుతున్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనుగుణంగా మోడల్ టెస్ట్‌లను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి. దీనిద్వారా రివిజన్ సమయంలో సమయం ఆదా అవుతుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: బ్యాంకింగ్ అవేర్‌నెస్

WHAT HAPPENS WHEN ETHANOL IS HEATED AT..

Physical Science

CARBON AND ITS COMPOUNDS

KEY WORDS

- **Homologous series:-** A Series of compounds where a functional group replaces hydrogen in a carbon chain.
- **Isomerism:-** When compounds have the same molecular formula but different properties.
- **Catalyst:** A substance that speeds up a reaction without being changed itself.
- **Saponification Reaction:-** The alkaline hydrolysis of esters to produce soaps.
- **Combustion:-** The process of burning carbon or Carbon compounds in the presence of excess Oxygen to produce heat and light.
- **Hybridisation:** The redistribution of orbitals of almost equal energy in individual atoms to give equal number of new orbitals of equivalent energy is called "Hybridisation"
- **Allotropy:** The occurrence of an element in two or more forms is known as 'Allotropy'.
- **Diamond:** Diamond is the crystalline allotrope of carbon with tetrahedral arrangement.
- **Graphite:** Graphite is the crystalline allotrope of carbon with hexagonal structure.
- **Nanotubes:** Nanotubes are an allotropic form of carbon which consist of hexagonal arrays of covalently bonded carbon atoms.
- **Catenation:** If any element forms bonds among its own atoms to give big molecules we call that property as catenation property.
- **Tetravalency:** The valency of an element is '4' then it is called 'Tetravalency'.
- **Alkanes:** Hydrocarbons containing only single bonds between carbon atoms are called Alkanes. Their general formula is C_nH_{2n+2}.
- **Alkenes:** Hydrocarbons containing at least one double bond between carbon atoms are called 'Alkenes'. Their general formula is C_nH_{2n}.
- **Functional group:** The characteristic properties of an organic compound depend mainly on an atom or group of atoms in its molecule is known as the Functional group.
- **Oxidation:** Adding of oxygen or removal of hydrogen from a compound is known as 'Oxidation'.
- **Esterification:** The reaction between carboxylic acid and an alcohol in the presence of Conc.H_2SO_4 to form a sweet odoured substance, ester is called 'Esterification'.
- **Micelle:** A spherical aggregate of soap molecule in the soap solution in water is called 'Micelle'.

1 MARK QUESTIONS

1.  **What does *x* represent?**

A. Hydrophilic end or polar end.

2. **Give IUPAC name HCOOH.**

A. Methanoic acid

3. **What is the shape of C_{60}?**

A. Foot ball (or) Soccer ball.

4. **Which fullerenes are called bucky balls**

A. Spherical fullerenes

5. **Which part of the soap molecule does attach with dirt**

A. Hydrophobic or Non polar end

6. **Give one example for straight chain compound?**

A. $CH_3–CH_2–CH_2–CH_2–CH_3$ (n-pentane)

7. **Name the carboxylic acid used as a preservative.**

A. Acetic acid is the carboxylic acid used as a preservative.

8. **What is soap?**

A. Soap is a sodium or potassium salts of higher fatty acids like palmatic and stearic and oleic acid.

9. **Which allotropic form of carbon has foot ball like structure?**

A. Buckminister fullerene.

10. **Which allotropic form of carbon has layered structure?**

A. Graphite

11. **What do we call the self linking property of carbon?**

A. Catenation

12. **Write any one use of vinegar?**

A. It is used as a preservative in pickles.

13. **Write any one use of Saponification?**

A. It is used in the preparation of Soap.

14. **Write any one use of Carbon Compound?**

A. Carbon Compounds are used as fuels.

15. **Write any one use of ethanol/Alcohol?**

A. It is used as a good solvent, medicines and tonics.

16. **Write any use of methane?**

A. It is used as a fuel. as bio and CNG.

17. **Write any use of ethanoic acid/acetic acid?**

A. i) It is used as vinegar for preparing pickles.
ii) It is used for the preparation of aspirin.

18. **Write any one industrial application of hydrogenation?**

A. It is used in the production of saturated vegetable ghee from unsaturated vegetable oils.

19. **Write any one use of detergents.**

A. To make shampoos and products for cleaning clothes.

20. **Ethane, with the molecular formula C_2H_6 has**

a) 6 covalent bonds b) 7 covalent bonds
c) 8 covalent bonds d) 9 covalent bonds

A. b

21. **Butanone is a four-carbon compound with the functional group**

a) Carboxylic acid b) Aldehyde
c) Ketone d) Alcohol

A. c

22. **While cooking, if the bottom of the vessel is getting blackened on the outside, means that**

a) the food is not cooked completely
b) the fuel is not burning completely
c) the fuel is wet
d) the fuel is burning completely.

A. b

2 MARKS QUESTIONS

1. **What happens when ethanol is heated at 443 K with conc H_2SO_4**

A. When ethanol is heated at 443 K with conc H_2So_4 ethene is formed

2. **Write two uses of ethanol in day to day life.**

A. Ethanol is used in the preparation of

i. Tincture of Iodine
ii. Ingredient in medicines like cough syrup.
iii. Ingredient in beverages
iv. Used as a solvent in dilution of chemicals

3. **Explain with the help of a chemical equation, how an addition reaction is used in vegetable ghee industry.**

A. The reaction in which a reagent adds completely on a substance without the removal of small molecules are called 'Addition reaction'.

Addition of hydrogen in the presence of nickel catalyst to vegetable oil gives ghee. Vegetable oil is unsaturated compound whereas ghee is a saturated compound.

$$\text{Vegetable oil} \xrightarrow[H_2,\ 200^\circ C]{\text{Ni Catalyst}} \text{Ghee}$$

4. **Give an example of esterification reaction.**

A. Ethanol reacts with ethanoic acid on warming in the presence of a few drops of concentrated sulphuric acid to form a sweet smelling ester, ethyl ethanoate.

$$\underset{\text{Ethanoic acid}}{CH_3COOH} + \underset{\text{Ethanol}}{C_2H_5OH} \xrightarrow{Conc.H_2SO_4} \underset{\text{Ethyl ethanoate}}{CH_3COOC_2H_5} + \underset{\text{Water}}{H_2O}$$

5. **Explain the formation of Scum when hard water is treated with Soap**

A. Hard water contains hydrogen carbonates, chlorides and sulphates of calcium and magnesium which reacts with soap to form Scum For example, Calcium Chloride reacts with Soap to form Scum.

Sodium Stearate + Calcium chloride → Sodium chloride + calcium Stearate (Scum).

6. **Why are Carbon and its Compounds used as fuels for most applications?**

A. Carbon on combustion gives Carbon dioxide and water. This reaction is accompanied by evolution of heat and light. The same is true for compounds of carbon. That is why carbon and its compounds are used as fuel for most applications.

7. **Collect the Saturated and unsaturated hydro carbons in the following.**

C_2H_6, C_3H_8, C_3H_6, C_2H_2, C_4H_6, C_5H_{10} and CH_4.

A. Saturated hydrocarbons - C_2H_6, C_3H_8, CH_4
Unsaturated hydrocarbons - C_3H_6, C_2H_2, C_4H_6, C_5H_{10}

4 MARKS QUESTIONS

1. **Differentiate between addition and substitution reactions give one example for each.**

Addition Reaction

1. An addition reaction is the combination of two or more atoms or molecules in order to form a large molecules.
2. These reactions are shown by unsaturated compounds.

Continued on next page..





Substitution Reaction.

1. A substitution reaction involves the replacement of an atom or a group of atoms by another atom or a group of atoms.
2. These reactions are shown by saturated compounds.
   $CH_4 + Cl_2 \rightarrow CH_3Cl + HCl$
   (In the presence of sunlight.)

2. Why does carbon form compounds mainly by covalent bonding?

A. Carbon electronic configuration is $1s^2 2s^2 2p^2$. There are 4 electrons in the outermost orbital. It is not possible to remove 4 electrons from a carbon atom to give it the inert gas electron arrangement. Since carbon atom is very small due to which its outermost electrons are strongly held by the nucleus. So carbon atom can achieve the inert gas electron arrangement only by the sharing of electrons, therefore carbon always forms covalent bonds.

3. How do you appreciate the role of esters in every-day life?

A. Esters are useful to us in many ways in every day life. Esters are sweet smelling substances. These are used in making perfumes and flavouring agents. Esters react with acids or bases to give alcohol and the carboxylic acids.
Esters are used in saponification to prepare soaps. Hence I appreciate the role of esters in every day life.

8 MARKS QUESTIONS

1. Define homologous series of carbon compounds, mention any two characteristics of homologous series.

A. ***Homologous Series:*** Homologous series is a group of organic compounds having similar structures and similar chemical properties in which the successive compounds differ by CH_2 group.

Characteristics of Homologous Series:

i) All the members of a homologous series can be represented by the same general formula.
ii) Any two adjacent homologous differ by 1 carbon atom and 2 hydrogen atoms in their molecular formula.
iii) The difference in the molecular masses of any two adjacent homologous is 14 units.
iv) All the compounds of a homologous series show similar chemical properties.
v) The members of a homologous series show a gradual change in their physical properties with increase in molecular mass.

2. Distinguish between esterification and saponification reactions of organic compounds.

A. Esterification

1) The formation of ester is known as esterification reaction
2) Alcohol reacts with carboxylic acids to produce esters.
3) Water is by product in esterification reaction
   Ex: Ethyl Acetate ($CH_3COOC_2H_5$)
4) This reaction is example for dehydration reaction
5) This reaction is slow and reversible.
6) This process is used for preparation of different esters

Saponification

1) The formation of soap is known as Saponification reaction.
2) Higher fatty acids reacts with bases to form soaps.
3) Glycerol is the by product in saponification reaction.
   Ex: Sodium stearate ($C_{17}H_{35}COONa$)
4) This reaction is example for hydrolysis.
5) This reaction is irreversible.
6) This is used for preparation of soaps.

3. Explain the Mechanism of the cleaning action of soap.

A:



Effect of soap in cleaning



1) When a dirty cloth is put in water containing dissolved Soap then the hydrocarbon end of the Soap molecule in micelle attach to the oil (or) grease particles present on the surface of dirty cloths.
2) In this way the soap micelle entraps the oily greasy particles by using its hydro carbon ends.
3) The ionic ends of the soap molecules in the micelle however remain attached to water.
4) When the dirty cloth is agitated in Soap solution the oily and greasy particles present on its surface and entrapped by Soap micelles get dispersed in water due to which the soap water becomes dirty but the cloth gets cleaned.
5) The cloth is cleaned thoroughly by rinsing in clean water a number at times.

4. How can you prove that ethanoic acid reacts with carbonates and bicarbonate and produces carbon-dioxide.

A. Material required : Dilute ethanoic aid, Sodium carbonate, Sodium bicarbonate, test tube, thistle, funnel, stand, Delivery tube, Lime water.



Passing carbon dioxide gas through calcium hydroxide solution

Procedure :

1. Set up the apparatus as shown in the figure.
2. Take a spatula full of sodium carbonate in a test tube and add 2 ml of dilute ethanoic acid.
3. Pass the gas produced through freshly prepared lime water.

Observations :

1. On the addition of sodium carbonate to a dilute solution of ethanoic acid, a brisk effervescence due to the evolution of carbon dioxide (CO_2) gas is produced.
2. $\underset{\text{(Ethanoic acid)}}{2CH_3COOH} + \underset{\text{(Sodium Carbonate)}}{Na_2CO_3} \longrightarrow 2CH_3COONa + H_2O + CO_2$
3. When carbon dioxide gas is passed through freshly prepared lime water, it turn lime water milky due to the formation of insoluble calcium carbonate.
4. Same observations are noted in the replacement of sodium bicarbonate instead of sodium carbonate.
   $CH_3COOH + NaHCO_3 \longrightarrow CH_3COONa + H_2O + CO_2$

AV Sudhakar
School Assistant (PS),
ZPPHS Chennarayunipalem,
Bogole (M), SPSR Nellore

Daily Quiz 18

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. The colour of methyl orange when added to aqueous solution of sodium hydroxide is?
a) Red b) Pink
c) Yellow d) No change

2. If the magnification is 1, then the image is?
a) equal to height of the object
b) erected image c) a & b
d) given data is insufficient

3. The strength of acid depends on?
a) concentration of acid b) concentration of H+
c) concentration of OH-
d) no. of moles of base used to neutralize ions

4. Which of the following pair gives common salt?
a) Sodium Thio sulphate, Sulphur dioxide
b) Hydrochloric acid, Sodium hydroxide
c) Chlorine and oxygen
d) Nitric acid and sodium hydrogen carbonate

5. The focal length of a lens depends on?
a) medium
b) the substance with which the lenses made
c) position of object
d) a and b



కశ్మీర్‌ను 'భూమిపై వెలసిన స్వర్గం' అని పిలుస్తారు. గుల్మార్గ్ వెళ్తే మీరు కూడా అదే మాట అంటారు. సముద్ర మట్టానికి సుమారు 8,800 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే మరో లోకంలోకి వచ్చామా అనే అనుభూతి కలగకమానదు. సాహసాలకు, ప్రశాంతత కోసం వెతికే ప్రకృతి ప్రేమికులకు ఇది ఒక అల్టిమేట్ డెస్టినేషన్.

గుల్మార్గ్ పర్యాటకంపై ప్రత్యేక కథనం సాక్షి ట్రావెల్ ఈపేపర్‌లో..

● జైపూర్ సాహితీ సంరంభం

'నేటి ఉరుకుల పరుగుల జీవితంలో స్త్రీ, పురుషులు కుటుంబాల కోసం, ఉద్యోగాల కోసం, ఆర్థిక ఎదుగుదల కోసం ఏమేమి చేయాలా అని నిత్యం ఆందోళన చెందుతున్నారుగానీ తమ కోసం తాము ఏం చేసుకోవాలనే సంగతిని మర్చిపోతున్నారు. నేడు ప్రతి మనిషి అన్నీ పట్టించుకుంటూ తనను తాను నిర్లక్ష్యం చేసుకుంటున్నాడు. మీకేమి కావాలో గ్రహించండి. మీతో మీరు అనుబంధం పెంచుకోండి' అన్నారు 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆధ్యాత్మిక మార్గదర్శి గురు గోపాల్‌దాస్.

మీతో మీరు అనుబంధం ఏర్పరుచుకోండి...

'అయిన వారి కోసం అన్నీ చేయాల్సిందే... కానీ వారి కంటే మీ అయిన వారు మీరే. మీకేం కావాలి? మీ ఇష్టాల గురించి, ఆరోగ్యం గురించి, అభిరుచుల గురించి, లక్ష్యాల గురించి, అసలేమీ చేయకుండా కొన్నాళ్లు గడపాలనుకుంటున్న తీరిక సమయాల గురించి మీరేమి చేసుకుంటున్నారు? మీతో మీ అనుబంధం సరిగా లేకపోతే మీ అయినవారికి మీరు చేయాల్సిందంతా ఎలా చేయగలరు?' అని ప్రశ్నిస్తారు గురు గోపాల్‌దాస్.

'జైపూర్ సాహితీ సంరంభం' లో తన తాజాపుస్తకం 'యూ కెన్ హేవ్ ఇట్ ఆల్' వెలువడిన సందర్భంగా జీవన మార్గాల సులభతరం గురించి ఆయన మాట్లాడారు.

మార్చలేని సమస్యలు

ప్రతి మనిషికీ జీవితంలో సమస్యలు ఉంటాయి. వాటిలో కొన్ని పరిష్కరించేవి ఉంటాయి... కొన్ని పరిష్కరించలేనివి. ఉదాహరణకు ఫలానా వ్యక్తికి మీరంటే పడదు... మీ గురించి చెడు చెప్తుంటాడు... మీరు ఎంత ప్రయత్నించినా మారడు. దానిని నేను గణితంలో 'పై'తో పోలుస్తాను. ఏం చేసినా దాని విలువ మారదు. కాబట్టి మార్చలేని సమస్యలను పూర్తిగా వదిలిపెట్టాలి. వాటికై ఏ మాత్రం శక్తి వృథా చేయకూడదు. రెండో రకం సమస్యలు... మార్చదగ్గవి. మీ అబ్బాయికి మంచి కాలేజ్‌లో సీటు రాని పరిస్థితి ఉంటే మెరుగైన కాలేజ్‌లో అయినా మీరు సంపాదించగలరు కదా. దీనిని నేను గణితంలో 'ఎక్స్' విలువ కనుగొనడంతో పోలుస్తాను. అలాంటి ఎక్స్ సమస్యల గురించి పని చేయాలి. కాబట్టి 'పై'ను వదిలిపెట్టండి. 'ఎక్స్' సంగతి చూడండి.

రాళ్లు కింద పడేయండి

ఒక సాధువు దగ్గరకి ఒక కుర్రవాడు వచ్చి 'స్వామీ... నాకు మనశ్శాంతి కావాలి' అని అడిగితే ఆ సాధువు కొన్ని రాళ్ల చూపించి 'వాటిని వారంపాటు మూటలో వేసుకుని విడువకుండా తిరుగు' అన్నాడు. ఆ కుర్రవాడు ఆ రోజూ ఆ రాళ్లమూటతో తిరగడం మొదలెట్టాడు. ఆ రాళ్లు రాను రాను బరువయ్యాయి. చివరిరోజు సాధువు ఆ మూటను కింద పడేయ్ అనగానే కుర్రవాడికి మనశ్శాంతి అంటే ఏమిటో అర్థమైంది. మనమంతా అనవసర రాళ్లను మోస్తూ ఉంటాం. అసూయ, కుళ్లు, కుతంత్రం, ద్వేషం, పగ, దురాశ, స్వార్థం... సంబంధం లేని వ్యక్తి/విషయం గురించి అభిప్రాయం, సామాజిక మాధ్యమాలలో ముసుగు ముఖంతో విమర్శలు గుప్పిస్తుంటాం... ఇవన్నీ బరువులు. ఈ రాళ్లను ప్రతిరోజు ఉదయాన్నే లేచి లెక్కబెట్టి పారేయండి. మనశ్శాంతి తప్పక దొరుకుతుంది.

మాట్లాడండి

నేటి మనిషి దేని గురించీ మాట్లాడటం లేదు. అన్నీ మనసులో పెట్టుకుంటున్నాడు. నీతో ఈ సమస్య ఉంది... నా వల్ల ఈ పొరపాటు జరిగింది... అని భార్యాభర్తలు, పిల్లలు, ఉద్యోగులు, ఇరుగు పొరుగు వారు మాట్లాడుకుంటే సమస్యలు లేని సామరస్య జీవితం దొరుకుతుంది. చాలా సమస్యలు కేవలం మాట్లాడకపోడం వల్ల పాషాణరూపం దాలుస్తాయి. మౌనం సమస్యకు మూలం. మౌనం వద్దు. మాట మొదలెట్టండి... మాట్లాడండి అని బోధించారు గురు గోపాల్‌దాస్.

ఆయన మాటలను వినడంతో వదిలేయకుండా ఆచరణలో పెడితేనే మనశ్శాంతి కలుగుతుంది.

– జైపూర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

ఆధ్యాత్మికథ

గుప్త దానం



స్వామి వారి దర్శనార్థం తిరుమలకొండకు చాలామంది తమిళ భక్తులు కాలినడకన వెళ్తూ ఉంటారు. వారు కాలికి చెప్పులు వేసుకోరు. ఆడామగా తేడా లేకుండా పసుపు గుడ్డలు ధరించి, భుజానికి సంచి తగిలించి, గోవింద నామస్మరణలు చేస్తూ నడుస్తారు. అలసిన సమయంలో ఏ చెట్టునో ఏ గుడినో ఆశ్రయిస్తారు. దొరికింది తింటారు.

తమిళనాడు దాటి ఆంధ్ర సరిహద్దుల్లో ప్రవేశించే దారిలో అనేక పల్లెటూర్లు ఉన్నాయి. ఆ ఊర్లలోని ఒక పల్లెటూరి యువకుడికి ఒక పౌర్ణమి రోజున నడిచి వెళ్ళే భక్తులకు అన్నదానం చేయాలనిపించి తండ్రితో ఆ విషయం చెప్పాడు. ''పేదలమైన మనం అంత ఖర్చుతో కూడుకున్న పనులు చేయలేము, ఆ ఆలోచన మానుకో!'' అన్నాడు తండ్రి.

''మన దగ్గర డబ్బు లేదు సరే, దానగుణం ఉన్న వాళ్ళు చాలామంది ఉంటారు కదా, వారిని అడుగుదాము'' అన్నాడు కొడుకు.

సరేనని కొడుకును తోడు చేసుకుని తండ్రి ఊరివారినడిగాడు. ఎవ్వరూ స్పందించలేదు. పక్క ఊరికి వెళ్ళారు. అక్కడ ఒక ధనవంతుడిని కలిశారు. తాను ఎంతమందికైనా చక్కటి విందు భోజనం ఏర్పాటు చేయగలనని, అయితే, అన్నదానం చేసే చోట తన పేరును పెద్ద అక్షరాలతో రాసి పెట్టాలని కోరాడతను. ఆలోచించి చెప్తామని అక్కడినుంచి కదిలాడు తండ్రి. వెనుకనే కొడుకు కూడా నడిచాడు.

మరో ఊరు వెళ్తూ ఉంటే దారిలో ఒక మధ్యతరగతి రైతు కనిపించాడు. ఎక్కడికి వెళ్తున్నారని అడిగాడు. అన్నదాన కార్యక్రమానికి దాతలకోసం వెదుకుతున్నామని బదులిచ్చారు. వెంటనే ఆ రైతు ''నాకు ఆ అవకాశం ఇవ్వండి. విందు భోజనం కాకపోయినా నా శక్తి కొలది మంచి భోజనమే చేయిస్తాను. అయితే నేను అన్నదానం చేసినట్లుగా ఎక్కడా ప్రచారం చేయకండి. నాకు అలాంటి ప్రచారాలు ఇష్టం లేదు'' అని చెప్పాడు. అలాగేనని తండ్రి అంగీకరించాడు.

పౌర్ణమి రోజు రానే వచ్చింది. భక్తులకు తండ్రీకొడుకు అన్నదానం చేస్తూ ఉన్నారు. కొడుకు తండ్రితో ''ఇప్పుడు మనం చేసే అన్నదానం... పులిహోర, పెరుగన్నం, అరటిపండే కదా. దీనికన్నా చక్కటి భోజనం ఏర్పాటు చేస్తానన్న అతడి విందు ఎందుకు వద్దన్నావు? అని ప్రశ్నించాడు.

తండ్రి నవ్వి ''ప్రతిఫలం ఆశించకుండా చేస్తేనే అది దానమవుతుంది. అందుకే మన పెద్దవాళ్ళు కుడిచేత్తో చేసే దానం ఎడమ చేతికి కూడా తెలియకూడదంటారు. పేరు ప్రతిష్ఠల కోసం చేసేది దానమనిపించుకోదు. అందుకే దాన్ని వద్దన్నాను'' అని వివరించాడు.

తృప్తిగా తిన్న భక్తులు 'అన్నదాతా సుఖీభవ!' అంటూ అక్కడినుంచి కదిలారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

ఆత్మీయం

బాధలూ బలమే!

అదే ఆధ్యాత్మికతకు అర్థం

లోకంలో బాధలు, కష్టాలు అందరికీ ఉంటాయి. అయితే ఒకోసారి ఎంత ప్రార్థించినప్పటికీ మన బాధలు, దుఃఖాలూ తొలగకపోగా మరిన్ని కష్టాలు చుట్టుముడుతుంటాయి. అందుకు కారణం సంచిత కర్మల వల్ల కలిగే ఆయా బాధలను, కష్టాలనూ మరు జన్మలకు మరలించేందుకు దైవం ఇష్టపడక పోవడమే! ఎందుకంటే కొన్నిరకాల కర్మల ఫలాలు ఆయా కష్టాలను లేదా బాధలను అనుభవించడం వల్లనే తీరతాయి. వాస్తవానికి కష్టాలనుంచి పారిపోవాలనుకునేవారు మానసికంగా, శారీరకంగా చాలా బలహీనంగా తయారవుతారు. ఎప్పుడూ సుఖాలనే కోరుతూ, బాధ్యతలను విస్మరించే వారి ఎదుగుదల ఎప్పుడూ సక్రమంగా ఉండదు. ఈ విషయం తెలియకనే చాలామంది కష్టం లేదా

ఆపద కలగడంతోనే, దానిని తొలగించవలసిందిగా దైవాన్ని కోరుకుంటారు. కాని దాని ఫలితం బ్యాంకులో అప్పులకు వడ్డీలు పెరిగిపోయినట్లుగా పెరిగిపోయి భవిష్యత్తులో మరింత తీవ్రతను సంతరించుకోవచ్చు. అందుకే దుర్భరమైన ఈ భవసాగరాన్ని విజయవంతంగా దాటటానికి, మనలోని చెడును, కల్మషాలను కడిగి వేయడానికి లభించిన అవకాశాలుగా ఆ కష్టాలను భావించి వాటిని అధిగమించడానికి కావలసిన మనోధైర్యాన్ని, శారీరక సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా కృషి చేయాలి.

అంతేకాదు, దైవకృప అంటే మన కష్టాలు తొలగిపోవడం మాత్రమే కాదని, దానిని భరించడానికి కావలసిన స్థిరబుద్ధిని, మానసిక నిశ్చలతను ఎదుర్కొనే బలమని గుర్తించాలి. కొందరు మహాభక్తులు తాముగా ఎన్నో రకాల శారీరక రోగాలను, అవకరాలను, ఈతిబాధలను కలిగి ఉండి కూడా తాము వాటిని మౌనంగా భరిస్తూనే ఇతరులకు వాటినుంచి బయటపడేందుకు కావలసిన శక్తిని, ధైర్యాన్ని, సూచనలను అందించడాన్ని చూస్తుంటాం. మనం ఈ శరీరంలో జీవిస్తున్నందుకు చెల్లించవలసిన పన్నులే రోగాలు, కష్టాలు అని, వాటిని చూసి బెంబేలెత్తి పోకూడదని రామకృష్ణ పరమహంస ఎప్పుడూ బోధించేవారు. కష్టంలోనూ, సుఖంలోనూ, చావులోనూ, బతుకులోనూ కూడా ఆ భగవంతుడు ఒక్కడే తమకు తోడుగా ఉన్నాడనే భావనను కలిగి ఉండటమే నిజమైన ఆధ్యాత్మికత అని ఆయన చెప్పేవారు.

– డి.వి.ఆర్.

సాక్షి సినిమా

● చిరంజీవి

నో బ్రేక్

పెద్దగా బ్రేక్ తీసుకోకుండా షూటింగ్ చేయాలని ఫిక్స్ అయినట్లు ఉన్నారు చిరంజీవి. సంక్రాంతి పండగని కుటుంబ సభ్యులతో కలిసి జోరుగా జరుపుకోవడంతో పాటు 'మన శంకర వరప్రసాద్‌గారు' సక్సెస్ సంబరంలో ఉన్న ఆయన మరో వారంలో కొత్త సినిమా సెట్‌లోకి అడుగుపెట్టనున్నారట. బాబీ కొల్లి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా ఓ సినిమా రూపొందనున్న విషయం తెలిసిందే. ఈ నెల 25న ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభించాలనుకుంటున్నారట. ఈ చిత్రంలో ఫుల్ మాస్ రోల్‌లో చిరంజీవి కనిపించనున్నారని టాక్. ఇదిలా ఉంటే... ఈ నెల 12న రిలీజ్ చేసిన 'మన శంకర వరప్రసాద్‌గారు' ఆరు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 261 కోట్లు వసూలు సాధించి, రూ. 300 కోట్ల దిశగా దూసుకెళుతోందని చిత్రబృందం పేర్కొంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో సుష్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రంలో వెంకటేశ్ కీలక పాత్ర చేసిన విషయం తెలిసిందే.

● ఎన్టీఆర్

హైదరాబాద్ టు జోర్డాన్

ఫిబ్రవరిలో జోర్డాన్ వెళ్లనుందట 'ఎన్టీఆర్‌నీల్' టీమ్. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్). ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా, ఓ కీలక పాత్రలో అనిల్ కపూర్ నటిస్తున్నారు. ఇంకా ఈ సినిమాలోని ఇతర కీలక పాత్రధారులంటూ టోవినో థామస్, కాజోల్, రష్మికా మందన్నా వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి.

ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రముఖ స్టూడియోలో వేసిన సెట్‌లో ఎన్టీఆర్ పాల్గొనగా కొన్ని నైట్ సీన్స్ చిత్రీకరించారు. ఈ షెడ్యూల్‌లోనే ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించారట. మళ్లీ ఈ వారంలో మొదలయ్యే కొత్త షెడ్యూల్‌లో ఎన్టీఆర్ పాల్గొనగా కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ జరగనుందని సమాచారం. ఈ షెడ్యూల్ ఈ నెలాఖరు వరకు సాగుతుందట. హైదరాబాద్ షెడ్యూల్ ముగిశాక మరో కీలక షెడ్యూల్ కోసం 'ఎన్టీఆర్‌నీల్' టీమ్ జోర్డాన్ వెళ్లనుందని సమాచారం. అక్కడ ఓ యాక్షన్ సీక్వెన్స్ కూడా షూట్ చేస్తారట. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.

● రజనీకాంత్

ఏప్రిల్‌లో స్టార్ట్

'తలైవర్ 173' సినిమా చిత్రీకరణ వేసవిలో ప్రారంభం కానుంది. రజనీకాంత్ హీరోగా సిబీ చక్రవర్తి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'తలైవర్ 173' (వర్కింగ్ టైటిల్). కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. కమర్షియల్ ఎంటర్‌టైనర్ జానర్‌లో ఈ సినిమా కథనం సాగుతుందని ఇటీవల ఓ సందర్భంలో రజనీకాంత్ పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని 2027 పొంగల్ పండగ సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోవైపు ప్రస్తుతం 'జైలర్ 2' చిత్రీకరణతో బిజీగా ఉంటున్నారు రజనీకాంత్. ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ వచ్చే వారంలో ప్రారంభం కానుందని కోలీవుడ్ సమాచారం. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న 'జైలర్ 2' ఈ ఏడాది జూన్‌లో విడుదల కానుంది.

● షారుక్ ఖాన్

డాన్ ఈజ్ బ్యాక్?

సిల్వర్ స్క్రీన్‌పై మరోసారి 'డాన్'గా కనిపించనున్నారట షారుక్ ఖాన్. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో షారుక్ ఖాన్ హీరోగా నటించిన 'డాన్: ది చేజ్ బిగిన్స్ ఎగైన్' (2006), 'డాన్ 2' (2011) చిత్రాలు సూపర్ హిట్స్‌గా నిలిచిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం ఫర్హాన్ అక్తర్ 'డాన్ 3' సినిమాకు శ్రీకారం చుట్టారు. ఈ సినిమాకి దర్శకత్వం వహించడంతో పాటు ఓ నిర్మాతగా కూడా ఆయన వ్యవహరిస్తారు. కాగా ఈ సినిమాలో హీరోగా రణ్‌వీర్ సింగ్‌ను ప్రకటించారు. 2023 ఆగస్టులోనే ఈ చిత్రం గురించిన అధికారిక ప్రకటన వచ్చింది. కానీ ఈ సినిమా ఇప్పటి వరకు సెట్స్‌కు వెళ్లలేదు. అయితే ఇటీవల 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ సింగ్ తప్పుకున్నారని, దీంతో ఈ ప్రాజెక్ట్ షారుక్ చెంతకు చేరే చాన్స్ ఉందనే టాక్ తెరపైకి వచ్చింది. 'డాన్ 3'లో నటించేందుకు షారుక్ ఖాన్ ఆసక్తిగానే ఉన్నారట. కాకపోతే తనకు 'జవాన్' వంటి హిట్ ఇచ్చిన దర్శకుడు అట్లీయే 'డాన్ 3' సినిమాకు దర్శకత్వం వహిస్తే బాగుంటుందనే కండీషన్ పెడుతున్నారట షారుక్ ఖాన్. మరి... ఫర్హాన్ అక్తర్ ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? 'డాన్ 3' సినిమా దర్శకత్వ బాధ్యతలు అట్లీకే అప్పగించి, తాను నిర్మాతగా ఉంటారా? లేక షారుక్ ప్రతిపాదనను వద్దనుకుని, మరో హీరోతో 'డాన్ 3' సినిమా చేస్తారా? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

● శ్రీలీల

● మీనాక్షి

సైన్స్ ఫిక్షన్‌లో...

'లవ్ టుడే', 'డ్రాగన్' (తెలుగులో 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'), 'డ్యూడ్' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు దర్శక–నటుడు ప్రదీప్ రంగనాథన్. తాజాగా ప్రదీప్ ఓ సైన్స్ ఫిక్షన్ కథను రెడీ చేశారు. ఈ సినిమా షూటింగ్‌ను ఈ ఏడాదిలోనే ప్రారంభించాలని అనుకుంటున్నారు. ఈ సినిమాలో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు ప్రదీప్. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించనుందని సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ చిత్రంలోని నటీనటుల ఎంపికపై ప్రదీప్ దృష్టి పెట్టారట. ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్స్‌కు చాన్స్ ఉందని, ఒక హీరోయిన్‌గా శ్రీలీల నటించనున్నారని, మరో హీరోయిన్‌గా మీనాక్షీ చౌదరి కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఆల్రెడీ ఈ సినిమా కథను శ్రీలీల, మీనాక్షీలకు ప్రదీప్ వినిపించారని సమాచారం మరి... ఈ సైన్స్ ఫిక్షన్స్ సినిమాకు శ్రీలీల, మీనాక్షీ చౌదరి 'సై' అన్నారా? లేదా అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

● రాజ్‌కుమార్ రావ్, పత్రలేఖ

పార్వతీ పాల్ రావ్

''ఆనందంతో నిండిపోయిన మనసులతో మాకు దక్కిన గొప్ప ఆశీర్వాదాన్ని మీకు పరిచయం చేస్తున్నాం'' అంటూ తమ కుమార్తెకు 'పార్వతీ పాల్ రావ్' అని నామకరణం చేసినట్లు రాజ్‌కుమార్ రావ్ – పత్రలేఖ దంపతులు పేర్కొన్నారు. అమ్మవారి పేరు (పార్వతి)తో మొదలై, తమ ఇద్దరి పేర్లు కలిసి వచ్చేట్లు (పత్రలేఖ పాల్‌లోని పాల్, రాజ్‌కుమార్ రావ్‌లోని రావ్) పెట్టుకున్నారు. 2014లో 'సిటీ లైట్స్' సినిమాలో నటిస్తున్న సమయంలో రాజ్‌కుమార్–పత్రలేఖ ప్రేమలో పడ్డారు. ఏడేళ్ల పాటు ప్రేమించుకుని, కుటుంబ సభ్యుల అంగీకారంతో 2021 నవంబర్ 15న పెళ్లి చేసుకున్నారు. విశేషం ఏంటంటే... వీరి పెళ్లి రోజునే గత ఏడాది పత్రలేఖ పాపకు జన్మనిచ్చారు. తాజాగా పాప ముఖం కనబడనివ్వకుండా ఆమె చిట్టి చేయిని, తమ ఇద్దరి చేతులతో పట్టుకున్న ఫొటోని షేర్ చేసి, పేరుని వెల్లడించారు.

భారతదేశం నాకు స్ఫూర్తి

– ఏఆర్ రెహమాన్

''కొన్నిసార్లు మన అభిప్రాయాలు ఇతరులకు తప్పుగా అర్థమయ్యే అవకాశం ఉందనే విషయాన్ని అర్థం చేసుకున్నాను'' అంటున్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్. ఇండస్ట్రీలో ఎనిమిదేళ్లుగా 'పవర్ షిఫ్ట్' నెలకొని ఉందని, సృజనాత్మకత లేని వారే క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని, ఇందుకు మతపరమైన అంశం కూడా కారణం కావొచ్చని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు చేశారు ఏఆర్ రెహమాన్. అంతేకాకుండా... ఆ ప్రభావం తనపై పడినట్లు తనకు అనిపించలేదు కానీ, పడిందన్నట్లుగా కొందరు గుసగుసలాడుకున్నట్లు తెలిసిందని కూడా పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను పలువురు నటీనటులు, రాజకీయ నాయకులు తప్పుపట్టారు. తాజాగా ఈ వివాదంపై ఏఆర్ రెహమాన్ స్పందిస్తూ ఓ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతదేశం నా ఇల్లు... నా గురువు... నాకు స్ఫూర్తి. కొన్నిసార్లు మన అభిప్రాయాలను ఇతరులు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని తెలుసుకున్నాను. కానీ నా ఆలోచన మాత్రం ఎప్పుడూ సంగీతం గౌరవించబడటమే... సంగీతానికి సేవ చేయడమే. అలాగే నేను ఎవర్నీ బాధపెట్టాలనుకోవడం లేదు. నా నిజాయితీని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. ఇక భావవ్యక్తీకరణ స్వేచ్ఛ కలిగిన భారతదేశంలో నేను భారతీయుడిగా ఉండడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో 'వేవ్స్ సమ్మిట్–2025'లో ఝాలా ప్రదర్శన, రూహ్–ఎ–నూర్, సన్ షైన్ ఆర్కెస్ట్రాకు మార్గదర్శకత్వం వహించడం, ఇండియాస్ ఫస్ట్ మల్టీకల్చరల్ వర్చ్యువల్ బ్యాండ్ 'సీక్రెట్ మౌంటైన్'ను బిల్డ్ చేయడం, హన్స్ జిమ్మర్‌తో కలిసి 'రామాయణ' సినిమాకు సంగీతం అందిస్తుండటం... ఇలా ప్రతిదీ నా జర్నీని బలోపేతం చేస్తుందని అనుకుంటున్నాను. ఈ దేశానికి కృతజ్ఞతతో ఉంటాను. జై హింద్. జయహో..'' అంటూ ఈ వీడియోలో మాట్లాడారు రెహమాన్. 'మా తుఝే సలామ్, వందేమాతరం' అంటూ ఓ స్టేడియంలో ఆడియన్స్ పాడుతున్న విజువల్స్ కూడా ఈ వీడియోలో ఉన్నాయి.

సాక్షి వెల్త్ By ప్రాఫిట్ ప్లస్
సోమవారం
19-1-2026

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (12-1-26 నుంచి 16-1-26 వరకు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
6	11
83,570	25,694

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,529	▽	1
డోజోన్స్	49,363	▽	79
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,235	▽	4
డాక్స్	25,297	▽	55
షాంఘై	4,102	▽	10
నికాయ్	53,936	▽	41

అమెరికా, బ్రిటన్, జర్మనీ, చైనా, జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	89.75	90.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	119.90	122.88
€	యూరో	ఎస్‌బీఐ	103.70	106.57
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.05	57.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.98	61.87
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.85	71.59
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.18	24.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.69	24.95
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.07	13.89

మొసళ్లుంటాయ్... జాగ్రత్త!

- స్టాక్‌మార్కెట్ సముద్రంలో అడుగడుగునా గండాలే
- కొత్తకొత్త రూపాలతో ముందుకొస్తున్న మోసగాళ్లు
- మార్కెట్లు పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లకు గాలం
- ర్యాలీని ఆసరా చేసుకుని అనామక షేర్ల హవా
- టిప్స్ అంటూ వాట్సాప్‌లో నకిలీ నిపుణుల వల
- ఫేక్ ప్లాట్‌ఫామ్‌లతో లేని లాభాలు చూపిస్తూ మోసం
- అధికారిక సమాచారం, కాస్త రీసెర్చ్ అవసరం
- ఇన్‌స్టంట్ లాభాలకు ఆశపడితే అంతే సంగతి

స్టాక్ మార్కెట్లు అదేపనిగా పెరుగుతున్నాయి. దీంతో ఇప్పటిదాకా దూరంగా ఉన్నవాళ్లు కూడా పెట్టుబడి పెడితే బాగుంటుంది కదా అని ఊగిసలాడుతున్నారు. ఇదే అదనుగా మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. ఏఐ అండతో ఏకంగా నకిలీ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్స్‌నే సృష్టిస్తున్నారు. నకిలీ లాభాలు చూపిస్తున్నారు. 10వేలు విత్‌డ్రా చేయనిచ్చి... 10 లక్షలు లాగేస్తున్నారు. కొందరి దగ్గరైతే కోట్లు కొట్టేస్తున్నారు. ఈ మధ్య హైదరాబాద్‌లో సాక్షాత్తూ సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ భార్యనే మోసం చేశారంటే మోసగాళ్లు ఏ స్థాయిలో రెచ్చిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. చాలామందికి లాభాల ఆశచూపించి... నకిలీ ఖాతాల్లోకి నగదు వేయించుకుని చెక్కేస్తున్నారు. ఇవన్నీ ఒకెత్తయితే... మార్కెట్ ర్యాలీలో భాగంగా కొన్ని అనామకపు షేర్లు కూడా హల్‌చల్ చేస్తున్నాయి. ఫలానా షేరు కొంటే నెలలో రెండింతలవుతుందంటూ ఎస్ఎంఎస్‌లూ వస్తున్నాయి. వీటి వలలో చిక్కుకుని చాలామంది విలవిలలాడుతున్నారు. మరి దీనికి మార్గమేంటి? స్టాక్ మార్కెట్ అంటే మోసం మాత్రమే కాదు కదా? ఈ మోసాల బారిన పడకుండా ఉండటమెలా? మన డబ్బులు మనం కాపాడుకోవటం ఎలా? ఇదే ఈ వారం బిగ్ 'వెల్త్ స్టోరీ'.

నకిలీలు, మోసగాళ్ల సంగతి పక్కనబెడితే... ముందుగా మార్కెట్లో ట్రేడవుతున్న షేర్లతోనే ఎలాంటి స్కామ్‌లు చేస్తారో ఒకసారి తెలుసుకుందాం.

పంప్ అండ్ డంప్..

పెద్దగా ఎవరికీ తెలియన ఓ అనామకపు షేరు ఉన్నట్టుండి తెరమీదికి వస్తుంది. అప్పటిదాకా స్తబ్దుగా ఉన్న ఆ షేరు ధర అప్పటికే పెరగటం మొదలవుతుంది. దీనికి గురించి సోషల్ మీడియాలో ఫిన్‌ఫ్లుయెన్సర్లు ఊదరగొడతారు. ఊరూపేరూ లేని ఎస్ఎంఎస్‌లు కూడా వచ్చేస్తుంటాయి. అప్పటిదాకా ఆ షేరు గురించి తెలియనివారు కొందరు ఇన్వెస్ట్ చేయటం మొదలుపెడతారు. కొందరు వేచి చూద్దామని వాచ్‌లిస్ట్‌లో పెడతారు. అది మెల్లగా పెరుగుతుంటుంది. దీంతో అందరూ ఎగబడతారు. అంతే... అప్పటికే దాన్ని కొనిపెట్టుకున్న స్టాక్‌మార్కెట్ తిమింగలాలు రేటు పెరిగే కొద్దీ వాటిని అమ్మేస్తుంటారు. బాగా సొమ్ము చేసుకుంటారు. ఒక దశ తర్వాత వేగంగా ఆ షేరు కుప్పకూలుతుంది. మళ్లీ లేచినా... కొద్దిరోజులకే మళ్లీ పడుతుంది. భారీ రేటుకు కొన్న ఇన్వెస్టర్లు ఇరుక్కు పోయినట్లే!!.

ఇన్‌సైడర్ ట్రేడింగ్

కంపెనీలు బయటకు వెల్లడించని సమాచారం కూడా యాజమాన్యానికి తెలిసి ఉంటుంది. అది సహజం. దీన్ని ఆధారం చేసుకుని యాజమాన్యంగానీ, వారికి దగ్గరగా ఉండే వారు గానీ ఆ కంపెనీ షేర్లలో ట్రేడింగ్ చేస్తుంటారు. కంపెనీకి ప్రతికూలంగా ఉండే సమాచారం గనక వారికి తెలిస్తే... షేర్లను విక్రయించేయటం, సానుకూలమైన సమాచారం తెలిస్తే కొని పెట్టుకోవటం చేస్తుంటారు. ఆ తరువాత సమాచారం బయటకు వస్తుంది. దానికి తగ్గట్టుగా షేరు రియాక్ట్ అవుతుంది. దీనివల్ల ముందే ట్రేడింగ్ చేసిన కంపెనీ ఇన్‌సైడర్లు బాగుపడతారు. కాబట్టే దీన్ని ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటారు. ఇలాంటి సందర్భాల్లో షేరు పెరగడానికి లేదా పడటానికి అసలు కారణాలేంటో తెలియని ఇన్వెస్టర్లు నష్టపోతూ ఉంటారు.

బాయిలర్ రూమ్ ఆపరేషన్స్

బాయిలర్ రూమ్‌లో ఎవరూ ఎక్కువసేపు ఉండలేరు. తక్షణం బయటపడేలా బాయిలర్ ఒత్తిడి చేస్తుందన్న మాట. అదే తరహాలో... మంచి తరుణం మించిన దొరకదు, లాస్ట్ చాన్స్ అంటూ ఊరూ పేరూ లేని, పనికిమాలిన స్టాక్స్‌ను కొనిపించేలా కొందరు బ్రోకర్లు, ఫిన్‌ఫ్లుయెన్సర్లు ఒత్తిడి పెంచుతుంటారు. దాన్ని వాళ్లు సొమ్ము చేసుకుంటారు.

పోంజీ, పిరమిడ్ స్కీములు

ఇన్వెస్ట్‌మెంట్ స్కీములో కొత్తగా ఎవరినైనా చేరిస్తే, భారీగా లాభాలిస్తామంటారు. కానీ అసలు లాభాల్లో నుంచి కాకుండా, కొత్త ఇన్వెస్టర్ల నుంచి తీసుకున్న డబ్బులో కొంత పాత ఇన్వెస్టర్లకు చెల్లిస్తుంటారు. అంతిమంగా ఇలాంటి స్కీములు ఎక్కడో ఒక దగ్గర ఆగిపోతాయి. లింకు తెగి అప్పటి దాకా ఇన్వెస్ట్ చేసిన వాళ్లంతా కుప్పకూలుతారు.

ఫాంటమ్ ఇన్వెస్ట్‌మెంట్స్

వీటినే ఫాంటమ్ రిటర్న్స్', ఫాంటమ్ అసెట్స్ అని కూడా పిలుస్తుంటారు. ఫాంటమ్ అనేది ఊహే కదా... అలాగే ఈ ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా అన్నమాట. అసలు ఉనికిలోనే లేని నకిలీ స్టాక్స్, బాండ్స్, ఫండ్స్‌లాంటి వాటిని అంటగడతారు. నకిలీ లాభాలు చూపిస్తుంటారు. నకిలీ స్టేట్‌మెంట్లు పంపిస్తారు. అంతా రియల్ అనుకుని, లాభాలు పెరుగుతుండటం చూసి మరింత పెట్టుబడి పెట్టేస్తుంటారు. ఎప్పుడైనా విత్‌డ్రా చేద్దామని అనుకుంటే... ఆ రోజే మొత్తం సిస్టమ్ మాయమైపోతుంది. ఈ మధ్య ఇలాంటివి బాగా పెరిగాయి.

తప్పుడు రీసెర్చ్ రిపోర్టులు

కొన్ని ఊరూపేరూ లేని సంస్థల నుంచి రీసెర్చ్ రిపోర్టులంటూ బయటికొస్తాయి. వారు కావాలనుకున్న షేరు తాలూకు భవిష్యత్తును ఊదరగొడుతూ చూపిస్తారు. రకరకాల మెయిల్స్ ద్వారా ఈ రిపోర్టులు వచ్చి పడుతుంటాయి. నిజమేనని నమ్మి ఇన్వెస్ట్ చేస్తే అంతే గతి.

అనధికారిక ట్రేడింగ్

ఒక్కోసారి కమీషన్ కోసం కక్కుర్తి పడి ఏజెంట్లు లేదా బ్రోకర్లు మీ అనుమతి లేకుండా మీ అకౌంట్లో అనధికారికంగా ట్రేడింగ్ చేస్తుండవచ్చు. దీన్ని జాగ్రత్తగా గమనిస్తుండాలి.

మోసపూరిత అడ్వైజరీ స్కాములు

సడెన్‌గా వాట్సాప్‌లో ఓ మెసేజ్ వస్తుంది. ఫలానా గ్రూపుకు చెందిన నిపుణుడు సలహాలిస్తాడంటూ లింకు పంపిస్తారు. ఆ గ్రూపు లో చేరితే... అప్పటికే కొందరు ఆ ఎక్స్‌పర్ట్‌ను పొగుడుతూ ఉంటారు. మీరిచ్చిన సలహా వల్ల నేను లక్షలు సంపాదించానంటూ మెసేజీలు పెడుతుంటారు. ఆ సలహా ఏంటో... ఎప్పుడిచ్చారో కూడా మనకు తెలీదు. ఇలా కొందరు చేస్తుండగానే... ఫలానా చోట ఖాతా తెరిస్తే తాను నేరుగా సలహాలిస్తానంటూ సదరు నిపుణుడు చెబుతాడు. అందులో ఉన్నదంతా ఆ నిపుణుడి మనుషులే కాబట్టి 'సరే సర్'.. అంటారు. అదంతా నిజమని నమ్మి మనం కూడా ఖాతా తెరిచినా... ఎక్స్‌పర్ట్‌కు ఫీజు చెల్లించినా... అంతే సంగతి.

మరి తప్పించుకోవటమెలా?

మరి ఇన్ని రూపాల్లో మోసగాళ్లు దాడులు చేస్తుంటే మనని మనం కాపాడుకోవటం ఎలా? ఈ సందేహానికి సమాధానం ఒక్కటే... ఆథరైజ్డ్ అవునా కాదా అన్నది చూసుకోవటం. రూపాయి పెట్టుబడి పెడుతున్నా సరే, ఇన్వెస్టింగ్‌కు ముందే బ్రోకర్ లేదా ప్లాట్‌ఫాం గురించి ధ్రువీకరించుకోవాలి. సెబీలోను, ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈలోను రిజిస్టర్డా కాదా అన్నది తెలుసుకోవాలి. సెబీలో నమోదు చేసుకోనివారికి ఎవరికైనా... పెట్టుబడి సలహాలివ్వడానికి గానీ మీ డబ్బును మేనేజ్ చేయడానికి గానీ చట్టబద్ధమైన అర్హత ఉండదు.

- గ్యారంటీ రాబడులొస్తాయని చెబితే...! ఎందుకంటే స్టాక్ మార్కెట్లో రాబడులకు గ్యారంటీ ఉండదు.
- వెంటనే నిర్ణయం తీసుకోకపోతే నష్టపోతారంటూ ఒత్తిడి చేస్తే...! ఎందుకంటే ఒత్తిడిలో ఏ నిర్ణయమూ తీసుకోవద్దు.
- అవాంఛిత కాల్స్, మెసేజీలు లేదా ఈమెయిల్స్ ద్వారా వచ్చిన సమాచారాన్ని నమ్మొద్దు. ఎందుకంటే ఆ సమాచారం సరైనదైతే మీకెందుకు పంపుతారు? వాళ్లే ఉపయోగించుకుంటారుగా!.
- నమ్మశక్యం కాని ఆఫర్లు ఇస్తే నమ్మొద్దు
- గుర్తు తెలియని ప్రొఫైల్స్ లేదా ఫేక్ యోగ్యతాపత్రాలు చూపిస్తే పట్టించుకోవద్దు
- ఎవరైనా సరే ''మీ డబ్బు చాలా వేగంగా రెట్టింపవుతుంది'' అంటూ హామీ ఇస్తున్నారంటే, అది సలహా కాదు, అలర్టవ్వాల్సిన విషయమని గుర్తుంచుకోవాలి.

శక్తివంతమైన ఆయుధాలున్నాయ్..

ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండేందుకు, మన చేతిలోనే కొన్ని శక్తివంతమైన ఆయుధాలున్నాయి. వాటిని కాస్త పదును పెట్టుకుంటే సరి. అవేంటంటే...

- ఏ అంశాన్నయినా లోతుగా పరిశీలించాలి..
- కంపెనీ ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవాలి
- కంపెనీ వార్షిక నివేదికలను చదవాలి
- వార్తలను విశ్వసనీయ సోర్స్‌ల ద్వారానే ధృవీకరించుకోవాలి
- సెబీ ఇన్వెస్టర్ హెల్ప్‌లైన్
- ఎన్ఎస్ఈ/బీఎస్ఈ అలర్టులు
- ప్రామాణికమైన ఫైనాన్షియల్ న్యూస్ ప్లాట్‌ఫాంలు

బేసిక్ అంశాలను తెలుసుకోవాలి ..

పెట్టుబడుల పెట్టే ముందు ఇలాంటి కొన్ని ఆర్థికాంశాల గురించి తెలుసుకుంటే మంచిది.

- పీ/ఈ నిష్పత్తి (కంపెనీ లాభాన్ని సంవత్సరాలతో గుణించడమన్న మాట)
- ఎర్నింగ్స్ పర్ షేర్ (ఈపీఎస్- సదరు కంపెనీ ఒక షేరుకు ఎంత చొప్పున ఆర్జిస్తోంది)
- రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్వోఈ- షేర్‌హోల్డర్ల ప్రతి రూ.100కు కంపెనీ ఎంత లాభాన్ని తెస్తోంది) అంకెల గురించి అంతగా అర్థం కాకపోయినా ఫర్వాలేదని, గుడ్డిగా ఇన్వెస్ట్ చేసేయొద్దు.

ఈ ప్రశ్నలు వేసుకోవాలి..

పెట్టుబడికి ముందు కొన్ని ప్రశ్నలు వేసుకోవాలి. అవేంటంటే..

- అసలు సదరు కంపెనీ ఏం చేస్తుంది?
- దాన్ని నడిపేది ఎవరు? వారికి విశ్వసనీయత ఉందా?
- ఆదాయం నిజమైనదేనా? నిలకడగా వచ్చేదేనా?
- ఈ పెట్టుబడి ఎందుకు పెట్టానో ఎవరు అడిగినా సరళంగా వివరించగలనా?
- ఏదైనా తేడా వస్తే బైటపడే మార్గమేంటి?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చుకోలేకపోతే, కాస్త ఆగి, ఆలోచించాలి.

ఆన్‌లైన్ ఖాతాలను రక్షించుకోవాలి..

డిజిటల్ భద్రతకు చెక్‌లిస్ట్

- 2-ఫ్యాక్టర్ ఆథెంటిఫికేషన్‌ని ఎనేబుల్ చేయాలి
- బలమైన, ప్రత్యేకమైన పాస్‌వర్డ్‌లను వాడాలి
- ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దు
- సందేహాస్పద లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలి
- అధికారిక సోర్సుల నుంచే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్రస్తుత ప్రపంచంలో మిమ్మల్ని ముంచినా మీ ఫోనే... మిమ్మల్ని కాపాడగలిగేది కూడా మీ చేతిలోని ఫోనే.

ఫ్రాడ్ అని అనుమానం వస్తే..

వెంటనే యాక్షన్ తీసుకోవాలి. సత్వరం ఫిర్యాదు చేస్తే రికవరీ చేసేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఏ మాత్రం జాప్యం చేసినా మోసగాళ్లు తప్పించుకునేందుకు అవకాశం ఇచ్చినట్లవుతుంది. ఈ కింది వాటికి రిపోర్ట్ చేయాలి.

- సెబీ ఆన్‌లైన్ కంప్లైంట్ పోర్టల్
- ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈ
- మీ బ్రోకర్
- లోకల్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్

ఆరోగ్యకరమైన మైండ్‌సెట్

పెట్టుబడులకు సంబంధించి ఆరోగ్యకరమైన ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలి.

- హైప్‌ని బట్టి కాకుండా దీర్ఘకాలిక లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేయాలి
- పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యం పాటించాలి. అంటే డబ్బంతా ఒకే దాంట్లో ఇన్వెస్ట్ చేయకుండా, కొంత ఈక్విటీ, కొంత డెట్, కాస్తంత బంగారంలో పెట్టుబడి పెడితే ఎటు పోయి ఎటొచ్చీ ఏదైనా పడిపోయినా మరొకటి మెరుగ్గా ఉండటం వల్ల ఓవరాల్‌గా రిస్కులు తగ్గుతాయి.
- 'హాట్ టిప్స్' వెంటబడకూడదు. చేతులు కాల్చుకోకూడదు.
- FOMO.. అంటే ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్. సింపుల్‌గా చెప్పాలంటే ఇప్పుడు ఇన్వెస్ట్ చేయకపోతే ఇక ఎప్పటికీ కుదరదు, ఆ మంచి అవకాశం ఇక దొరకనే దొరకదు అన్నట్లుగా ఒక్కోసారి కంగారు పుట్టించే పరిస్థితులు ఎదురవుతుంటాయి. స్కామర్లు ఇలాంటివాటిని ఆయుధాలుగా వాడుకుంటూ ఉంటారు. జాగ్రత్త వహించాలి.
- సిసలైన ఇన్వెస్ట్‌మెంట్ అనేది చాలా బోరింగ్‌గానే ఉంటుంది. కానీ అదే మంచిది. ఓపిగ్గా, రీసెర్చ్ చేసి, క్రమశిక్షణతోనే పెట్టుబడుల ఫలాలు అందుకోవచ్చు. షార్ట్‌కట్‌లంటూ ఉండవు. స్టాక్ మార్కెట్ అనేది అన్ని వివరాలను తెలుసుకుని, జాగ్రత్తగా వ్యవహరించే ఇన్వెస్టర్లకు మాత్రమే లాభాలనిస్తుంది. అజాగ్రత్తగా ఉండే వారిని నష్టాలతో శిక్షిస్తుంది. పెట్టుబడులకు సంబంధించి ఎప్పటికప్పుడు కొత్త వివరాలను తెలుసుకునేందుకు ఆసక్తిగా ఉండాలి. అదే సమయంలో అప్రమత్తంగానూ ఉండాలి. రాత్రికి రాత్రి లాభాలు గడించాలనుకోవడం కాకుండా పెట్టుబడిని కాపాడుకోవడానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలి!.

క్యూ3 ఫలితాలే దిక్సూచి

ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను ప్రధానంగా క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాలే నిర్దేశించనున్నాయి. ఫిబ్రవరి 1న ప్రకటించనున్న బడ్జెట్ వైపు ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నప్పటికీ సమీపకాలంలో కార్పొరేట్ పనితీరు, గ్లోబల్ అంశాలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

- వారాంతాన పనితీరు వెల్లడించిన దిగ్గజాలు
- జాబితాలో రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్
- ఇకపై భెల్, పీఎన్‌బీ, బీవోఐ, డీఎల్ఎఫ్, బీపీసీఎల్
- ఇండిగో, పీఎన్‌బీ, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, అదానీ గ్రీన్ రెడీ
- ఈ వారం మార్కెట్ల ట్రెండ్‌పై విశ్లేషకుల అంచనాలు



గత వారాంతాన ఇండెక్స్‌లను ప్రభావితం చేయగల బ్లూచిప్ కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసిక ఫలితాలు ప్రకటించాయి. డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు.. బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ క్యూ3 పనితీరు వెల్లడించాయి. ఈ ప్రభావం నేడు(19న) కనిపించనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఇదేవిధంగా ఈ వారం మరిన్ని కంపెనీలు క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాలు విడుదల చేయనున్నాయి. ఈ జాబితాలో బీహెచ్‌ఈఎల్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, డీఎల్ఎఫ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్, ఎల్‌టీఐమైండ్‌ట్రీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ గ్రీన్ ఎనర్జీ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తదితరాలు చేరాయి. వీటితోపాటు పలు మిడ్, స్మాల్ క్యాప్ కౌంటర్లు ప్రకటించనున్న ఫలితాలపై ఇన్వెస్టర్లు దృష్టిపెట్టనున్నట్లు నిపుణులు తెలియజేశారు.

ట్రంప్ ఎఫెక్ట్

యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ వెనిజువెలా అధ్యక్షుడిని అరెస్ట్ చేయడంసహా.. ఇరాన్‌లో అంతర్యుద్ధానికి మద్దతు పలకడం, గ్రీన్‌ల్యాండ్ తమదే నంటూ ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లలో ఆందోళనలను పెంచినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో రక్షణాత్మక పెట్టుబడి సాధనాలుగా భావించే పసిడి, వెండి ధరలు రేసు గుర్రాల్లా పరుగు తీస్తున్నట్లు తెలియజేశారు. వెరసి రిస్క్ పెట్టుబడులు నీరసించే వీలున్నట్లు విశ్లేషించారు. మరోపక్క యూఎస్‌తో భారత్ వాణిజ్య చర్చలు ఒక కొలిక్కిరాకపోవడం సైతం సెంటిమెంటును బలహీనపరుస్తున్నట్లు తెలియజేశారు.

విదేశీ గణాంకాలు

నేడు చైనా.. అక్టోబర్-డిసెంబర్(క్యూ4) జీడీపీ గణాంకాలు ప్రకటించనుంది. జూలై-సెప్టెంబర్(క్యూ3)లో ఎకానమీ 4.8 శాతం ఎగసింది. ఈ బాటలో డిసెంబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి, రిటైల్ అమ్మకాల గణాంకాలు సైతం వెల్లడికానున్నాయి. పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా వడ్డీ రేట్లపై స్పందించనుంది. ఇక మరోవైపు యూఎస్ క్యూ3 జీడీపీ వృద్ధి రేటు తుది గణాంకాలు విడుదలకానున్నాయి. ఈ నెల 17కల్లా నమోదైన నిరుద్యోగ గణాంకాలు ప్రకటించనుంది. వారం చివర్లో యూఎస్‌తోపాటు.. దేశీయంగా తయారీ, సర్వీసుల రంగ పీఎంఐ ఇండెక్సులు విడుదలకానున్నాయి. కాగా.. 27 దేశాలతోకూడిన యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య చర్చలు తుది దశకు చేరినట్లు వాణిజ్యం, పరిశ్రమల కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించడం సానుకూల అంశమని నిపుణులు పేర్కొన్నారు. నెలాఖరుకల్లా ఒప్పందం ఖరారుకానున్నట్లు మంత్రి తెలియజేశారు.

సాంకేతికంగా చూస్తే

గత వారం తొలి రోజు మార్కెట్లు పతనమైనప్పటికీ తదుపరి కోలుకున్నాయి. వెరసి ఇండెక్సులు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ నికరంగా 6 పాయింట్లు నీరసించి 83,570 వద్ద నిలవగా.. నిఫ్టీ 11 పాయింట్లు బలపడి 25,694 వద్ద స్థిరపడింది. ఈ వారం సెన్సెక్స్ 83,000-82,800 పాయింట్ల వద్ద సపోర్ట్ తీసుకోవచ్చు. బలపడితే 84,300ను అధిగమించవచ్చు. నిఫ్టీకి 25,500 పాయింట్ల వద్ద సపోర్ట్, 26,000 వద్ద రెసిస్టెన్స్‌కు చాన్స్ ఉంది!

ఎఫ్‌పీఐల అమ్మకాల స్పీడ్

ఈ నెలలో రూ. 22,350 కోట్లు వెనక్కి

కొద్ది నెలలుగా దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే కట్టుబడుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఈ నెలలో సైతం ఇదే బాటలో నడుస్తున్నారు. జనవరిలో ఇప్పటివరకూ(1-16) ఎఫ్‌పీఐలు నికరంగా 2.5 బిలియన్ డాలర్ల(రూ. 22,530 కోట్లు) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇందుకు ప్రపంచ కరెన్సీలతో బలపడుతున్న డాలర్, యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ మెరుగుపడటం ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. గత కేలండర్ ఏడాది(2025)లోనూ కొన్ని నెలలు పెట్టుబడులకు ఆసక్తి చూపినప్పటికీ నికరంగా 18.9 బిలియన్ డాలర్ల(రూ. 1.66 లక్షల కోట్లు) విలువైన స్టాక్స్ విక్రయించడం గమనార్హం! ప్రపంచ వాణిజ్య టారిఫ్‌ల ఆందోళనలు, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఇందుకు కారణంకాగా.. డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ రూపాయి 5 శాతం పతనమైంది. 2025 డిసెంబర్‌లో సరికొత్త కనిష్టం 91కు బలహీనపడిన విషయం విదితమే.

డిజిలాజిక్ సిస్టమ్స్ ఐపీవో 20న

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రక్షణ, ఏరోస్పేస్ రంగానికి ఆటోమేటెడ్ టెస్ట్ ఎక్విప్‌మెంట్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్ సేవలందించే హైదరాబాద్ సంస్థ డిజిలాజిక్ సిస్టమ్స్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ జనవరి 20న ప్రారంభమై 22న ముగియనుంది.



ఐపీవో కింద తాజా షేర్ల జారీ ద్వారా రూ. 69.67 కోట్లు సమీకరించనుండగా, ఆఫర్ ఫర్ సేల్ కింద రూ. 11.33 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు. ఒక్కో షేరు ధర శ్రేణి రూ. 98-104గా, లాట్ పరిమాణం 1,200 షేర్లుగా ఉంటుంది. ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ. 51.73 కోట్లను కొత్త ప్లాంటు ఏర్పాటుకు కంపెనీ వినియోగించుకోనుంది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫాంలో షేర్లు లిస్ట్ కానున్నాయి.

బంధన్ ఎంఎఫ్ నుంచి 2 ఫండ్స్

పసిడి, వెండికి డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో బంధన్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్, సిల్వర్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్‌లను ప్రవేశపెట్టింది. జనవరి 20 వరకు ఇవి అందుబాటులో ఉంటాయి. కనీసం రూ. 1,000 నుంచి, సిప్ విధానంలోనైతే రూ. 100 నుంచి ఈ ఫండ్ ఆఫ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సులభతరంగా, పారదర్శకంగా పసిడి, వెండిలో పెట్టుబడులు పెట్టేందుకు ఇవి ఉపయోగపడతాయి. పోర్ట్‌ఫోలియో డైవర్సిఫికేషన్‌కి ఇవి సహాయకరంగా ఉంటాయని బంధన్ ఏఎంసీ సీఈవో విశాల్ కపూర్ తెలిపారు.

విజయం అనేది అంతిమమైనది కాదు. వైఫల్యం ప్రాణాంతకమైనదికాదు. కొనసాగించే ధైర్యం మాత్రమే ముఖ్యమైనది.
- విన్స్టన్ చర్చిల్, బ్రిటన్ మాజీ ప్రధాని, రచయిత

మీరు యాక్టివా.. పాసివా?

స్టాక్ మార్కెట్లపై పెద్దగా అవగాహన లేనివారు... షేర్ల గురించి ఎక్కువగా తెలియని వారు కూడా మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఎందుకంటే ఏ షేర్లో ఎప్పుడు ఎంత ఇన్వెస్ట్ చేయాలో, ఎప్పుడు వెనక్కు తీసుకోవాలో అవన్నీ చూసుకోవటానికి మ్యూచువల్ ఫండ్లలో ఓ పెద్ద వ్యవస్థ ఉంటుంది. అవన్నీ చేస్తూ... ఏడాది తిరిగేసరికల్లా చక్కని రాబడిని స్తాయి కనక మ్యూచువల్ ఫండ్లు చాలామందిని ఆకర్షిస్తుంటాయి. బ్యాంకు వడ్డీని మించి రాబడి సాధించాలన్నా... ద్రవ్యోల్బణాన్ని తట్టుకోవాలన్నా ఇదో మంచి మార్గం. సరే! మరి ఏ ఫండ్లో ఇన్వెస్ట్ చేయాలి? అంటే షేర్లలోను, బాండ్ల లోను ఇన్వెస్ట్ చేసేయాక్టివ్ ఫండ్స్లోనా? లేక ఇండెక్స్లలో మాత్రమే పెట్టుబడి పెట్టే పాసివ్ ఫండ్స్లోనా? ఏది బెటర్? దీన్ని వివరించేదే ఈ 'వెల్త్ స్టోరీ'...

రూ.81 లక్షల కోట్లకు చేరిన మన మ్యూచువల్ ఫండ్ల విలువ

- అందులో రూ.14 లక్షల కోట్లకు చేరిన పాసివ్ ఫండ్స్ వాటా
- ఇండెక్స్లలో ఇన్వెస్ట్ చేసే పాసివ్ ఫండ్స్కు ఖర్చులు తక్కువ
- దీర్ఘకాలంలో దీనివల్ల చాలా లాభం... అందుకే ఇన్వెస్టర్ల మొగ్గు
- ఫస్ట్ టైమర్స్, దీర్ఘకాలిక సిప్ ఇన్వెస్టర్లకిది ప్రయోజనకరం
- పాసివ్ ఫండ్స్లో రిస్కూ ఎక్కువే... రాబడీ ఎక్కువే
- అనుభవజ్ఞులకు, రిస్కు తీసుకునేవారికి అనుకూలం
- రెండిటినీ కలిపే హైబ్రిడ్ విధానం మేలంటున్న నిపుణులు

భారతదేశ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ ఏకంగా రూ.81 లక్షల కోట్లకు చేరిందిపుడు, ఒకరకంగా ఇది రికార్డు స్థాయి. ఇందులో పాసివ్ ఫండ్స్ విలువ దాదాపు రూ.14 లక్షల కోట్లు. మిగిలిన విలువ యాక్టివ్ ఫండ్స్‌ది. అసలు మనదేశంలో ఇండెక్స్‌లో మాత్రమే ఇన్వెస్ట్ చేసే పాసివ్ ఫండ్ల విలువ రూ.14 లక్షల కోట్లకు చేరుతుందని ఎవరైనా ఊహించారా? మున్ముందు ఇది ఇంకా పెరుగుతుందనేది నిపుణుల మాట. దీంతో పాసివ్ ఫండ్లు మంచివా... లేక యాక్టివ్ ఫండ్సా అనే చర్చ మళ్లీ జోరందుకుంది. నైపుణ్యం, అనుభవం ఉన్న ఫండ్ మేనేజర్లు మాత్రమే, నిరంతరం మార్కెట్‌ని మించి రాబడులు అందించగలరనే భావన కొన్నాళ్ల కిందటిదాకా ఉండేది. కానీ, ఇపుడు చాలా మంది ఇన్వెస్టర్లు క్రమంగా ఖర్చులను ఆదా చేసే, సరళంగా ఉండే, దీర్ఘకాలికంగా విశ్వసనీయంగా ఉండే పాసివ్ విధానంవైపు మళ్లుతున్నారు. ఈ రెండింట్లో ఉండే సానుకూల, ప్రతికూలాంశాలు చూస్తే...

ఖర్చులు కీలకం..

ఇండెక్స్ ఫండ్స్‌కి సంబంధించిన పెద్ద సానుకూల అంశం ఖర్చులు తక్కువగా ఉండటం. డైరెక్ట్ ప్లాన్లయితే సాధారణంగా 0.1 శాతం నుంచి 0.3 శాతం వరకు ఉంటాయి. మరోవైపు, యాక్టివ్ ఫండ్లు సాధారణంగా 1.5 – 2.5 శాతం శ్రేణిలో చార్జీలు విధిస్తాయి. కాలక్రమేణా ఈ చార్జీలన్నీ కలిపితే తడిసి మోపెడవుతుంది. దీర్ఘకాలంలో ఇదొక సైలెంట్ వెల్త్ కిల్లర్‌లాంటిది. 20–25 ఏళ్ల వ్యవధిలో చూస్తే ఆఖర్లో ఈ వ్యయాల భారం పెట్టుబడి, నిధిని బట్టి లక్షలు, కోట్లల్లోనూ ఉంటుంది. ఆ మేరకు రాబడీ తగ్గుతుంది.

ఇండెక్స్ వర్సెస్ యాక్టివ్ ఫండ్స్..

ఇండెక్స్ ఫండ్స్ అంటే, సెన్సెక్స్, నిఫ్టీ50, నిఫ్టీ– 500 లాంటి నిర్దిష్ట మార్కెట్ సూచీని ప్రతిబింబించేవి పాసివ్ ఫండ్స్. ఇవి ఆ సూచీలోని స్టాక్స్‌లో, అదే పరిమాణంలో ఇన్వెస్ట్ చేస్తాయి. ప్రత్యేకంగా షేర్లను ఎంచుకోవడం, మంచి సమయం కోసం వేచి ఉండటంలాంటిది ఉండదు. ఈ తరహా ఫండ్స్‌లో ఖర్చులు చాలా తక్కువ. దాదాపు సదరు ఇండెక్స్ స్థాయిలో పనితీరు కనపరుస్తాయి (కొంత వ్యయాలు పోగా).

అదే యాక్టివ్ ఫండ్స్‌ని తీసుకుంటే బెంచ్‌మార్క్‌కి మించిన రాబడులను అందించేలా వీటిని ప్రొఫెషనల్స్ నిర్వహిస్తుంటారు. ఇందుకోసం అధ్యయనం, షేర్ల ఎంపిక, వ్యూహాత్మకంగా సర్దుబాట్లు చేయడంలాంటి హడావిడి ఉంటుంది. ఈ తరహా ఫండ్‌లు ప్రామాణిక సూచీలకు మించిన పనితీరు సాధించే అవకాశం ఉంటుంది. వీటిల్లో పరిశోధనలు, ట్రేడింగ్ యాక్టివిటీ చాలా ఎక్కువగా ఉంటుంది. అలాగే, ఖర్చుల నిష్పత్తి కూడా ఎక్కువే.

ఏవి ఎలా ఉంటాయ్..

ఇండెక్స్ ఫండ్స్ పూర్తి పారదర్శకంగా ఉంటాయి. ఏదో ఒక్క మేనేజరు మీదే ఆధారపడాల్సిన పరిస్థితి ఉండదు. మార్కెట్ హెచ్చుతగ్గులపరమైన ప్రభావమే తప్ప నిర్దిష్ట స్టాక్‌పరమైన ప్రతికూల ప్రభావం ఉండదు. మరోవైపు, యాక్టివ్ ఫండ్స్ విషయానికొస్తే ఇవి నిర్దిష్ట సాధనాల్లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేయడం వల్ల, తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడితే పెట్టుబడిపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. తప్పుడు నిర్ణయాలు తీసుకున్న పక్షంలో ఫండ్ పనితీరు దెబ్బతినే అవకాశాలూ ఉంటాయి.

వాస్తవ పరిస్థితి

ఆర్థిక సమాచార సేవల సంస్థ ఎస్ అండ్ పీకి చెందిన ఎస్‌పీఐవీఏ ఇండియా నివేదిక ప్రకారం (2025 మధ్య, అంతకు ముందు ట్రెండ్స్) దాదాపు 65–66 శాతం లార్జ్ క్యాప్ యాక్టివ్ ఫండ్స్, 2025లో తమ తమ బెంచ్‌మార్క్ సూచీల కన్నా తక్కువ రాబడులను అందించాయి. దీర్ఘకాలికంగా అంటే పదేళ్ల పైగా వ్యవధిలో చూస్తే సుమారు 80 శాతం మిడ్, స్మాల్ క్యాప్ యాక్టివ్ ఫండ్స్ వెనుకబడ్డాయి. అయితే, కొన్ని యాక్టివ్ ఫండ్‌లు తీవ్ర హెచ్చుతగ్గుల మార్కెట్లలో కూడా రాణించగలిగే విధంగా ఉంటాయి. మరోవైపు, పాసివ్ ఫండ్స్ అనేవి కొంత రిస్కు తక్కువ వ్యవహారంగా విశ్వసనీయమైన స్థాయిలో రాబడులు అందించేందుకు అవకాశం ఉంది.

హైబ్రిడ్ వ్యూహంతో మేలు..

చాలా మంది నిపుణులు ప్రస్తుతం పెట్టుబడులకు సంబంధించి హైబ్రిడ్ వ్యూహమైన 'కోర్–శాటిలైట్' విధానాన్ని సూచిస్తున్నారు. అంటే 60–70 శాతం మొత్తాన్ని (కోర్) తక్కువ వ్యయాలతో కూడుకుని ఉండే ఇండెక్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు. వీటి నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉంటాయి, పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వం లభిస్తుంది. ఇక 30–40 శాతం మొత్తాన్ని అనుబంధంగా (శాటిలైట్), అధిక లాభాలను ఆర్జించి పెట్టే అవకాశమున్న నిర్దిష్ట యాక్టివ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు.

అయితే, ఇక్కడో విషయం గుర్తుంచుకోవాలి. అందరికీ ఒకే రకం పెట్టుబడి వ్యూహం ఉపయోగపడకపోవచ్చు. ఇండెక్స్ ఫండ్లతో ఖర్చులు ఆదా అవుతాయి. రాబడులు కాస్త అంచనాలకు అందే విధంగా ఉంటాయి. దీర్ఘకాలికంగా కాంపౌండింగ్ ప్రయోజనాలు దక్కుతాయి. ముఖ్యంగా నిలకడగా మార్కెట్‌ని మించి రాబడులను సాధించడం కష్టంగా ఉండే లార్జ్–క్యాప్ సెగ్మెంట్‌కి సంబంధించి ఇవి అనువైనవిగా ఉంటాయి. యాక్టివ్ ఫండ్స్ అనేవి అధిక రాబడుల ఆశలు కల్పిస్తాయి, కానీ ఫీజులు, రిస్కులు అధికంగా ఉంటాయి. ఏదైతేనేం.. వీలైనంత ముందుగా పెట్టుబడులను ప్రారంభించాలి. యాంఫీ, ఫండ్ ఫ్యాక్ట్ షీట్లు, విశ్వసనీయమైన ప్లాట్‌ఫాంల ద్వారా ఫండ్‌ని క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. మీ రిస్క్ ప్రొఫైల్, లక్ష్యాలకు అనువుగా ఉండే దాన్ని ఎంచుకోవాలి. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేయాలి.

ఎవరికి .. ఏవి అనువు..

ఇండెక్స్ ఫండ్స్: తొలిసారి ఇన్వెస్ట్ చేస్తున్నవారు, దీర్ఘకాలిక సిప్ ఇన్వెస్టర్లు, రిటైర్మెంట్ ప్రణాళికల్లో ఉన్నవారు. పెట్టుబడుల ప్రక్రియ సరళంగా ఉండాలనుకునేవారు. ప్రతి రోజూ మార్కెట్లను, పెట్టుబడులను చూస్తూ కూర్చోవడానికి ఇష్టపడని వారు.

యాక్టివ్ ఫండ్స్: పనితీరును సమీక్షించుకోవడానికి ఇష్టపడే అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లు, నిర్దిష్ట రంగాలు/థీమ్‌లలో పెట్టుబడుల ద్వారా భారీ లాభాలను కోరుకునేవారు.

క్యూ3 ఫలితాలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్.. ప్లస్

నికర లాభం రూ. 19,807 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం ఎగసి రూ. 19,807 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయంలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 17,657 కోట్లు ఆర్జించింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 11 శాతం బలపడి రూ. 18,654 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ. 32,600 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం 12 శాతం ఎగసి రూ. 13,250 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 3.35 శాతంగా నమోదయ్యాయి. కొత్త కార్మిక చట్టాల అమలు కారణంగా రూ. 800 కోట్ల వ్యయాలు నమోదైనట్లు బ్యాంక్ వెల్లడించింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,154 కోట్ల నుంచి రూ. 2,838 కోట్లకు తగ్గాయి. స్థూల మొండిబకాయిలు 1.58 శాతం నుంచి 1.24 శాతానికి నీరసించగా.. గత 12 నెలల కాలంలో 500 బ్రాంచీలను కొత్తగా జత కలుపుకుంది. దీంతో వీటి సంఖ్య 9,616ను తాకింది. ఈ కాలంలో బ్యాంక్ మొత్తం సిబ్బంది సంఖ్య దాదాపు 5,000 తగ్గి 2.15 లక్షలకు పరిమితమైంది. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 19.9 శాతంగా నమోదైంది.

ఐసీఐసీఐ బ్యాంక్.. డౌన్

నికర లాభం రూ. 12,538 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 3 శాతం నీరసించి రూ. 12,538 కోట్లకు పరిమితమైంది. ప్రాధాన్యతా రంగ అడ్వాన్సులంటూ తప్పుగా నమోదుచేయడంతో ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా వ్యవసాయ రుణాలకు రూ. 1,283 కోట్ల ప్రొవిజన్ చేపట్టింది. దీంతో లాభాలు దెబ్బతిన్నట్లు బ్యాంక్ వెల్లడించింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 4 శాతం బలహీనపడి రూ. 12,883 కోట్లకు చేరింది. కాగా.. ఎండీ, సీఈవో సందీప్ బక్షి పదవీ కాలాన్ని రెండేళ్లు పొడిగించేందుకు బోర్డు నిర్ణయించినట్లు బ్యాంక్ పేర్కొంది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం వృద్ధితో రూ. 21,932 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.3 శాతంగా నమోదయ్యాయి. ట్రెజరీ కార్యకలాపాలు మినహాయించి, వడ్డీయేతర ఆదాయం 12 శాతం ఎగసి రూ. 7,525 కోట్లకు చేరింది. కొత్త కార్మిక చట్టాల అమలులో భాగంగా రూ. 145 కోట్ల వ్యయాలు నమోదు చేసినట్లు బ్యాంక్ వెల్లడించింది. మొత్తం ప్రొవిజన్లు రెట్టింపై రూ. 2,556 కోట్లకు చేరాయి. తాజా స్లిప్పేజీలు రూ. 5,356 కోట్లుకాగా.. స్థూల మొండిబకాయిలు 1.58 శాతం నుంచి 1.53 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 17.34 శాతంగా నమోదైంది. ఐసీఐసీఐ అనుబంధ సంస్థలలో ప్రుడెన్షియల్ లైఫ్ నికర లాభం రూ. 390 కోట్లకు, లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ లాభం రూ. 659 కోట్లకు, ఏఎంసీ లాభం రూ. 917 కోట్లకు చేరాయి.

యస్ బ్యాంక్.. హైజంప్

నికర లాభం రూ. 952 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ యస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 55 శాతం జంప్‌చేసి రూ. 952 కోట్లను తాకింది. మొత్తం ప్రొవిజన్లు రూ. 259 కోట్ల నుంచి భారీగా తగ్గి రూ. 22 కోట్లకు పరిమితంకావడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 612 కోట్ల లాభం ఆర్జించింది. కొత్త కార్మిక చట్టాల అమలుకు రూ. 155 కోట్లమేర ప్రొవిజన్లు చేపట్టింది. నికర వడ్డీ ఆదాయం 11 శాతం వృద్ధితో రూ. 2,466 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 5.2 శాతంగా నమోదయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 8 శాతం పుంజుకుని రూ. 1,633 కోట్లకు చేరింది. స్థూల స్లిప్పేజీలు రూ. 1,248 కోట్ల నుంచి రూ. 1,050 కోట్లకు క్షీణించగా.. స్థూల మొండిబకాయిలు 0.1 శాతం మెరుగుపడి 1.5 శాతాన్ని తాకాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 14.5 శాతంగా నమోదైంది.

బినామీ ఆస్తులకు చెక్

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి

కె.వి.ఎన్ లావణ్య

ట్యాక్సేషన్ నిపుణులు

బినామీ ఆస్తులు... దాని వ్యవహారాలను భారతదేశంలో నిషేధించారు. ఇందుకు సంబంధించి 1988లో చట్టమే వచ్చింది. ఇది చాలా ముఖ్యమైన, బలమైన చట్టం.

ఆస్తి అంటే: బినామీ వ్యవహారాలన్నీ ఆస్తి చుట్టూ తిరుగుతాయి. అందుకని 'ఆస్తి' అనే పదాన్ని బాగా నిర్వచించారు. చట్టంలో ఈ నిర్వచనం కష్టమయితే చాలా తెలివిగా, పరిధి ఎక్కువగా ఉండేలా వివరణ ఇచ్చారు. ఈ క్రిందివన్నీ 'ఆస్తి' అని పెద్ద జాబితా చెబుతారు. ఈ నిర్వచనం చదివితే మీకు భగవద్గీత స్ఫురణకు రాకతప్పదు.

(1) ఏ రకమయినా.. స్థిరమైన, అస్థిరమైన, కంటికి కనిపించేవి... కనపడవని... భౌతికమైనవి... నిరాకారమైనవి.
(2) హక్కు, ఆసక్తి, దస్తావేజుల్లో పేరు, ప్రస్తావన
(3) రూపాంతరం చెందగలిగే ఆస్తి
(4) పై పేర్కొన్న 1,2,3 ఆస్తుల ద్వారా వచ్చిన వసూళ్లు ..రియల్ ఎస్టేట్, భూములు, ఇళ్లు, పొలాలు, స్థిరాస్తులు, షేర్లు, వేతనాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు డిపాజిట్లు, నగదు బ్యాంకు లాకర్లు, ప్రయివేటు లాకర్లు మొదలైనవి.

బినామీ వ్యవహారం ఏమిటంటే...

(అ) ఒక వ్యవహారం–ఒప్పందం.. ఒక ఆస్తికి కాగితాల ప్రకారం ఓనర్ (యజమాని) ఓనమాలు రాని ఓబయ్య అయితే.., ఆ వ్యవహారానికి మదుపు పెట్టినది చదువుకున్న చలమయ్య. ఇందులో చలమయ్య గారికి ఇప్పుడు కానీ, భవిష్యత్తులో కానీ, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రయోజనం ఉంటుంది.
(ఆ) లేని వ్యక్తి పేరు మీద, డమ్మీ వ్యక్తి పేరు మీద జరిగే వ్యవహారం... కర్త, కర్మ, క్రియ... ఒకరైతే.. అబద్ధపు పేరుతో దస్తావేజులు తయారవుతాయి.
(ఇ) ఒక వ్యక్తి/సంస్థకి తెలియకుండా/చెప్పకుండా/ ఎరుకలో లేకుండా జరిగిన వ్యవహారం. విచారణలో నాకు తెలియదు, నేను కాదని, నాకు హక్కు లేదని ధ్రువీకరించిన కేసులు.
(ఈ) కొన్ని వ్యవహారాల్లో మనిషి కల్పితం (చందమామ బేతాళ కథల్లోలాగా).

గాభరా పడొద్దు.. వీటికీ మినహాయింపులున్నాయి. హిందూ ఉమ్మడి కుటుంబంలో కర్త కాని, సభ్యులు కాని వారి పేరు మీద ఆస్తి ఉంచుకోవచ్చు. కానీ సోర్స్ మాత్రం కుటుంబం నుంచే రావాలి. ప్రయోజనం ఉమ్మడి కుటుంబానికే చెందాలి. ట్రస్టుల్లో, భాగస్వామ్యంలో, కంపెనీల్లో, డిపాజిటరీలాగా, ఏజెంటులాగా, విశ్వాసపాత్రుడి హోదాలో వ్యవహారాలు.. కుటుంబంలో భార్యభర్తల పేరు మీద, పిల్లల పేరు మీద జరిగే వ్యవహారాలు మొదలైన వాటికి సోర్స్ కుటుంబ సభ్యుల నుంచే రావాలి. అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములు, అన్నాచెల్లెళ్లు, గత తరంగానీ, భవిష్యత్తు తరంగానీ, జాయింట్ ఓనర్స్... డాక్యుమెంట్ ప్రకారం ఉండి.. సోర్స్ వారిలో ఎవరి దగ్గర్నుంచైనా ఉండాలి. గుర్తుంచుకోవాల్సినది ఏమిటంటే 'సోర్స్' అంటే 'కెపాసిటీ' ఉండాలి. నిజమైన వ్యవహారం అయి ఉండాలి. డమ్మీలుండకూడదు.

మరి కొన్ని ఉదాహరణలు గమనించండి...

'A' అనే అన్నగారు ఒక ఇల్లు కొన్నారు. తానే డబ్బు ఇచ్చారు. కానీ 'B' అనే వదిన గారి పేరు మీద రిజిస్ట్రేషన్ జరిగింది. 'A' ఆ ఇంట్లోనే ఉంటారు. ఈ కేసులో 'B' బినామీదారు. 'A' ప్రయోజనం పొందిన వ్యక్తి.

ఇక మరో కేసు. ఇది వింటే 'మత్తు' వదిలిపోతుంది. 'P' అనే వ్యక్తికి లిక్కర్ లైసెన్సు ఉంది. తన ఉద్యోగి 'Q' పేరు మీద అన్ని చెల్లింపులు. కానీ రాబడి అంతా 'P'దే. ఇదొక బినామీ వ్యవహారం.

బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, కల్పిత పేర్లతో, లేనివారి పేరు మీద, మరణించిన వారి పేరుతో మీద పెడతారు. ఇదీ బినామీయే.

ఉద్యోగస్తుల పేరు మీద బ్యాంకు లాకర్లు తెరిచి అందులో నగదు, బంగారం పెట్టడం, అలాగే బంధువుల పేరు మీద వ్యవహారాలు చేయడం.. ఇటువంటి వ్యవహారాల్లో బేతాళ కథల్లోని కల్పిత వ్యక్తి ... బినామీదారు. తన గుట్టు చెప్పకుండా ప్రయోజనం పొందే వ్యక్తి, ప్రయోజనం పొందిన వ్యక్తిని ఈ పేరుతో వ్యవహరిస్తారు.



ఈ వ్యవహారాలు/ఆస్తులు, ఇందులోని సూత్రధారులు అందరూ శిక్షార్హులే! ''బినామీ వ్యవహారాలకు దూరంగా ఉండండి'' అని డిపార్టుమెంటు వారు జారీ చేసిన కరపత్రాలు చదవండి. బినామీ అంటే సునామీ లాంటిది.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలంలో రాబడి వెలుగులు!

ఎడెల్‌వీజ్ మిడ్‌క్యాప్ ఫండ్



ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టే ప్రతి ఒక్కరి పోర్ట్‌ఫోలియోలో మిడ్‌క్యాప్ ఫండ్ తప్పకుండా ఉండాలి. ఎందుకంటే లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లో రిస్క్ తక్కువ, మోస్తరు రాబడులు ఉంటాయి. అదే స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో రిస్క్ ఎక్కువ. రాబడులూ ఎక్కువే. ఈ రెండింటికీ మధ్యేమార్గమే మిడ్‌క్యాప్ ఫండ్స్. పెట్టుబడుల్లో రిస్క్ మోస్తరుగా ఉంటుంది. అదే సమయంలో రాబడులూ లార్జ్‌క్యాప్ కంటే మెరుగ్గా ఉంటాయి. చిన్న స్థాయి నుంచి మధ్యస్థాయికి ఎదిగిన కంపెనీలు కావడంతో ఆయా కంపెనీల వ్యాపారం, యాజమాన్యం సామర్థ్యాలను విశ్లేషించేందుకు అవకాశం ఉంటుంది.

అంటే అప్పటికే తమను తాము నిరూపించుకుని, మధ్యస్థాయికి ఎదిగిన కంపెనీలు కావడంతో.. దీర్ఘకాలంలో అవి లార్జ్‌క్యాప్ కంపెనీలుగానూ అవతరించే సామర్థ్యాలను కలిగి ఉంటాయి. అందుకే దీర్ఘకాల పెట్టుబడులకు ఈ విభాగం అనుకూలం.

రాబడులు

ఎడెల్‌వీజ్ మిడ్‌క్యాప్ ఫండ్ అన్ని మార్కెట్ సైకిల్స్‌లోనూ పోటీ పథకాలు, బెంచ్‌మార్క్ (సూచీ)ను మించి పనితీరు చూపించినట్టు గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తుంది. 2018 జనవరి నుంచి ఐదేళ్ల రోలింగ్ రాబడులను పరిశీలిస్తే మిడ్‌క్యాప్ విభాగంలో 51 శాతం ఫండ్స్ సూచీలతో పోల్చితే రాబడుల్లో వెనుకబడ్డాయి. కానీ, ఈ కాలంలో ఎడెల్‌వీజ్ మిడ్‌క్యాప్ ఫండ్ సూచీలను మించి రాబడులను అందించింది. ఏడాది కాలంలో సిప్ పెట్టుబడిపై రాబడి 6.25 శాతంగా ఉంది. మూడేళ్లలో 34 శాతం, ఐదేళ్లలో 72 శాతం, పదేళ్లలో 216 శాతం రాబడిని పెట్టుబడులపై తెచ్చి పెట్టింది. ఒకే విడత ఇన్వెస్ట్ చేసిన వారికి మూడేళ్లలో 107 శాతం, ఐదేళ్లలో 206 శాతం, పదేళ్లలో 547 శాతం రాబడిని అందించడం గమనార్హం.

పెట్టుబడుల విధానం - పోర్ట్‌ఫోలియో

ఎడెల్‌వీజ్ మిడ్‌క్యాప్ ఫండ్ రంగాలవారీ పెట్టుబడులను ఎంతో స్మార్ట్‌గా నిర్వహిస్తుంటుంది. గత ఐదేళ్ల పనితీరును గమనిస్తే.. క్యాపిటల్ గూడ్స్‌కు 10 శాతం మేర పెట్టుబడులను కేటాయించింది. ఇదే కాలంలో క్యాపిటల్ గూడ్స్ రంగం ఏటా 29 శాతం చొప్పున రాబడులు అందించడం గమనార్హం. ఈ విభాగంలో డిక్సన్ టెక్, భారత్ ఎలక్ట్రానిక్స్, కమిన్స్ ఇండియా, మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ స్టాక్స్ అయితే ఏటా 50 శాతం చొప్పున ర్యాలీ చేశాయి. ఈ స్టాక్స్‌లో ఈ పథకం ఎక్స్‌పోజర్ కలిగి ఉండడం మంచి రాబడులకు దారితీసింది. ఒకే స్టాక్‌ను దీర్ఘకాలం పాటు కలిగి ఉండాలన్న విధానాన్ని అనుసరించదు. గత ఆరేళ్ల కాలాన్ని పరిశీలిస్తే.. ఒక్కో స్టాక్ సగటు హోల్డింగ్ కాలం 22.8 నెలలుగా ఉంది. మూడేళ్లకు పైగా పెట్టుబడులను కలిగిన స్టాక్స్ కేవలం 22.5 శాతమే. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో 1,3650 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో ఈక్విటీలకు 97.79 శాతం కేటాయించింది. డెట్ సాధనాల్లో 2.30 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 31.27 శాతం, ఇండస్ట్రియల్స్‌కు 15.12 శాతం, కన్స్యూమర్ డిస్క్రెషినరీ కంపెనీలకు 13.60 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 10 శాతం చొప్పున కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
పర్సిస్టెంట్ సిస్టమ్స్	2.93
కోఫోర్జ్	2.43
మారికో	2.39
ఎంసీఎక్స్	2.24
బీఎస్ఈ	2.21
ఫెడరల్ బ్యాంక్	2.15
పీబీ ఫిన్‌టెక్	2.09
ఐడీఎఫ్‌సీ ఫస్ట్	2.05
యూనో మిండా	1.89
ఇండియన్ బ్యాంక్	1.88

క్లుప్తంగా...

ఆర్చరీలో సత్తా చాటిన తెలుగు తేజం

ఫ్రాన్స్‌లో జరిగిన ప్రపంచస్థాయి పోటీల్లో స్వర్ణ పతకం

గణేష్ మణిరత్నం

నాయుడుపేట టౌన్: ఫ్రాన్స్‌లో ఈనెల 15 నుంచి 18 వరకు ప్రపంచ స్థాయిలో జరిగిన 2026 ఇండోర్ ఆర్చరీ టోర్నమెంట్స్‌లో తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నం ప్రతిభ చాటారు. వివిధ దేశాలకు చెందిన ఆర్చరీ క్రీడాకారులతో భారత్ తరపున తలపడి ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించారు. ఈ విషయాన్ని గణేష్ మణిరత్నం తండ్రి తిరుమూరు హరిప్రసాద్ ఆదివారం తెలియజేశారు. గత నెలలో చైనాలో జరిగిన పోటీల్లో కూడా మణిరత్నం సత్తా చాటి స్వర్ణ పతకం సాధించినట్టు వెల్లడించారు. ఇప్పటికే చైనాతో పాటు ఐర్లాండ్, సౌత్ కొరియా, బ్యాంకాక్, థాయ్‌లాండ్, కెనడా, సింగపూర్, నెదర్లాండ్స్ వంటి 9 దేశాలలో జరిగిన పోటీల్లో మెడల్స్ సాధించినట్టు వివరించారు.

ఉత్తమ రచనలకు జాతీయ పురస్కారాలు

సాక్షి, చెన్నై: తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, ఒడియా, బెంగాలీ, మరాఠీ భాషల లో ప్రచురించే ఉత్తమ రచనలకు తమిళనాడు ప్రభుత్వం తరపున ఇకపై జాతీయ స్థాయిలో సాహితీ పురస్కారాలు ప్రదానం చేయనున్నామని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ ప్రకటించారు. సెమ్మొళి(ప్రాచీన భాష) పురస్కారంగా దీనిని అందజేస్తామన్నారు. చెన్నైలోని కలైవానర్ అరంగ వేదికగా మూడు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ పుస్తక ఉత్సవం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. పురస్కారంతో పాటు రూ.5 లక్షలు నగదు బహుమతిని అందిస్తామని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక ఎంపిక కమిటీని నియమించనున్నట్లు పేర్కొన్నారు.

పీఆర్సీ ఎప్పుడిస్తారని అడగడమే పాపం..

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆర్ఐపై పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు

వీరులపాడు(నందిగామ): ''పీఆర్సీ, ఐఆర్, డీఏలు ఎప్పుడిస్తారు ముఖ్యమంత్రి గారూ'' అంటూ సామాజిక మాధ్యమాలలో ప్రశ్నించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆర్ఐ హరిసింగ్‌పై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరులపాడుకి చెందిన హరిసింగ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 'సీఎం గారూ.. మా పీఆర్సీ, ఐఆర్, సరెండర్ లీవ్‌లు, పాత బకాయిలు ఎప్పుడిస్తారు?' అంటూ వాట్సప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. దీనిపై టీడీపీ మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ అభిమన్యుని వివరణ కోరగా.. ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న హరిసింగ్ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొమురవెల్లిలో వైభవంగా 'పట్నం వారం'

కొమురవెల్లి (సిద్దిపేట): తెలంగాణలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి భక్తజనం పోటెత్తారు. మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి ఆదివారం (పట్నం వారం)తో ప్రారంభమై ఉగాదికి ముందు వచ్చే ఆదివారం వరకు (రెండున్నర నెలల పాటు) కొనసాగనుంది. ఆదివారం 60 వేల మంది భాగ్యనగర వాసులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గుట్టపై వెలసిన రేణుక ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం అగ్నిగుండాలు, పెద్దపట్నం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా 2024లో నిలిచిపోయిన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీఎన్‌వీఆర్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2014కు ముందు నోటిఫికేషన్ ద్వారా శాంక్షన్ పోస్టుల్లో నియమితులైన వారందరినీ క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు క్రమబద్ధీకరణకు అర్హులుగా నిర్ణయించినట్టు వివరించారు. వీరిలో 3,324 మందిని రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన వారి క్రమబద్ధీకరణ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. 2,800 మంది క్రమబద్ధీకరణకు ఫైనాన్స్ అనుమతి ఉందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు కావస్తున్నా ఈ ప్రక్రియను పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగులు అందరూ ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని, ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టాలని కోరారు.

వచ్చేనెల 5న 'మార్చ్ టు పార్లమెంట్'

ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాలపై పోరుబాట చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ఆలిండియా జాయింట్ యాక్షన్ కమిటీ (ఏఐ జాక్టో)ని ఏర్పాటుచేశామని, ఫిబ్రవరి 5న 'ఛలో ఢిల్లీ–మార్చ్ టు పార్లమెంట్' నిరసన ర్యాలీ చేపట్టినట్లు ఆప్టా అధ్యక్ష, కార్యదర్శులు కాకి ప్రకాశ్‌రావు, ఎంజీ మెహది తెలిపారు. ఇన్‌సర్వీస్ టెట్ మినహాయించాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని, జాతీయ విద్యా విధానం రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగే 'మార్చ్ టు పార్లమెంట్' నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆలిండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్ని రాష్ట్రాల ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో జాతీయ నాయకులు బసవరాజు గువేకర్ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని యూటీఎఫ్, ఎస్టీయూ, ఆప్టా తదితర సంఘాలు ఏఐ జాక్టోలో ఉన్నాయని, ఈ సంఘాల సభ్యులు అన్ని జిల్లాల్లోను సమన్వయ కమిటీలు ఏర్పాటుచేసుకుని మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎవ్వరికీ సంక్రాంతి సరదాలేదు

- ఏడాదిన్నరగా చంద్రబాబు ప్రభుత్వం రైతులకు చేసింది శూన్యం
- ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర నిరాశలో ఉన్నారు
- పండుగ పేరుతో విచ్చలవిడిగా జూదాన్ని ప్రోత్సహించారు
- సంప్రదాయ వేడుకలు మచ్చుకైనా కనిపించలేదు
- చంద్రబాబు ప్రభుత్వంపై శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స ధ్వజం

ఎంవీపీ కాలనీ (విశాఖ): రాష్ట్రంలో పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని, పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు గాలికొదిలేశారని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం విశాఖలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, సన్యాసిపాత్రుడుతో కలిసి బొత్స మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ఏ వర్గం వారికీ సంక్రాంతి ఆనందం లేకుండాపోయిందని విమర్శించారు. పండుగకు ముందే మద్యం ధరలు పెంచడంతోపాటు, వేడుకల పేరుతో ప్రజలను దోచుకున్నారని మండిపడ్డారు. తెలుగు సంస్కృతిని చాటే భోగి మంటలు, ముగ్గులు, గొబ్బెమ్మలు, కైట్స్, సాంస్కృతిక వేడుకలు వంటి సంప్రదాయాలు మచ్చుకైనా కనిపించలేదని, వాటికి భిన్నంగా రికార్డింగ్ డ్యాన్సులు, జూదాలు, కోడిపందాలతో విష సంస్కృతికి బీజం వేశారని బొత్స ఆవేదన వ్యక్తంచేశారు. జూదాన్నే అద్భుతమైన పండుగ సందడిగా కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇటువంటి చర్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాక రాష్ట్ర ప్రతిష్ఠకు మచ్చతెస్తాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించడంవల్ల సామాన్యుల కొనుగోలు శక్తి క్షీణించి, వారి బతుకులు దుర్భరంగా మారుతున్నాయని తెలిపారు.

రైతులకు ఎరువులు కూడా అందించలేని దుస్థితి

రైతుల ప్రయోజనాల విషయంలో ఏడాదిన్నర కాలంగా చంద్రబాబు ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. కనీసం రైతులకు ఎరువులు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రూ. 270కి లభించాల్సిన యూరియా బస్తాను రైతులు నల్లబజారులో రూ.600 పోసి కొనాల్సి వస్తోందని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడంలేదని ఆయన ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,600 కోట్లు నేటికీ చెల్లించకపోవడంతో విద్యార్థులు మనస్తాపానికి గురవుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని వివరించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా అని ప్రశ్నించిన ఆయన.. పల్నాడు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకుడు సాల్మన్ హత్య ఉదంతం దారుణమన్నారు. శవాన్ని కూడా గ్రామంలోకి తీసుకెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. కూటమి నాయకులు హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, గ్రామ బహిష్కరణలు వంటి అక్రమాలపై ప్రధాని మోదీ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

నాటి ఒప్పందాలకే నేడు కార్యరూపం..

గత వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన ఒప్పందాలకే ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం కార్యరూపం ఇస్తోందని బొత్స స్పష్టంచేశారు. గ్రీన్‌కో ప్రాజెక్టు రూపకల్పన తమ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. అప్పట్లో పారిశ్రామికవేత్తలను బెదిరిస్తున్నారంటూ చంద్రబాబు విషప్రచారం చేశారని.. అసలు తాము ఏ సంస్థను బెదిరించామో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. ఏడాదిన్నర కాలంగా లూలు వంటి సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు భూ కేటాయింపులు చేయడం తప్ప చంద్రబాబు ప్రభుత్వం సాధించిందేమీలేదని ఆయన తేల్చిచెప్పారు.

పెళ్లి చేసుకుంటానని 12 ఏళ్లుగా నమ్మిస్తూ..

- నర్సీపట్నం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర మోసం చేశాడని మహిళ ఆరోపణ
- ఇంటికి వచ్చి కొట్టాడని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు

తండ్రి సూరిబాబుతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు లావణ్య

సూర్యచంద్ర

నాతవరం: అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర తనపై దాడి చేసి తనను, తన తండ్రిని కొట్టారని ఓ మహిళ నాతవరం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. బాధితురాలు నాతవరం గ్రామానికి చెందిన పోలుపర్తి లావణ్య తన తండ్రి పోలుపర్తి సూరిబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ లావణ్యకు గతంలో ఓ వ్యక్తితో వివాహం జరగ్గా.. తాను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, భర్తతో విడాకులు తీసుకునేలా జనసేన నేత సూర్యచంద్ర నమ్మించాడు. 12 ఏళ్లుగా వివాహం చేసుకోవాలని ఎన్నిసార్లు అడుగుతున్నా సూర్యచంద్ర పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో సూర్యచంద్ర.. లావణ్య ఇంటికి వెళ్లి, గతంలో తాను ఇచ్చిన సెల్‌ఫోన్ ఇవ్వాలని అడిగాడు. సెల్‌ఫోన్‌ను ఉదయం ఇస్తామని లావణ్య తండ్రి చెప్పడంతో సూర్యచంద్ర కోపంతో ఊగిపోయి లావణ్య, ఆమె తండ్రి సూరిబాబును తీవ్రంగా కొట్టి గొడవ చేశాడు. దీంతో సూరిబాబుకు గాయమైంది. ఈ సంఘటనపై నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు లావణ్య తెలిపింది. ఈ విషయంపై నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావును సంప్రదించగా.. సూర్యచంద్రపై లావణ్య ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని చెప్పారు. తాము చాలాకాలంగా కలిసి ఉంటున్నామని శనివారం రాత్రి సూర్యచంద్ర మద్యం తాగి గొడవకు దిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేయకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరినట్టు ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసేందుకు సంతకం చేయమంటే ఆమె నిరాకరించినట్టు తెలిపారు. ఫిర్యాదురాలి అభీష్టం మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి బదులు మెడికల్ కాలేజీలు కట్టండి

- రూ.1,750 కోట్లను మెడికల్ కాలేజీలకు వినియోగించండి
- ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ

మాట్లాడుతున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, పక్కన లక్ష్మణరెడ్డి, లక్ష్మణరావు తదితరులు

గుంటూరు మెడికల్: ఎన్టీ రామారావు విగ్రహ నిర్మాణం కోసం రూ.1,750 కోట్ల ప్రజాధనాన్ని వినియోగించే బదులు.. అదే డబ్బుతో ప్రజలకు ఉపయోగపడే 7 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రుషికొండపై రూ.500 కోట్లతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతిపెద్ద ప్యాలెస్ నిర్మించారని, ఆ నిధులతో రెండు మెడికల్ కళాశాలలు నిర్మించవచ్చని సీఎం చంద్రబాబు ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రూ.1,750 కోట్లతో ప్రపంచంలోనే అతి ఎత్తైన ఎన్టీ రామారావు విగ్రహ నిర్మాణానికి పూనుకున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వ నిధులతో నిర్మాణంలో ఉన్న 7 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాధనాన్ని విద్య, వైద్య రంగాలపై వెచ్చించండి

శాసనమండలి మాజీ సభ్యుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం 18 నెలల్లో రూ.3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసిందని, ప్రతినెలా రూ.7 వేల కోట్లకు పైగా వడ్డీలు చెల్లిస్తోందని చెప్పారు. ప్రజాధనాన్ని ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్య రంగాలపై వెచ్చించాలని హితవు పలికారు. రూ.1,750 కోట్లతో రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, రక్షితనీరు, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు కల్పించవచ్చని, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లో వసతులను మెరుగుపర్చవచ్చని వివరించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. రూ.1,750 కోట్లతో పేద వర్గాల అభ్యున్నతికి తోడ్పడే విద్య, వైద్యం, ధరల స్థిరీకరణ నిధికి కేటాయించి రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తే ఎన్టీఆర్‌కు ఘనమైన నివాళులు అర్పించినట్టు అవుతుందన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మిస్తే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. అతి పేదరికంలో ఉన్న లక్షలాది కుటుంబాల జీవన ప్రమాణాలు మార్పు చేసేందుకు దోహదపడే నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన వంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జనచైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, స్టూడెంట్స్ యూనియన్ ఫర్ నేషన్ నేత కె.యశ్వంత్ పాల్గొన్నారు.

తెలుగు భాషపై పిల్లలకు మక్కువ పెంచండి

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్
- ఘనంగా లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం

లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారాలు అందుకున్న వారితో ముఖ్య అతిథులు

అల్లిపురం(విశాఖ): పిల్లలకు తెలుగు భాషపై పట్టు, జాతి మూలాలపై అవగాహన తల్లిదండ్రులే కల్పించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సూచించారు. డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ చేస్తున్న సాహిత్య సేవ మరువలేనిదని కొనియాడారు. వివిధ రంగాల్లో సేవ చేస్తున్న ప్రముఖులను సత్కరించడం అభినందనీయమన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ 22వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ నందమూరి తారక రామారావు, హరివంశరాయ్ బచ్చన్ చిత్రపటాలకు ముఖ్య అతిథులుగా వచ్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటి కోటి సూర్యప్రభతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాహిత్య పురస్కారంతో డాక్టర్ వెలమల సిమ్మన్నను సత్కరించి, మెమెంటో అందజేసి అభినందించారు. ఫౌండేషన్ జీవన సాఫల్య పురస్కారాలతో డాక్టర్ తోటకూర ప్రసాద్, ఆర్యన్ ఉదయ్ ఆరేటి, డాక్టర్ నోరి దత్తాత్రేయ, డాక్టర్ రాఘవేంద్ర చౌదరి వేములపల్లిని ఘనంగా సత్కరించారు.

ఎన్‌టీవీ జర్నలిస్టుల అరెస్ట్‌పై ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన ఈజీఐ
- అర్ధరాత్రి అరెస్టులు చేయడంపై అభ్యంతరం
- పోలీసులు నిబంధనలు పాటించాలని సూచన

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్‌టీవీకి చెందిన ఇద్దరు జర్నలిస్టులను పోలీసులు అరెస్ట్ చేసిన విధానంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎడిటర్స్ గిల్డ్ లేఖ రాసింది. మీడియా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టుల పట్ల పోలీసులు సంయమనం పాటించేలా ఆదేశాలివ్వాలని ఆ లేఖలో కోరింది. ఎన్‌టీవీలో ప్రసారమైన ఒక గాసిప్ కార్యక్రమం ఆధారంగా ఇద్దరు జర్నలిస్టులను అరెస్ట్ చేయడంలో పోలీసులు ప్రదర్శించిన ధోరణిని గిల్డ్ ఖండించింది. ఆ కథనంలో ఎవరి పేర్లనూ ప్రస్తావించలేదని గిల్డ్ పేర్కొంది. ఈ వార్తపై కేసు నమోదైన వెంటనే పోలీసులు అర్ధరాత్రి సమయంలో జర్నలిస్టులను అరెస్ట్ చేసి, కోర్టు బెయిల్ ఇచ్చేవరకు నిర్బంధంలో ఉంచారని తెలిపింది. కేసులో బెయిల్ లభించే సెక్షన్లే ఉన్నందున, అర్ధరాత్రి దాడులు, అరెస్టులు చేయడం అనవసరమని అభిప్రాయపడింది. కాగా, పరువు నష్టం జరిగిందంటూ బాధిత అధికారి ఫిర్యాదు చేయలేదని, తెలంగాణ ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారని గిల్డ్ ప్రస్తావించింది. అరెస్టుల వంటి చర్యలకు దిగకముందే పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, చట్టపరమైన విధివిధానాలను పాటించాల్సిందని పేర్కొంది. ఇలాంటి చర్యలు స్వతంత్ర మీడియాపై ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణలో మీడియా స్వేచ్ఛగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాలని ఎడిటర్స్ గిల్డ్ తమ లేఖలో ముఖ్యమంత్రిని కోరింది.

వైభవంగా నాగోబా జాతర

నాగోబా జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి మెస్రం వంశీయులు గోదావరి నుంచి పవిత్ర గంగాజలాన్ని తీసుకొచ్చారు. నాగోబాను అభిషేకించి ఆదివారం మహాపూజ చేయడంతో జాతరకు అంకురార్పణ జరిగింది. మెస్రం వంశ మహిళలు పెద్దల ఆశీర్వాదం తీసుకొని సిరికొండ కుండలను అందుకున్నారు. అనంతరం మర్రిచెట్టు సమీపంలోని కోనేరు వద్దకు వెళ్లి పవిత్ర జలం సేకరించి తీసుకొచ్చారు. మెస్రం వంశం అల్లుళ్లు పాత పుట్టలను తొలగించగా.. మహిళలు కొత్త పుట్టలను తయారు చేశారు. ఆ కొత్త పుట్ట మట్టి ఉండలతో బౌలదేవతను తయారు చేసి పూజలు చేశారు. పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని రాత్రి 10 నుంచి 11 గంటల వరకు మహాపూజను వంశ పెద్దలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి నాగోబాను దర్శించుకున్నారు. ఈ నెల 22న నాగోబా దర్బార్ నిర్వహించనున్నారు.

– ఇంద్రవెల్లి

వనదేవతల దర్శనానికి పోటెత్తిన జనం

తెలంగాణలోని ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవార్ల గద్దెలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సుమారు 50 వేల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. అయితే ఆదివారం అమావాస్య కావడంతో భక్తుల రద్దీ అనుకున్నదానికంటే కొంత తగ్గిందని తెలిపారు. ఇదిలా ఉండగా, అమావాస్య రోజు కొన్ని పూజలకు అనుకూలం కాదన్న భావన ఉన్నప్పటికీ, వనదేవతలకు అటువంటి నిబంధనలు వర్తించవని ఆదివాసీ పెద్దలు స్పష్టం చేశారు.

– ములుగు/ఎస్ఎస్ తాడ్వాయి

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుతీరి వెళ్తున్న వాహనాలు

ముగిసిన పండుగ.. మొదలైన రద్దీ!

సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వచ్చిన ప్రజలు తిరుగు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్–విజయవాడ, హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారులపై వాహనాల రద్దీ నెలకొంది. అలాగే తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, చౌటుప్పల్ మండలంలోని పంతంగి, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు బారులుతీరాయి. పంతంగి టోల్‌ప్లాజా మీదుగా శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం సాయంత్రం 4.30 గంటల వరకు 41 వేల వాహనాలు రాకపోకలు సాగించాయి. చిట్యాల, పెద్దకాపర్తిలో సర్వీస్ రోడ్డు మీదుగా వాహనాలు వెళ్లాల్సి రావటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. పెద్దకాపర్తి శివారులో జాతీయ రహదారిపై హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఓ కారు సడెన్ బ్రేక్ వేయటంతో వరుసగా మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో వాహనాలు దెబ్బతినగా ఆ కార్లలో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

– చౌటుప్పల్, చిట్యాల, కేతేపల్లి, భువనగిరి టౌన్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

సెలవులో జెన్‌కో ఎండీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నాగలక్ష్మి వ్యక్తిగత కారణాలతో కొన్ని నెలల పాటు సెలవుపెట్టారు. ఈ నేపథ్యంలో ఆమె నిర్వహిస్తున్న జెన్‌కో ఎండీ, ఏపీ స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో, ఏపీఎస్ఈసీఎం సీఈవో పోస్టులకు ఇన్‌చార్జ్‌గా ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీ పి.పుల్లారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏపీపీడీసీఎల్‌కు చైర్మన్ గానూ, ఏపీపీఎఫ్‌సీఎల్, ఏపీఆర్‌ఏపీఎల్‌లకు డైరెక్టర్‌గా కూడా పుల్లారెడ్డి వ్యవహరిస్తారు. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యాధుల నియంత్రణకు ఆర్టీజీఎస్ సేవలు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో సీజినల్ వ్యాధుల నియంత్రణ కోసం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అవేర్ విభాగం సేవలను వినియోగించుకుంటామని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గడిచిన ఐదారేళ్లలో సచివాలయాల వారీగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర కేసుల నమోదు డేటాను విశ్లేషిస్తామన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యాపించే వ్యాధులపట్ల తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చర్యలకు ఆర్టీజీఎస్‌లోని సాంకేతిక సదుపాయాలను వాడతామన్నారు. ఈ సేవల వినియోగంపై డీఎంఈ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులకు అవగాహన కల్పించామన్నారు.

నగమోము సింగారం

ఇమిటేషన్ జ్యూయలరీకి పెరిగిన ఆదరణ

- తక్కువ ధరలో లభించడంతో మహిళల ఆసక్తి
- అందుబాటులో వివిధ రకాల ఆభరణాలు / శుభకార్యాలు, వేడుకల్లో వినియోగం

ఇమిటేషన్ నగలు

రాయవరం: రోజు రోజుకూ బంగారం ధర కొండెక్కుతోంది. ప్రస్తుతం పది గ్రాములు రూ. రెండు లక్షలకు చేరువలో ఉంది. బంగారం, వెండి ధరలకు కళ్లెం లేకుంది. అయితే ఏ శుభకార్యమైనా మెడలో బంగారు నగలు ధరించాలని మహిళలకు ఉత్సుకత ఉంటుంది. ప్రస్తుతం సామాన్యులు బంగారం కొనలేని పరిస్థితి నెలకొంది. అందుకే.. అచ్చు బంగారం నగలను పోలిన జ్యూయలరీ ట్రెండ్ నడుస్తోంది. అలంకారం కోసమే కాకుండా పలు శుభ కార్యక్రమాల్లో సైతం ధరించేందుకు బంగారాన్ని మైమరపించేలా ఈ జ్యూయలరీ లభిస్తుండడంతో మహిళలు వీటినే కోరుకుంటున్నారు. చూస్తే నిజంగా బంగారు ఆభరణాలనే విధంగా ఆకట్టుకునే డిజైన్లలో మార్కెట్లో లభిస్తున్నాయి. ఈ నగలకు ఒక గ్రాము బంగారం అద్దడంతో నిజమైన పుత్తడిలా కనిపిస్తుంటుంది. పుత్తడితో పోల్చి చేసే నగలు బంగారం పూత పూసి స్వర్ణకాంతులతో శోభను సంతరించుకుంటున్నాయి. పాలు, నీళ్లకు మధ్య తేడాను హంసలు ఇట్టే కనిపెడతాయనేది నానుడి. అదే తరహాలో బంగారు నగలకు, గిల్టు నగల మధ్య తేడా కేవలం మహిళలకే తెలుస్తుంది. వివిధ రకాల లోహాలతో కూడిన పదునైన ఫినిషింగ్‌తో ఇమిటేషన్ నగలు దొరుకుతున్నాయి. కొత్త ఫ్యాషన్లు, సరికొత్త నగలను కోరుకునే వారికి బీరువాలో నిజమైన ఆభరణాలు ఉన్నప్పటికీ ముస్తాబు కోసం బంగారాన్ని మరిపించే వివిధ లోహాల జ్యూయలరీని మహిళలు ఎంచుకుంటున్నారు.

పసిడి పరుగులు

పసిడి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. 2025 ఆగస్టులో పది గ్రాముల బంగారం ధర రూ.1,02,650 ఉండగా, సెప్టెంబర్‌లో రూ.1,14,500, అక్టోబర్‌లో రూ.1.28 లక్షలు, నవంబర్‌లో రూ.1,29,100, డిసెంబర్‌లో రూ.1,39,600లు, 2026 జనవరిలో ఏకంగా రూ.1.49 లక్షలకు చేరింది. ఈ ధర ఈ ఏడాది రూ.రెండు లక్షలకు చేరుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బంగారంతో పాటు వెండి ధర కూడా అంతే వేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం కిలో వెండి రూ.2.39 లక్షలకు చేరింది. బంగారం, వెండి వాటి రికార్డులను అవే తిరిగి రాస్తున్నాయి.

ధగధగ మెరుపులు

బంగారు ఆభరణాలతో సమానంగా ఇమిటేషన్ నగలు ధగధగ మెరుస్తున్నాయి. ఈ మధ్య కాలంలో మార్కెట్లో ఇమిటేషన్ జ్యూయలరీ కొత్త డిజైన్లలో వస్తున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తుని పట్టణాలతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా కొత్తగా ఇమిటేషన్ నగల దుకాణాలు ప్రారంభించారు. అక్కడ మహిళలకు నచ్చిన కొత్త డిజైన్లు అందుబాటులో ఉంటున్నాయి. వేసుకునే డ్రెస్‌లు, చీరలను బట్టి మ్యాచింగ్ డిజైన్లు దొరుకుతుండడంతో మహిళలు ఎక్కువగా వీటినే కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో బంగారు నగల షాపులతో పోటీగా వివిధ కంపెనీల పేరుతో ఇమిటేషన్ నగల దుకాణాలు వెలుస్తున్నాయి. బంగారం షాపులే అన్నట్లుగా ఉంటున్న ఈ షాపులు కూడా ఇటీవల కాలంలో రద్దీగా మారుతున్నాయి.

బంగారు పూతతో సరికొత్తగా..

బంగారం, వెండి పూతతో తళుకు తళుకుమంటూ మెరుస్తు న్న నగలను చూసి అబ్బుర పడాల్సిందే. ఈ మెరుపులు కొన్ని నెల ల పాటు తాత్కాలిక మే అయినప్పటికీ రకరకాల డిజైన్లతో నగలు ఉండ డంతో అన్ని వర్గాల మహిళలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్ షాపింగ్, వైబ్‌సైట్ల ద్వా రా ఇమిటేషన్ నగలను అధికంగా కొంటున్నారు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో ఈ దుకాణాలు ఏర్పాటయ్యాయి.

గుర్తు పట్టలేనంతగా..

ఇమిటేషన్ నగలు బంగారు నగలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉంటున్నాయి. బర్త్ డే ఫంక్షన్ నుంచి పెళ్లిళ్ల వరకూ ఈ నగలనే వేసుకుంటున్నాం. బంగారు నగలు ఉన్నప్పటికీ ఇమిటేషన్ నగలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇవి వివిధ రకాల కొత్త డిజైన్లలో ఉంటున్నాయి.

–బీఎస్ సునీతాలక్ష్మి, ఉపాధ్యాయిని, ద్రాక్షారామ

అందరికీ అందుబాటులో..

పేద, మధ్య తరగతి ప్రజలకు సైతం అందుబాటులో ఇమిటేషన్ నగలు దొరుకుతున్నాయి. ప్రస్తుతం బంగారం ధర రోజు రోజుకూ పెరుగుతున్న తరుణంలో ఇమిటేషన్ నగలకు ప్రాధాన్యం పెరుగుతుంది. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ నగలు ఒక కానుక అని చెప్పవచ్చు. ఎక్కడైనా పోగొట్టుకున్నా పెద్దగా బాధపడాల్సిన అవసరం లేదు.

–జి.త్రివేణిస్వాతి, గృహిణి, కాకినాడ

సామాజిక విప్లవ కవి వేమన

సత్యాన్ని నిర్భయంగా పలికారు. మూఢనమ్మకాలను ఎండగట్టారు. ఏళ్ల క్రితమే తన పద్యాలతో సామాజిక విప్లవానికి నాందిపలికారు. పామరుల నోటిపై సైతం సహజంగా పలికే సాహిత్యం రాశారు. 'నదులన్నీ ఒక్కటే, కానీ పేర్లు వేరు.. ఆవుల రంగుల వేరు, కానీ పాలు ఒక్కటే' అన్న ఆయన తత్వం నేటికీ సమాజ శాంతికి మూలాధారమంటే అతిశయోక్తి కాదేమో! ఆ మహనీయుడెవరో కాదు.. 'విశ్వదాభిరామ.. వినురవేమ' అంటూ ఇప్పటి తరానికీ చిరపరిచితమైన వేమన మహాకవి. నేడు వేమన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

విశ్వదాభి'వేమ'.. కవిసార్వభౌమ

- అసమానతలపై ఏళ్ల క్రితమే ప్రశ్నల బాణం..
- పామరులకు కూడా అర్థమయ్యేలా పద్యాల గానం
- ప్రపంచ సాహితీ యవనికపై స్థానం

వేమన సమాధి

గాండ్లపెంట: వెయ్యేళ్ల సాహిత్య చరిత్రలో వేమన అంతటి వైవిధ్య భరితమైన, చర్చనీయాంశమైన కవి మరొకరు లేరంటే ఆశ్చర్యం అవసరం లేదు. వేమన జీవితం, సాహిత్యంపై విస్తారమైన అధ్యయనం జరిగింది, జరుగుతూనే ఉంది. తన బోధనల ద్వారా ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణానికి కావాల్సిన అవసరమైన మూలాలను ఆయన తెలిపాడు. సమాజ వ్యవస్థలోని లోపాలను, అసమానతలను ఎత్తిచూపాడు. నూతన సమాజం ఉండాల్సిన తీరుపై ఏళ్ల క్రితమే దిశా నిర్దేశం చేశాడు. వేమన సామాజిక తాత్వికుడిగా, సంఘ సంస్కర్తగా, యోగిగా పలు కోణాల్లో వైవిధ్యంగా దర్శనమిస్తాడు. జాతి,కుల,వర్గ, ప్రాంత తరతమ భేదం లేకుండా అన్ని భౌతిక, భవ బంధాలకు దూరమై ఒక యోగ స్థితిలో ఆయన సత్యాన్వేషణ చేశాడు. అందుకే వేమన తత్వం సమాజ పురోగతిని కాంక్షించే వారందరి మూలాల్లో కనబడుతుంది.

గుర్తింపు తెచ్చిన 'కట్టమంచి'..

తెలుగు సాహిత్యంలో వేమనను చాలా కాలం కవిగా గుర్తించలేదు. 1914లో కట్టమంచి రామలింగారెడ్డి 'కవి తత్వ విచారం'లో వేమన స్థానాన్ని స్థిరీకరించారు. ఆనాటి నుంచి సాహితీ లోకంలో వేమనను గుర్తించడం మొదలైంది. తెలుగు పరిశోధకుల లాగే విదేశీ పరిశోధనలు కూడా అత్యంత ప్రామాణికంగా నిలిచాయి. తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన ఆంగ్లేయ అధికారి సీపీ బ్రౌన్ వేమన తాళపత్ర గ్రంథాలను సేకరించి 1829లో 'ది వర్సస్ ఆఫ్ వేమన' అనే గ్రంథంగా 694 పద్యాలను ప్రచురించి ప్రపంచ సాహితీ యవనికపై ఆయనకు స్థానం కట్టబెట్టాడు. 1860లో ఆర్‌ఎం మాక్డోనాల్డ్ అనే ఆంగ్లేయ అధికారి తెలుగు సాహిత్య పాఠ్యపుస్తకాల కమిటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. వేమన పద్యాలను పాఠ్య పుస్తకాలలో ఎక్కించిన ఘనత ఈయనదే. 1898లో వేమనపై అధ్యయనం చేసిన మరో పండితుడు 'క్యాంఫ్‌బెల్' మద్రాస్ క్రిస్టియన్ కాలేజి జర్నల్‌లో వ్యాసం రాయడం కోసం అనేక పరిశోధనలు చేసి స్వయంగా కటారుపల్లెకు వచ్చి అక్కడి సమాధి విశేషాలను తెలుసుకున్నాడు.

కాలం, ప్రాంతంపై భిన్నాభిప్రాయాలు..

- వేమన కాలం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొంత మంది 15 శతాబ్దం అని, కొంత మంది 17వ శతాబ్దం అని తెలిపారు. అయితే చాలా మంది పరిశోధకులు వేమన 17వ శతాబ్దంలో ఉన్నట్లుగా అభిప్రాయపడ్డారు. వేమన కులం గురించి ఒకటి రెండు పద్యాలలో కొంత సమాచారం ఉంది. 'ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి మూగ చింతపల్లె మొదటి ఇండ్లు అరశిచూడు బయలు.... అనే పద్యంలో వేమన వంశీయులు కొండవీడులోని పడమటి వీధిలో నివాసం ఉండేవారని తెలుస్తోంది. వేమన తన పద్యాలలో ఉపయోగించిన మాండలికాలు రాయలసీమ ప్రాంతంలోనివిగా ఉండడంతో ఆయనను రాయలసీమ వాసిగా సీపీ బ్రౌన్ నిర్ధారించారు.
- ప్రస్తుతం ఉన్న ఆధారాలలో వేమన సమాధి ఉన్న ఊరు 'కటారుపల్లె'గా గుర్తించారు. అనంత కృష్ణశర్మ తాటాకు ప్రతిని పరిశీలించి కటారుపల్లెలో ఉండే 'తుంగ వేమన' అని తెలియజేశారు.
- 'కదిరి తూర్పు నందు ఘనత శోభిల్లగా బరుగువర కతారుపల్లె వెలసి యచలనిష్ఠ గూడ సమరియూండేదరయా' అనే పద్యం ఆధారంగా వేమన కతారుపల్లెలోనే సమాధి పొందినట్లు తెలుస్తోంది.
- విశ్వకవి యోగి వేమన సమాధి అయిన ప్రాంతం కటారుపల్లెను ఇంకా అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. రాష్ట్రంలోని ఒక జిల్లాకు వేమన పేరు పెట్టాలని, కటారుపల్లెలో వేమన పరిశోధనా కేంద్రం, మ్యూజియం ఏర్పాటు చేయాలని, వేమన విగ్రహాన్ని కదిరి జీవిమాను కూడలిలో ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నేడు వేమన జయంతి



లిప్‌స్టిక్ పంటకు గిరాకీ

- 9 నెలల్లోనే చేతికొస్తున్న పంట
- క్వింటాకు రూ.60 వేల ధర

జాఫ్రా గింజలను కోస్తున్న కూలీలు

బుట్టాయగూడెం : పశ్చిమ గోదావరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో జాఫ్రా (లిప్‌స్టిక్ గింజల) సాగు క్రమంగా పెరుగుతుంది. ఐదేళ్ల క్రితం బుట్టాయగూడెం మండలం దాసయ్యపాలెంకు చెందిన గిరిజన రైతు జాఫ్రా సాగు మొదలుపెట్టి తొలి ప్రయత్నంలోనే సత్ఫలితాలు సాధించడంతో పంట సాగుపై పలువురు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పలు గ్రామాల్లో జాఫ్రా సాగును చేపట్టారు. స్వల్ప పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండడంతో రైతులు జాఫ్రాపై మక్కువ చూపుతున్నారు.

విస్తరిస్తున్న సాగు

మన్యంలో 5 సంవత్సరాల క్రితం మూడున్నర ఎకరాల్లో రైతు జాఫ్రా పంటను వేసి అధిక దిగుబడులు సాధించాడు. అమ్మపాలెం, వంకబొత్తప్పగూడెం గ్రామాల్లో కూడా సుమారు 24 ఎకరాల్లో రైతులు జాఫ్రా సాగును చేపట్టారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 27 ఎకరాలకు పైగా జాఫ్రా పంట సాగు చేస్తున్నారు. అక్టోబర్ నుంచి పంట కోత పనుల్లో రైతులు నిమగ్నమవుతారు. ప్రస్తుతం రైతుల ఇళ్లల్లో విక్రయానికి లిప్‌స్టిక్ గింజలు నిల్వ ఉన్నాయి. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా క్వింటాకు రూ.60 వేలు దాటే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలో పంట సాగుతోపాటు మొక్కల నర్సరీని గిరిజన మహిళా రైతు వెంకాయమ్మ, జంపాలు ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే రాష్ట్రంలోని పలు జిల్లాలకు మొక్కలను సరఫరా చేస్తున్నారు.

స్వల్ప పెట్టుబడులతో అధిక దిగుబడులు

జాఫ్రా మొక్కలు కొండల్లో, గుట్టల్లో సహజసిద్ధంగా పెరుగుతుంటాయి. జాఫ్రా కాయల నుంచి ఎర్రటి లిప్‌స్టిక్ గింజలు తీస్తారు. ఈ సాగును గిరిజన రైతులు పోడు, మెట్ట ప్రాంతాల్లో చేస్తున్నారు. ఈ మొక్కను ఒక్కసారి నాటితే 25 ఏళ్ల వరకూ దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. స్వల్ప పెట్టుబడితోనే అధిక దిగుబడులు కూడా వస్తున్నాయని పంటలు వేసిన రైతులు అంటున్నారు. 9 నెలల్లోనే పంట చేతికి వస్తుందని గతేడాది కేజీ రూ.500 నుంచి రూ.600 వరకూ పలికిందని తెలిపారు. క్వింటాకు రూ.60,000 వరకూ ధర వచ్చినట్లు రైతులు పేర్కొన్నారు. ఎకరాకు రూ.1.20 లక్షల వరకూ ఆదాయం వస్తుందని చెబుతున్నారు.

రాతి వనం.. అపురూపం

దూరం నుంచి చూస్తే ఎంతో నైపుణ్యం ఉన్న శిల్పి చెక్కినట్లుగా కొన్ని.. రాయిపై రాయి ఎవరో పేర్చినట్లుగా మరి కొన్ని కనిపిస్తాయి. సహజసిద్ధంగా ఏర్పడిన రాతి గుట్టల నిండా అద్భుతమైన అందాలు మనస్సు దోచుకుంటున్నాయి. వందల ఎకరాల్లో విస్తరించిన రాతి వనంలో ఎటు చూసినా ప్రకృతి చెక్కిన శిల్పాలు ఉన్నాయి. నిశితంగా పరిశీలిస్తే ఏదో రూపం అందులో దాగి ఉన్నట్లుగా అనిపిస్తుంది. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారి పక్కన, ఓర్వకల్లు సమీపంలోని రాతి వనం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. టూరిజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాక్‌గార్డెన్‌ను నిత్యం పర్యాటకులు సందర్శిస్తూ కి'రాక్' అంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు







కశ్మీర్‌ను 'భూమిపై వెలసిన స్వర్గం' అని పిలుస్తారు. గుల్మార్గ్ వెళ్తే మీరు కూడా అదే మాట అంటారు. సముద్ర మట్టానికి సుమారు 8,800 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతాన్ని సందర్శిస్తే మరో లోకం లోకి వచ్చామా అనే అనుభూతి కలగకమానదు. మరీ ముఖ్యంగా చలికాలంలో ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా మంచు దుప్పటి పరుచుకుని ఉన్నట్టే అనిపిస్తుంది. సాహసాలు చేయాలనుకునే ప్రయాణికులకు, ప్రశాంతత కోసం వెతికే ప్రకృతి ప్రేమికులకు ఇది ఒక అల్టిమేట్ డెస్టినేషన్.

భూమిపైన స్వర్గం

గండోలా రైడ్

గుల్మార్గ్‌లో గండోలా అంటే రోప్‌వే. ఇది ఈ ప్రాంతం ప్రధాన ఆకర్షణ. ఆసియాలోనే అత్యంత ఎత్తైన గండోలా కూడా ఇదే. గండోలా ప్రయాణం రెండు దశల్లో ఉంటుంది. ఫేజ్ నెం.1 లో గుల్మార్గ్ నుంచి కాంగ్‌దూరి స్టేషన్ వరకు 8,530 అడుగుల ఎత్తులో గండోలాపై ప్రయాణం ఉంటుంది. ఇది పైన్ చెట్ల మధ్యలోంచి ఈ థ్రిల్లింగ్ రైడ్‌లా సాగుతుంది.

ఫేజ్.2 లో కాంగ్‌దూరి స్టేషన్ నుంచి అఫర్వట్ పర్వతం వరకు 14,403 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తారు. 12 నిమిషాల రైడ్‌లో గతంలో ఎప్పుడూ చూడనంత మంచును, మంచు పర్వతాలను వీక్షించవచ్చు.

మంచు పర్వతాల దర్శనం

చలికాలానికి ముందు గుల్మార్గ్ ఒక అందమైన పువ్వుల లోయగా అలరిస్తుంది. చలికాలం వచ్చేసరికి మంచు ప్రపంచంలా మారిపోతుంది. చలికి డ్రంగ్ అనే జలపాతం గడ్డకట్టుకుపోవడం చూస్తే ప్రకృతి కాలాన్ని ఆపిందేమో, జలపాతాన్ని పాజ్ చేసిందేమో అనిపిస్తుంది. తీవ్రమైన చలిలో ఇక్కడి పర్యాటక ప్రాంతాలన్నీ మంచు ప్రేమికులతో కిటకిటలాడుతాయి. ఇక ఫొటోగ్రఫీ ఇష్టపడే వారికి గుల్మార్గ్‌లో ప్రతీ ఫ్రేమ్ ఒక పోస్ట్‌కార్డ్‌లా కనిపిస్తుంది.

ఏమేం చూడాలంటే...



గుల్మార్గ్ వెళ్లినప్పుడు మీరు వద్దన్నా మీకు ఎన్నో అందమైన లొకేషన్లు కనిపిస్తాయి. అయితే అవకాశం ఉంటే సెంట్ మేరీ చర్చ్ గోథిక్ శిల్పకళను, అఫార్వత్ పర్వతంపై మంచు మకుటాన్ని, చలికి మంచులా మారిన అల్ఫాథర్ సరస్సును, ఫ్రీజ్ అయిన డ్రంగ్ జలపాతాన్ని, దట్టమైన పైన్ చెట్ల వనాలు, స్థానిక గ్రామాలను, స్థానికుల జీవితాన్ని వెళ్లి చూసి అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి.

మంచు కురిసే వేళల్లో ఆకాశం నుంచి జారిపడే మల్లెపువ్వుల్లాంటి స్నో, దూరంగా పొగ మంచులోంచి కనిపించి కనిపించనట్టు ఉండే పైన్ చెట్లు, పర్యాటకులు కనిపించగానే స్థానికుల కళ్లలో కనిపించే వెలుగు, కలపతో చేసిన ఇళ్లపై పలకలపై అక్షరాల్లా చేరుకున్న మంచు.. ఇవన్నీ ఎవరికి వారు వ్యక్తిగతంగా వెళ్లి చూసి అనుభూతి చెందాల్సిందే!

పొద్దున్నే కావా.. మధ్యాహ్నం ఛాయ్

కశ్మీర్ అనేది ఫుడ్ లవర్స్‌కు కూడా స్వర్గం లాంటిదే. ఇక్కడికి వచ్చే పర్యాటకులు కశ్మీరీ కావా అనే ఫేమస్ గ్రీన్ టీని అస్సలు మిస్ అవ్వరు. స్థానిక కుంకుమపువ్వు, నట్స్‌ను కలిపి సర్వ్ చేస్తారు. రోగన్ జోష్, యాఖ్నీ, దమ్ ఆలూ ఇవి టేస్ట్ చేయకుండా పర్యాటకులు ఉండలేరు. అలాగే ఇక్కడ అడుగడుగునా చాట్, మ్యాగీ, వజ్వాన్ రుచులు అందుబాటులో ఉంటాయి. పొద్దున్నే కావా, మధ్యాహ్నం చాయ్ అనేది ఎక్కువ మంది టూరిస్టులు ట్రై చేసే కాంబినేషన్.

గుల్మార్గ్ ఎప్పుడు వెళ్లాలి?

చలికాలంలో గుల్మార్గ్ మంచు ప్రపంచంలా మారిపోతుంది. అయితే మార్చి నుంచి జూన్ మధ్యలో పర్యటనకు బెస్ట్ టైమ్. ఈ సమయంలో ఎటు చూసినా పచ్చదనం, పువ్వులు, పర్యాటకుల చిరునవ్వులు కనిపిస్తాయి. దూరం నుంచి భారీ పర్వతాలను చూస్తూ చిన్న పిల్లల్లా కేరింతలు కొట్టవచ్చు. చలికాలంలో స్నో ఫాల్, వింటర్ స్పోర్ట్స్ కోసం బెస్ట్ టైమ్.

ఎలా చేరుకోవాలి?

గుల్మార్గ్ చేరుకోవడానికి కశ్మీర్ క్యాపిటల్ శ్రీనగర్ చేరుకోవాలి. శ్రీనగర్‌కు దేశంలోని అన్ని విమానాశ్రయాల నుంచి డైరెక్ట్ ఫ్లైట్స్ ఉన్నాయి. శ్రీనగర్ నుంచి గుల్మార్గ్‌ను క్యాబ్ లేదా లోకల్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా చేరుకోవచ్చు. షేరింగ్‌లో కూడా ప్రయత్నించవచ్చు. ఈ ప్రయాణం చాలా అందమైనది. స్నో ఫాల్ సమయంలో స్థానిక పరిస్థితులను బట్టి ప్లాన్ చేసుకోవాలి.

ఎక్కడ ఉండాలంటే..!

గుల్మార్గ్ అనేది ఒక హాట్ టూరిస్ట్ డెస్టినేషన్. వర్షాకాలం మినహా సంవత్సరం మొత్తం పర్యాటకులు దేశవిదేశాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. గుల్మార్గ్‌లో బడ్జెట్ హోటల్స్ నుంచి లగ్జరీ రిసార్టుల వరకు అన్నీ అందుబాటులో ఉంటాయి. పీక్ సీజన్‌లో అడ్వాన్స్ బుకింగ్ తప్పనిసరి.

రిసార్టుల్లో ఆధునిక సదుపాయాలు, వ్యాలీ వ్యూ రూములు, ఫైన్ డైనింగ్ సదుపాయాలు ఉంటాయి. బడ్జెట్ ప్రయాణికుల కోసం గెస్ట్ హౌసులు, హోమ్ స్టేలు ఉన్నాయి. ఎకో–ఫ్రెండ్లీ కాటేజీలను కూడా ట్రై చేయవచ్చు.

జీవితాంతం గుర్తుండే ట్రిప్

గుల్మార్గ్‌లో సూర్యోదయాన్ని అసలు మిస్ అవ్వొద్దు. పిర్ పంజాల్ పర్వత శ్రేణిలో ఉన్న హిమగిరులపై సూర్యకిరణాలు పడి, పర్వతాలు బంగార రంగులో మెరవడం అనేది జీవితాంతం గుర్తుంటుంది. అలాగే కేబుల్ కార్ రైడ్ సమయంలో తనువును మీటే చలిగాలి, పైన్ చెట్ల సువాసన, ఆకాశంలో విన్యాసం చేసే వివిధ రంగులు ఇవన్నీ ఎవరైనా అంత ఈజీగా మర్చిపోగలరా? మనకు తెలియకుండానే మన మనసు కోరుకునే అనుభూతులు ఎన్నో.

సూర్యాస్తమయం తరువాత గుల్మార్గ్‌లోని గ్రామాల్లో వీధి దీపాలు ఎక్కువగా, మనుషులు తక్కువగా కనిపిస్తారు. వెచ్చని దుప్పటిలో ముడుచుకుని పడుకునే సమయంలో స్వర్గం అంటే ఇదేనేమో అనిపిస్తుంది.

షాపింగ్

గుల్మార్గ్‌లో కశ్మీరీ హ్యాండీక్రాఫ్టులు, శాలువాలు, కార్పెట్లు, కుంకుమపువ్వు, డ్రై ఫ్రూట్స్ చాలా ఫేమస్. అలాగే స్థానిక మసాలా దినుసులను కూడా ట్రై చేయవచ్చు. కశ్మీర్ యాపిల్ గురించి చాలా మందికి తెలిసే ఉంటుంది. అయితే మీరు డ్రై యాపిల్ గురించి ఎప్పుడైనా విన్నారా ? అది కూడా మీరు ఇక్కడ ట్రై చేయవచ్చు.

కశ్మీర్ టూరును ఒక యాత్రలా కాకుండా ఒక స్ట్రెస్ రిలీవింగ్ మాత్రలా భావించవచ్చు. గుల్మార్గ్‌కు కేవలం అందమైన లొకేషన్ల కోసం మాత్రమే కాకుండా ఇక్కడి వైబ్‌ను ఫీల్ అవ్వడానికి వెళితే స్వర్గం అంటే ఇదే అనిపించకుండా ఉండదు. కశ్మీర్ వెళ్తే స్వర్గం ఎక్కడ ఉంటుందో అనే ప్రశ్నకు సమాధానం కూడా తెలిసిపోతుంది.

బెస్ట్ స్కీయింగ్ పాయింట్

చలికాలంలో గుల్మార్గ్‌లో స్కీయింగ్, స్నో బోర్డింగ్, స్నో ట్రెక్కింగ్ యాక్టివిటీస్ కోసం భారతీయులతో పాటు విదేశీ పర్యాటకులు కూడా వస్తుంటారు. ఎండాకాలంలో మౌంటెన్ బైకింగ్, ట్రెక్కింగ్ ట్రై చేయవచ్చు.

వింటర్‌లో ఇక్కడ స్కీయింగ్, స్నో బోర్డింగ్ చేయడం అనేది ఒక లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియెన్స్. ఇక్కడి స్నో స్పోర్ట్స్ ఎంజాయ్ చేయడానికి ప్రొఫెషనల్ అవ్వాల్సిన అవసరం లేదు. మంచి ఇన్‌స్ట్రక్టర్ ఉంటే సరిపోతుంది.

- ఎం.జి. కిశోర్, ప్రయాణికుడు.కామ్

హిడెన్ స్కీయింగ్ ప్యారడైజ్

బయటి ప్రపంచానికి తెలియని ఎన్నో అద్భుతమైన ప్రదేశాలు భారతదేశంలో ఎన్నో ఉన్నాయి. అందులో ఉత్తరాఖండ్‌లోని ఔలి ఒకటి. రిషికేష్ నుంచి బద్రినాథ్‌కు వెళ్లే మార్గంలో ఉన్న జ్యోషిమఠం నుంచి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఈ అందమైన హిల్ స్టేషన్ ఉంటుంది.

చలికాలంలో అడ్వెంచర్ స్పోర్ట్స్ ఇష్టపడే వారికి ఔలి కంటే బెస్ట్ డెస్టినేషన్ ఉండదనే చెప్పాలి. ముఖ్యంగా స్కీయింగ్ కోసం ఔలి దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి నుంచి నందాదేవి, కామెత్ వంటి హిమాలయ పర్వత శ్రేణులు అద్భుతంగా దర్శనమిస్తాయి. ఔలిలో ఒక ఆర్టిఫిషియల్ లేక్ కూడా ఉంది. చలికాలంలో ఈ సరస్సు చుట్టూ మొత్తం మంచు పేరుకుపోయి, ఈ ప్రదేశం మంచు స్వర్గంలా మారిపోతుంది. జ్యోషిమఠం నుంచి ఔలికి రోప్‌వే ప్రయాణం కూడా చేయవచ్చు. ఈ ప్రయాణం మొత్తం హిమాలయాల అందాలను ఆస్వాదించేలా ఉంటుంది.



కుటుంబంతో కలిసి ఒక మంచి హిమాలయన్ అడ్వెంచర్ ట్రిప్ ప్లాన్ చేయాలనుకుంటే, మీ లిస్టులో ఔలిని తప్పకుండా టాప్ 3 డెస్టినేషన్లలో చేర్చుకోవచ్చు. అలాగే జ్యోషిమఠంలో ఉన్న పాలరాయితో నిర్మించిన నరసింహ స్వామి ఆలయం కూడా దర్శించుకోవచ్చు.

మలానా గ్రామం ఇక్కడ మనుషులను తాకితే ఫైన్ వేస్తారు

భారతదేశంలో కొన్ని ప్రదేశాలు మ్యాపులో సింపుల్‌గా కనిపించినా.. అక్కడి వాస్తవాలు భిన్నంగా ఉంటాయి. అలాంటి ఒక ప్రదేశమే మలానా గ్రామం. హిమాచల్ ప్రదేశ్‌లోని పార్వతీ లోయ పక్కనే, కొండల మధ్యలో ఉన్న ఈ గ్రామం ఎన్నో ప్రత్యేకతలు ఉన్న ఒక పురాతన ప్రదేశం. ఇక్కడికి వచ్చే టూరిస్టులు ఆలయాలను, గోడలను, మనుషులను తాకితే అధికారులు ఫైన్ వేస్తారు. స్థానికులకు ఎవరైనా బయటి వారు డబ్బులు ఇవ్వాల్సి వస్తే నేలపై లేదా కౌంటర్‌పై పెడతారు కానీ చేతికి ఇవ్వరు. పొరపాటున బయటి వాళ్లు టచ్ అయితే వెంటనే వెళ్లి స్నానం చేసి శుద్ధి చేసుకోవాలి అనేది ఇక్కడి ప్రజల విశ్వాసం.

మలానా గ్రామాన్ని చాలా మంది ప్రపంచంలోనే అతిపురాతనమైన ప్రజాస్వామ్యం ఉన్న ప్రదేశంగా చెబుతారు. ఇక్కడ పోలీసు వ్యవస్థతో పని లేకుండా, జమ్లూ దేవత అనే స్థానిక దైవశక్తి సాక్షిగా తీర్పులు, నిర్ణయాలు జరుగుతాయి. మలానా ప్రజలు కానాశీ అనే ఒక సీక్రెట్ భాషలో మాట్లాడుతారు. ఇది ఎంత సీక్రెట్ అంటే, వారు మాట్లాడే పదాలు చుట్టుపక్కల ఉన్న గ్రామస్థులకు కూడా అర్థం కావు. అలాగే అలెగ్జాండర్ సైనికుల వంశం ఇక్కడ కొనసాగుతుందని కూడా కొంతమంది అంటారు, కానీ దానికి స్పష్టమైన రుజువులు లేవు.

కారును లాగే కొండ

లేహ్–కార్గిల్ హైవేలో ఉన్న మేగ్నెటిక్ హిల్ ప్రాంతం అయస్కాంత శక్తికి ఒక ఎగ్జాంపుల్. ఇక్కడ రోడ్డుపై భూమ్యాకర్షణ శక్తికి వ్యతిరేకంగా వస్తువులు, వాహనాలు మూవ్ అవుతున్నట్టు మనం గమనించవచ్చు. కారును న్యూట్రల్ గేరులో పెట్టి స్టార్ట్ పాయింట్ దగ్గర ఆపితే, ఆటోమెటిక్‌గా కారు గంటకు 20 కిలోమీటర్ల వేగంతో కొండపైకి వెళ్తుంది. మొదట్లో ఇది ఒక భ్రమలా, మాయలా అనిపించవచ్చు. కానీ అక్కడికి వెళ్లినవాళ్లకు ఇది నిజంగా జరిగే అద్భుతంలా అనిపిస్తుంది. ఇలా ఎందుకు జరుగుతుంది అనే విషయంపై చాలా మంది పరిశోధనలు కూడా చేస్తున్నారు. ప్రయాణికులకు మాత్రం ఇది ఒక గొప్ప అనుభూతిని అందించే ప్రదేశంగా మారిపోయింది.

టైటిల్ నంబర్ 36

- ఇండియా ఓపెన్‌లో విజేతగా నిలిచిన కొరియా సూపర్ స్టార్ ఆన్ సె యంగ్
- ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యిపై గెలుపు

వేదిక ఏదైనా... పరిస్థితులు ఎలా ఉన్నా... ప్రత్యర్థులు ఎవరైనా... తగ్గేదేలా అంటోంది దక్షిణ కొరియా సూపర్‌స్టార్ షట్లర్ ఆన్ సె యంగ్. బ్యాడ్మింటన్ సీజన్‌లోని రెండో టోర్నమెంట్ ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఆన్ సె యంగ్ టైటిల్ నిలబెట్టుకుంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో విజేతగా నిలిచి ఈ ఏడాది ఘనంగా ప్రారంభించిన ఈ ప్రపంచ నంబర్‌వన్ అదే జోరును న్యూఢిల్లీలోనూ కొనసాగించింది. తుది పోరులో ఆన్ సె యంగ్‌కు గట్టిపోటీ ఇస్తుందనుకున్న ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి కొరియా స్టార్ ధాటికి తేలిపోయింది. కెరీర్‌లో 22వసారి వాంగ్ జి యితో ఆడిన ఆన్ సె యంగ్ 18వసారి చైనా ప్లేయర్‌ను ఓడించి తన కెరీర్‌లో 36వ సింగిల్స్ టైటిల్‌ను జమ చేసుకుంది. గత ఏడాది చివరి నాలుగు టోర్నీల్లో విజేతగా నిలిచిన ఆన్ సె యంగ్ ఈ ఏడాది ఆడిన రెండు టోర్నీల్లోనూ టైటిల్ సొంతం చేసుకొని 'సిక్సర్' నమోదు చేసింది.

ఆన్ సె యంగ్

లిన్ చున్ యి

న్యూఢిల్లీ: 'ఆమె మనిషి కాదు... రోబో' అని ఆన్ సె యంగ్ గురించి ఆమె ప్రత్యర్థులు ఇటీవల చేసిన వ్యాఖ్యలు నిజమే అనుకోవాలి. కొన్నేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో అత్యంత నిలకడగా విజయాలు నమోదు చేస్తున్న ఆన్ సె యంగ్ కొత్త ఏడాదిలోనూ చెలరేగిపోతోంది. ఆదివారం ముగిసిన ఇండియా ఓపెన్ టోర్నీలో ఈ టాప్ సీడ్ ప్లేయర్ చాంపియన్‌గా నిలిచింది. గత ఏడాది టైటిల్ సాధించిన ఈ కొరియా సూపర్‌స్టార్ ... ఈ సంవత్సరం కూడా అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. 43 నిమిషాలపాటు జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆన్ సె యంగ్ 21–13, 21–11తో వాంగ్ జి యిపై గెలిచింది. ఆన్ సె యంగ్‌కు 66,500 డాలర్ల (రూ. 60 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 11,000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ 12వ ర్యాంకర్ లిన్ చున్ యి (చైనీస్ తైపీ) టైటిల్ గెలిచాడు. ఫైనల్లో లిన్ చున్ యి 21–10, 21–18తో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై విజయం సాధించాడు. లిన్ చున్ యికి 66,500 డాలర్ల (రూ. 60 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 11,000 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి. మహిళల డబుల్స్‌లో లియు షెంగ్‌షు–టాన్ నింగ్ (చైనా) జోడీ టైటిల్ దక్కించుకుంది. ఫైనల్లో లియు–టాన్ నింగ్ 21–11, 21–18తో యుకీ ఫుకుషిమా–సయాకా మత్సుమోతో (జపాన్)లపై గెలిచారు. పురుషుల డబుల్స్ ఫైనల్లో లియాంగ్ వెకెంగ్–వాంగ్ చాంగ్ (చైనా) ద్వయం 17–21, 25–23, 21–16తో హిరోకి మిదోరికావా–క్యోహె యామషిటా (జపాన్) జోడీపై నెగ్గి టైటిల్ అందుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో డెచాపోల్–సుపిసారా (థాయ్‌లాండ్) జంట 19–21, 25–23, 21–18తో మథియాస్ క్రిస్టియాన్సెన్–అలెగ్జాండ్రా బోయె (డెన్మార్క్) జోడీపై విజయం సాధించి టైటిల్ హస్తగతం చేసుకుంది.

ఆన్ సె యంగ్ విజయ గర్జన

విదర్భ ఖాతాలో విజయ్ హజారే ట్రోఫీ

- ఫైనల్లో 38 పరుగులతో సౌరాష్ట్రపై విజయం
- 'శత'క్కొట్టిన అథర్వ తైడే

బెంగళూరు: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన విదర్భ జట్టు తొలిసారి విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. టోర్నమెంట్ ఆసాంతం రాణించిన విదర్భ ఫైనల్లోనూ అదే జోరు కొనసాగిస్తూ విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో విదర్భ 38 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ సౌరాష్ట్రపై గెలుపొందింది. గతేడాది తుదిమెట్టుపై బోల్తా పడ్డ విదర్భ... ఈసారి పట్టు వదలకుండా ప్రయత్నించి విజయవంతమైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. ఓపెనర్ అథర్వ తైడే (118 బంతుల్లో 128; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో కదంతొక్కగా... యశ్ రాథోడ్ (61 బంతుల్లో 54; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీతో రాణించాడు. అమన్ మోఖడే (33), రవికుమార్ సమర్థ్ (25) ఫర్వాలేదనిపించారు. ఒక దశలో 213/1తో మరింత భారీ స్కోరు చేసేలా కనిపించిన విదర్భ... ఆ తర్వాత వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ హర్ష్ దూబే (17), మొహమ్మద్ ఫైజ్ (19) ఎక్కువసేపు నిలవలేకపోయారు. సౌరాష్ట్ర బౌలర్లలో అంకుర్ పన్వర్ 4 వికెట్లు పడగొట్టగా... చేతన్ సకారియా, చిరాగ్ జానీ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం ఛేదనలో సౌరాష్ట్ర 48.5 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. ప్రేరక్ మన్కడ్ (92 బంతుల్లో 88; 10 ఫోర్లు), చిరాగ్ జానీ (63 బంతుల్లో 64; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీలతో పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ హార్విక్ దేశాయ్ (20), విశ్వరాజ్ జడేజా (9), పర్శ్వరాజ్ రాణా (7) విఫలమయ్యారు. విదర్భ బౌలర్లలో యశ్ ఠాకూర్ 4 వికెట్లు పడగొట్టగా... నచికేత్ మూడు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. విదర్భ ప్లేయర్లు అథర్వ తైడేకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', అమన్ మోఖడేకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు, ఆంధ్ర మాజీ క్రికెటర్ చాముండేశ్వరనాథ్ విదర్భ జట్టుకు విన్నర్స్ ట్రోఫీ అందించారు.

అర్జున్ రెండో గేమ్ 'డ్రా'

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. థాయ్ డాయ్ వాన్ నుగుయెన్ (చెక్ రిపబ్లిక్)తో ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను అర్జున్ 56 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందతో శనివారం జరిగిన తొలి గేమ్‌లో అర్జున్ 32 ఎత్తుల్లో గెలుపొందాడు.

నితీశ్ రెడ్డి సెంచరీ

- అమెరికా 253/9
- న్యూజిలాండ్‌తో మ్యాచ్ రద్దు
- అండర్–19 వన్డే ప్రపంచకప్

బులవాయో: సుదిని నితీశ్ రెడ్డి (133 బంతుల్లో 117 నాటౌట్, 12 ఫోర్లు, 1 సిక్స్) అండర్–19 వన్డే ప్రపంచకప్‌లో సెంచరీతో చెలరేగాడు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్‌ఏ) జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ తెలుగు సంతతి కుర్రాడు... అండర్–19లో అమెరికా తరఫున సెంచరీ చేసిన తొలి ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. వరల్డ్‌కప్ గ్రూప్ 'బి'లో భాగంగా ఆదివారం న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో నితీశ్ సత్తా చాటాడు. అయితే వర్షం కారణంగా ఈ మ్యాచ్ రద్దు అయింది. మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. నితీశ్ ఒంటరి పోరాటంతో జట్టుకు మంచి స్కోరు అందించగా... శివ్ శని (33), అదిత్ (40) ఫర్వాలేదనిపించారు. అమెరికా జట్టులోని పదకొండు మంది ప్లేయర్లు భారత సంతతి ఆటగాళ్లే కాగా... కెప్టెన్ ఉత్కర్ష్ శ్రీవాస్తవ (0), సాహిల్ గార్గ్ (9), అమరిందర్ గిల్ (10), అద్నిత్ (6), అమోఘ్ రెడ్డి ఆరెపల్లి (0) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో ఫ్లిన్ మోరె 4, మాసన్ క్లార్క్ 3 వికెట్లు పడగొట్టారు. లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ 1 ఓవర్‌లో వికెట్ నష్టపోకుండా 12 పరుగులు చేసింది. ఈ దశలో మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. వరుణుడు ఎంతకూ శాంతించకపోవడంతో పలుమార్లు పరిశీలించిన అనంతరం అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

సబలెంకా బోణీ

- రెండో రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్
- పావోలిని, స్వితోలినా ముందంజ

మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ పెను సంచలనాలు లేకుండానే ప్రారంభమైంది. ఫేవరెట్స్ స్థాయికి తగ్గ ఆటతీరు కనబరిచి శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్), ఏడో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ), 12వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఎనిమిదోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న సబలెంకా తొలి రౌండ్‌లో 6–4, 6–1తో టియాంట్సోవా రకోటొమాంగా (ఫ్రాన్స్)పై గెలుపొందింది. ఈ మ్యాచ్‌ను టెన్నిస్ దిగ్గజాలు రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), రాడ్ లేవర్ (ఆస్ట్రేలియా) ప్రత్యక్షంగా తిలకించారు. 76 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరంభంలో తడబడింది. తొలి మూడు పాయింట్లు కోల్పోవడంతోపాటు తన తొలి సర్వీస్ గేమ్‌ను చేజార్చుకుంది. అయితే వెంటనే తేరుకున్న రెండుసార్లు (2023, 2024) చాంపియన్, గత ఏడాది రన్నరప్ పదో గేమ్‌లో టియాంట్సోవా సర్వీస్‌ను బ్రేక్ చేసి తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో మాత్రం సబలెంకా జోరు పెంచగా... 'వైల్డ్ కార్డు'తో ఈ టోర్నీలో బరిలోకి దిగిన టియాంట్సోవా తేలిపోయింది. 23 విన్నర్స్ కొట్టిన సబలెంకా 20 అనవసర తప్పిదాలు కూడా చేసింది. మ్యాచ్ మొత్తంలో ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో పావోలిని 6–1, 6–2తో క్వాలిఫయర్ సస్నోవిచ్ (రష్యా)పై, స్వితోలినా 6–4, 6–1తో క్రిస్టినా బుక్సా (స్పెయిన్)పై, 28వ సీడ్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్) 6–4, 6–1తో మనన్‌చాయ సావంగ్‌కె (థాయ్‌లాండ్)పై నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

వీనస్ తొలి రౌండ్‌లోనే అవుట్

మరోవైపు అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్‌తోపాటు 11వ సీడ్ అలెగ్జాండ్రోవా (రష్యా), 20వ సీడ్ మార్టా కొస్టుక్ (ఉక్రెయిన్), 26వ సీడ్ డయానా యాస్ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్) తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో ఆడిన అతి పెద్ద వయస్కురాలిగా రికార్డు నెలకొల్పిన 45 ఏళ్ల వీనస్ తీవ్రంగా పోరాడినా తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించలేకపోయింది. 2 గంటల 17 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో వీనస్ 7–6 (7/5), 3–6, 4–6తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడింది. ఇతర మ్యాచ్‌ల్లో క్వాలిఫయర్ జెనెప్ సోన్‌మెజ్ (టర్కీ) 2 గంటల 37 నిమిషాల్లో 7–5, 4–6, 6–4తో అలెగ్జాండ్రోవాపై, 3 గంటల 31 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ఎల్సా జాక్వెమోట్ (ఫ్రాన్స్) 6–7 (4/7), 7–6 (7/4), 7–6 (10/7)తో మార్టా కొస్టుక్‌పై, ఎలీనా గాబ్రియేలా రుస్ (రొమేనియా) 6–4, 7–5తో యాస్ట్రెమ్‌స్కాపై సంచలన విజయాలు నమోదు చేశారు.

అల్‌కరాజ్ శుభారంభం

పురుషుల సింగిల్స్ విభాగంలో టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), పదో సీడ్ బుబ్లిక్ (కజకిస్తాన్) తొలి రౌండ్‌లో నెగ్గి రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను తొలిసారి గెలిచి 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' పూర్తి చేసుకోవాలని భావిస్తున్న అల్‌కరాజ్ 6–3, 7–6 (7/2), 6–2తో ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. ఈ మ్యాచ్‌లో అల్‌కరాజ్ ఎనిమిది ఏస్‌లు సంధించి, 36 విన్నర్స్ కొట్టాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. జ్వెరెవ్ 6–7 (1/7), 6–1, 6–4, 6–2తో డియాలో (కెనడా)పై, బుబ్లిక్ 6–4, 6–4, 6–4తో జెన్సన్ బ్రూక్స్‌బై (అమెరికా)పై నెగ్గారు.


అల్‌కరాజ్

భారత చాంప్స్ సంజీవని, కార్తీక్



ముంబై: ప్రతిష్టాత్మక ముంబై మారథాన్ (42 కిలోమీటర్ల 195 మీటర్లు) భారత అథ్లెట్ల విభాగంలో కార్తీక్ కర్కెరా (2 గంటల 19 నిమిషాల 55 సెకన్లు), సంజీవని జాధవ్ (2 గంటల 49 నిమిషాల 2 సెకన్లు) విజేతలుగా నిలిచారు. పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ అనీశ్ థాపా (2 గంటల 20 నిమిషాల 8 సెకన్లు) రెండో స్థానానికి పరిమితం కాగా... ప్రదీప్ (2 గంటల 20 నిమిషాల 49 సెకన్లు) మూడో 'ప్లేస్'లో నిలిచాడు. మహిళల విభాగంలో నిర్మాబెన్ ఠాకూర్ (2 గంటల 49 నిమిషాల 13 సెకన్లు), సోనమ్ (2 గంటల 49 నిమిషాల 24 సెకన్లు) వరుసగా రెండో, మూడో స్థానాలు దక్కించుకున్నారు. అగ్రస్థానంలో నిలిచిన వారికి రూ. 5 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన అథ్లెట్లకు రూ. 4 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 3 లక్షల నగదు పురస్కారం దక్కింది.

ఇథియోపియా రన్నర్ల హవా

అంతర్జాతీయ పురుషుల విభాగంలో ఇథియోపియాకు చెందిన టాడు అబటే డెమె (2 గంటల 9 నిమిషాల 55 సెకన్లు)... మహిళల విభాగంలో ఇథియోపియాకే చెందిన యెషి కలాయు చెకోలె (2 గంటల 25 నిమిషాల 13 సెకన్లు) చాంపియన్స్‌గా అవతరించారు. ఇప్పటి వరకు 21 సార్లు ముంబై మారథాన్ నిర్వహించగా... అందులో ఏడుసార్లు ఇథియోపియా అథ్లెట్లే విజేతలుగా నిలిచారు. పురుషుల విభాగంలో లియోనార్డ్ కిప్రోటిచ్ లంగాట్ (2 గంటల 10 నిమిషాల 10 సెకన్లు; కెన్యా), మెర్హావి (2 గంటల 10 నిమిషాల 22 సెకన్లు) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో అయితే తొలి మూడు స్థానాలు ఇథియోపియా అథ్లెట్లే దక్కించుకున్నారు. కిడ్‌సన్ అలెమా గెబ్రెమెధిన్ (2 గంటల 27 నిమిషాల 35 సెకన్లు), గొజ్జమ్ సెగయె (2 గంటల 28 నిమిషాల 27 సెకన్లు) రెండో, మూడో స్థానాలు దక్కించుకున్నారు. మహిళల, పురుషుల విభాగాల్లో విజేతకు 50 వేల డాలర్లు (రూ. 45.35 లక్షలు), రెండో స్థానంలో నిలిచిన వారికి 25 వేల డాలర్లు (రూ. 22.67 లక్షలు), మూడో స్థానం దక్కించుకున్న వారికి 15 వేల డాలర్లు (రూ. 13.60 లక్షలు) అందించారు.

రన్నరప్ అనిరుధ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: కొత్త ఏడాదిలో తొలి టైటిల్ సాధించాలని ఆశించిన హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్‌కు నిరాశ ఎదురైంది. థాయ్‌లాండ్‌లోని నొంతాబురిలో జరిగిన బ్యాంకాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో అనిరుధ్ రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో అనిరుధ్ (భారత్)–టకెరు యుజికి (జపాన్) ద్వయం 3–6, 6–7 (6/8)తో టాప్ సీడ్ శ్రీరామ్ బాలాజీ (భారత్)–నీల్ ఒబెర్‌లెట్నర్ (ఆస్ట్రియా) జంట చేతిలో ఓడిపోయింది. అనిరుధ్–టకెరులకు 2,880 డాలర్ల (రూ. 2 లక్షల 61 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 50 ర్యాంకింగ్ పాయింట్లు... బాలాజీ–నీల్‌లకు 4,980 డాలర్ల (రూ. 4 లక్షల 51 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 75 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మాఘ మేళాలో ఆదివారం మౌని అమావాస్య సందర్భంగా గంగా తీరంలో హారతి ఇస్తున్న ఓ సన్యాసి

ట్రంప్ వైఖరిపై ఆదివారం న్యూక్‌లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రీన్‌లాండ్ ప్రజలు

చాబహార్ పోర్టుపై రాజకీయ రగడ

ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై ట్రంప్ సుంకాల పోటు

- చాబహార్‌పై ఇప్పటికే భారీగా పెట్టుబడులు పెట్టిన భారత్
- అక్కణ్నుంచి వెనక్కి తగ్గుతోంది: అంతర్జాతీయ మీడియా
- ట్రంప్ ఒత్తిడికి మోదీ లొంగిపోతున్నారన్న కాంగ్రెస్
- సుంకాలు అమల్లోకి వస్తే భారత్‌కు నష్టమే: నిపుణులు

ఇరాన్‌లోని చాబహార్ ఓడ రేవు భారత్‌లో రాజకీయ వివాదానికి దారితీస్తోంది. ఈ ఓడరేవుతో భారత్‌కు ఎంతో అనుబంధం ఉంది. పోర్ట్ నిర్మాణంలో దాదాపు దశాబ్ద కాలంగా భాగస్వామిగా కొనసాగుతోంది. పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోంది. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై 25 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం భారత్‌కు ఇబ్బందికరంగా మారింది. ట్రంప్ ఒత్తిడిని తట్టుకోలేక చాబహార్ పోర్ట్ నిర్మాణ బాధ్యతల నుంచి తప్పుకోవడానికి భారత ప్రభుత్వం సిద్ధమైనట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు రావడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ ఎదుట ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారని, దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడుతున్నారని విపక్ష కాంగ్రెస్ ఆరోపించింది. భారత విదేశాంగ విధానాన్ని అమెరికా వైట్ హౌస్ నిర్దేశించే పరిస్థితి తీసుకొచ్చారని మండిపడింది. భారత్‌పై పెత్తనం చేయడానికి ట్రంప్‌ను ఎందుకు అనుమతిస్తున్నారని నిలదీసింది అయితే, కాంగ్రెస్ ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని అధికార బీజేపీ కొట్టిపారేసింది. చాబహార్ పోర్ట్ విషయంలో వైఖరి మార్చుకొనే ప్రసక్తే లేదని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో చాబహార్ పోర్ట్ నుంచి భారత్ నిజంగా వెనక్కి తగ్గుతుందా, అదే జరిగితే మనకు నష్టమెంత అనేదానిపై ఊహాగానాలు మొదలయ్యాయి.

గ్వాదర్ పోర్టుకు పోటీగా..

పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో గ్వాదర్ ఓడరేవును చైనా నిర్మిస్తోంది. దాంతో ఆ ప్రాంతంలో స్వీయ ప్రయోజనాలు కాపాడుకోవడానికి భారత్ కూడా రంగంలోకి దిగింది. గ్వాదర్ పోర్ట్‌కు పోటీగా ఇరాన్ తీరంలో చాబహార్ పోర్ట్ నిర్మాణాన్ని భారత్ ప్రారంభించింది. గత ఏడాది ఇరాన్, అమెరికా మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చాబహార్ పోర్ట్‌పై సెప్టెంబర్‌లో అమెరికా సర్కార్ ఆంక్షలు విధించింది. అక్కడ కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని భారత్‌కు సూచించింది. అందుకు ఆరు నెలల గడువు విధించింది. భారత ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు 2026 ఏప్రిల్ దాకా ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చింది. పోర్ట్ నిర్మాణం కోసం భారత్ ఇప్పటికే ఇరాన్‌కు 12 కోట్ల డాలర్లు బదిలీ చేసింది.

ఎందుకంత కీలకం?

చాబహార్ ఓడ రేవు ఇరాన్‌లో వ్యూహాత్మకంగా కీలక ప్రాంతంలో.. పాక్‌లోని గ్వాదర్ పోర్ట్‌కు 170 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ప్రపంచ ఇంధన వ్యాపారానికి చెక్‌పాయింట్ లాంటి హార్మూజ్ జలసంధికి సమీపంలోనే ఉండడంతో భారత్ ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంది. దీంతో అఫ్గనిస్తాన్, మధ్య ఆసియాతో నేరుగా వ్యాపార మార్గం ఏర్పడుతుంది. పాకిస్తాన్ రేవులతో పనిలేదు. అంతేకాకుండా అంతర్జాతీయ ఉత్తర–దక్షిణ రవాణా కారిడార్(ఐఎన్ఎస్‌టీసీ)లో చాబహార్ పోర్ట్ ముఖ్యమైనది. ముంబై నుంచి ఈ పోర్ట్ గుండా రష్యా, యూరప్‌లకు చేరుకోవచ్చు. సరుకు రవాణా సులభతరమవుతుంది. ప్రయాణ సమయం కూడా భారీగా తగ్గిపోతుంది. అరేబియా, పశ్చిమ హిందూ మహా సముద్రంలో పాక్–చైనాల ఆధిపత్యాన్ని అడ్డుకోవచ్చు. పోర్ట్ నిర్మాణం, నిర్వహణ, ఇతర కార్యకలాపాల కోసం భారత్, ఇరాన్ మధ్య 2003లో చర్చలు ప్రారంభమయ్యాయి. 2015లో ఇరుదేశాల నడుమ ఒప్పందం కుదిరింది. 2018 డిసెంబర్‌లో చాబహార్‌లో భారత కార్యకలాపాలు ప్రారంభించింది. చాబహార్ నుంచి అఫ్గానిస్తాన్ సరిహద్దులోని జహెదాన్ వరకు రైలు మార్గాన్ని అభివృద్ధి చేయడానికి భారత్ అంగీకరించింది. దీంతో వ్యాపార విస్తరణ మెరుగుపడే అవకాశం ఉంది.

సుంకాలతో భారత్‌కు నష్టమే

చాబహార్ కోసం భారత్ చేస్తున్న మొత్తం వ్యయం 370 మిలియన్ డాలర్లు. ఇందులో 120 మిలియన్ డాలర్లు ప్రత్యక్ష పెట్టుబడి కాగా, 250 మిలియన్ డాలర్లను ఇరాన్‌కు రుణంగా ఇస్తోంది. 120 మిలియన్ డాలర్లను ఇప్పటికే ఇరాన్‌కు అందించింది. చాబహార్‌పై విధించిన ఆంక్షలు గడువు త్వరలోనే ముగిసిపోనుంది. గడువు పెంపుకోసం భారత ప్రభుత్వం ప్రయత్ని స్తోంది. అమెరికాతో సంప్రదింపులు జరుపుతోంది. ఇరాన్‌పై ట్రంప్ ప్రభు త్వం కఠినంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అందుకే ఆంక్షలను ఎత్తివేసే సూచనలు కనిపించడంలేదు. పోర్ట్ విషయంలో ఇలాగే ముందుకు వెళ్తే ట్రంప్ హెచ్చరించినట్లు భారత్‌పై మరో 25 శాతం సుంకాలు అమల్లోకి వచ్చినా ఆశ్చర్యంలేదు. అదే జరిగితే భారత్‌కు భారీగా నష్టం వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. 120 మిలియన్ డాలర్ల పెట్టుబడిని వదులుకోవాలా? లేక అమెరికాతో జరిగే 132 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని వదులుకోవాలా? అనేది భారత ప్రభుత్వం నిర్ణయించుకోవాలని అంటున్నారు. మొత్తానికి చాబహార్ ఓడ రేవు అంశంలో భారత్ విపరీతమైన ఒత్తిడి ఎదుర్కొంటోందని చెప్పొచ్చు. భారతదేశ ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలు విధించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మిన్నెపొలిస్‌లో 'వలస'ల రగడ

వ్యతిరేక, అనుకూల వర్గాల ఘర్షణ

మిన్నెపొలిస్: ట్రంప్ సర్కారు వలసల అణచివేత చర్యలపై అమెరికాలో మిన్నెసోటా రాష్ట్రంలోని మిన్నెపొలిస్ అట్టుడుకుతోంది. వలసల వ్యతిరేక, అనుకూల వర్గాల నడుమ ఘర్షణలు తారస్థాయిలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జాతీయ భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నాయని గవర్నర్ కార్యాలయం తెలిపింది. వలసల అణచివేతపై నిరసనల్లో భాగంగా శనివారం మిన్నియాపోలీస్ డౌన్‌టౌన్‌లో నిరసన కారులు పెద్ద సంఖ్యలో చేరారు. వారికి వలసలపై అణచివేతకు అనుకూల ఆందోళనకారులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. ఒకరిపై ఒకరు స్నో బాల్స్, ఇతర నీటి బెలూన్లను విసురుకున్నారు. ముసుగులు ధరించిన ఇమ్మిగ్రేషన్ అధికారులు ఇళ్ల నుంచి, కార్ల నుంచి ప్రజలను బయటకు లాగడమే కాక.. దూకుడుగా వ్యవహరిస్తున్నారని నిరసనకారులు విమర్శించారు. తక్కువగా ఉన్న అనుకూల సమూహాన్ని తరిమికొట్టిన నిరసనకారులు, అనుకూల ఆందోళనకారుల్లో ఒకరైన జేక్‌లాంగ్‌ను పట్టుకుని దాడిచేశారు. గతేడాది జనవరి 6న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్షమాభిక్ష ప్రసాదించిన వారిలో జేక్ ఉన్నారు. ఆయన బేస్‌బాల్ బ్యాట్‌తో అధికారిపై దాడి చేయడం సహా పలు నేరాలకు పాల్పడినట్లు అభియోగాలున్నాయి. క్షమాభిక్షతో బయటికి వచ్చిన జేక్.. ఫ్లోరిడాలోని యూఎస్ సెనేట్‌కు పోటీ చేస్తున్నట్లు ఇటీవల ప్రకటించారు.

మిన్నెపొలిస్, సెయింట్ పాల్ జంట నగరాల్లో వలసలపై అణచివేత చర్యల్లో భాగంగా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ఇటీవల 2వేల మందికి పైగా ఫెడరల్ అధికారులను తరలించింది. ఇమ్మిగ్రేషన్ అమలును వేగవంతం చేసింది. నాటి నుంచి ప్రతిరోజూ నిరసనలు జరుగుతున్నాయి. ట్విన్ సిటీస్‌లో జరుగుతున్న ఇమ్మిగ్రేషన్ ఆపరేషన్‌లో ఇటీవల ఒక మహిళ మరణించింది. అమెరికా పౌరురాలైన ఆమెను జనవరి 7న జరిగిన ఘర్షణలో ఇమ్మిగ్రేషన్ అధికారులు కాల్చి చంపారు. దీంతో శనివారం అధికారులు శాంతియుతంగా నిరసనకారులపై ఎలాంటి నిర్బంధం, టియర్‌గ్యాస్‌ను కూడా ప్రయోగించలేదు. మిన్నెసోటా స్టేట్ ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడటానికే కాదు, శాంతియుతంగా సమావేశమయ్యే ప్రజల హక్కులకు మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని డెమొక్రటిక్ గవర్నర్ టిమ్ వాల్జ్ తెలిపారు. అయితే, దేశంలో ఉండటానికి హక్కు లేని అక్రమ వలసదారుల అరెస్టు, నిర్బంధం బహిష్కరణ కోసం తాము పోరాడుతూనే ఉంటామని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అసిస్టెంట్ సెక్రటరీ ట్రిసియా మెక్ లాఫ్లిన్ అన్నారు.

సిటీ హాల్ వద్ద ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

హిందీయేతర భాషలకు సాహితీ అవార్డు

ప్రకటించిన తమిళ సీఎం స్టాలిన్

చెన్నై: తమిళ, తెలుగు, బెంగాలీ, మరాఠీ భాషల్లోని ఉత్తమ రచనలకు సాహిత్య పురస్కారం అందజేయనున్నట్లు తమిళ నాడు సీఎం ఎంకే స్టాలిన్ ఆదివారం ప్రకటించారు. సెమ్మొళి ఇల్లకియా విరుధుగా ఈ అవార్డు కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున నగదును విజేతలకు అందజేస్తుందన్నారు. మొదటి దశలో తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, ఒడియా, బెంగాలీ, మరాఠీలకు చోటు కల్పిస్తామన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ జోక్యం కారణంగానే ఈ దఫా సాహిత్య అకాడమీ పురస్కారాలను ప్రకటించలేదని స్టాలిన్ చెప్పారు. ఇటువంటి వ్యవహారాలకు చోటు లేకుండా చూసేందుకే తాము ఏడాదిన్నరకోసారి జాతీయ స్థాయి సాహితీ పురస్కారాలను అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. విజేతల ఎంపిక కోసం సంబంధిత భాషల్లో ప్రముఖ రచయితలతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విచారణ ఆలస్యమైతే బెయిలివ్వాలి!

ఉమర్ ఖలీద్ ఉదంతంపై మాజీ సీజేఐ చంద్రచూడ్

జైపూర్: ఢిల్లీలో అల్లర్లకు కుట్ర పన్నినట్లు అభియోగాలు ఎదుర్కొంటూ 2020 నుంచి జైలులో ఉన్న జవహర్‌లాల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి, డెమొక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ మాజీ నేత ఉమర్ ఖలీద్‌కు కొన్ని హక్కులు ఉన్నాయని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆదివారం అభిప్రాయపడ్డారు. ''వేగవంతమైన విచారణ హక్కును కోర్టులు పరిగణనలోకి తీసుకోవాలి. సుదీర్ఘకాల నిర్బంధం సరికాదు. నిందితులకు బెయిల్‌ను నిరాకరించలేం. న్యాయమూర్తులు ఈ విషయంలో ఒత్తిళ్లకు లొంగొద్దు'' అని ఆయన సూచించారు.

కళ్లముందు కదనరంగం

- నిఘా నుంచి దాడి, రక్షణ వరకు యుద్ధ వ్యూహాల ప్రదర్శన
- ఈసారి వినూత్నంగా రిపబ్లిక్ వేడుకలు
- భైరవ్ కమాండోల అరంగేట్రం
- భారత సైనిక శక్తికి ప్రతీకగా నిలువనున్న పరేడ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఈ ఏడాది 76వ గణతంత్ర దినోత్సవ పరేడ్ సంప్రదాయాలకు భిన్నంగా సాగనుంది. శత్రుదేశంతో యుద్ధం వేళ నిఘా నుంచి దాడి, రక్షణ, వ్యూహాలను ఎలా అమలు చేస్తారనే విషయాలను పరేడ్‌లో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించనున్నారు. దాయాది దేశం పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్'తర్వాత నిర్వహిస్తున్న మొదటి రిపబ్లిక్ డే వేడుకలు కావడంతో ఈసారి కర్తవ్య పథ్‌పై భారత సైన్యం నిజమైన యుద్ధరంగ దృశ్యాన్ని ప్రతిబింబించేలా తన యుద్ధపాటవాన్ని ప్రదర్శించనుంది. కదనరంగాన్ని కళ్ల ముందు సాక్షాత్కరింపజేయనుంది. మొదటిసారిగా పరేడ్‌లో సైనిక దళాలు తమ ఆయుధాలను రణక్షేత్రంలో ఏ తరహాలో అయితే మొహరిస్తారో అదే రీతిలో ప్రదర్శించనున్నాయి. నిఘాకు సంబంధించిన హై మొబిలిటీ వాహనాలు, బ్యాటిల్ ఫీల్డ్ సర్వైలెన్స్ రాడార్లు, డ్రోన్లను ప్రదర్శించనున్నారు. యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైళ్లను ఆ తర్వాత ప్రదర్శించనున్నారు. అనంతరం భూతలంపై సైనిక దళాలకు గగనతల నుంచి దన్నుగా నిలబడే అపాచీ దాడి హెలికాప్టర్లు, తేలికపాటి యుద్ధ 'ప్రచండ్'హెలికాప్టర్లు కర్తవ్యపథ మీదుగా దూసుకెళ్లి తమ సైనిక పాటవాన్ని ప్రదర్శించనున్నాయి.

ట్యాంకుల బలం...

భూతల యుద్ధాన్ని ముందుండి నడిపించే అత్యంత కీలక టీ–90 యుద్ధ ట్యాంక్‌లు, అర్జున్ యుద్ధ ట్యాంక్, బీఎంపీ-2 ఇన్ఫాంట్రీ కాంబాట్ వాహనాలు, ఎన్ఏఎంఐఎస్–2 నాగ్ మిస్సైల్ వ్యవస్థ పరేడ్‌లో కీలక ఆకర్షణగా నిలవనున్నాయి. భారతదేశంలో తయారైన ఆధునిక ఆయుధ వ్యవస్థలు ఏటీఏజీఎస్ ధనుష్, బ్రహ్మోస్ క్షిపణి, ఆకాశ్, బరాక్–8 గగనతల రక్షణ వ్యవస్థలనూ పరేడ్‌లో ప్రదర్శించనున్నారు.

ఆధునిక యుద్ధ సాంకేతికత..

ఈసారి పరేడ్‌లో భవిష్యత్ యుద్ధరీతుల్లో కీలకమైన ఆధునాతన సాంకేతికతలను ప్రదర్శించడంపై ప్రధానంగా దృష్టిసారించారు. ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ సెంటర్, అన్‌మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్స్, ఆల్–టెర్రెయిన్ వాహనాలు, రోబోటిక్ మ్యూల్స్‌తో లైట్ స్ట్రైక్ వెహికిల్స్, రోబోటిక్ డాగ్స్ తదితరాలు ప్రదర్శనలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సంప్రదాయం– ఆధునికత కలబోతగా ఈసారి జాన్స్కర్ పోనీలు, బ్యాక్ట్రియన్ ఒంటెలు, సైనిక డాగ్ స్క్వాడ్ దళాలు, లాజిస్టిక్స్ యూనిట్లతో కలిసి పరేడ్‌లో కవాతు చేయనున్నాయి. పరేడ్ ముగింపులో ఇన్ఫాంట్రీ దళాలతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన 'భైరవ్ లైట్ కమాండో బెటాలియన్'తొలిసారిగా పాల్గొననుంది. 'ఉంచా కదమ్ తాల్'తో మార్చింగ్ చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అనంతరం అత్యాధునిక రాఫెల్, సుఖోయ్–30, మిగ్–29 యుద్ధవిమానాలు నింగిలో వైమానిక విన్యాసాలు చేయనున్నాయి. వీటి వెంటే అపాచీ, తేలికపాటి యుద్ధ విమాంన, ఏఎల్‌హెచ్ సహా భారీ సరకు రవాణా విమానాలు తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించనున్నాయి. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ కవాతును కేవలం సంబరంగా కాకుండా సమరక్షేత్రానికి నమూనాకు చూపించనున్నారు. ఆధునిక సాంకేతికత, దేశీయ ఆయుధాలు, కొత్త కమాండో దళాలతో భారత రక్షణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటనుంది.

నేడే నబిన్ నామినేషన్

తరలిరానున్న బీజేపీ అగ్ర నేతలు

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియకు అంతా సిద్ధమైంది. సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, రాష్ట్ర విభాగాల అధ్యక్షులు, ఇతర ప్రముఖ నేతలు హాజరుకానున్నారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటీవలే నియమితులైన నితిన్ నబిన్ పార్టీ 12వ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా వంటి అగ్రనేతలు ఆయన అభ్యర్థిత్వానికి మద్దతిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం నామినేషన్ సమర్పణ ఉంటుంది. ఫలితాలను మరునాడు ప్రకటిస్తారు. పార్టీ జాతీయ కౌన్సిల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. ఒక రాష్ట్రానికి చెందిన ఎలక్టోరల్ కాలేజీలోని 20 మంది సభ్యులు కలిసి జాతీయ అధ్యక్షుడి పేరును ప్రతిపాదించవచ్చు.

ఢిల్లీలో రూ.5 కోట్ల డ్రగ్స్ సీజ్

నైజీరియా ముఠా అరెస్ట్

న్యూఢిల్లీ: నైజీరియన్లు నడిపే అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేయడంతోపాటు రూ.5 కోట్ల కొకైన్, ఎక్స్‌టసీ లేదా ఎండీఎంఏ అని పిలిచే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డిసెంబర్ 2వ తేదీన దక్షిణ ఢిల్లీ ప్రాంతంలో ఓ వ్యక్తి డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు నిఘా ఉంచారు. అయితే, పోలీసు వాసన పసిగట్టిన ఆ వ్యక్తి వేరే వేరే ప్రాంతాలు మారుస్తూ వస్తున్నాడు. సాంకేతిక ఆధారాలతో పోలీసు బృందం ఫ్రాంక్ విటుస్ ఉమే అనే నైజీరియా వాసిని పట్టుకుంది. అతడి నుంచి కొకైన్‌తోపాటు, ఎండీఎంఏ టాబ్లెట్లను స్వాధీనం చేసుకుంది. అతడిచ్చిన సమాచారం మేరకు మెహ్రౌలీ ప్రాంతంలో ఉండే సండే ఓటు అనే నైజీరియా వాసిని అరెస్ట్ చేసింది. నైజీరియాలోని ప్రధాన ముఠా సభ్యుల నుంచి అందే ఆదేశాల మేరకు ఓటు డ్రగ్స్‌ను ఉమెకు అందజేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ముఠా విదేశాలకు చెందిన నంబర్లతో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. హ్యాండ్లర్లు, కొరియర్ల మధ్య ప్రత్యక్ష సంబంధాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక విదేశీ మహిళ సహా పలువురు మధ్యవర్తుల ద్వారా ఢిల్లీ, చుట్టుపక్కల రాష్ట్రాల్లో డ్రగ్స్‌ను అందజేస్తున్నారని పోలీసులు తెలిపారు. బిజినెస్ వీసాపై కొన్నేళ్ల క్రితమే ఇక్కడికి వచ్చిన వీరు డ్రగ్స్ దందా మొదలుపెట్టారన్నారు.

బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల పరంపర కొనసాగుతోంది. తాజాగా, గాజీపూర్‌లో అరటి పండ్ల విషయమై తలెత్తిన వివాదంలో బైశాఖి హోటల్ యజమాని లిటన్ చంద్ర ఘోష్(55)ను ఒకే కుటుంబంలోని ముగ్గురు కొట్టి చంపారు. ఘటనకు సంబంధించి స్వపన్ మియా(55), ఆతడి భార్య మజేదా ఖతున్, కుమారుడు మసుమ్ మియాలను అరెస్ట్ చేసినట్లు కాళీగంజ్ పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. మసుమ్ అరటి పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. అతడి దుకాణంలో కొన్ని పండ్లు మాయమయ్యాయి. చంద్ర ఘోష్‌పై అనుమానం రాగా తల్లిదండ్రులతో కలిసి ఘోష్ హోటల్‌కు వచ్చాడు. అరటి పండ్ల విషయమై గొడవకు దిగారు. ముగ్గురూ కలిసి ఘోష్‌పై దాడి చేశారు. కిందపడిపోయిన ఘోష్ అక్కడికక్కడే చనిపోయాడని పోలీసులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ఇక అంతే..

మహారాష్ట్రలో ఆ పార్టీ వ్యూహం సక్సెస్: సిబల్

న్యూఢిల్లీ: బీజేపీ రాజకీయ వ్యూహాలపై రాజ్యసభ ఎంపీ, సీనియర్ లాయర్ కపిల్ సిబల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'అధికారంలో లేని లేదా తక్కువ మెజారిటీ కలిగిన రాష్ట్రాల్లో కాషాయ పార్టీ ఇతరులతో పొత్తుల ద్వారా అధికారంలోకి వస్తుంది.. తర్వాత ఆ పార్టీలను క్రమంగా పక్కనబెడుతుంది'అని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో ఇదే వ్యూహంతో బీజేపీ విజయం సాధించిందని ఆయన చెప్పారు. మహారాష్ట్రలోనూ ఇదే రాజకీయ వ్యూహాన్ని అమలు చేసిందన్నారు. ఈ వ్యూహం ఫలితంగానే భాగస్వామ్య పార్టీలైన శివసేన(షిండే), ఎన్సీపీ అజిత్ పవార్ వర్గాల ప్రాధాన్యత తగ్గిపోతుండగా, బీజేపీ బలం పెరుగుతోందని సిబల్ చెప్పారు. తాజాగా వెలువడిన స్థానిక ఎన్నికల ఫలితాలే ఇందుకు ఉదాహరణ అని ఆయన విశ్లేషించారు. గత ఎన్నికలతో పోల్చి చూస్తే షిండే, అజిత్ పవార్‌ల బలం ఒక్కసారిగా తగ్గిపోయిందని, మరో వైపు బలం బీజేపీ పుంజుకుంటూ పోయిందని అన్నారు. బీజేపీతో మైత్రి ద్వారా ప్రభావం తగ్గించుకోవాలా లేదా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపి పోరాడాలా అనే చిన్న పార్టీలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని కపిల్ సిబల్ పేర్కొన్నారు.

క్లయింట్ల కోసం లాయర్లు సహా చట్టాన్ని వాడరాదు: సీఐసీ

న్యూఢిల్లీ: న్యాయవాదులు తమ కక్షిదారుల కోసం సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరరాదని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలు ఆ చట్టం ఉద్దేశ్యాలను నెరవేర్చనట్లు కాదని పేర్కొంది. హరియాణాలోని జవహర్ నవోదయ విద్యాలయకు పండ్లు, కూరగాయలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు సంబంధించిన సమాచారం కావాలంటూ ఓ లాయర్ రెండోసారి చేసిన అప్పీల్‌పై సమాచార కమిషనర్ రేలంగి సుధారాణి ఈ విషయం తెలిపారు. కూరగాయలు, పండ్ల కాంట్రాక్టర్ అయిన తన సోదరుడి తరఫున లాయర్ చేసిన ఈ అప్పీల్‌ను అనుమతించబోమన్నారు. ఇందుకు సంబంధించి మద్రాస్ హైకోర్టు వెలువరించిన తీర్పును ఆమె ఉటంకించారు.

శ్రీలంక పర్యాటకుల్లో భారతీయులే టాప్

కొలంబో: 2025వ సంవత్సరంలో శ్రీలంకను సందర్శించిన విదేశీయుల్లో భారతీయులు మొట్టమొదటి స్థానంలో ఉన్నారు. ఏడాది కాలంలో ఏకంగా 23 లక్షల మంది భారతీయులు వచ్చినట్లు శ్రీలంక పర్యాటక శాఖ వెల్లడించింది. 'పర్యాటక మార్కెట్‌లో భారత్ తిరుగులేని అగ్రగామిగా కొనసాగుతోంది. 5,31,511 మంది పర్యాటకులు రాకతో, రెండో స్థానంలో ఉన్న దేశం కంటే ఇది రెట్టింపు కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. గతేడాదితో పోలిస్తే 1.14లక్షల మంది ఎక్కువ మంది సందర్శించారు. ఇది అద్భుతమైన వృద్ధిని హైలైట్ చేస్తోంది. భారత పర్యాటకుల సంఖ్య ఏడాదికి 15 శాతం చొప్పున పెరుగుతోందని పేర్కొంది. భారత్ తర్వాత 21,277 మందితో యూకే రెండో స్థానంలో నిలిచిందని తెలిపింది.

23న తమిళనాడులో మోదీ ఎన్నికల ర్యాలీ

చెన్నై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 23వ తేదీన తమిళనాడులో ఎన్డీయే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. మదురాంతకంలో జరిగే భారీ ర్యాలీలో ప్రధాని మోదీ పాల్గొంటారని బీజేపీ శాసనసభా పక్ష నేత నయినార్ నాగేంద్రన్ వెల్లడించారు. తమిళనాడులోని ప్రజా వ్యతిరేక డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటిదారి పట్టించేందుకు ఆరోజు నుంచే కౌంట్‌డౌన్ మొదలవుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎన్డీయే భాగస్వామ్య పార్టీల సమాచారం ప్రకటిస్తామని చెప్పారు. పొత్తులపై నిర్ణయం ఆయన సమావేశమయ్యారు. ఈ అవకాశాన్ని మిస్ చేసుకోవద్దన్నారు. ఆ రోజు వేదికపై ఎవరెవరుంటారో మీరే చూస్తారు.. అంటూ దాటేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాట డీఎంకేకు ప్రత్యామ్నాయంగా నిలిచేందుకు కాషాయదళం కృషి చేస్తోంది.

సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలు..

ఆప్ ఎంపీ సంజయ్‌పై కేసు

మరో ఎనిమిది మందిపై కూడా

వారణాసి: ప్రపంచ ప్రఖ్యాత హిందూ క్షేత్రం కాశీలోని మణికర్ణికా ఘాట్ సుందరీకరణ పనులకు సంబంధించి ఫేక్ ఫొటోలను సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినందుకు ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ సహా ఎనిమిది మంది వ్యక్తులపై కేసు నమోదైంది. వీరిలో ఇండిపెండెంట్ ఎంపీ పప్పు యాదవ్, కాంగ్రెస్ నేత జస్వీందర్ కౌర్ కూడా ఉన్నారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీయడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చగొట్టడం, సామరస్యాన్ని దెబ్బతీసే ఉద్దేశంతో ఏఐ సాయంతో తప్పుడు వీడియోలు సృష్టించారని పోలీసులు తెలిపారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న సోషల్‌మీడియా హ్యాండిల్స్‌తోపాటు కంటెంట్‌ను వైరల్ చేస్తున్నవారిపైనా చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ బన్సాల్ పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌పై ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ స్పందించారు. పునరుద్ధరణ పనులవల్లే మణికర్ణిక ఘాట్ విధ్వంసం జరిగిందని, ఆలయాలు దెబ్బతిన్నాయని, అహల్యాబాయి హోల్కర్ విగ్రహం ధ్వంసమైందని తెలిపారు. దీనిపై సాధువులు, ఇతరుల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయని, ఈ అంశాన్ని లేవనెత్తినందుకు తనను టార్గెట్ చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణను జిల్లా యంత్రాంగం తోసిపుచ్చింది. అత్యంత పురాతనమైన, పవిత్రమైన దహన సంస్కార స్థలాల్లో మణికర్ణికా ఘాట్ ఒకటి. ఇక్కడ దహనం చేసినవారికి మోక్షం లభిస్తుందని నమ్ముతారు. ఘాట్ పునరాభివృద్ధి ప్రాజెక్టును గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం ప్రారంభించింది. వారణాసి వారసత్వాన్ని యోగి, మోదీ ప్రభుత్వం నాశనం చేస్తోందని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఘాట్ వద్ద జరుగుతున్న పనులను వెంటనే నిలిపివేయాలని, అక్కడి మత పెద్దలతో సంప్రదించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం చట్టం చేయొచ్చా?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసింది. రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అనే పదాన్ని ప్రయోగించపోయినా.. భారతదేశం సమాఖ్య రాజ్యమే. ఎందుకంటే సమాఖ్య మౌలిక లక్షణాలన్నీ భారత సమాఖ్యలో ఉన్నాయి. సమాఖ్యలో అత్యంత ముఖ్య లక్షణం అధికార విభజన. రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య చాలా విస్పష్టమైన, స్పష్టమైన అధికార విభజన జరిగింది.

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య మూడు రకాల సంబంధాలను పొందుపర్చారు.

1. శాసన సంబంధాలు (Legislative Relations)–11వ భాగం,ప్రకరణ 245 నుంచి 255
2. పరిపాలనా సంబంధాలు (Administrative Relations)–11వ భాగం, ప్రకరణ 256 నుంచి 263
3. ఆర్థిక సంబంధాలు (Financial Relations) –12 భాగం, ప్రకరణ 264 నుంచి 300

కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలు

భాగం 11లోని ప్రకరణలు 245 నుంచి 255 వరకు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న శాసన సంబంధాలను పొందుపరిచారు. శాసన సంబంధాలు అంటే పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు ఏయే అంశాలపై చట్టాలు చేయవచ్చో వివరించే ప్రక్రియ.

ప్రకరణ–245: కేంద్ర పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల చట్టాల భౌగోళిక పరిమితులు:

- పార్లమెంట్ రూపొందించే చట్టాలు దేశంలో అన్ని ప్రాంతాలకు,అన్ని సంస్థలకు వర్తిస్తాయి. ఇవి ఇతర దేశాల్లో నివసిస్తున్న భారతీయులకు కూడా వర్తిస్తాయి(ప్రకరణ 245(2)). ఈ అధికారాన్నే 'Extra Territorial Legislation' లేదా 'సీమాంతేతర చట్టాలు' అంటారు.
- రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాలు ఆ రాష్ట్ర భూభాగాలకు మాత్రమే వర్తిస్తాయి. వీటికి సీమాంతేతర చట్టాల పరిధి లేదు.

పార్లమెంట్ చట్టాలపై పరిమితులు:

- పార్లమెంట్ చేసిన చట్టాలు కొన్ని ప్రాంతాలకు.. ముఖ్యంగా కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్ హవేలీ, డామన్-డయ్యూ ప్రాంతాలకు వర్తించవు. వీటి పరిపాలనా రాష్ట్రపతి నేరుగా నియంత్రిస్తారు. పరిపాలనా ఆదేశాలను రాష్ట్రపతి జారీ చేస్తారు. ఇవి పార్లమెంట్ చట్టాలతో సమాన ప్రతిపత్తి కలిగి ఉంటాయి.
- రాష్ట్రాల్లోని కొన్ని షెడ్యూల్ ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు వర్తించవు. ఈ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తారు. అసోం గవర్నర్‌కు ఆ రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లా మండలి (Autonomous District Council)కి సంబంధించి ప్రత్యేక అధికారాలు ఉంటాయి.
- మేఘాలయ, త్రిపుర, మిజోరం రాష్ట్రాల్లో స్వయం ప్రతిపత్తి ఉన్న జిల్లాలపై గవర్నర్‌కు ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ- 246: కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన: కేంద్ర,రాష్ట్రాల మధ్య అధికారాలను మూడు జాబితాల్లో విభజించారు. వీటికి సంబంధించిన వివరాలను ఏడో షెడ్యూల్లో పేర్కొన్నారు.

జాబితాలు

కేంద్ర జాబితా (Union List) ప్రకరణ 246 (1): రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ప్రారంభంలో ఈ జాబితాలో 97 అంశాలున్నాయి. తర్వాత ఈ జాబితాకు 2ఎ, 92ఎ, 92బి, 92సి అంశాలను చేర్చారు. 33లో ఉన్న అంశాలను తొలగించారు. ప్రస్తుతం ఇందులో వంద అంశాలున్నాయి.

జాబితాలోని ముఖ్యాంశాలు: దేశ రక్షణ, అంతర్జాతీయ వ్యవహారాలు, బ్యాంకింగ్, కరెన్సీ, అణుశక్తి, బీమా, ప్రసారాలు, వైమానిక, నౌకా రవాణాలు మొదలైన జాతీయ ప్రాముఖ్యం ఉన్న విషయాలను కేంద్ర జాబితాలో పొందుపరిచారు.

కేంద్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలను రూపొందించవచ్చు, సవరించవచ్చు, రద్దు చేయవచ్చు.

రాష్ట్ర జాబితా (State List) ప్రకరణ 246(3): రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ఇందులో 66 అంశాలున్నాయి. ప్రస్తుతం 61 అంశాలు మాత్రమే ఉన్నాయి. ఈ జాబితాలోని ఎంట్రీ 11, 19, 20, 29, 36లోని అంశాలను ఉమ్మడి జాబితాలోకి మార్చారు.

జాబితాలోని ముఖ్యాంశాలు: శాంతి భద్రతలు, పోలీస్, వ్యవసాయం, నీటిపారుదల, స్థానిక సంస్థలు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, జైళ్లు, గ్రంథాలయాలు, మార్కెట్లు, వడ్డీ వ్యాపారం తదితర స్థానిక ప్రాముఖ్యం ఉన్న అంశాలను ఈ జాబితాలో పొందుపరిచారు.

ఉమ్మడి జాబితా (Concurrent List) ప్రకరణ 246(2): ప్రారంభంలో ఈ జాబితాలో 47 అంశాలు ఉండేవి. ప్రస్తుతం 52 ఉన్నాయి. ఈ జాబితాలో ఎంట్రీ నంబర్ 11ఎ న్యాయపాలన, సబార్డినేట్ కోర్టుల వ్యవస్థీకరణ, 17ఎ అడవులు, 17బి వన్యప్రాణుల సంరక్షణ, 20ఎ జనాభా నియంత్రణ, కుటుంబ నియంత్రణ, 25 సాధారణ విద్య, సాంకేతిక విద్య, 33ఎ తూనికలు, కొలతలు.

పై అన్ని అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి చేర్చారు. అందువల్ల ఉమ్మడి జాబితాలోని అంశాలు 47 నుంచి 52కు పెరిగాయి.

కేంద్ర, రాష్ట్ర శాసనాల మధ్య వైరుధ్యం

ఉమ్మడి జాబితాలోని అంశాలపైన పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేయవచ్చు. అయితే కేంద్ర శాసనానికి, రాష్ట్ర శాసనానికి మధ్య వైరుధ్యం ఏర్పడితే.. ఇదే అంశంపై కేంద్ర శాసనానికే ఆధిక్యత ఉంటుంది. కొన్ని సందర్భాల్లో మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రపతి పూర్వానుమతితో రాష్ట్ర శాసనసభ చట్టం చేసి, అదే అంశంపై పార్లమెంట్ కూడా చట్టం చేస్తే.. పార్లమెంట్ చేసిన చట్టం రాష్ట్ర శాసనసభ చేసిన చట్టానికి విరుద్ధమైతే, రాష్ట్ర శాసనసభ చేసిన చట్టమే చెల్లుబాటవుతుంది.

కేంద్ర, రాష్ట్ర చట్టాల వివాదాల పరిష్కారానికి సంబంధించిన సూత్రాలు (Doctrines)

కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజనకు సంబంధించి వివాదాలు తలెత్తితే.. వాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు కొన్ని న్యాయ సూత్రాలను అవలంబిస్తుంది. ప్రతి సూత్రానికి అంతర్గతంగా ఒక పరమార్థం ఉంటుంది. వాటిని కింది విధంగా వివరించవచ్చు.

డాక్ట్రిన్ ఆఫ్ పిత్ అండ్ సబ్‌స్టెన్స్: సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరిగిన సందర్భాల్లో ఒక నిర్దిష్ట అంశం లేదా చట్టాన్ని ఒక జాబితాలో పొందుపరుస్తారు. ఆ అంశం ఏ జాబితాలో పొందుపరిచిన అంశాన్ని సందర్భానుసారం కొంత వరకు అతిక్రమించినా, ఆ చట్టాలను రద్దు చేయరు. అలాంటి సందర్భాల్లో ఆ అంశంలోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. దీన్నే 'పిత్ అండ్ సబ్‌స్టెన్స్' అంటారు. ఉదాహరణకు, మనీ లెండింగ్ (రుణం ఇవ్వడం) అనేది ఒక అంశం రాష్ట్ర జాబితాలో ఉంది. దీనికి సాక్ష్యంగా ఆధారంగా రాసే ప్రామిసరీ నోటు అనే అంశం కేంద్ర జాబితాలో ఉంది.

మనీ లెండింగ్‌ను నియంత్రిస్తూ రాష్ట్రం చేసిన చట్టం సందర్భానుసారం కేంద్ర జాబితాలోని ప్రామిసరీ నోటు అనే అంశంలోకి చొరబడ్డా.. రాష్ట్రం తన శాసనసభ పరిధిని అతిక్రమించిందనే నెపంతో న్యాయస్థానం ఆ చట్టాలను కొట్టివేయదు. ఎందుకంటే ఆ చట్టంలోని ప్రధాన సారాంశం రాష్ట్ర జాబితాలోనే ఉంది. అనుకోకుండా ఆ చట్ట పరిధి కేంద్ర జాబితాలోకి విస్తరించినా.. ప్రధాన ఉద్దేశం రాష్ట్ర జాబితాలోని అంశాన్ని నియంత్రించడమే అవుతుంది. కేంద్ర, రాష్ట్రాలు తమ పరిధులను అతిక్రమించాయనే సమస్య ఉత్పన్నమైనప్పుడు న్యాయస్థానం'పిత్ అండ్ సబ్‌స్టెన్స్' సూత్రం ప్రకారం తీర్పులు చెబుతుంది. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సదరన్ ఫార్మాస్యూటికల్ వర్సెస్ కేరళ ప్రభుత్వం(1981), స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వర్సెస్ చావ్లా కేసుల్లో స్పష్టీకరించింది.

డాక్ట్రిన్ ఆఫ్ కలరబుల్ లెజిస్లేషన్: కేంద్ర రాష్ట్రాల అధికారాల విభజన ఉద్దేశం రెండింటి మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా చూడటం. అయితే శాసన శాఖ తన పరిధిలో లేని అంశాలను ఉన్నట్లుగా ఊహించుకుని దురుద్దేశపూర్వకంగా చట్టాలు చేస్తే, అలాంటి చట్టాలను కలరబుల్ లెజిస్లేషన్ అంటారు. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం.. ప్రత్యక్షంగా చేయలేని పనిని పరోక్షంగానూ చేయకూడదు (You can not do indirectly what you can not do directly i.e. no person who has no title can not transfer it to others)ఉదాహరణకు 'రైల్వేలు' కేంద్ర జాబితాలో ఉంది. ఆ అంశాలపై రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేస్తే, ఆ చట్టాలు కలరబుల్ లెజిస్లేషన్ అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ: రిపగ్నెన్సీ అంటే ఇష్టం లేకపోవడం లేదా అసంబద్ధం అని అర్థం. ఒక చట్టం ఒక పనిని అనుమతించి, మరో చట్టం ఆ పనికి అనుమతిని నిరాకరిస్తే దాన్ని అసంబద్ధం లేదా డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ అంటారు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు చేయవచ్చు. రెండింటి మధ్య వివాదం ఏర్పడితే అనివార్యంగా కేంద్ర చట్టమే చెల్లుబాటవుతుంది. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభ చట్టాలు రెండూ పరస్పర విరుద్ధమైతే, డాక్ట్రిన్ ఆఫ్ రిపగ్నెన్సీ ప్రకారం ఆ చట్టాల చెల్లుబాటును నిర్ణయిస్తారు.

ఉదాహరణకు హత్య నేరానికి ఐ.పి.సి. 302 ప్రకారం శిక్ష వేయవచ్చు. బాల నేరస్తులకు సంబంధించి ఒకవేళ ఆ రాష్ట్రం ప్రత్యేక చట్టం చేసి ఉంటే, ఆ రాష్ట్ర చట్టం ప్రకారం వారిని విచారించి శిక్షించాల్సి ఉంటుంది. అలాంటి చట్టాలు సి.ఆర్.పి.సి.లో మినహాయింపు ఉంటే రాష్ట్ర చట్టాలే చెల్లుబాటు అవుతాయి.

డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్: రెసిడ్యూరీ అంటే మిగిలిపోయిన భాగం అని అర్థం. మూడు జాబితాల్లో ప్రస్తావించని అంశాలను అవశిష్ట అధికారాల పేరుతో కేంద్రానికి ఇచ్చారు. కాబట్టి అవశిష్ట అధికారాలపై చట్టం చేసే అధికారం పూర్తిగా కేంద్ర ప్రభుత్వానికే ఉంటుంది. ఈ సూత్రం ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వాన్ని బలోపేతం చేయడమే.

ఉదాహరణకు పార్లమెంట్ అవశిష్ట అంశాలకు సంబంధించి పార్లమెంట్ సంపద పన్ను చట్టం-1957; బహుమతి పన్ను చట్టం-1957; కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 మొదలైన చట్టాలను రూపొందించింది. ఇవి డాక్ట్రిన్ ఆఫ్ రెసిడ్యూరీ పవర్స్‌లో వస్తాయి.

డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్మ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆస్తులపై పరస్పరం పన్నులు విధించుకోరాదని మినహాయింపు ఉంది. దీన్ని డాక్ట్రిన్ ఆఫ్ ఇమ్మ్యూనిటీ ఆఫ్ ఇన్‌స్ట్రుమెంటాలిటీస్ అంటారు. ప్రకరణలు 285, 287, 288, 289లో వీటిని ప్రస్తావించారు.

ప్రకరణ 247 ప్రకారం.. కేంద్ర జాబితాలో పొందుపరిచిన అంశాలకు సంబంధించి అదనపు న్యాయస్థానాలు ఏర్పాటు చేసే అధికారం పార్లమెంట్ కలిగి ఉంటుంది.

అవశిష్ట జాబితా (Residual List) ప్రకరణ 248(1): అవశిష్ట జాబితాలోని అంశాలపై పార్లమెంట్ మాత్రమే చట్టం చేస్తుంది. అవశిష్ట జాబితా అంటే కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో ప్రస్తావించని అంశాలు.

ప్రకరణ 248 (2) ప్రకారం.. రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలో లేని అంశాలకు పన్ను విధించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.

అమెరికా, ఆస్ట్రేలియాలో అవశిష్ట అధికారాలను రాష్ట్రాలకు ఇచ్చారు. కెనడాలో అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఉన్నాయి. భారత ప్రభుత్వ చట్టం -1935 ప్రకారం అవశిష్ట అధికారాలను అనాటి గవర్నర్ జనరల్‌కు ఇచ్చారు.

ప్రకరణ 249 (1) ప్రకారం.. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యసభ 2/3 వంతు సభ్యుల మెజారిటీతో ఒక తీర్మానం చేస్తే.. ఆ తీర్మానాన్ని లోక్‌సభ కూడా ఆమోదిస్తే ఆ అంశంపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది.

ఆ విధంగా రాష్ట్ర జాబితాలో అంశాలపై పార్లమెంట్ చేసిన చట్టాలు ఒక సంవత్సరం వరకే అమల్లో ఉంటాయి (ప్రకరణ 249(2)). అవసరమైతే తీర్మానం ద్వారా మరో ఏడాది వరకు పొడిగించవచ్చు. గడువు ముగిసిన తర్వాత, ఆరు నెలల వరకు మాత్రమే అలాంటి చట్టాలు అమల్లో ఉంటాయి. తర్వాత ఆటోమేటిక్‌గా కేంద్ర జాబితాలోకి బదిలీ అయిన అంశం తిరిగి రాష్ట్ర జాబితాలోకి చేరుతుంది.

ప్రకరణ 250 (1) ప్రకారం.. దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి (ప్రకరణ 352) అమల్లో ఉన్నప్పుడు, పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలను రూపొందిస్తుంది. అలాంటి శాసనం అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నంత కాలం చెల్లుబాటవుతుంది.

ప్రకరణ 250 (2) ప్రకారం.. అత్యవసర పరిస్థితి ఎత్తేసిన ఆరు నెలల తర్వాత ఆ చట్టాలు రద్దవుతాయి.

ప్రకరణ 251 ప్రకారం.. ప్రకరణలు 249, 250 అనుసరించి పార్లమెంట్ రాష్ట్ర జాబితాలో చేసిన చట్టాలు, అంతకుముందు రాష్ట్రాలు వాటి జాబితాలో చేసుకున్న చట్టాలకు వైరుధ్యం ఏర్పడితే.. పార్లమెంట్ చేసిన చట్టమే చెల్లుబాటు అవుతుంది.

ప్రకరణ 252 (1) ప్రకారం.. రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనార్థం రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేయమని కోరితే.. అలా కోరిన రాష్ట్రాలకు వర్తించేవిధంగా రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ చట్టాలు రూపొందిస్తుంది.

ఉదాహరణకు ఎస్టేట్ సుంకం చట్టం-1955; ప్రైజ్ కాంపిటీషన్ చట్టం-1955; వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972; జలకాలుష్య నివారణ చట్టం-1974; పట్టణ, ఆస్తుల పరిమితి చట్టం-1976; మానవ అవయవాల మార్పిడి చట్టం-1994 మొదలైన చట్టాలను పార్లమెంట్ రూపొందించింది రాష్ట్రాలకు వర్తింపజేసింది.

ప్రకరణ 252(2) ప్రకారం.. పైన పేర్కొన్న విధంగా రూపొందించిన శాసనాన్ని సవరించే లేదా రద్దు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది.

ప్రకరణ 253 ప్రకారం.. అంతర్జాతీయ ఒప్పందాల అమలు కోసం అవసరమైన శాసనాలను రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఈ ఒప్పందాల అమలుకు రాష్ట్రాల చట్టాలు అవరోధాలుగా ఉంటే వాటిని పార్లమెంట్ అధిగమించవచ్చు.

ఉదాహరణకు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అవసరాల రక్షణ చట్టం-1947; జెనీవా ఒప్పందం చట్టం-1960; హైజాకింగ్ వ్యతిరేక చట్టం-1982 లాంటి చట్టాలను పార్లమెంట్ రూపొందించింది.

ప్రకరణ 254 ప్రకారం.. ఉమ్మడి జాబితాలోని వైరుధ్యాలను తొలగించడం, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి రాష్ట్ర విధానసభలు రూపొందించిన శాసనం విరుద్ధంగా ఉంటే, పార్లమెంట్ రూపొందించిన శాసనానికి ఆధిక్యత ఉంటుంది.

ప్రకరణ 255 ప్రకారం.. కొన్ని చట్టాలను రూపొందించే సమయంలో రాష్ట్రపతి, గవర్నర్ల పూర్వానుమతి అవసరం. ఒకవేళ అలాంటి చట్టాలను వీరి పూర్వానుమతి లేకుండా రూపొందిస్తే అవి చెల్లవు అని చెప్పే అధికారం రాష్ట్రపతి, గవర్నర్లకు ఉండదు. వారి అనుమతి తీసుకోవడమనేది కేవలం ప్రక్రియకు సంబంధించిందే కానీ, వారి అధికారాలకు చెందింది కాదు.

ఇతర భాగాల్లోని ప్రకరణలు (18వ భాగం)

ప్రకరణ 352 ప్రకారం.. జాతీయ అత్యవసర పరిస్థితి సమయంలోనూ కేంద్రం రాష్ట్ర జాబితాలో చట్టాలు చేయవచ్చు.

ప్రకరణ 356 ప్రకారం.. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు రాష్ట్ర జాబితాలోని అంశాలపై పార్లమెంట్ రాష్ట్ర శాసనసభ తరఫున చట్టాలను రూపొందించవచ్చు.

కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?

టెట్/డీఎస్సీ - ప్రత్యేకం
జాగ్రఫీ

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా, బోట్స్‌వానా, కాంగో, కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో ఇప్పటివరకు మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్తరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:

- మధ్యప్రదేశ్ - కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ - అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదీలోయ.
- కేరళ - కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. అవి:

1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబీ మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోఫైట్:** పసుపు వర్ణంలో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయోటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:

- బిహార్ - గయ.
- జార్ఖండ్ - కోడెర్మా, హజారీబాగ్, సింగ్భమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ - నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ - ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం సల్ఫేట్ రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కండెన్సర్‌గా, వైద్య రంగంలో ఎక్స్‌రే సంబంధిత అంశాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:

- ఆంధ్రప్రదేశ్ - కడప.
- తెలంగాణ - ఖమ్మం.

ఆస్బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. దీని నిల్వలు, ఉత్పత్తిలో రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీలో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్తాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్తాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్తాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్ రూపంలో లభ్యమవుతుంది. ఇది కేబుల్ కవర్లు, పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకెన్ హిల్స్ ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా లభ్యమవుతాయి.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్తాన్, ఆంధ్రప్రదేశ్(కర్నూలు, గుంటూరు), తెలంగాణ (నల్గొండ,ఖమ్మం),బిహార్,ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జెంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్తరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రోప్లేటింగ్,ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో వినియోగిస్తారు. దీని నిల్వలు రాజస్తాన్(జవార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్తాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్తాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

రాతి ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కైనైట్: జార్ఖండ్‌లో దీని అధికంగా లభిస్తోంది.

జిప్సం: రాజస్తాన్‌లో దీని నిల్వలు అధికం.

ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం,సహజవాయువు)ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్తరాల్లో లభ్యమవుతోంది. అవి:

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90శాతం ఈ రకానికి చెందింది. ఇది ఎక్కువగా గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్తరాల్లోని దామోదర్ లోయ (జార్ఖండ్-దామోదర్), సోన్ (మధ్య ప్రదేశ్), మహానది (ఒడిశా), గోదావరి (తెలంగాణ), వార్ధా (మహారాష్ట్ర)లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్తాన్, అసోం, జమ్ము-కశ్మీర్‌లోని ద్వీపకల్పం, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి.

1. **ఆంత్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90-95 శాతం కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిటుమినస్:** ఇందులో 85-90శాతం కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్ కోల్):** 30-40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటి దశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యుమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలోని ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు

జార్ఖండ్ - జరియా, బొకారో, డాల్టన్‌గంజ్.
పశ్చిమ బెంగాల్ - రాణిగంజ్, గిరిడి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్ - కోర్బా, బిలాస్‌పూర్, చిరిమిరి, హస్‌దో- అరండ్, తాతాపాని- రామ్‌కోలా.
మధ్యప్రదేశ్ -సింగ్రౌలి,సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర - చందా, వార్ధా, కంప్టీ, భండార.
తెలంగాణ - సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:

తమిళనాడు - నైవేలి జయంకొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం - మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్తాన్ - బికనీర్.
ఉత్తర ప్రదేశ్ - నామ్‌చిక్, నాంరూక్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:

యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, ఉమారియో, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రెయిన్: డొనెట్స్ ప్రాంతం.
రష్యా: కుజునెట్స్క్ బేసిన్.
కజకిస్తాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలా స్తరాల్లో లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో చైనా, జపాన్, ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీని ఉత్పత్తి ప్రారంభమైంది. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్‌'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్' క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై-హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిభెట్, బస్సీన్.
గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గామ్, ఖోర్బా కలోల్, కోసాంబ (వీటన్నింటిని కలిపి గంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబాట్ బేసిన్‌లోని అలియాబెట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మెసేన్.
అసోం: దిగ్బాయ్, నహర్ కటియా, మొరాన్, హగ్రిజాన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.
తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారిమనం, కోవిల్‌కుప్పల్.
త్రిపుర: మనుబాగ్, బారామురా, దేవ్‌మురా.
ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది - HBJ పైప్‌లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్యప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:

1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరీ బేసిన్ (తమిళనాడు)
6. రాజస్తాన్‌లోని తనోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కోనియం, ఇల్మనైట్, టైటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లె), తెలంగాణ(నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక దిబ్బల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టైటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కోనియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు

1. **నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.**
ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
సి. లియోనైట్ డి. సిడరైట్
1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. **అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?**
1) పెట్లైట్ 2) బాక్సైట్
3) మాగ్నసైట్ 4) కుద్రేముఖ్
3. **కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?**
1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. **సఖాలిన్ చమురు క్షేత్రం ఏ దేశంలో ఉంది?**
1) అమెరికా 2) ఉక్రెయిన్
3) చైనా 4) రష్యా
5. **కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?**
1) కజకిస్తాన్ 2) జర్మనీ
3) ఉక్రెయిన్ 4) జాంబియా
6. **సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?**
1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
3) తెలంగాణ 4) ఒడిశా
7. **మాక్‌కూమ్ బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?**
1) మేఘాలయ 2) అసోం
3) మణిపూర్ 4) త్రిపుర
8. **ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?**
1) కాపర్ 2) క్రోమైట్
3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1)1; 2) 2; 3) 3; 4) 4; 5) 1; 6)3; 7) 2; 8) 2

కాడ్‌లివర్ నూనెలో అధికంగా ఉండేది?

మాదిరి ప్రశ్నలు

1. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాసక్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారెవరు?
   1) సర్‌హాన్స్ క్రెబ్స్ 2) బెన్సన్
   3) మెల్విన్ కాల్విన్ 4) ష్వాన్
2. అయోడిన్ చర్య దేన్ని కనుగొనడానికి ఉపయోగపడుతుంది?
   1) కాంతి 2) గ్లూకోజ్
   3) పిండి పదార్థం 4) కార్బన్ డై ఆక్సైడ్
3. తేనెటీగలు తేనె పట్టును దేని కోసం నిర్మించుకుంటాయి?
   1) మకరంద సేకరణ
   2) జాతి (సంతానం) ఉత్పత్తి కోసం
   3) రక్షణ 4) పైవన్నీ
4. వర్గం అనే వర్గీకరణ అంతస్తును ప్రవేశ పెట్టిన వారెవరు?
   1) లిన్నెయస్ 2) హెకెల్
   3) హైమన్ 4) విట్టేకర్
5. స్పంజికల్లో కణాంతర జీర్ణక్రియ ఏ కణాల్లో జరుగుతుంది?
   1) ఆర్కియోసైట్స్
   2) కాలర్ కణాలు
   3) పినాకోసైట్స్
   4) అమీబోసైట్స్
6. కిందివాటిలో సమవిభజన ఉపయోగంకానిది?
   1) క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి తోడ్పడుతుంది
   2) జీవుల్లో పెరుగుదల కోసం దోహదపడుతుంది
   3) గాయాలు మానడానికి తోడ్పడుతుంది
   4) పాత కణాల నుంచి కొత్త కణాలు ఏర్పడటానికి దోహదపడుతుంది
7. సామాన్య సూక్ష్మ దర్శినిని కనుగొన్న వారెవరు?
   1) జకేరియస్ జాన్సన్
   2) రస్కా 3) నాల్
   4) లీవెన్ హాక్
8. కిందివాటిలో క్లోరోప్లాస్టులు లోపించిన కణాలేవి?
   1) జంతుకణాలు 2) శైవలాలు
   3) శిలీంధ్రాలు 4) 1, 3
9. కిందివాటిలో సౌరశక్తిని వినియోగించుకోగలిగినవి ఏవి?
   1) ఉత్పత్తిదారులు
   2) వినియోగదారులు
   3) విచ్ఛిన్నకారులు
   4) ద్వితీయ వినియోగదారులు
10. జీవి మనుగడకు అవసరం కాని క్రియ ఏది?
   1) శ్వాసక్రియ 2) ప్రత్యుత్పత్తి
   3) ప్రసరణ 4) విసర్జన
11. టోనోప్లాస్ట్ కలిగిన కణాంగం ఏది?
   1) మైటోకాండ్రియా 2) గాల్జి సంక్లిష్టం
   3) రిక్తిక 4) కణత్వచం
12. వ్యాధులు సంక్రమించినప్పుడు తయారయ్యే ప్రతిరక్షకాలు అనేవి..?
   1) ప్రోటీన్ నిర్మాణాలు
   2) ప్రోటీనేతర నిర్మాణాలు
   3) కార్బోహైడ్రేట్ నిర్మితాలు
   4) సెల్యులోజ్ నిర్మితాలు
13. పెద్ద వృక్షాల్లో నీటి ప్రసరణ జరగడానికి తోడ్పడే ప్రక్రియ ఏది?
   1) బాష్పోత్సేకం
   2) విసరణ, ద్రవాభిసరణ
   3) వేరు పీడనం, బాష్పోత్సేకం
   4) వేరు పీడనం
14. కిందివాటిలో సేంద్రీయ పదార్థం కానిది?
   1) కొవ్వు పదార్థం
   2) విటమిన్లు
   3) పిండి పదార్థం
   4) డీఎన్ఏ
15. ఏ మొక్కలో దారు నాళాలు నీటి ప్రసరణలో చురుగ్గా పాల్గొంటాయి?
   1) టెరిస్ 2) ఫైకస్
   3) పైనస్ 4) ఏదీకాదు
16. ఏ మొక్కల్లో రెసిన్ నాళాలు కనిపిస్తాయి?
   1) టెరిడోఫైట్‌లు
   2) శైవలాలు
   3) బ్రయోఫైట్‌లు
   4) వివృత బీజాలు
17. అంతర్జాతీయ ఆహార దినోత్సవం ఏ రోజున నిర్వహించుకుంటారు?
   1) అక్టోబరు 10 2) అక్టోబరు 26
   3) అక్టోబరు 16 4) అక్టోబరు 24
18. 'మింగడం' అనేది ఏ రకమైన చర్య?
   1) నియంత్రిత 2) అనియంత్రిత
   3) అసంకల్పిత 4) ప్రతీకార చర్య

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

19. ప్రౌఢ మానవుని నోటిలో ఉండే కుంతకాల సంఖ్య?
   1) 8 2) 4 3) 6 4) 2
20. వినడంలో పాత్ర వహించే లోపలి చెవి నిర్మాణం ఏది?
   1) పేటిక
   2) కర్ణావర్తం
   3) అర్ధవర్తుల కుల్యాలు
   4) యూస్టాషియన్ నాళం
21. మానవుడికి చీకటిలో వస్తువులన్నీ బూడిద రంగులో కనిపించడానికి కారణమైన కణాలేవి?
   1) దండాలు
   2) కోనులు
   3) దండాలు, కోనులు
   4) పైవేవీకాదు
22. రోమాలు, గోర్లు, గిట్టల రూపంలో జీవులకు రక్షణ కలిగించే కణజాలం ఏది?
   1) ఉపకళా 2) అస్థి
   3) ఎడిపోస్ 4) కార్టిలేజ్
23. రసభరితమైన పొలుసు ఆకులను కలిగి ఉండే మొక్కలో కనిపించే భూగర్భ కాండ రూపాంతరం ఏది?
   1) దుంప 2) కొమ్ము
   3) లశునం 4) మొగ్గలు
24. 'అవిసీనియా' మొక్కలో ప్రధాన వేర్లను కాకుండా వాయుగత వేర్లను తొలగిస్తే ఏమవుతుంది?
   1) కిరణజన్య సంయోగక్రియ జరగదు
   2) నత్రజని స్థాపన ఆగిపోతుంది
   3) బాష్పోత్సేకం ఆగిపోతుంది
   4) శ్వాసక్రియ ఆగిపోతుంది
25. ఒక విద్యార్థి తనకు దొరికిన మొక్క కాండం నుంచి అనేక వేర్లు సమాన పరిమాణంలో ఉండటాన్ని గమనించాడు. అది కిందివాటిలో ఏ మొక్క అయి ఉండవచ్చు?
   1) వేరుశనగ 2) కంది
   3) మొక్కజొన్న 4) చిక్కుడు
26. కిందివాటిలో జన్యు వ్యాధికి ఉదాహరణ?
   1) డిఫ్తీరియా 2) హీమోఫిలియా
   3) టెటానస్ 4) రేచీకటి
27. రక్తంలో సహజ రక్త స్కందక నివారిణి?
   1) హీమోలైసిన్ 2) హిరుడిన్
   3) హెపారిన్ 4) సోడియం సిట్రేట్
28. కింద పేర్కొన్న ఏ చేపల్లో అంతర అస్థి పంజరం మృధులాస్థితో నిర్మితమై ఉంటుంది?
   1) టీలియోస్ట్ 2) రోహు
   3) వల్లగో అట్టు 4) షార్క్
29. కణంలోని జీవ పదార్థంలో నీటి శాతం?
   1) 90–95 2) 85–90
   3) 70–80 4) 30–40
30. నాడీ వ్యవస్థ నిర్మాణాత్మక ప్రమాణం ఏది?
   1) డెండ్రాన్ 2) నెఫ్రాన్
   3) న్యూరాన్ 4) ఆక్జాన్
31. ఎర్ర రంగు గులాబీ పసుపురంగు కాంతిలో ఎలా కనిపిస్తుంది?
   1) తెలుపు 2) ఎరుపు
   3) పసుపు 4) నలుపు
32. కంటి చూపుపై ప్రభావం పడకుండా ఉండాలంటే టీవీకి కంటికి మధ్య కనీసం ఎంత దూరం ఉండాలి (మీటర్లలో)?
   1) 1.5 2) 2.5 3) 5.5 4) 0.5
33. మొక్కలు నీటిని, ఖనిజ లవణాలను పీల్చుకునే విధానం గురించి తెలుసుకోవాలనుకునే విద్యార్థి దేన్ని అధ్యయనం చేయాలి?
   1) ప్లాంట్ మార్ఫాలజీ
   2) ప్లాంట్ ఫిజియాలజీ
   3) ప్లాంట్ ఇకాలజీ
   4) ప్లాంట్ ఎంబ్రియాలజీ
34. కిందివాటిలో లైకేన్లలో కనిపించే జీవనం, అందులో పాల్గొనే జీవులు వరుసగా?
   1) పరాన్న జీవనం – శైవలం, శిలీంధ్రం
   2) సహజీవనం – శైవలం, బ్రయోఫైట్
   3) పూతికాహారం – శైవలం, శిలీంధ్రం
   4) సహజీవనం – శైవలం, శిలీంధ్రం
35. నిస్సల్ కణికలు కలిగిన కణాలేవి?
   1) న్యూరాన్లు 2) నెఫ్రాన్లు
   3) ఇసినోఫిల్స్ 4) లింఫోసైట్లు
36. శరీరం మొత్తం బరువులో మెదడు బరువు సుమారుగా ఎంత శాతం?
   1) 13 2) 5 3) 2 4) 8
37. మానవుని సామాన్య రక్తపీడనం 120/80. ఇందులో పై సంఖ్య దేన్ని సూచిస్తుంది?
   1) డయాస్టోలిక్ పీడనం
   2) సిస్టోలిక్ పీడనం
   3) ఊర్ధ్వ పీడనం
   4) రక్తపోటు
38. పత్రం ద్వారా కొత్త మొక్కలను ఏర్పరిచే మొక్క ఏది?
   1) చేమంతి
   2) కరివేపాకు
   3) రణపాల
   4) గడ్డి
39. ఒక పుష్పాన్ని పరిశీలిస్తే అందులో రక్షక, ఆకర్షక పత్రావళి మాత్రమే ఉన్నాయి. అయితే అది ఏ రకమైన పుష్పం?
   1) ద్విలింగ 2) అసంపూర్ణ
   3) ఏకలింగ 4) సంపూర్ణ
40. కొబ్బరిలో తినే భాగం ఏ స్థితిలో ఉంటుంది?
   1) ఏకస్థితిక 2) ద్వయస్థితిక
   3) త్రయస్థితిక 4) బహుస్థితిక
41. కణ విభజనలో ద్విగుణీకృతం అయ్యేవి?
   1) రైబోజోములు 2) గాల్జీ సంక్లిష్టం
   3) క్రోమోజోములు 4) క్లోరోప్లాస్టులు
42. 'టానిన్స్' అనే పదార్థాల ఉపయోగం ఏమిటి?
   1) పాలను నిల్వ చేయడానికి వాడతారు
   2) తోళ్లను శుద్ధి చేయడానికి వాడతారు
   3) ఆల్కహాల్ తయారీలో ఉపయోగిస్తారు
   4) జున్ను తయారీలో వినియోగిస్తారు
43. 'నీలి విప్లవం' అనేది వేటి ఉత్పత్తికి సంబంధించింది?
   1) పాలు 2) కూరగాయలు
   3) తేనెటీగలు 4) చేపలు
44. కిందివాటిలో డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు కనుగొన్నది ఏది?
   1) టెట్రాసైక్లిన్
   2) పెన్సిలిన్
   3) ఇన్సులిన్
   4) వ్యాక్సినేషన్
45. ఒక తరం నుంచి మరో తరానికి లక్షణాలు సంక్రమించే విషయం గురించి తెలియజేసే శాస్త్రం ఏది?
   1) పిండోత్పత్తి శాస్త్రం
   2) జన్యు శాస్త్రం
   3) సూక్ష్మజీవ శాస్త్రం
   4) జీవ సాంకేతిక శాస్త్రం
46. మానవుని జీర్ణ వ్యవస్థలో కిందివాటిలో ఏ పదార్థం జీర్ణం కాదు?
   1) ప్రోటీన్లు
   2) కార్బోహైడ్రేట్లు
   3) కొవ్వులు
   4) సెల్యులోజ్
47. కాడ్‌లివర్ నూనెలో అధికంగా ఉండేది?
   1) విటమిన్–బి
   2) ప్రోటీన్లు
   3) విటమిన్–ఎ
   4) విటమిన్–సి
48. ఇందిరాగాంధీ జూ పార్క్ ఎక్కడ ఉంది?
   1) ఏలూరు 2) గుంటూరు
   3) నెల్లూరు 4) విశాఖపట్నం
49. ఎడారి మొక్కల్లో ఆహారాన్ని తయారు చేసే భాగం ఏది?
   1) పత్రం 2) వేరు
   3) కాండం 4) ఫలం
50. అగ్‌మార్క్ ప్రయోగశాల మనరాష్ట్రంలో ఎక్కడ ఉంది?
   1) కాకినాడ
   2) విజయవాడ
   3) గుంటూరు
   4) అనంతపురం
51. బొద్దింకలో రక్తాన్ని హృదయంలోకి పంపడానికి ఉపయోగపడే నిర్మాణాలేవి?
   1) వాయు నాళ కండరాలు
   2) పక్షాకార కండరాలు
   3) హృదయ కండరాలు
   4) ఉరః కుహర కండరాలు
52. కిందివాటిలో ఏ జీవిలో చర్మం శ్వాసాంగంగా ఉండదు?
   1) బొద్దింక 2) వానపాము
   3) జలగ 4) సాలమాండర్
53. కిందివాటిలో శరీర కుహర ద్రవం కలిగిన జీవి ఏది?
   1) అమీబా
   2) పారమీషియం
   3) వానపాము
   4) వర్టిసెల్లా
54. పీయూష గ్రంథిలోని తమ్మెల సంఖ్య?
   1) 4 2) 3 3) 2 4) 5

సమాధానాలు

1) 3; 2) 3; 3) 4; 4) 2; 5) 4;
6) 1; 7) 4; 8) 4; 9) 1; 10) 2;
11) 3; 12) 1; 13) 3; 14) 4; 15) 2;
16) 4; 17) 3; 18) 1; 19) 1; 20) 2;
21) 1; 22) 1; 23) 3; 24) 4; 25) 3;
26) 2; 27) 3; 28) 4; 29) 2; 30) 3;
31) 4; 32) 2; 33) 2; 34) 4; 35) 1;
36) 3; 37) 2; 38) 3; 39) 2; 40) 3;
41) 3; 42) 2; 43) 4; 44) 1; 45) 2;
46) 4; 47) 3; 48) 4; 49) 3; 50) 3;
51) 2; 52) 1; 53) 3; 54) 2.

Indian Financial Network is the...

Model Questions

1. The Reserve Bank's affairs are governed by a central board of directors. The board is appointed by the Government of India in keeping with the Reserve Bank of India Act. It is Appointed/ nominated for a period of....
   a) 6 years
   b) 5 years
   c) 4 years
   d) 3 years
   e) 2 years
2. As per SEBI guidelines, in a Book Building process the cap in the price band
   a) should be at least 10 per cent of the floor price
   b) should not be more than 20 per cent of the floor price
   c) should not be more than 30 per cent of the floor price
   d) no limits e) none
3. _______ is a short term security (7 days to 365 days) issued by a corporate entity (other than a bank), at a discount to the face value?
   a) Commercial Paper
   b) Certificate of Deposit
   c) Non-convertible Debenture
   d) Treasury Bill
   e) None of the above
4. Who is the chairman of NITI Ayog ?
   a) Narendra Modi
   b) Arvind Pangaria
   c) Mangu Singh
   d) Anupam Srivastava
   e) Ashok Kumar Roy
5. The Nai Manzil Scheme is designed as an integrated education and training programme that provides youth from minority communities skills needed for different tasks in a rapidly changing world. It also provides them trade related training in which of the following areas:
   a) Manufacturing
   b) Engineering
   c) Services
   d) Soft skills
   e) All the above
6. Indian Financial Network [INFINET] is the...
   a) Communication backbone for the Indian Banking and Financial sector
   b) Association of the employers of the banking and financial sector
   c) Closed user group network of SBI and its subsidiaries
   d) All of the above
   e) None of the above
7. In Mutual Funds, A close ended fund means:
   a) The corpus is of fixed size with a definite redemption period
   b) Listing on stock exchanges provides easy liquidity
   c) The market price is always below the Net Asset Value
   d) All of the above
   e) None of the above
8. Which of the following is correct statement in respect of debit cards
   a) Debit card facility is provided to those having savings bank account/current account holders
   b) This facility is not extended to cash credit/loan account holders
   c) It is an unsecured credit facility
   d) Debit card is issued to all the persons who visit the branch
   e) a and b
9. In the term IPO, what do you mean by "P"?
   a) Provisions b) Public
   c) Private d) Prudent
   e) Pension
10. The Overall Priority Sector Lending Target to be increased to ______ by Foreign Bank with more than 20 Branches by 2018?
   a) 60 percent of adjusted Net Bank Credit
   b) 40 percent of Adjusted Net Bank Credit
   c) 32 percent of adjusted Net Bank Credit
   d) 25 percent of adjusted Net Bank Credit
   e) 30 percent of adjusted Net Bank Credit
11. When it comes to scheduled commercial banks, which out of the following is not true?
   a) Nationalised banks
   b) Regional Rural banks
   c) Foreign banks
   d) Private sector banks
   e) Local area banks
12. Which amongst the following is called as mother of deposits?
   a) Current account
   b) Fixed deposit
   c) Recurring deposit
   d) Savings bank
   e) Reinvestment deposit
13. "Micro Finance" is a ______ of banking services?
   a) Introduction stage
   b) Saturation stage
   c) Research stage
   d) Decline stage
   e) None of the Above
14. Which amongst the following is not term deposits issued by commercial banks?
   a) Current account
   b) Fixed deposit
   c) Recurring deposit
   d) Reinvestment deposit
   e) All the above

BANK EXAMS

BANKING AWARENESS

15. What is the main purpose of Open market operations?
   a) A fiscal device which assists Government borrowing
   b) A monetary measure to regulate quantity of money in circulation and the cash reserves of the commercial banks
   c) A measure to counteract extreme trends in business
   d) A measure to influence the balance of payments position
   e) None of the above
16. What is the full form of MSME?
   a) Mini, Small and Medium Enterprises
   b) Micro, Small and Medium Enterprises
   c) Mini scale Marketing Enterprises
   d) Medium Scale Marketing Enterprises
   e) None of the above
17. A customer is required to maintain adequate balances in his/her accounts in order to use his ______ card in the merchant establishments?
   a) Smart Card
   b) Credit Card
   c) Add-on Credit card
   d) Debit Card
   e) None of the above
18. Which of the following are the latest guidelines issued by the RBI in respect of opening new branches in villages?
   a) To open more brick and mortar branches in villages where there are no banking facilities and population is more than 5,000.
   b) Banks to submit a roadmap on how many branches they will be opening by 31 March 2017.
   c) The roadmap by end of January 2016.
   d) BCBF Model to be discontinued
   e) Only a, b, c
19. Name the financial instrument which is/are issued for short term (up to one year) borrowing by RBI on behalf of the Government of India?
   a) Treasury Bills
   b) Commercial Paper
   c) Certificate of Deposit
   d) Non-convertible Debenture
   e) Only b & c
20. KYC (Know Your Customer) norms were implemented in the Indian banking system in 2002 as per the directive of ?
   a) SEBI b) RBI c) IBA
   d) IRDA e) None of these
21. Often, we read in the newspapers that several Indian companies are taking the FCCB route to raise capital. What does the term FCCB stand for?
   a) Foreign Currency Convertible Bond
   b) Foreign Convertible Credit Bond
   c) Financial Consortium and Credit Bureau
   d) Future Credit and Currency Bureau
   e) None of these
22. ATM cards are issued to a person who maintains any of following accounts with the bank
   a) saving bank account
   b) current accounts
   c) term deposits
   d) loan or cash credit accounts
   e) either a or b
23. A commercial paper is
   a) A paper issued by Reserve Bank of India an trade and commerce
   b) An unsecured money market instrument issued in the form of promissory note
   c) A document issued by IDBI for seeking refinance facility from Reserve Bank India
   d) All of the above
   e) None of the above
24. Which of the following would fall under the category of retail banking?
   a) Home Loans
   b) Credit Cards
   c) Personal Loans
   d) Car Loans
   e) All of these
25. Who decides how much quantity of the coins to be minted?
   a) Reserve Bank of India
   b) Central Government
   c) Finance Ministry
   d) Both RBI and Central Government decide
   e) None of the above
26. What are the components of Foreign Exchange Reserves?
   a) Foreign currency assets,
   b) Gold,
   c) Special Drawing Rights
   d) Reserve Position in the IMF
   e) All the above
27. The chairman of Regional Rural Bank is appointed by _____?
   a) State Government
   b) Reserve Bank of India
   c) Central Government
   d) Sponsoring bank in consultation with NABARD
   e) None of the above

KEY

1) c 2) b 3) a 4) a 5) e
6) a 7) d 8) e 9) b 10) b
11) e 12) d 13) a 14) a 15) b
16) b 17) d 18) e 19) a 20) b
21) a 22) e 23) b 24) e 25) b
26) e 27) d